అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 22-11-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 323 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



తావిడిస్తే సావొస్తది

కోట్లిచ్చినా భూములొదలం

- అర్ధరాత్రి ఇండ్లల్ల జొరబడి దొంగల్లా పట్టుకుపోయిండ్రు
- అవి తొండలు గుడ్లు పెట్టే భూములు కావు..
- బువ్వ పెట్టే భూములే
- ఫార్మాకోసం గురునాథరెడ్డి సీలింగ్ భూమి పనికిరాదా?
- న్యాయం చేస్తాడని ఓట్లేసినం
- సీఎం సారు మా బతుకునే ఆగం చేస్తుండు
- వామపక్ష నేతలతో లగచర్ల బాధితుల ఆవేదన
- రైతులకు అండగా ఎర్రజెండాలు : తమ్మినేని భరోసా
- లగచర్ల కల్లోలిత ప్రాంతమా? అంటూ సర్కార్‌పై ఆగ్రహం
- సీఎం ఇచ్చిన ఏడో గ్యారెంటీ ఏమైందంటూ సూటి ప్రశ్న

నవతెలంగాణ - హైదరాబాద్ బ్యూరో, కొడంగల్

సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయ తలపెట్టిన ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పచ్చని పంట పొలాల్లో చిచ్చు పెట్టేలా.. సర్కారు ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయంపై మండిపడుతున్నారు. ప్రాణాలైనా ఇస్తాం.. కానీ, సాగు భూములను ఇచ్చేది లేదని వారు తెగేసి చెప్పారు. ఫార్మా విలేజ్‌కు సంబంధించి ఇటీవల పలు ఘటనలు, ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్న నేపథ్యంలో గురువారం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో వామపక్ష నేతలు పర్యటించారు. సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె రమ, సీపీఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆకుల పాపయ్య, గోవర్ధన్, ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, సీపీఐ ఎంఎల్ కార్యదర్శి ప్రసాదన్న,ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి మురహరి, సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు ఈ పర్యటనలో ఉన్నారు. బాధిత రైతుల గోసను, ఆవేదనను విని, వారిని ఓదార్చారు. వారికి మేమున్నామంటూ భరోసానిచ్చారు.

ఈ సందర్భంగా బాధిత రైతులు, ప్రజలు వామపక్ష నేతల ముందు తమ గోడును వెళ్లబోసుకున్నారు. కొన్నేండ్లుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్న తమ పంట పొలాలను ఫార్మా కంపెనీలకు ఇచ్చేది లేదని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఏటా వరి పంటను సాగు చేస్తూ తాము తింటూ, పదిమందికి అన్నం పెట్టే పచ్చని సాగు భూముల్లో కాలుష్యం వెదజల్లే కంపెనీలను ఏర్పాటు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్న మూడు గ్రామాల్లోనే కాకుండా వాటి చుట్టూ ఉన్న పలు గ్రామాల్లోనూ వ్యవసాయం బందవుతుందనీ, తాగు, సాగు నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ కడుపు కొట్టొద్దని.. కొడంగల్ నియోజకవర్గంలో సాగుకు అనుకూలంగా లేని భూములు చాలా ఉన్నాయనీ, వాటిలో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సర్కారు ఫార్మా విలేజ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ ...14లో

లంచావతారం


సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం అధికారులకు అదానీ ముడుపులు

వాస్తవాలు దాచిపెట్టి అమెరికా నుంచి నిధులు

న్యూయార్క్ కోర్టులో ప్రాసిక్యూటర్ల అభియోగాలు..కేసులు

భారీగా పతనమైన అదానీ షేర్లు వివరాలు 3లో





వడ్డించేవాడు మనవాడైతే..ఏమూల కూర్చున్నా పంచభక్ష్యపరమాన్నాలు అందుతాయని నానుడి. ఇపుడు గౌతమ్ అదానీ విషయంలో అదే జరుగుతోంది. మోడీ అధికారంలోకి వచ్చాక అదానీ అక్రమార్జనకు అంతేలేకుండా పోయిందనటానికి ఎన్నో సాక్ష్యాలు..మరెన్నో ఆధారాలు.. కెన్యా, బంగ్లాదేశ్‌లోనే కాదు, తాజాగా అమెరికాలోనూ సౌరవిద్యుత్ కాంట్రాక్టుల కోసం అదానీ గ్రూపు లంచాలిచ్చిందన్న ఎఫ్‌బీఐ నిర్ధారణతో మొత్తం ప్రపంచ దేశాల్లో ఈ వ్యవహారం పెద్ద చర్చనీయాంశమైంది. దీనిపై రాజకీయం వేడెక్కింది. ఇపుడు అదానీని కాపాడటానికి కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఇంకెంతవరకు దిగజారుతుందన్నదే హాట్ టాపిక్..

చట్టాలను ఉల్లంఘించారు

తక్షణమే అరెస్టు చేయాలి :

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు విషయంలో అదానీ గ్రూపు ఛైర్మెన్ గౌతం అదానీ అధికారులకు ముడుపులు ఇచ్చేందుకు ప్రయత్నించినట్టు నేరాభియోగం నమోదైంది. ఆ కేసులో అమెరికా కోర్టు ఆయనపై అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. గౌతం అదానీ.. భారతీయ, అమెరికా చట్టాలను ఉల్లంఘించినట్టు స్పష్టమవుతున్నదని ఆరోపించారు. మోడీ, అదానీ కలిసి ఉంటే, ఆ ఇద్దరూ ఇండియాలో క్షేమంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. అదానీని తక్షణమే అరెస్టు చేయాలని, ఈ కేసులో మాధబి పురి బుచ్‌నూ విచారించాలని అన్నారు.దేశంలోని సీఎంలను అరెస్టు చేస్తున్నారని, కానీ అదానీ మాత్రం పరారీలో ...3లో

అక్రమాలెన్నో..

న్యూఢిల్లీ : గౌతమ్ అదానీపై ఆ గ్రూపునకు చెందిన మరో ఆరుగురిపై అమెరికా న్యాయస్థానంలో కేసు నమోదైన నేపథ్యంలో ఇప్పటివరకు అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలు, కుంభకోణాలను పరిశీలిద్దాం. అదానీ గ్రూపు చరిత్ర అంతా అవకతవకలు, అవినీతి ఆరోపణలమయమే. పర్యావరణానికి హాని కలిగించే ప్రణాళికలు, కుట్రలు, కుతంత్రాలతో నిండి వుంది. తాజాగా అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదారి పట్టించారంటూ అక్కడి కోర్టులో కేసు నమోదవడం వీటికి పరాకాష్టగా వుంది. అమెరికా న్యాయస్థానం అభిశంసన ప్రభావం వెంటనే కనిపించింది. అదానీ గ్రూపు కంపెనీల షేర్లు పతనమయ్యాయి. అదానీ ...3లో

అదానీకి కెన్యా షాక్.. 3లో..

ఎయిర్‌పోర్ట్, విద్యుత్ సరఫరా లైన్ల కాంట్రాక్టు రద్దు

అదానీని అరెస్టు చేయండి

ఆ గ్రూపుపై తక్షణమే కేసు నమోదు చేయాలి

అవకతవకలపై స్వతంత్ర సంస్థతో

పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలి : సీపీఐ(ఎం)డిమాండ్

మోడీ ప్రభుత్వం ఇక ఇప్పుడు ఏ తెర చాటునా

దాక్కోలేదంటూ వ్యాఖ్య



న్యూఢిల్లీ : అదానీ గ్రూపు పాల్పడిన అవకతవకలన్నింటిపై స్వతంత్ర సంస్థతో పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపించాలని, అమెరికా ప్రాసిక్యూటర్లు అందజేసిన ఆధారాల ప్రాతిపదికన అదానీపై వెంటనే కేసు నమోదు చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన జారీ చేసింది.గౌతమ్ అదానీ మరో ఆరుగురిపై అమెరికా కోర్టులో అక్కడి న్యాయశాఖ దాఖలు చేసిన నేరారోపణ పత్రంలో కేంద్ర, రాష్ట్ర స్థాయిలో భారత ...3లో

గజ గజ..

'కోర్ కోల్డ్ వేవ్ జోన్'లో తెలంగాణ

మరో 16 రాష్ట్రాలు, యూటీలు కూడా..

ఎన్‌పీసీసీహెచ్‌హెచ్ సమాచారం



న్యూఢిల్లీ : దేశంలోని పలు ప్రాంతాల్లో చలి పులి వణికిస్తున్నది. ఉత్తర, దక్షిణ అనే తేడా లేకుండా.. అన్ని ప్రాంతాలనూ చుట్టేస్తున్నది. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. ఇదే పరిస్థితి తెలంగాణతో పాటు మరో 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతా(యూటీ)ల్లో నెలకొన్నాయి. ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కిందకు వచ్చే 'నేషనల్ ప్రోగ్రాం ఆన్ క్లైమేట్ ఛేంజ్ అండ్ హ్యూమన్ హెల్త్ (ఎన్‌పీసీసీహెచ్‌హెచ్)' ఈ విషయాన్ని వెల్లడించింది. 'కోర్ కోల్డ్ వేవ్ జోన్'లో ఉన్న 17 రాష్ట్రాలు, యూటీలలో తెలంగాణ కూడా ఉన్నదని వివరించింది. గత కొన్ని రోజులుగా తెలంగాణలో రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఇలాంటి సమయంలో చలి గాలుల పరిస్థితులపై ...13లో

నదులు కనుమరుగైతే మనుగడే ప్రశ్నార్థకం

సీఎం రేవంత్‌రెడ్డి ఆందోళన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నదులు కనుమరుగైతే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల 'మూసీ పునరుజ్జీవం- ప్రక్షాళన' పేరుతో అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చివేస్తోంది. ఈనేపథ్యంలో పలువురి నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సోషల్‌మీడియాలో తనదైన శైలిలో స్పందించారు. "నదుల వెంట నాగరికత వర్ధిల్లాలి. నదులను కబళిస్తే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ప్రజారోగ్యం, పటిష్ట ఆర్థికం, పర్యావరణ కోణాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్‌కు మూసీ ఒక వరం కావాలి. గానీ శాపంగా మిగిలిపోకూడదు. మూసీని ప్రక్షాళన చేయాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పం ఈ తరానికే కాదు తరతరాలకు మేలు చేసే నిర్ణయం. ఈ నిర్ణయానికి అండగా నిలిచే ప్రతి వ్యక్తికీ, ప్రతి వ్యవస్థకు ధన్యవాదాలు" అంటూ రేవంత్ భావోద్వేగంగా ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

సీఎంవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

వడ్ల కొనుగోలులో ప్రభుత్వం విఫలం

ప్రతిపక్షంగా ప్రజల పక్షాన ఉంటాం : మాజీమంత్రి తన్నీరు హరీశ్ రావు



నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్రంలో ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపితే సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. గురువారం సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం మాసంపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెద్దమ్మతల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలపైన కేసీఆర్ ప్రశ్నిస్తే జైలుకు పంపిస్తానంటున్నారన్నారు. రాష్ట్రంలో కలుషిత ఆహారం తిని పిల్లలు చనిపోతున్నారని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 42 మంది విద్యార్థులు చనిపోయారని తెలిపారు. తాను ప్రశ్నిస్తే రంగనాయక సాగర్ వద్ద కబ్జాలకు పాల్పడ్డానని తనపై బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. కబ్జాల చరిత్ర నీది అని, మాకు ఆ చరిత్ర లేదని స్పష్టం చేశారు. తాను రైతుల నుంచి 13 ఎకరాలు కొనుగోలు చేశానని, ఇరిగేషన్ భూమి కానీ, ప్రభుత్వ భూమి కానీ ఎక్కడా కబ్జా చేయలేదని, నువ్వు ఎప్పుడు వస్తావో చెప్పు అప్పుడు కొలతలు పెడదామంటూ సవాల్ విసిరారు. ఎన్ని బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడినా ప్రభుత్వంపై ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. రాష్ట్రంలో వడ్ల కొనుగోళ్లలో ప్రభుత్వం ఫెయిల్యూర్ అయిందని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వలేదని, రూ.500 బోనస్ ఏమయిదని ప్రశ్నించారు. రైతులు ఇబ్బందులు పడుతూ దళారులకు ధాన్యాన్ని రూ.400-500 తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం దళారుల పాలు అయిందన్నారు. వ్యవసాయ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని ప్రకటన చేయగా, సివిల్ సప్లయ్ కమిషనర్ చౌహాన్ ...13లో

డిసెంబరు 9 నుంచి అసెంబ్లీ

ఆర్ఆర్ఆర్ చట్టం, కులగణనపై చర్చ

మూసీ ప్రక్షాళన, హైడ్రాపై సభలో వివరించనున్న సర్కార్

నాలుగు నెలల తర్వాత కొలువుదీరనున్న సభ

తాజా పరిణామాలతో సమావేశాలపై సర్వత్రా చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలను డిసెంబరు 9 నుంచి నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గత జులైలో శాసనసభ శీతాకాల సమావేశాలను నిర్వహించిన సంగతి విదితమే. అప్పటి నుంచి నాలుగు నెలల తర్వాత డిసెంబరులో శాసనసభ, మండలి కొలువుదీరనున్నాయి. ఈ సమావేశాల్లో రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) చట్టం, కుల గణన, మూసీ ప్రక్షాళన, హైడ్రా తదితర కీలకాంశాలపై చర్చించే అవకాశముంది. రైతు భరోసా, రుణమాఫీ కూడా చర్చకు రానున్నాయని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలంటూ మండలి చైర్మెన్, శాసనసభ స్పీకర్... సంబంధిత అధికారులను ఆదేశించారు.

మరోవైపు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల అనంతరం మంత్రివర్గ విస్తరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ భావిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి డిసెంబరు ఏడు నాటికి ఏడాది పూర్తవుతుంది. ఈలోపే పూర్తి స్థాయిలో క్యాబినెట్‌ను విస్తరించాలని ఆయన నిర్ణయించారు. ఇదే సమయంలో పంచాయతీ ఎన్నికలపై కూడా సీఎం దృష్టి సారించారు. రాష్ట్రంలో కుల గణన పూర్తయిన తర్వాత ఆ ఎలక్షన్లను నిర్వహించేందుకు రేవంత్ సమాలోచనలు చేస్తున్నారు. ఈ క్రమంలో కుల గణన, పంచాయతీల్లో రిజర్వేషన్లకు సంబంధించి కూడా అసెంబ్లీలో విస్తృతంగా చర్చిస్తారని సమాచారం. పంచాయతీ ఎన్నికలకు ముందే ఆసరా పింఛన్ల పెంపు, రైతు భరోసా తదితర హామీలను అమలు చేయటం ద్వారా కాంగ్రెస్‌కు మైలేజీ తీసుకురావాలని సీఎం భావిస్తున్నారు. ఆ తర్వాత ఎలక్షన్లకు వెళ్లటం... అన్ని రకాలుగా కలిసొస్తుందనే వ్యూహంతో ఆయన ఉన్నారు.



రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో డిసెంబరులో నిర్వహించబోయే అసెంబ్లీ సమావేశాలు... వాడివేడిగా కొనసాగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్, బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు విమర్శలు, ప్రతి విమర్శల నేపథ్యంలో సమావేశాలు మరింత హీటెక్కనున్నాయి. కేటీఆర్‌కు చెందిన జన్వాడ ఫామ్‌హౌస్‌లో క్యాసినో వ్యవహారం, లగచర్లలో ఫార్మా రగడ తదితరాంశాల ఆధారంగా ప్రధాన ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతోంది. ప్రతిగా హస్తం పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై సభలో నిలేయటం ద్వారా అధికార పక్షాన్ని ఇబ్బంది పెట్టేందుకు కారు పార్టీ సర్వశక్తులూ ఒడ్డనుంది. ఈ క్రమంలో జన్వాడ ఫామ్‌హౌస్ మాదిరిగానే మాజీ మంత్రి హరీశ్‌రావుకు చెందిన కొండపోచమ్మ సాగర్ దగ్గర్లోని వ్యవసాయ క్షేత్రంపై కూడా విచారణకు ఆదేశించటం ద్వారా బీఆర్ఎస్‌ను గుక్కతిప్పుకోనీయకుండా చేసేందుకు ముఖ్యమంత్రి వ్యూహం రచిస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే నెల్లో జరగబోయే అసెంబ్లీ సమావేశాలు సర్వత్రా చర్చనీయాంశం కానున్నాయి.

హైదరాబాద్‌లో రాష్ట్రపతి

బేగంపేట ఎయిర్‌పోర్టులో గవర్నర్, సీఎం స్వాగతం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

రాష్ట్రపతి ద్రౌపతిముర్ముకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం బేగంపేట్ ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం పలికారు. వీరివెంట మంత్రి సీతక్క, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నారు.

నెతన్యాహుకు ఐసీసీ అరెస్టు వారంట్



అమెస్టర్‌డామ్ : గాజాలో యుద్ధ నేరాలకు, మానవాళి వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారంటూ ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు, మాజీ రక్షణ మంత్రి యోవ్ గాలంట్‌లకు అంతర్జాతీయ న్యాయస్థానం అరెస్టు వారంట్లు జారీ చేసింది. అలాగే హమాస్ నేత ఇబ్రహీమ్ అల్ మాస్రిపై కూడా అరెస్టు వారంటు జారీ అయింది.కాగా ఇజ్రాయిల్ ఈ వారంట్లను ...13లో

ఇది ప్రజా ప్రభుత్వం

సమస్యలు పరిష్కరించేందుకే ముఖాముఖి కార్యక్రమం : డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజల సమస్యల పరిష్కారానికి గాంధీభవన్‌లో ప్రజలు, కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. గురువారం డిప్యూటీ సీఎం గాంధీభవన్‌లో ప్రజలు, కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ భావజాలాన్ని నమ్మి ఓట్లు వేసిన ప్రజల ఆలోచనలు, పార్టీ కార్యకర్తల ద్వారా వారి అభిప్రాయాలను తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వంలో మంత్రులు, డిప్యూటీ సీఎంగా తాను గాంధీభవన్ కార్యక్రమానికి హాజరవుతున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం గడీల మధ్యన పాలించగా నేడు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి యావత్ క్యాబినెట్ ప్రజల మధ్య పాలన చేస్తుందని తెలిపారు.

రాష్ట్రంలో విద్య, వైద్యంపై ప్రజా ప్రభుత్వం దృష్టి నిలిపిందని తెలిపారు. ప్రపంచ స్థాయి విద్యను పేద విద్యార్థులకు అందించేందుకు సకల సౌకర్యాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. గత పాలకులు పదేండ్లు విస్మరించినా తమ ప్రభుత్వం హాస్టల్ విద్యార్థుల ఛార్జీలను 40 శాతం పెంచిందని గుర్తుచేశారు. 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు సరఫరా, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం... ఇవన్నీ ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వం విజయాలు అన్నారు.

ఏడాదిలోపే 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. గత పది సంవత్సరాల పాటు గ్రూప్ 1 పరీక్ష నిర్వహించలేకపోయారనీ, అధికారంలోకి రాగానే పేపర్ లీకేజీలు, ఎలాంటి అడ్డంకులు లేకుండా విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. జనాభాలో సగభాగం ఉన్న మహిళలను దృష్టిలో పెట్టుకొని ఏడాదికి రూ.20 నుంచి 25 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ... ఐదు సంవత్సరాల కాలంలో మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఒప్పించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో 10 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని వివరించారు. ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి వాటిని మహిళా సంఘాలకు అప్పగించి.. వారు ఆర్టీసీకి బస్సులు లీజుకు ఇచ్చి ఆదాయం పొందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రపంచస్థాయి స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామనీ, మూలనపడ్డ 65 ఐటీఐ లను అడ్వాన్స్ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు.

కులగణన చారిత్రాత్మక నిర్ణయమనీ, దీనిని అడ్డుకోవాలని దోపిడీదారులు సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సర్వే పూర్తయితే ఇన్నాళ్లు దోచుకున్న వారి ఆటలు సాగవని హెచ్చరించారు. ఫ్యూడల్ వ్యవస్థ నుంచి బయటికి తెచ్చి సమ సమాజ నిర్మాణానికి వేస్తున్నట్టు వివరించారు. ముఖాముఖి సందర్భంగా పలువురు తమ సమస్యలపై ఇచ్చిన వినతిపత్రాలను ఆయన స్వీకరించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాల వచ్చేలా పని చేయాలని కోరారు.

టెట్‌కు 2.75 లక్షల దరఖాస్తులు

- దరఖాస్తుల సవరణకు నేడే ఆఖరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు సంబంధించి దరఖాస్తు స్వీకరణ గడువు బుధవారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 2,75,773 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఈ మేరకు టెట్ కన్వీనర్ రమేష్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్మెన్ ఈవి నరసింహారెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ పేపర్-1కు 94,335 మంది, పేపర్-2కు 1,81,438 మంది కలిపి మొత్తం 2,75,773 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన వారి దరఖాస్తుల సవరణకు శుక్రవారం వరకు గడువున్నదని తెలిపారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే 7032901383/9000756178 నెంబర్లను సంప్రదించాలి.

అంకితభావంతో పనిచేయాలి

రిటైర్‌మెంట్ వరకు ఇదే ఫిట్‌నెస్ ఉండాలి

- నా 33ఏండ్ల సర్వీస్‌లో అదే ఫిట్‌నెస్ : హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి.ఆనంద్
- 747మంది కానిస్టేబుల్స్ బేసిక్ ఇండెక్షన్ ట్రైనింగ్ పూర్తి
- పాసింగ్ అవుట్ పరేడ్‌కి హాజరైన సీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో/ధూల్‌పేట్

క్రమశిక్షణ, అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ పోలీసు శాఖకు మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని హైదరాబాద్ నగర సీపీ సివి.ఆనంద్ అన్నారు. 747 మంది 9 నెలల బేసిక్ ఇండెక్షన్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని పేట్లబుర్జు పోలీస్‌స్టేడియంలో నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌కు సీపీ హాజరయ్యారు. పాసింగ్ అవుట్ పరేడ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన 747 మంది కానిస్టేబుళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శిక్షణ అభ్యర్థులను ఉద్దేశించి సీపీ మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగం అనేది ఒక పవిత్రమైన ఉద్యోగమని, పోలీస్ ఏ ఒక్క రోజూ పనిచేయకున్నా సమాజం నడవదని అన్నారు. ఎంతో బాధ్యతగల విధుల్లో ఉన్న పోలీసులు నిరంతరం సమాజం కోసం శ్రమిస్తారని తెలిపారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీసులకు వారి కుటుంబ సభ్యుల నుంచి పూర్తి సహకారం ఉండాలని కోరారు. శిక్షణ సమయంలో చేసే ప్రతిజ్ఞ సారాంశాన్ని తెలుపుతూ, అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. పోలీసులు రాజ్యాంగానికి విధేయత చూపాలన్నారు. నిజాయితీతో, న్యాయంగా పనిచేయాలని, ప్రజల మాన ప్రాణాలు కాపాడటంలో కర్తవ్యం నెరవేర్చాలన్నారు. సర్వీసు ముగింపు వరకు వాటికి కట్టుబడి ఉద్యోగం నిర్వర్తించాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో ఒత్తిడి వల్ల పోలీసులు చెడు అలవాట్లు నేర్చుకునే అవకాశముందని, కానీ ఎలాంటి పరిస్థితుల్లోనైనా వాటికి దూరంగా ఉండాలని, ఓపిక తప్పకుండా అలవరుచుకోవాలని చెప్పారు. అప్పుడే మన జీవితం ఎలాంటి అడ్డంకులూ లేకుండా సర్వీసు సాఫీగా ముందుకు వెళ్తుందన్నారు. మిమ్మల్ని చూస్తే తన అనుభవాలు గుర్తుకు వస్తున్నాయన్నారు.

1992లో తాను ఐపీఎస్ శిక్షణ పొందానని, 80 మందితో తమ పాసింగ్ అవుట్ పరేడ్ వర్షంలో జరిగిందని గుర్తు చేశారు. తాను 33 ఏండ్ల పోలీస్ సర్వీస్‌లో 75-76 కేజీల మధ్యలో ఉన్నానని, ఫిట్‌నెస్‌గా ఉండటానికి చాలా శ్రమిస్తానని చెప్పారు. అందరూ ఇప్పుడున్న ఫిజికల్ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ రాబోయే 30 సంవత్సరాల తరువాత కూడా ఇదే యూనిఫామ్ ధరించే విధంగా ఉండాలన్నారు. పోలీసుల జీత భత్యాలననుసరించి తన స్థాయిని బట్టి డబ్బుల విషయంలో సర్దుకుపోవాలే కానీ, ఎలాంటి అవినీతికీ పాల్పడొద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, అదనపు డీసీపీలు మద్దిపాటి శ్రీనివాసరావు, ఆనంద్, భాస్కర్, కానిస్టేబుల్స్ కుటుంబసభ్యులు, బంధువులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రాలు ఇవ్వండి

- మంత్రుల ముఖాముఖిలో భట్టి, పొంగులేటికి జేఎల్ అభ్యర్థుల విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వివిధ జిల్లాలు, విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు నియామకపత్రాలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మంత్రుల ముఖాముఖి కార్యక్రమానికి అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని పలువురు అభ్యర్థులు కలిసి నియామక పత్రాలను ఇవ్వాలంటూ విజ్ఞప్తి చేశారు. 2022లో నోటిఫికేషన్ వచ్చిందనీ, 2023లో రాతపరీక్షలను టీజీపీఎస్సీ నిర్వహించిందని గుర్తు చేశారు. ఈ ఏడాదిలో తుది ఫలితాలను ప్రకటించారని వివరించారు. జేఎల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలను ఇవ్వాలని కోరారు. ఇదే విషయంపై గతంలో పలువురు మంత్రులు, అధికారులను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దే విద్యాశాఖ ఉన్నందున నియామకపత్రాలిచ్చేందుకు త్వరగా చర్యలు చేపట్టాలని సూచించారు. తద్వారా విద్యారంగ ప్రక్షాళన జరుగుతుందనీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులందరూ నాణ్యమైన విద్యను పొందుతారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా జరుగుతున్న ప్రజా విజయోత్సవాల్లో భాగంగా జేఎల్ అభ్యర్థులకు నియామకపత్రాలను ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో ముఖ్యభూమిక పోషిస్తామని పేర్కొన్నారు. ప్రయివేటు జూనియర్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు నీట్, జేఈఈ, ఎప్‌సెట్ కోచింగ్‌లు ఇచ్చి మంచి ర్యాంకులు వచ్చేలా బోధిస్తామనీ, ఉన్నత స్థానాలకు వెళ్లేలా తీర్చిదిద్దుతామని వివరించారు. ప్రజాప్రభుత్వంలో భాగస్వాములమవుతామని తెలిపారు.

జేఎల్ తుది ఫలితాలు విడుదల

- టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఎంపికైన అభ్యర్థుల వివరాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఇంటర్ విద్యాశాఖ కమిషనరేట్ పరిధిలో 1,392 జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) గురువారం విడుదల చేసింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతోపాటు ఉర్దూ మాధ్యమానికి సంబంధించి మ్యాథమెటిక్స్ సబ్జెక్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను విడుదల చేశామని తెలిపారు. జేఎల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలు www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని పేర్కొన్నారు. 1,392 జేఎల్ పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ తొమ్మిదిన టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. జూనియర్ లెక్చరర్ పోస్టులకు సంబంధించి ఇంకా వివిధ సబ్జెక్టుల్లో ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించాల్సి ఉన్నది.

లంచావతారం

సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం అధికారులకు అదానీ ముడుపులు

- వాస్తవాలు దాచిపెట్టి అమెరికా నుంచి నిధులు
- న్యూయార్క్ కోర్టులో ప్రాసిక్యూటర్ల అభియోగాలు...కేసులు
- తాజా పరిణామాలతో పతనమైన అదానీ షేర్లు



న్యూయార్క్ : పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ మరో వివాదంలో చిక్కుకున్నారు. సౌర విద్యుత్ కాంట్రాక్టులు పొందడానికి భారత ప్రభుత్వ అధికారులకు రూ.2,029 కోట్ల ముడుపులు ముట్టజెప్పారు. ఈ మేరకు గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీ, మరో ఆరుగురిపై అమెరికా ప్రాసిక్యూటర్లు న్యూయార్క్ జిల్లా కోర్టులో అభియోగాలు మోపారు. 2020-2024 మధ్య ఈ ముడుపుల బాగోతం నడిచిందని వారు ఆరోపించారు. సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం అదానీ గ్రూప్ వాస్తవాలను కప్పిపెట్టి అమెరికా బ్యాంకులు, మదుపరుల నుండి అనేక బిలియన్లు సేకరించింది. తద్వారా వారిని మోసం చేసింది. ఇంధన కాంట్రాక్టులు సంపాదించడం ద్వారా రెండు బిలియన్ డాలర్ల లాభాలు వస్తాయని ఆశించింది.

ముడుపుల ఆరోపణలు భారత అధికారులకు సంబంధించినవే అయినప్పటికీ ఈ వ్యవహారంలో అమెరికా మదుపరులు లేదా బ్యాంకర్ల ప్రమేయం ఉన్నందున అవినీతి ఆరోపణలు మోపేందుకు ఆ దేశ చట్టాలు అనుమతించాయి. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ తోసిపుచ్చింది. ఇవి నిరాధార ఆరోపణలని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపింది. అదానీ గ్రూపుపై సంవత్సరం క్రితం అమెరికా షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ అవినీతి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. వాటి కారణంగా అదానీ గ్రూప్ మార్కెట్ విలువ 150 బిలియన్ డాలర్ల మేర పడిపోయింది.

అభియోగాలు వీరి పైనే

అదానీని భారతీయ ఇంధన కంపెనీ 'అదానీ గ్రీన్ ఎనర్జీ' వ్యవస్థాపకుడు, ఛైర్‌పర్సన్‌గా అమెరికా ప్రాసిక్యూటర్లు తమ అభియోగాలలో పేర్కొన్నారు. ఈ కంపెనీయే ఇప్పుడు వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. ఇంధన కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సాగర్ అదానీ పేరును ప్రస్తావించింది. అజూర్ పవర్ సీఈఓ రంజిత్ గుప్తా, ఆ సంస్థ కన్సల్టెంట్ రూపేష్ అగర్వాల్‌పై కూడా అమెరికా ప్రాసిక్యూటర్లు కేసు నమోదు చేశారు. అజూర్ పవర్ అనేది అమెరికాకు చెందిన ప్రభుత్వ సంస్థ.

ఏమిటీ కేసు ?

అమెరికా ప్రాసిక్యూటర్ల అభియోగాల ప్రకారం...భారత ప్రభుత్వానికి చెందిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ-సెసీ)కు 12 గిగావాట్ల విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అదానీ గ్రీన్ ఎనర్జీ, అమెరికా సంస్థ కలిసి కాంట్రాక్ట్ సంపాదించాయి. అయితే సెసీకి భారత్‌లో సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసే వారు కన్పించలేదు. కొనుగోలుదారులు లేకపోవడంతో ఈ ఒప్పందం ముందుకు సాగలేదు. ఫలితంగా ఈ రెండు కంపెనీలు తాము ఆశించిన లాభాలను పొందలేని పరిస్థితి తలెత్తింది. ఆ సమయంలో అదానీ గ్రూప్, అజూర్ పవర్ కలిసి ఓ పథకాన్ని రూపొందించుకొని భారత ప్రభుత్వ అధికారులకు ముడుపులు అందించాయి. దీనికి ప్రతిఫలంగా సెసీతో విద్యుత్ సరఫరా ఒప్పందాలు కుదుర్చుకునేలా ఆ అధికారులు రాష్ట్ర విద్యుత్ పంపిణీ కంపెనీలను ఒప్పించారు. ఈ రెండు కంపెనీలు భారత అధికారులకు 265 మిలియన్ డాలర్ల మేర ముడుపులు అందిస్తామని హామీ ఇచ్చాయి. ఇందులో అధిక భాగం ఆంధ్రప్రదేశ్‌లోని అధికారులకే చేరాయి.

అధికారులు నచ్చచెప్పడంతో కొన్ని రాష్ట్ర విద్యుత్ కంపెనీలు సెసీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. అందులో భాగంగా ఆ రెండు కంపెనీల నుండి సౌర విద్యుత్‌ను కొనుగోలు చేశాయి. ఎవరెవరికి ఎంతెంత సొమ్ము ముట్టచెప్పాలనే విషయంపై అదానీ గ్రీన్ ఎనర్జీ, అజూర్ పవర్ కలిసే నిర్ణయం తీసుకున్నాయి. అయితే అవి తమ గుట్టు బయటపడకుండా కోడ్ నేమ్స్‌ను ఉపయోగించాయి. ఉదాహరణకు గౌతమ్ అదానీని 'న్యూమెరో ఉనో', 'ది బిగ్ మ్యాన్' అని సంబోధించారు. గుప్త సందేశాల ద్వారా సంప్రదింపులు జరిగేవి.

కథ అడ్డం తిరిగింది

ఇక్కడే కథ అడ్డం తిరిగింది. అమెరికా సంస్థ యాజమాన్యం చేతులు మారడంతో గుట్టు రట్టయింది. 2019-2022 మధ్యకాలంలో రంజిత్ గుప్తా అజూర్ పవర్‌కు సీఈఓగా వ్యవహరించారు. 2022-23 నుండి రూపేష్ అగర్వాల్ ఆ బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రాజెక్టుతో ప్రమేయమున్న కొందరు కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లను రాజీనామా చేయాల్సిందిగా కోరారు. హామీ ఇచ్చిన ప్రకారం ముడుపులు ఎలా అందించాలనే విషయంపై చర్చించేందుకు అనేక సమావేశాలు జరిగాయి. ప్రాజెక్ట్ మొత్తాన్ని కొన్ని భాగాలుగా విభజించి వాటిని బదిలీ చేయడం, ఫీజుల రూపంలో చెల్లింపులు జరపడం వంటి అవకాశాలను పరిశీలించారు.

'కుట్రదారులు తమ ప్రణాళికలను అమలు చేయడం ప్రారంభించారు. ముడుపుల హామీని నెరవేర్చడంలో భాగంగా అందులో ఓ భాగాన్ని అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీకి వాపసు చేశారు. సొమ్మును వాపసు చేయడానికి వారు కొన్ని కారణాలను సృష్టించారు. న్యాయపరమైన వివాదం, క్షీణిస్తున్న ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపారు' అని అమెరికా ప్రాసిక్యూటర్లు వివరించారు. అయితే మరికొన్ని విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పీపీఏలు) పొందేందుకు ప్రతిఫలంగా ముడుపులు ఇస్తామని తాము ఇప్పటికే హామీ ఇచ్చిన విషయాన్ని అదానీ గ్రూప్ అమెరికా సంస్థ డైరెక్టర్ల బోర్డుకు చెప్పకుండా దాచిపెట్టింది.

బాండ్ల జారీ రద్దు

ముడుపుల ఆరోపణల నేపథ్యంలో షేర్ మార్కెట్‌లో అదానీ గ్రూప్ వాటాల విలువ దారుణంగా పడిపోయింది. బాంబే స్టాక్ ఎక్స్చేంజీ (బీఎస్ఈ)లో అదానీ గ్రీన్ వాటాల విలువ 20 శాతం వరకూ పతనమైంది. తనపై అమెరికా ప్రాసిక్యూటర్లు అభియోగాలు మోపి కేసు నమోదు చేయడంతో అదానీ గ్రూప్ 600 మిలియన్ డాలర్ల బాండ్ల జారీని రద్దు చేసుకుంది. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ (డీఓజే), సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) కేసులు నమోదు చేసిన తర్వాత ఆసియన్ ట్రేడింగ్‌లో అదానీ డాలర్ బాండ్ల విలువ పడిపోయింది. కొన్ని సెక్యూరిటీలు భారీగా నష్టపోయాయి. ధరను నిర్ణయించిన కొద్ది గంటల వ్యవధిలోనే బాండ్ల అమ్మకాన్ని అదానీ గ్రూప్ నిలిపివేసింది. చట్టపరమైన పరిణామాలను కారణంగా చూపింది.

అమెరికా మార్కెట్ల నుండి నిధులు సమీకరించేందుకు సాగర్ అదానీ, వినీత్ జైన్ సహా కీలక వ్యక్తులు మదుపుదారులను తప్పుదోవ పట్టించారని అభియోగాలు మోపారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ సంవత్సరం మార్చిలో జారీ చేసిన అదానీ గ్రీన్ ఎనర్జీ బాండ్ల విలువ కనిష్ట స్థాయికి పడిపోయింది. అదానీ గ్రూపునకు చెందిన ఇతర సెక్యూరిటీలు కూడా నష్టపోయాయి.

తోసిపుచ్చిన అదానీ గ్రూప్

తమ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఇతర కీలక ఎగ్జిక్యూటివ్‌లపై అమెరికా ప్రాసిక్యూటర్లు మోపిన మోసం, ముడుపుల ఆరోపణలను అదానీ గ్రూప్ తీవ్రంగా ఖండించింది. తమపై నిరాధారమైన ఆరోపణలు మోపారని అంటూ తాము ఎంతో ఉన్నత ప్రమాణాలతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని తెలిపింది. ఆరోపణలను ఎదుర్కొనేందుకు చట్టపరమైన పరిష్కారాలను అన్వేషిస్తామని చెప్పింది.

అదానీకి కెన్యా షాక్..

ఎయిర్‌పోర్ట్ , విద్యుత్ సరఫరా లైన్ల కాంట్రాక్టు రద్దు



నైరోబీ: అదానీ గ్రూప్‌నకు కెన్యా సర్కారు షాకిచ్చింది. లంచం ఆరోపణలపై అమెరికాలో గౌతమ్ అదానీపై కేసు నమోదైన నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఎయిర్‌పోర్ట్ కాంట్రాక్ట్ సహా, విద్యుత్ సరఫరా లైన్ల కాంట్రాక్టును రద్దు చేస్తున్నట్టు కెన్యా అధ్యక్షుడు విలియం రూటో గురువారం వెల్లడించారు. విద్యుత్ సరఫరా లైన్ల నిర్మాణానికి పబ్లిక్-ప్రయివేటు భాగస్వామ్యం కింద 30 ఏండ్లకు కెన్యా సర్కారు 736 మిలియన్ డాలర్లకు అదానీ గ్రూపుతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందానికి ఇప్పుడు బ్రేక్ పడింది.

మరోవైపు కెన్యాలోని ప్రధాన విమానాశ్రయమైన జోమో కెన్యాట్టా అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధి కోసం అదానీకి అప్పగించేందుకు రంగం సిద్ధం అవ్వగా.. ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిపై నిరసన ప్రదర్శనలు కూడా జరిగాయి. దీంతో తాత్కాలికంగా ఈ ప్రాజెక్ట్ నిలుపుదల చేసిన అక్కడి ప్రభుత్వం.. తాజాగా పూర్తిగా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. భాగస్వామ్య దేశాల దర్యాప్తు సంస్థల నుంచి అందిన సమాచారం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు రూటో ప్రకటించారు. రవాణా, ఇంధన మంత్రిత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

అదానీని అరెస్టు చేయండి



(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ అధికారులకు ముడుపులు చెల్లించడంలో గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలకు ప్రమేయం వుందంటూ తీవ్రమైన నేరాభియోగాలు వున్నాయి. సౌర విద్యుత్ సరఫరా కోసం రాష్ట్రాలు లేదా ప్రాంతీయ విద్యుత్ పంపిణీ కంపెనీలతో విద్యుత్ విక్రయానికి సంబంధించి అక్రమ ఒప్పందాలతో ముందుకు సాగడానికి భారత ప్రభుత్వ అధికారులకు రూ.2,029 కోట్లు ఇవ్వజూపారని లేదా ఇస్తామని హామీ ఇచ్చారని ఆ అభియోగ పత్రం పేర్కొంటోంది. అదానీలు అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదారి పట్టించారనే ఆరోపణలపై అమెరికాలో ఈ కేసు నమోదైంది.

ప్రభుత్వ అధికారులకు ఇవ్వజూపిన, వాగ్దానం చేసిన ముడుపులకు సంబంధించిన నిర్దిష్ట వివరాలను అందజేసిన సాగర్ అదానీ నుంచి సాక్ష్యాధారాలను కూడా సేకరించినట్టు అభియోగపత్రం పేర్కొంది. "ముడుపుల పత్రాలు గుర్తించినవి : (1) రాష్ట్రం లేదా ప్రాంతం కోసం ప్రభుత్వ అధికారులకు ఇవ్వచూపిన ముడుపులు (2) ఇస్తామని చెప్పిన ముడుపుల మొత్తం (3) ఈ ముడుపులు ముట్ట జెప్పినందుకు లేదా ఇస్తామని హామీ ఇచ్చినందుకు ప్రతిఫలంగా రాష్ట్రం లేదా ప్రాంతం కొనుగోలు చేయడానికి అంగీకరించిన సౌర విద్యుత్ మొత్తం. చాలా సందర్భాల్లో, మొత్తంగా ఇవ్వచూపిన ముడుపుల మొత్తంలో ఒక్కో మెగావాట్ రేటు ఎంత వుందో కూడా ముడుపుల పత్రాలు గుర్తించాయి. అలాగే ఈ లంచాలు అందుకునే ప్రభుత్వ అధికారులకు సంబంధించిన సంక్షిప్త నామాలు కూడా వున్నాయి. ఒక్కో రాష్ట్రంలో, ప్రాంతంలో ప్రభుత్వ అధికారుల మధ్య పంపిణీ చేయాల్సిన ముడుపుల మొత్తం కూడా వుంది." ఇంత పెద్ద ఎత్తున లంచాలకు పాల్పడడం, పైగా అదానీలు, ప్రభుత్వ అధికారులను తమ అధీనంలో వుంచుకోవడం, ఇదంతా కూడా భారత్‌లో కాకుండా అమెరికాలో వారి నేర న్యాయ వ్యవస్థ ద్వారా బయటపడడం సిగ్గుచేటైన విషయం. అంతేకాకుండా ఇటువంటి అక్రమ, నేరపూరితమైన కార్యకలాపాలు చేపట్టేందుకు గౌతమ్ అదానీకి, ఆయన వ్యాపార సామ్రాజ్యానికి మోడీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో రక్షణగా నిలుస్తున్నది. హిండెన్‌బర్గ్ వ్యవహారంలో తలెత్తిన ఆరోపణలపై ఎలాంటి విచారణ లేదా ప్రాసిక్యూషన్ జరగకుండా అదానీకి ప్రధాని నరేంద్ర మోడీ పూర్తి రక్షణగా నిలిచారు. మోడీ ప్రభుత్వం ఇక ఇప్పుడు ఏ తెర చాటునా దాక్కోలేదు. అమెరికాలోని ప్రాసిక్యూషన్ అందజేసిన సమాచారం ఆధారంగా కేసు నమోదు చేయాల్సిందిగా తక్షణమే సీబీఐకి ఆదేశాలు జారీ చేయాలి. ప్రభుత్వ అధికారులకు ముడుపులు ఇవ్వడమనేది సిబిఐ పరిధిలో వున్న అవినీతి నిరోధక చట్టం కిందకు వస్తుంది. అదానీ గ్రూపు కంపెనీలు పాల్పడిన తప్పులు, అవకతవకలన్నింటినీ వెలికితీయడానికి స్వతంత్ర సంస్థతో పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టడం తక్షణావసరమని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

చట్టాలను ఉల్లంఘించారు

(మొదటిపేజీ తరువాయి)

ఉంటున్నారని ఆరోపించారు. ఈ అంశంపై ఎన్నాళ్లనుంచో ప్రశ్నిస్తున్నామని, కానీ అదానీని మోడీ రక్షిస్తున్నారని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ స్కామ్‌లో ప్రధాని పాత్ర కూడా ఉన్నట్టు ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా ఈ అంశాన్ని లోక్‌సభలో లేవనెత్తుతానని చెప్పారు. అదానీ నేరాలపై జేపీసీ విచారణ జరిపించాలన్న డిమాండ్ కొనసాగుతుందన్నారు. భారత సర్కారు గౌతం అదానీకి రక్షణగా నిలుస్తోందని, ఆయన్ను అరెస్టు చేయడం కానీ విచారణ చేయడం కానీ జరగదని ఇందుకు తాను గ్యారెంటీ ఇస్తున్నట్టు రాహుల్ గాంధీ తెలిపారు. గౌతం అదానీ ఎందుకు ఈ దేశంలో స్వేచ్ఛగా విహరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. రెండు వేల కోట్ల స్కామ్‌తో పాటు ఇతర కుంభకోణాల్లో ఆయన పాత్ర ఉన్నట్టు తెలిసినా ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయడం లేదని ఆయన అడిగారు.

అక్రమాలెన్నో..



(మొదటిపేజీ తరువాయి)

ఎంటర్‌ప్రైజెస్ షేర్లు 23శాతం మేర క్షీణించగా, మిగిలిన కంపెనీల షేర్లు 20నుంచి 90శాతం మేర క్షీణించాయి. గురువారం ఉదయం జరిగిన ట్రేడింగ్‌లో 2800కోట్ల డాలర్ల మేరకు నష్టం సంభవించింది. 2023 ఆగస్టులో విదేశీ నిధులను వాడుకుంటున్నారంటూ అదానీ కుటుంబంపై ఓసీసీఆర్‌పీ నివేదిక ఆరోపణలు చేసింది. గతేడాది జనవరిలో, అదానీ గ్రూపు స్టాక్‌ల అవకతవకలకు, అవినీతికి పాల్పడిందంటూ అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక ఆరోపించింది. విదేశాల్లో పన్నులకు స్వర్గధామాలుగా వున్న ప్రాంతాలను అనుచితంగా ఉపయోగించుకుంటున్నారని పేర్కొంది.

భారీ కుంభకోణాలు, ఆరోపణలు...

2023 జనవరి - హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక : అదానీ గ్రూపు తీవ్ర స్థాయిలో స్టాక్‌ల అవకతవకలకు, అవినీతికి పాల్పడిందంటూ అమెరికాకు చెందిన కంపెనీ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపించింది. ఈ అవకతవకలు, అవినీతి దశాబ్దాలుగా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. సమర్థించుకోలేని రీతిలో అధిక రుణ భారాలతో సతమతమవుతోందని, పైగా విదేశీ పన్ను స్వర్గధామాలను అనుచితమైన రీతిలో ఉపయోగించుకుంటోందని విమర్శించింది.

2023 ఆగస్టు : ఓసీసీఆర్‌పీ నివేదిక : భారత సెక్యూరిటీల చట్టాలను ఉల్లంఘించి అదానీ గ్రూపు కంపెనీల్లో విదేశీ నిధులను పెట్టుబడులుగా పెడుతున్నారంటూ అదానీ కుటుంబంపై వారి సహచరులపై ఆరోపణలతో ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఓసీసీఆర్‌పీ) ఒక నివేదికను వెలువరించింది.

2024 నవంబరు - అమెరికా కోర్టు అభియోగపత్రం, సివిల్ కేసు : 26 కోట్ల డాలర్లకు పైగా ముడుపులను అందించి భారత ఉపఖండంలో సౌర విద్యుత్ ప్రాజెక్టులను చేపడుతున్న విషయాన్ని దాచిపెట్టి అమెరికా పెట్టుబడిదారులను మోసగించారంటూ గౌతమ్ అదానీపై అమెరికా న్యాయస్థానంలో కేసు నమోదైంది.

ఎనిమిదేండ్లలో అదానీ గ్రూపు అక్రమాలపై ప్రజాందోళనలు

2017 - కార్మిచెల్ బొగ్గు గని ప్రాజెక్టు : ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్‌లో దాదాపు 1100కోట్ల డాలర్లతో కార్మిచెల్ బొగ్గు గని ప్రాజెక్టును చేపట్టాలని అదానీ ఎంటర్‌ప్రైజెస్ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు వాతావరణ కార్యకర్తల నుండి తీవ్రమైన నిరసన ఎదురైంది. ఈ ప్రాజెక్టు వెలువరించే కర్బన ఉద్గారాల వల్ల ఆస్ట్రేలియాలోని గ్రేట్ బారియర్ పగడపు దిబ్బలకు తీవ్రంగా నష్టం వాటిల్లే ప్రమాదముందంటూ విస్తృత స్థాయిలో ఆందోళనలు, నిరసనలు చేపట్టారు.

2017 - గొడ్డా విద్యుత్ ప్లాంట్ : అదానీ గ్రూపు జార్ఖండ్‌లోని గొడ్డాలో విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పింది. ఇందుకోసం బంగ్లాదేశ్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంది. గిరిజనుల హక్కులను ఉల్లంఘిస్తున్నారన్న కారణంతో ఈ ఒప్పందంపై అటు బంగ్లాదేశ్‌లో ఇటు జార్ఖండ్‌లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

2021 - యాంగాన్ పోర్ట్ : మయన్మార్‌లోని యాంగాన్ నగరంలో కంటెయినర్ టెర్మినల్‌ను నిర్మించాలన్న అదానీ పోర్ట్స్ ప్రణాళికను అంతర్జాతీయ పెట్టుబడిదారులు తీవ్రంగా పరిశీలించారు. మయన్మార్ మిలటరీకి చెందిన సంస్థల నుంచి లీజుకు తీసుకున్న భూమిలో దీన్ని నిర్మించాలనుకోవడమే ఇందుకు కారణం. ఆ తర్వాతే మయన్మార్‌లో సైనిక కుట్ర జరగడం, వందలాదిమంది చనిపోవడం చోటు చేసుకుంది.

2022 - శ్రీలంక పవన విద్యుత్ ప్రాజెక్టు : శ్రీలంకలోని ఉత్తర ప్రావిన్స్‌లో నిర్మించే ప్రాజెక్టుల ద్వారా గాలి మరల విద్యుత్‌ను శ్రీలంక ప్రభుత్వానికి విక్రయించేందుకు అదానీ గ్రీన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టును పర్యావరణ కార్యకర్తలు, స్థానికులు తీవ్రంగా నిరసించారు. జీవ వైవిధ్యంపై, స్థానికుల జీవనోపాధులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యతిరేకించారు.


2023 డిసెంబరు - ధారావి పునర్ అభివృద్ధి ప్రాజెక్టు : ఆసియాలోనే అతిపెద్ద మురికివాడల్లో ఒకటైన ముంబైలోని ధారావిలో 259 హెక్టార్లను అభివృద్ధి పరిచే ప్రాజెక్టును అదానీ ప్రాపర్టీస్ 2022 నవంబరులో చేజిక్కించుకుంది. ఇందుకు వేలాదిమంది ప్రజలు నిరసన వ్యక్తం చేశారు.

ఈ ప్రాజెక్టుకు వేసిన బిడ్‌లలో అదానీ గ్రూపునకే ప్రభుత్వం ప్రాధాన్యతను ఇచ్చిందని ప్రతిపక్షాలు విమర్శించాయి. మహారాష్ట్రలో ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అస్థిరపరిచి, బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అదానీ నివాసంలోనే సమావేశం జరిగిందని ఇటీవల వెలుగులోకి వచ్చింది.

2024 సెప్టెంబరు - నైరోబి ఎయిర్‌పోర్ట్ : అదానీ గ్రూపుతో కెన్యా ఎయిర్‌పోర్ట్ అథారిటీ కుదుర్చుకున్న ఒప్పందాన్ని వందలాదిమంది కార్మికులు తీవ్రంగా నిరసించారు. ఈ ఒప్పందం కింద నైరోబి విమానాశ్రయాన్ని 30ఏళ్లపాటు లీజుకు తీసుకుని, నిర్వహించే బాధ్యతను అదానీ గ్రూపు తీసుకోనుంది. దీనివల్ల ఉద్యోగాల్లో కోత వుంటుందని కార్మికులు భయాందోళనలు వ్యక్తం చేశారు.

ఏపీ ఉన్నతాధికారికి రూ.1,750 కోట్ల

ముడుపులు ముట్టజెప్పిన అదానీ



పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై అమెరికా ప్రాసిక్యూటర్లు మోపిన అభియోగాలలో దిగ్భ్రాంతి కలిగించే విషయాలు వెలుగు చూశాయి. 2019 మే నుండి ఈ సంవత్సరం జూన్ వరకూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పనిచేసిన ఓ ఉన్నతాధికారికి గౌతమ్ అదానీ, ఆయన సహ కుట్రదారులు రూ.1,750 కోట్లను 'అవినీతి చెల్లింపు'గా అందించారని అమెరికా ప్రాసిక్యూటర్లు వెల్లడించారు. ఆ ప్రభుత్వాధికారిని 'విదేశీ అధికారి 1'గా కోర్టు ఫైలింగ్స్‌లో చూపారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెసీ) నుంచి ఏడు గిగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర పంపిణీ కంపెనీలను అంగీకరింపజేసినందుకు ప్రతిఫలంగా ఈ మొత్తాన్ని అందించారు. 'గౌతమ్ అదానీ వ్యక్తిగతంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విదేశీ అధికారి 1ని అనేకసార్లు కలిశారు. సెసీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ కంపెనీల మధ్య కుదిరిన విద్యుత్ అమ్మకపు ఒప్పందాన్ని గడువు కంటే ముందుగానే అమలు చేయాలని కోరారు. ఆయన ఆ అధికారిని 2021 ఆగస్ట్ 7, సెప్టెంబర్ 12, నవంబర్ 20 తేదీలలో కలిశారు. ముడుపుల పథకాన్ని ముందుకు తీసుకుపోయేందుకు, అదానీకి చెందిన పునరుద్పాదక ఇంధన సబ్సిడరీలకు ప్రయోజనం చేకూరేలా ఒప్పందంపై త్వరగా సంతకాలు జరిగేలా చూసేందుకు ఈ సమావేశాలు జరిగాయి' అని అమెరికా ప్రాసిక్యూటర్లు కోర్టుకు తెలిపారు. కాగా కోర్టుకు అందజేసిన ఫైలింగ్స్‌లో పలువురు ఇతర వ్యక్తులను కూడా నిందితులుగా చేర్చారు. హాంగ్‌కాంగ్‌లో నివసిస్తున్న అమెరికన్, అమెరికా సంస్థలో ఎగ్జిక్యూటివ్ స్థానంలో ఉన్న భారతీయుడు కూడా ఈ జాబితాలో ఉన్నారు. ఎలక్ట్రానిక్ సందేశాలు సహా పలు పద్ధతులను ఉపయోగించి ఒప్పందాలు అమలు చేసేలా భారతీయ అధికారులకు ముడుపులు అందించడానికి సహ నిందితులు ప్రయత్నించారని అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు.

ఎవరీ 'విదేశీ అధికారి 1' ?

- ఏపీలో రాజకీయ ప్రకంపనలు



న్యూఢిల్లీ : అదానీ గ్రూప్ నుంచి రూ.1,750 కోట్లను ముడుపుల రూపంలో అందుకున్న 'విదేశీ అధికారి 1' ఎవరు? ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ఇప్పుడు ఈ ముడుపుల వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. 2021 ఆగస్ట్ 7, సెప్టెంబర్ 12, నవంబర్ 20న అదానీ స్వయంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆ విదేశీ అధికారిని కలిశారని అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఆ అధికారి ఎవరన్న విషయంపై ఇప్పుడు ఏపీలో చర్చోపచర్చలు సాగుతున్నాయి. 2021 సెప్టెంబర్ 13న అదానీ, ఇతర గ్రూప్ అధికారులతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి భేటీ అయ్యారని ఆంధ్ర మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఈ సమావేశం వివరాలు మాత్రం బయటకు రాలేదు. 2021 సెప్టెంబరులో అదానీ తన సోదరులతో కలిసి అప్పటి ముఖ్యమంత్రి తాడేపల్లి నివాసంలో జగన్‌తో సమావేశమయ్యారని ఆ నెల 13న ఓ వార్త వచ్చింది. అయితే ఈ పర్యటనపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. సాధారణంగా ఇలాంటి సమావేశాలు జరిగినప్పుడు అధికారిక ప్రకటనలు ఇస్తుంటారు. ఈ పర్యటనకు ముందు గంగవరం ఓడరేవులో ప్రభుత్వానికి ఉన్న 10.4 శాతం వాటాను అదానీ గ్రూపునకు విక్రయించాలని ఏపీ సర్కారు ప్రయత్నించింది. ఆ సమయంలో ప్రభుత్వానికి పోర్టులో 89.61 శాతం వాటాలు ఉన్నాయి. అయితే ప్రభుత్వ ప్రయత్నాలను హైకోర్టులో కొందరు వ్యక్తులు సవాలు చేశారు. జగన్, అదానీల మధ్య జరిగిన రహస్య సమావేశం వివరాలను బహిర్గతం చేయాలని వామపక్షాలు అప్పట్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ సమావేశం తర్వాత రాష్ట్రంలో 9,000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేసేందుకు అదానీ గ్రూపును అనుమతిస్తూ రాష్ట్ర క్యాబినెట్ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. ప్రాజెక్ట్ అమలుకు అనేక మంది కాంట్రాక్టర్లు ముందుకు వస్తే అదానీకి మాత్రమే ఎందుకు అప్పగించారని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. 2021 డిసెంబరులో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ కంపెనీలు సెసీతో విద్యుత్ సరఫరా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వీటి ప్రకారం ఏడు గెగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ అంగీకరించింది. 2021లో అదానీ, జగన్ మధ్య సమావేశం జరిగిన నెల రోజుల తర్వాత అదానీలు, అంబానీలకు చెందిన ప్రత్యేక ప్రయివేటు జెట్లను ఉపయోగించుకునేందుకు ఏపీ ముఖ్యమంత్రి ఆసక్తి చూపారు. తిరుమల దేవాలయ పర్యటన కోసం చిత్తూరు వెళ్లేందుకు అదానీ విమానాన్ని జగన్ ఉపయోగించారు. అదానీలతో సమావేశం కావడానికి ముందు ఆగస్టులో రిలయన్స్ గ్రూపునకు చెందిన విమానాన్ని జగన్ వాడారు.

దలాల్ స్ట్రీట్‌కు లంచాల దెబ్బ

కుప్పకూలిన గౌతం కంపెనీల షేర్లు

- సెన్సెక్స్ 422 పాయింట్ల పతనం
- ఎల్ఐసీకి మళ్లీ భారీ నష్టం



ముంబయి : గౌతం అదానీ లంచాలు ఇవ్వజూపారనే అభియోగాలు దలాల్ స్ట్రీట్‌ను తీవ్ర కలవరానికి గురి చేశాయి. ప్రధాని మోడీ అత్యంత సన్నిహితుడైన అదానీ.. దేశంలో సోలార్ పవర్ కాంట్రాక్టులు దక్కించుకోవడానికి యూఎస్‌లోని అధికారులకు లంచాలు ఇచ్చారనే వార్తలు గురువారం అంతర్జాతీయ, జాతీయ మీడియాలో గుప్పుమన్నాయి. ఇవి అదానీ కంపెనీలు సహా ఇతర షేర్లను తీవ్ర ఒత్తిడికి గురి చేయడంతో సెన్సెక్స్, నిఫ్టీలు కుప్పకూలాయి. లక్షల కోట్ల మదుపర్ల సొమ్ము హరించుకుపోయింది. గతేడాది అదానీ అవినీతిపై హిండెన్‌బర్గ్ విడుదల చేసిన రిపోర్ట్ తర్వాత భారీగా నష్టపోయిన అదానీ కంపెనీల షేర్లు.. తాజాగా మరోమారు అదే గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. మరోవైపు అంతర్జాతీయంగా రష్యా, ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడం మదుపర్లను ఆందోళనకు గురి చేశాయి. విదేశీ మదుపర్లు అమ్మకాలను కొనసాగించడం, దేశీయంగా పెద్ద ఆర్థిక సానుకూల పరిణామాలు ఏమీ కానరాకపోవడం తదితర పరిణామాల మధ్య మార్కెట్లు ప్రారంభమైన కాసేపట్లోనే నష్టాల వైపు పయనించాయి. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 423 పాయింట్లు లేదా 0.54 శాతం పతనమై 77,156కు పడిపోయింది. ఇంట్రాడేలో ఏకంగా 776 పాయింట్లు కోల్పోయి.. 76,803 కనిష్ఠ స్థాయిని ఎదుర్కొంది. తుదకు బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.5.28 లక్షల కోట్లు హరించుకుపోవడంతో రూ.425.38 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 169 పాయింట్ల నష్టంతో రూ.23,350 వద్ద ముగిసింది. వరుసగా ఏడు రోజులు భారీ నష్టాలను చవి చూసిన మార్కెట్లు.. బుధవారం నాటి లాభాలు స్వల్ప ఉపశమనం కలిగించాయని భావించినంతలోనే మరుసటి రోజే నిరాశ ఎదురయ్యింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 7 పైసలు పతనమై 84.49 జీవితకాల కనిష్టానికి పడిపోయింది. సెన్సెక్స్-30లో అదానీ పోర్ట్స్, ఎస్‌బిఐ, ఎన్‌టిపిసి, ఐటిసి సహా 20 స్టాక్స్ నష్టాలు చవి చూశాయి. డి-మార్ట్, టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్, ఏషియన్ పెయింట్స్, ఇంద్రప్రస్థ గ్యాస్, బంధన్ బ్యాంకు, ఇండస్ ఇండ్ బ్యాంకు స్టాక్స్ 52 వారాల కనిష్టానికి జారాయి.

ఎల్ఐసీకి రూ.12వేల కోట్ల నష్టం

అదానీ షేర్లు కుప్పకూలడంతో దిగ్గజ బీమా కంపెనీ ఎల్ఐసీ భారీ నష్టాన్ని చవి చూసింది. అదానీకి చెందిన ఎంటర్‌ప్రైజెస్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ టోటల్ గ్యాస్, ఏసీసీ, అంబుజా సిమెంట్స్‌లో ఎల్ఐసీ కీలక వాటాలని కలిగి ఉంది. ఈ స్టాక్స్ 20 శాతం వరకు విలువ కోల్పోవడంతో.. ఎల్ఐసీ దాదాపు రూ.12,000 కోట్లు నష్టపోయింది. గతేడాది అదానీపై హిండెన్‌బర్గ్ రిపోర్ట్ సమయంలోనూ ఎల్ఐసీ వేల కోట్ల సంపదను కోల్పోయింది.

అదానీ సంపద రూ.2.5 లక్షల కోట్లు ఫట్




అదానీ గ్రూపులోని 10 లిస్టెడ్ కంపెనీల షేర్లు భారీ పతనాన్ని చవి చూడటంతో గౌతమ్ అదానీ సంపద భారీగా హరించుకుపోయింది. ఆయా షేర్లు 23 శాతం వరకు నష్టపోవడంతో ఒక్క పూటలోనే దాదాపు రూ.2.60 లక్షల కోట్లు ఆవిరయ్యింది. మొత్తంగా గ్రూపు కంపెనీల మార్కెట్ విలువ రూ.14.28 లక్షల కోట్ల నుంచి రూ.12.42 లక్షల కోట్లకు పడిపోయిందని అంచనా. గౌతమ్ అదానీ సంపద ఒకేరోజు దాదాపు 12.1బిలియన్ డాలర్లు పడిపోయి.. 70 బిలియన్ డాలర్ల నుంచి 57.7బిలియన్ డాలర్లకు పరిమితమయ్యింది. దీంతో ఇప్పటి వరకు ఫోర్బ్స్ బిలియనీర్ ఇండెక్స్ జాబితాలో 22 స్థానంలో కొనసాగిన అదానీ ప్రస్తుతం 25వ స్థానానికి పడిపోయారు. హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో గతేడాది 34 శాతం విలువ కోల్పోయిన అదానీ కంపెనీలు.. ఈ దఫా కూడా అదే స్థాయిలో నష్టాలు జరుగొచ్చని.. రిటైల్ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

కంపెనీ పేరు	నష్టం
అదానీ ఎంటర్‌ప్రైజెస్	22.61 శాతం
అదానీ ఎనర్జీ సొల్యూషన్స్	20 శాతం
అదానీ గ్రీన్ ఎనర్జీ	18.80 శాతం
అదానీ పోర్ట్స్ అండ్ సెజ్	13.53 శాతం
అంబూజా సిమెంట్స్	11.98 శాతం
అదానీ టోటల్ గ్యాస్	10.40 శాతం
అదానీ విల్మార్	9.98 శాతం
అదానీ పవర్	9.15 శాతం
ఎసిసి	7.29 శాతం

సంపాదకీయం

బైడెన్ దుశ్చర్య-ట్రంప్ మౌనం!

బుధవారం నాటికి ఉక్రెయిన్‌పై రష్యా ప్రారంభించిన సైనిక చర్య 1000వ రోజులో నూతన దశలో ప్రవేశించింది. రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో అంతుపట్టడం లేదు.రష్యాలోని కురుస్క్ ప్రాంతంపై ఉక్రెయిన్ మిలిటరీ అమెరికా, బ్రిటన్ అందచేసిన మూడు వందల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను తాకే క్షిపణులను ప్రయోగించింది. దానికి ప్రతిగా తమ మీద రష్యా ఖండాంతర క్షిపణిని ప్రయోగించినట్లు జెలెన్‌స్కీ యంత్రాంగం గురువారం నాడు ఆరోపించింది. తాను ఎన్నికైతే అధికారం స్వీకరించిన 24 గంటల్లోనే ఉక్రెయిన్-రష్యా పోరును నిలిపివేస్తానని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.తాము అందచేసిన క్షిపణులను రష్యా భూభాగం మీద ప్రయోగించవచ్చని జోబైడెన్ ప్రకటించి వేయించిన తరువాత కూడా ఆ పెద్దమనిషి ట్రంప్ మౌన ముద్ర దాల్చటం అనేక అనుమానాలకు తావిస్తున్నది.తన అనుచరులతో బైడెన్ చర్యను విమర్శించటం తప్ప బైడెన్ నిర్ణయాన్ని రద్దు చేస్తాననే మాట ట్రంప్ నోటి నుంచి వెలువడలేదు. ఎన్నికల సమయంలో చేసిన ప్రకటనలో చిత్తశుద్ధి ఉందని ఇతర నాటో దేశాలు భావిస్తే వాటిలో కొన్ని బైడెన్‌కు మద్దతు ఇచ్చేవి కాదు. బైడెన్ అధికారం ఇంకా రెండునెలల పాటు కొనసాగుతుంది.ఈ లోగా ఇంకెన్ని పిచ్చిపనులు చేస్తాడో తెలియదు. అమెరికా, ఐరోపా దేశాలు ఇచ్చిన దీర్ఘశ్రేణి క్షిపణుల ప్రయోగానికి ప్రతిగా రష్యా దాడులు చేసేందుకు సిద్ధమవుతున్నదన్న సంకేతాలతో అమెరికా, కొన్ని నాటో దేశాలు ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని తమ రాయబార కార్యాలయాలను మూసివేస్తున్నట్లు, తమ పౌరులు రక్షణ కోసం అవసరమైతే కలుగుల్లో దూరి తలదాచుకోవాలని ఆదేశాలు జారీ చేశాయి. అయితే రష్యా వైపు నుంచి వెంటనే ఎలాంటి దాడులు జరగకపోవటంతో తమ రాయబార కార్యాలయం అక్కడి నుంచే పనిచేస్తుందని అమెరికా ప్రకటించింది.



జో బైడెన్ ఆకస్మికంగా ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అనే చర్చ జరుగుతోంది.యుద్ధాన్ని నిలిపివేస్తానన్న ట్రంప్ ప్రకటనను వమ్ము చేసేందుకే అన్నది ఒకటి.ఉక్రెయిన్‌కు అందచేసిన నిధులు చెల్లించనవసరం లేదని కూడా నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఉక్రెయిన్ సంక్షోభం తమ ఖజానాను ఖాళీ చేస్తోందని రిపబ్లికన్లు చెప్పారు. అదే సమయంలో ఈ సంక్షోభం నుంచి అమెరికా ఆయుధ కార్పొరేట్లు భారీ మొత్తాల్లో లాభాలు పిండుకున్నాయి. రానున్న రోజుల్లో కూడా అదే కొనసాగించవచ్చనే ఆయుధ లాబీ మంత్రాంగం బైడెన్ నిర్ణయం-ట్రంప్ మౌనం వెనుక ఉందని చెప్పవచ్చు. భవిష్యత్‌లో జరుగుతాయని భావిస్తున్న శాంతి చర్చలలో ఉక్రెయిన్‌కు బలం చేకూర్చేందుకే ఇదనే వాదనను మరికొందరు ముందుకు తీసుకువచ్చారు. తమ షరతులను ఆమోదించకుండా చర్చల ప్రసక్తే లేదని గతంలోనే పుతిన్ ప్రకటించిన సంగతి తెలిసిందే.అవసరమైతే రష్యా ఆధీనంలో ఉన్న ఉక్రెయిన్ ప్రాంతాలను వదులు కుంటే రాజీకుదరవచ్చని ట్రంప్ చెప్పాడు. దానికి సామ్రాజ్యవాదులు అంగీకరిస్తారన్న భ్రమలు పెట్టుకోనవసరం లేదు. రష్యా తరపున పోరాడేందుకు పదివేల మంది ఉత్తర కొరియా సైనికులు రంగంలోకి దిగిన కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పటం ఒకసాకు తప్ప మరొకటి కాదు.నిజానికి ఈ అంశంపై ఆరోపణలు తప్ప నిర్ధారణ లేదు.

దీర్ఘశ్రేణి క్షిపణుల వినియోగానికి అంగీకరించేది లేదని గతంలో నాటో కూటమి దేశాలు ప్రకటించిన దానికి బైడెన్ నిర్ణయం విరుద్ధం. ఇలా జరిగితే ఇతర దేశాలు ప్రత్యక్షంగా దాడిలో పాల్గొన్నట్లుగా భావించి తమ శత్రువులుగానే పరిగణిస్తామని, అవసరమైతే అణ్వాయుధాలను కూడా ప్రయోగించేందుకు వెనుకాడబోమని కూడా గతంలోనే రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. నాటో కూటమి దేశాలు గతంలో గీసుకున్న గీతను తామే ఉల్లంఘించి సంక్షోభాన్ని మరింతగా ఎగదోసేందుకు పూనుకోవటం తప్ప మరొకటి కాదు. ఈ పరిణామ పర్యవసానాలకు అమెరికా, దాని అడుగుజాడల్లో నడిచే దేశాలదే బాధ్యత అవుతుంది. అమెరికా చర్యపై ఐరోపా దేశాలలో మిశ్రమ వైఖరి వెల్లడైంది. నాటోలోని టర్కీతో పాటు మరికొన్ని దేశాలు వ్యతిరేకించాయి. బ్రిటన్, ఫ్రాన్సు వంటి దేశాలు సమర్ధించటమే గాక తాము అందచేసిన ఆధునిక ఆయుధాలను ప్రయోగించేందుకు అనుమతించాయి. సంక్షోభాన్ని మరింత విస్తరించేందుకు ప్రాతిపదిక వేశాయి. ఇది ఒక్క ఐరోపాకే కాదు, యావత్ ప్రపంచానికి ఆందోళన కలిగించే పరిణామం.

> దీర్ఘశ్రేణి క్షిపణుల వినియోగానికి అంగీకరించేది లేదని గతంలో నాటో కూటమి దేశాలు ప్రకటించిన దానికి బైడెన్ నిర్ణయం విరుద్ధం. ఇలా జరిగితే ఇతర దేశాలు ప్రత్యక్షంగా దాడిలో పాల్గొన్నట్లుగా భావించి తమ శత్రువులుగానే పరిగణిస్తామని, అవసరమైతే అణ్వాయుధాలను కూడా ప్రయోగించేందుకు వెనుకాడబోమని కూడా గతంలోనే రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. నాటో కూటమి దేశాలు గతంలో గీసుకున్న గీతను తామే ఉల్లంఘించి సంక్షోభాన్ని మరింతగా ఎగదోసేందుకు పూనుకోవటం తప్ప మరొకటి కాదు.

కడవరకూ కార్మికుల కోసమే..

కార్మికోద్యమ నేత, సీఐటీయూ ఉద్యమాల మార్గదర్శకుడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కామ్రేడ్ పి.బాలకష్టయ్య గౌడ్ 17వ వర్ధంతి నేడు. కష్టజీవుల కోసం, కార్మికుల శ్రేయస్సుకు ఆయన చేసిన కృషి ప్రజల హృదయాల్లో నేటికీ చెదరని ముద్రే.1952లో ఎత్తిన జెండా ఆయన 2007లో కనుమూసే వరకు వీడలేదంటే పేదలన్నా, పోరాటాలన్నా ఎంతటి మమకారమో అర్థం చేసుకోవచ్చు. నాగర్‌కర్నూల్‌లో గుమస్తాగా పనిచేసిన ఆయనకు అక్కడి కమ్యూనిస్టు నాయకులతో ఏర్పడిన పరిచయం పార్టీ సభ్యునిగా మార్చింది. 1962లో భారత్ -చైనా యుద్ధం సందర్భంగా పార్టీ పొరుగు దేశాలలో శాంతియుతంగా సమస్య పరిష్కరించు కోవాలనే లైన్‌ను తీసుకోవడంతో అప్పటి పాలకవర్గం కార్యకర్తలందరినీ అరెస్టుచేసి రాజమండ్రి, చంచల్‌గూడ జైలులో నిర్బంధించింది. 16 నెలల పాటు జైలు జీవితం గడిపిన వారిలో బాలకిష్టయ్య ఒకరు. తర్వాత కాలంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు మోటూరి హనుమంతరావు, కొరటాల సత్యనారాయణ, లావు బాల గంగాధర్‌రావు వంటి ముఖ్య నేతల్ని ఆదర్శంగా తీసుకుని ఉద్యమాల్లో పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పార్టీ పునర్నిర్మాణం తర్వాత జిల్లా కమిటీ సభ్యుడిగా, కార్యదర్శివర్గ సభ్యులుగా కడవరకూ పనిచేశాడు. ఈ కాలంలో ప్రభుత్వం నుంచి ఎన్నో నిర్బంధాలు, కష్టాలు ఎదుర్కొన్నాడు. ట్రేడ్ యూనియన్ రంగం రాష్ట్ర నాయకులు లక్ష్మీదాస్‌తో కలిసి బాలకిష్టయ్య గౌడ్ పంచాయతీ, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్లలో పనిచేసే కార్మికులతో సంఘాల్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆనాడు కార్మికులు చెమటోడ్చడమే తప్ప హక్కులు, పని గంటలు తెలియని రోజుల్లో వారిని ఐక్యం చేసి పోరాటాల్లో పాల్గొనేలా చేశాడు. జిల్లాలో సీఐటీయూ అభివృద్ధికి వర్క్ ఛార్జెట్ కార్మిక ఉద్యమం ఎంతగానో తోడ్పడింది. భవననిర్మాణం, హమాలీలు, అంగన్వాడీ, మున్సిపల్ తదితర రంగాల్లో బలమైన ఉద్యమాలు నిర్మించి వారి సమస్యలపై పోరు ఉద్యమం నడిపాడు. జిల్లా కేంద్రంలో సీఐటీయూ, పార్టీ సొంత భవనాల నిర్మాణానికి అవిరాళమైన కృషి చేశాడు. 2003లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఐటీయూ 8వ మహాసభలను మహబూబ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించ డంలో బాల కిష్టయ్యది ప్రధాన పాత్ర. అప్పటి రాష్ట్ర నాయకులు వర్సా సత్యనారాయణ మహాసభల నిర్వహణ చూసి జిల్లా ఉద్యమం " పిట్ట కొంచెం..కూత గణం" అన్నట్లు ఉందని అభినందించారు. 2005లో జిల్లా సమగ్రాభివద్ధి పాదయాత్ర జరగ్గా ముగింపురోజు బహిరంగసభకు కామ్రేడ్ బీవీ. రాఘవులు హాజరయ్యారు. జిల్లా ఉద్యమాభివృద్ధికి ఈ సభ ఒక పెద్ద ముందడుగని వ్యాఖ్యానించారు. వారు చెప్పినట్టు గానే బాలకిష్టయ్య జిల్లా ఉద్యమాల్లో నిర్మాణాత్మక పాత్రను పోషించాడు. ఈ సందర్భంగా యన ఆశయ సాధనలో ముందుకు సాగడమే మనమిచ్చే నిజమైన నివాళి.

- కిల్లెగోపాల్

వైదిక మత దేవీ దేవతల శిల్పాలన్నీ బుద్ధుడి శిల్పాలే!



డాక్టర్ దేవరాజు మహారాజు

పట్టపగలే అందరూ చూస్తుండగా దొంగతనం చేయడం ఎలా సాధ్యమవుతుందీ - అని అనుకుంటారు గానీ, నేటి మనువాద ప్రభుత్వం సామాన్యుల్ని కొల్లగొడుతున్నది చూస్తూనే ఉన్నాం. అంతేకాదు, ఒకప్పటి వైదిక ధర్మ ప్రభోదకులు చేసింది కూడా ఇదే- అందరూ చూస్తుండగానే దేశవ్యాప్తంగా చేస్తూ పోయారు. అందుకు అన్ని ఆధారాలూ దొరికాయి. ఇంకా దొరుకుతూనే ఉన్నాయి. నేటి కేంద్ర ప్రభుత్వం అయోధ్యలో రామాలయం కట్టించింది. ఇది దేశ ప్రజల కండ్లెదుటే జరిగింది. అయితే, జరిగిన దొంగతనం ప్రజలకు తెలయకుండా జాగ్రత్త పడింది. నేపాల్‌లోని లుంబినిలో 'బాల బుద్ధుని'-విగ్రహం లభించింది. అది బుద్ధుని జన్మస్థానం! అయితే, అలాంటి బాలబుద్ధుని విగ్రహమే సాకేత్ నగరంలో అంటే అయోధ్యలో కూడా దొరికింది. ఆ విగ్రహాన్ని చూపించి అది 'బాల రాముడి' విగ్రహమని ప్రకటించారు. అంతటితో ఆగలేదు. ఆ బాల రాముడి కోసం పెద్దగుడి కట్టారు. ఆ బాలరాముడి విగ్రహం చుట్టూ పెద్దఎత్తున దేశంలో కుట్రల కుళ్లు రాజకీయాలు నడిచాయి. ఇంకా నడుస్తూనే ఉన్నాయి. ఆ దేవాలయ నిర్మాణంలోనూ, ఆ దేవాలయానికి వెళ్లే హై-వే: రోడ్డు నిర్మాణం లోనూ నేటి ఆరెస్సెస్ - బీజేపీ ప్రభుత్వపు అవినీతి వికృతంగా బయటపడింది.



ఈ మాటలు ఊరికే అనడం లేదు. అన్నింటికన్నీ చారిత్రక ఆధారాలున్నాయి. రాహుల్ సాంకృత్యాయన్ (కేదార్ నాథ్ పాండే) పేరూ, 'ఓల్గా సే గంగా' పుస్తకం శీర్షిక గురించి విననివారుండరు. కదా? అందులో ఏ ముందో ఒకసారి చూడండి - మౌర్య సామ్రాజ్యాన్ని పాలించిన చివరి రాజు బృహద్రతుని చంపి, మగధలో పుష్యమిత్రుడు శృంగరాజ్యాన్ని స్థాపించాడు. శృంగవంశం - సాధారణ శకానికి ముందు 184 BCE నుండి సాధారణ శకం 74C.E వరకు, దాదాపు 258 సంవత్సరాలు మగధను పాలించింది. సాధారణ శకానికి ముందు 184-147 BCE వరకు పాలించిన పుష్య మిత్రుడు భరద్వాజ గోత్రానికి చెందిన బ్రాహ్మణుడు. వైదికమతాన్ని పెంచి పోషించిన ఇతను, ఎన్నో అశ్వ మేధ యాగాలు చేశాడు. పైగా కనిపించిన బౌద్ధ భిక్కువులనందరినీ చంపించాడు. ఈ శృంగవంశపు రాజుల కాలంలోనే రామాయణ రచన జరిగి ఉంటుందని సుప్రసిద్ధ మార్క్సిస్టు మేధావి, బౌద్ధ వాఙ్మయ మహాజ్ఞాని రాహుల్ సాంకృత్యాయన్ 'ఓల్గా సే గంగా' గ్రంథంలో రాశాడు. (పేజీ: 213) శృంగవంశపు రాజుల మన్ననల కోసం వాల్మీకి పుష్యమిత్రుణ్ణి లేక అగ్ని మిత్రుణ్ణి రాముడనే పేరుతో కీర్తించాడు.

రాహుల్ సాంకృత్యాయన్ (9 ఏప్రిల్ 1893 - 14 ఏప్రిల్ 1963) అసలు పేరు కేదార్‌నాథ్ పాండే. బ్రాహ్మనిజాన్ని నిరసించి, బౌద్ధుడయినవాడు. 1951లో ఆయన బదరీనాథ్ యాత్ర చేసివచ్చి - అక్కడి బదరీనాథ్ విగ్రహం - 'ధ్వంసం చేసి బుద్ధుడి విగ్రహమని ప్రకటించాడు. ఈ విషయం ఆయన తన 'హిమాలయాల పరిచయం" (హియాలయా పరిచయ్: హిందీ) అనే గ్రంథంలో 11వ అధ్యాయంలో నమోదు చేశాడు. విగ్రహం చేతులు విరగొట్టి, ముఖ కవళికలు చిద్రంచేసి, రూపురేఖలు మార్చారని స్పష్టంగా రాశారు. క్షేత్ర స్థాయిలో అక్కడి స్థానికులు చెప్పే విషయమేమంటే - బదరీనాథుడి శిల్పం ముందు టిబెట్ లామాల దగ్గర ఉండేదనీ - అక్కడి నుండి తెచ్చి ఇక్కడ పెట్టారనీ చెపుతారు. ఇక శివుడికీ పార్వతికీ సంబంధించిన కట్టుకథలు మనువాదులు ఆ ప్రాంతంలో బాగా ప్రచారం చేశారని చెపుతారు. పార్వతి శాపం వల్ల అక్కడ పంటలు పండటం లేదనీ, మంచుకురుస్తూ ఉంటుందని కథలు చెప్పుకుంటారు. ఏ కథలు చెప్పినా, శివుడి విగ్రహం కానే కాదు. అది రూపు మార్చిన బుద్ధవిగ్రహం!

మధ్యప్రదేశ్ పన్నాలోని చముక్‌నాథ్ ఆలయంలో ఉన్న విగ్రహాన్ని శివలింగంగా పూజిస్తున్నారు. ఆ ఆలయం బౌద్ధ విహార్ అనీ, ఆ విగ్రహం బుద్ధుడిదనీ, అక్కడ బౌద్ధ వారసత్వాన్ని తుడిచిపెట్టే కుట్ర జరిగిందని ప్రముఖ బౌద్ధ బిక్కు శ్రీజితా గౌతమ్ స్వయంగా అక్కడికి వచ్చే ప్రజలకు, మీడియాకు చెపుతున్నారు,. చముక్‌నాథ్ ఆలయం, పన్నా, మధ్యప్రదేశ్‌లో - గర్భ గుడిలో చతుర్ముఖ శివలింగం పేరిట ఒక విగ్రహం ఉంది. కానీ, ఆ విగ్రహం తథాగత్ బుద్ధుని చతుర్ముఖ విగ్రహం (స్క్వాడ్) సుమారు ఐదుగురు ఎత్తుంటుంది. ఇలాంటి కుట్రే ద్వారకలో కూడా చేశారు. తథాగత్ బుద్ధుణ్ణి ద్వారకాధీశునిగా ప్రకటించారు. అంతా బ్రాహ్మణ పండితుల దుష్ప్రచారం మాత్రమే! ద్వారకలో ఉన్నవి ప్రాచీన భారీ దేవాలయాలు కావు. అవన్నీ ప్రాచీన బౌద్ధవిహారాలు కావాలంటే మధుర మ్యూజియం వెళ్లిచూడండి. మధుర - శ్రీకృష్ణుడి స్వస్థలం అని ప్రచారం చేశారు కదా? మధుర మ్యూజియంలో ఒక్కటంటే ఒక్కటి శ్రీకృష్ణుడి ఆనవాలు, విగ్రహం ఎందుకు లేవూ? అన్నింటికన్న బుద్ధ విగ్రహాలు, బౌద్ధశిల్పాలు ఎందుకున్నాయీ? హిందూ దేవాల యాల్లోని విగ్రహాలకున్న మేకప్‌లు, ఆభరణాలు, పూసిన రంగులు తొలగించి చూడండి. అన్నిచోట్లా బుద్ధుడి విగ్రహాలు, బౌద్ధశిల్పాలు కనిపిస్తాయి.

చరిత్ర నుండి గుణపాఠం నేర్చుకోనివారికి, తర్వాతి కాలంలో చరిత్రే గుణపాఠం నేర్పుతుంది.చక్రవర్తి అశోకుడి కాలంలో నేటి ఒరిస్సా ప్రాంతాన్ని 'కళింగ' అని పిలిచేవారు. అశో కుడు ఇక్కడ విజయం సాధించిన తర్వాత, ఈ ప్రాంతమంతా బౌద్ధ క్షేత్రమయ్యింది. ఇక్కడ అశోకుడికీ, బౌద్ధానికీ సంబంధించిన ఎన్నో చిహ్నాలు ఉన్నాయి. అనేక బౌద్ధ విహారాలున్నాయి. కానీ మనవాదులు ఆబౌద్ధ అవశేషాలను, చిహ్నాలను బ్రాహ్మణీకరించారు. వాటిద్వారా తమ ఉపాధిని చూసుకున్నారు. ఒరిస్సాలో ఒక పురాతన ఆరామాన్ని ఆలయంగా మార్చుకుని, అందులోని విగ్రహం 'పద్మావతి'ది అని ప్రకటించారు. విగ్రహంపై చీర కప్పి, పూలతో అలంకరిస్తే వాస్తవం మరుగునపడుతుంది కదా? అది ఊహాజనితమైన దేవతా విగ్రహం కాదు. విగ్రహం జాగ్రత్తగా పరిశీలించిన వారికీ, కొద్దిపాటి వివేకం ఉపయోగించిన వారికి, బుద్ధుడి శిల్పాలతో పరిచయం ఉన్నవారికి- విషయం సులభంగా అర్థమవుతుంది. బుద్ధుడి విగ్రహాన్ని మార్చి, పద్మావతిగా పూజలు చేస్తున్నారని - ఒకప్పటి ఆరామాన్ని మార్చి, వైదిక- హిందూ దేవాలయంగా మార్చుకున్నారని!! భారతదేశంలోని విగ్రహాల వాస్తవికతను లేదా అసలు రూపాన్ని బయటకు తీయా లంటే, ఆ విగ్రహాలపై ఉన్న అలంకరణలు తొలగించాలి! కృత్రిమంగా చేయించి పెట్టిన తొడుగులు తీసెయ్యాలి!! ఇలాంటి మార్పిడులను దక్షిణ ఆసియా సోక్రటీస్‌గా పేరుగాంచిన పెరియార్ తీవ్రంగా నిరసించిన విషయం గుర్తుంచుకోవాలి.

బుద్ధుడు మౌనముద్రలో ఉండగా, వెనక నుండి పడగవిప్పిన నాగు అతనికి రక్షణగా ఉంటుంది. ఇక్కడ నాగుపాము నాగజాతికి సంకేతం. భారతదేశంలో ఒకప్పుడు నాగజాతి వారి ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. వారంతా బుద్ధుని అనుచరులు. వారు బుద్ధునికి అనుచరులుగా ఉన్నారని చెప్పడానికి బౌద్ధంలోని వజ్రయాన శాఖవారు అలా శిల్పాలు చెక్కుకున్నారు. నాగజాతి వారి ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలన్నీ దేశంలో ఇప్పటికీ నాగ - పేరుతోనే వ్యవహరింప బడుతున్నాయి. ఉదాహరణకు నాగ్‌పూర్, అనంత్‌నాగ్ వంటివి చూడొచ్చు. ఒకప్పుడు బౌద్ధులకు నాగపూర్ నిలయంగా ఉంది కాబట్టే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాగ్‌పూర్‌లో బౌద్ధం స్వీకరించారు (14 అక్టోబర్ 1956) దాన్నే ఇప్పుడు 'దీక్షాభూమి' అంటున్నాం! ఒకప్పుడు మన భారతదేశంలోని మూలవాసులందరూ బౌద్ధులే! ఆర్యుల రాకతో వారంతా హిందువులుగా ముద్రవేయబడ్డారు. మొఘలుల రాకతో హిందువుల్లో కొందరు ముస్లింలుగా మారారు. బ్రిటీష్ వారి రాకతో మరికొంత మంది క్రైస్తవులుగా మారారు. నిజానికి ఈ దేశంలో ముస్లిం, క్రైస్తవ మూలాలు లేవు. అందరూ ఈ దేశ మూలవాసులే! వేల ఏండ్ల చరిత్ర - అందులోని వాస్తవాలు తెలుసుకుని, తమ మూలాలేవో అర్థం చేసుకున్నవారంతా ఇప్పుడు మళ్లీ బౌద్ధులుగా మారుతున్నారు. డా.బి.ఆర్. అంబేద్కర్ బౌద్ధం స్వీకరించడంతో ఈ దేశవాసులకు ఒక ప్రేరణ లభించింది. ఒక జీవన మార్గం కనిపించింది.

బౌద్ధదేవత 'సురసతి' నుండి బ్రాహ్మణార్యులు సరస్వతికి రూపకల్పన చేసుకున్నారు. 'ప్రపంచ పాలిబాషా దినోత్సవం- ఎప్రిల్ ఒకటి! భారతీయులకు వారి అసలు చరిత్ర తెలియకుండా ఉండడానికి ఎప్రిల్ ఒకటిని 'ఫూల్స్ డే' గా మార్చి ప్రచారం చేశారు. పాలిభాషలోని ఖత్తియ నుంచి ఏర్పడిందే క్షత్రియ. ఖత్తియా అంటే స్థానిక పాలకుడు అని అర్థం! బుద్ధిజం నుండి తీసుకున్నదే ఖత్తియా పదం. ఉత్తర భారత దేశంలో ఖత్తియా, ఖత్రి పదాలు ఇప్పటికీ కొందరి పేర్ల చివర కనిపిస్తాయి. బ్రాహ్మణ పురోహితులు 'మంగళాష్టకం'- అని అంటున్నారు. ఎనిమిది మాత్రమే ఎందుకూ? ఏడో, తొమ్మిదో, ఎందుకు కాదూ? అంటే, ఎనిమిది తథాగత బుద్ధుని 'అష్టాంగ మార్గాని'కి సంబంధించిన పాలి భాషా పదం. బుద్ధుణ్ణీ, బౌద్ధాన్నీ మరిచిపోయినా, ప్రజలు ఇప్పటికీ కొన్ని పాలి భాషా, పదాలు వాడుతున్నారు. బౌద్ధ విధానాలు ఆచరిస్తున్నారు. 'మంగల సుత్త' (మంగళ సూత్రం)లో 38 పూసలు మాత్రమే ఉంటాయి. దాని ద్వారా బుద్ధుడు చెప్పిన 38 మంగళసూత్రాలను ప్రజలు గుర్తుంచుకుంటారని ఆ ఏర్పాటు జరిగింది. మనమంతా మూల వాసులుగా ఉన్నప్పటి సంగతి అది! మంగళ సూత్రానికి మధ్యలో 3 బిళ్లలుంటాయి. అవి ధర్మంలోని త్రిశరణాలు. వాటి మధ్య 8 గుండ్లు ఉంటాయి. అవి అష్టాంగ మార్గానికి సంబంధించినవి. ఇటూ అటూ ఉండే దారానికి 38 పూసలు ఉంటాయి. బ్రాహ్మణార్యుల ప్రభావంతో ఇవన్నీ మారి పోతూ వచ్చాయి. పూసల సంఖ్య పెంచుతూ వచ్చారు. బౌద్ధ నేపథ్యాన్ని మరుగున పడేశారు. విదేశీ యురేషియన్‌లు వారి ప్రాబల్యం పెంచుకుంటూ వచ్చినప్పుడు కొన్ని కొన్ని మార్పులు జరు గుతూ వచ్చాయి. ఎంత చేసినా వారి కుట్రలు బట్టబయలవుతూనే ఉన్నాయి. మంగళసూత్రానికి సంబంధించిన ఈ వివరాలన్నీ అంతర్జాతీయ బౌద్ధా నెట్‌వర్క్‌లో ఎ.కె.దివేకర్ నమోదు చేసినవి.

> ఒకప్పుడు మన భారతదేశంలోని మూలవాసులందరూ బౌద్ధులే! ఆర్యుల రాకతో వారంతా హిందువులుగా ముద్రవేయబడ్డారు. మొఘలుల రాకతో హిందువుల్లో కొందరు ముస్లింలుగా మారారు. బ్రిటీష్ వారి రాకతో మరికొంత మంది క్రైస్తవులుగా మారారు. నిజానికి ఈ దేశంలో ముస్లిం, క్రైస్తవ మూలాలు లేవు. అందరూ ఈ దేశ మూలవాసులే! వేల ఏండ్ల చరిత్ర - అందులోని వాస్తవాలు తెలుసుకుని, తమ మూలాలేవో అర్థం చేసుకున్నవారంతా ఇప్పుడు మళ్లీ బౌద్ధులుగా మారుతున్నారు. డా.బి.ఆర్. అంబేద్కర్ బౌద్ధం స్వీకరించడంతో ఈ దేశవాసులకు ఒక ప్రేరణ లభించింది. ఒక జీవన మార్గం కనిపించింది.

శ్రామికలోకపు ఊహాచిత్రం!

(చిన్నా, పెద్దా పెట్టుబడిదారుల సంభాషణ)





రంగనాయకమ్మ

ఒకరోజు హఠాత్తుగా ఎటో చూస్తే అటు చంద్రన్న చక చకా వస్తూ కనపడ్డాడు. సూరయ్య చప్పున లేచి, పడుతూ లేస్తూ ఎదురెళ్లాడు!"వచ్చేశావు! హమ్మ! వచ్చేశావు!" చంద్రన్నా! నీకు కమిషన్లు పెంచుతా! అంటూ సూరయ్య ఉత్సాహంగా, చంద్రన్నని పట్టుకున్నాడు. "వాళ్లు, ఆ కమ్యూనిస్టోల్లు కొట్టుకుంటున్నారు, అంతేగా? కుమ్ములాటలు రోజూ వుంటాయిలే. ఇక, వాళ్ల రాజ్యం ఎగిరిపోయిందిలే. చంద్రన్నా, నేనూ వచ్చేస్తా! మనం ఎప్పట్లాగే చేసుకుందాం. నేనూ వస్తా! అయ్యో, అసలు నువ్వు మళ్లీ ఎందుకొచ్చావు?" అని ఆతృతగా అనేసి ఆగాడు, కూలబడ్డాడు."అదేనండీ, చెప్పనిచ్చారా? వాళ్లా కొట్టుకునేది? కుమ్ములాటలా? వాళ్లందరూ సమానత్వ సంబంధాల సోదరులండీ! ఆ మాటే మీకు చెప్పి, మిమ్మల్ని కూడా రమ్మనాలని వచ్చాను! అయ్యో! లేవండి! అలస్యం ఎందుకు?"

"చాల్లే! నోరుమూసుకో! వాళ్లని పొగిడేదాకా వచ్చావా! ఇక్కడ కూర్చున్నప్పట్నించీ దేవుడి మొహం చూడలేదు నేను. ఒక్కసారి గుడికిపోయి దణ్ణం పెడితేగానీ,...."

"ఏ గుడికి?"

"ఏ గుడికేంటి? అదుగో, అటు తూర్పేపున శివాలయం లేదూ?"

"అయ్యో! అది ఇంకా వుందనుకుంటున్నారా? అది, ఇప్పుడు చిన్నపిల్లల బడిగా అయింది! పిల్లలు ఒకటే పరుగులు అటేపు బడికి!"

"బడా? దేవుడేవయ్యాడు? శపించలేదా? ఊరుకున్నాడా? ఆ, ఆ విగ్రహాలేం చేశారు? వాటిని ముట్టుకుంటే, మూర్చలతో చచ్చారా, బతికారా?"

"అయ్యో! అవన్నీ చెప్పాలనిపించే వచ్చాను. ఈపూట నేను డ్యూటీ మానుకుంటాననంటే, తోటివాళ్లు ఎంత మంచిగా వెళ్లమన్నారో! 'ఏం ఫర్వాలేదు, మేం చేసుకుంటాం. తొందరగా వెళ్లిరా' అన్నారు. పరిగెత్తుకొచ్చాను. "ఆ విగ్రహాలా? ఆ పక్క పందిరేసి, దానికింద పెట్టారు. అప్పుడే ఇరవై ముప్పయ్ విగ్రహాలు అక్కడ చేరాయండీ!"

"ఏంటోయ్ అబద్ధాలు? ఎవడూ చావరా? దేవుణ్ణి అంటుకుంటారా? ఎందరు చచ్చారు? శివుడు అంతేలే. ఉత్తరంవేపు నారాయణమూర్తి వుంటాడుగా? అటు పోదాం కొంచెం ఒక్క దణ్ణం పెట్టుకోవాలి!"

"ఆ గుడిని ఆస్పత్రిగా, చిన్నదే, చేశారండీ! జనాలు తెగ సంతోషిస్తున్నారు! తలనొప్పికి కూడా ఆస్పత్రికే పరుగులు!"

"ఏంటీ? మతులు పోయాయా జనాలకి? దేవుళ్ళ మీద ఎగబడ్డారని, కోర్టుకి ఎవరూ చెప్పలేదా?"

"కోర్టు లెక్కడండీ? మీ ఇంటిని ఏం చేశారో వినండి ముందు! అది, పన్నెండు గదుల ఇల్లు కదా? మీ వాళ్ల కోసం నాలుగు గదులు బాగానే వుంచారు. మిగతా గదుల్లో, మధ్య మధ్య తడికలు పెట్టి, మూడు పేద కుటుంబాలకి ఏర్పాటు చేస్తే, పాపం ఆ పేదవాళ్ళు, 'మాకు వొద్దులెండి, చెట్లకిందే బతికేస్తాం. ఆ ఇంట్లో పార్టీ ఆఫీసులవీ పెట్టండి!' అన్నారు."

"మా ఇంట్లోనా! వాళ్ల పార్టీ ఆఫీసులు!"

"అదేనండీ, ఇప్పుడు మీ ఇంట్లోనే రెండు మూడు పార్టీ ఆఫీసులున్నాయి. మా ఇల్లు కూడా అలాగే. అది, ఆరు గదుల్ది కదా? మూడు మాకు వదిలేసి, పెద్ద గదిలో లైబ్రరీ పెట్టారండీ! ఆ పక్క, ఒక ముసలాయన వున్న పేద కుటుంబానికి ఇచ్చేశారు. అంతా బాగానే చేస్తున్నారు లెండి! వాళ్లు తమ కోసం తినేదీ, తాగేదీ, ఏం లేదండీ! నిజమే!"

"మన ఇళ్లని వాళ్లు ఆక్రమించారా? వాళ్లు తినేదీ, తాగేదీ లేదా? వాళ్ల దగ్గర నీ భాగం ఎంత?"

చంద్రన్న నవ్వాడు. "అయ్యా! అంతా మర్చిపోండి!

మన ఇళ్లు, నిజానికి మనవా? మనవి కావు లెండి! అందులో ఒక్క ఇటిక ముక్కన్నా, గుప్పెడు మట్టో, ఇసకో, ఒక్క తలుపుచెక్కనో, మనం ఏమన్నా చేశామా చెప్పండి! అదే, అంటున్నారు వాళ్లు. ఏం చెప్పగలం మనం?"

"చెప్పలేమా! మా తాతల కొంప అది! మా నాన్న ఇంకో రెండు గదులేస్తే, నేను నాలుగేశాక పన్నెండు గదులయ్యాయి, తెలుసా? నీకేం తెలుసు?"

"తాతలూ, తండ్రులూ కూడా మనలాగ సంపాదించినవాళ్లే లెండి! వాళ్లేమన్నా వొంగుని పొలాల్లో దున్నారా?"

"ఇదేమిటి? ఇలా తయారయ్యావు? అక్కడికెళ్లే మతిపోయిందా?"

"అది కాదండీ, మన వూళ్లో, రోడ్లు ఎలా మెరుస్తున్నాయో చూస్తే, అక్కడే రోడ్లమీదే పడుకోవాలనిపించింది నాకు. అమ్మో! ఈ మాటలు కాదు, నా డ్యూటీ! వెళ్లాలి!"

"ఏం పని?"

"చిన్నపిల్లల బళ్లో ఒక టీచరు సెలవుపెట్టాడు. ఆయనకి అర్జంటు పనేదో వచ్చింది. అది తెలిసి, 'నేను వెళ్తాను, చిన్నపిల్లలకి చిన్న చిన్న లెక్కలు చెపుతాను' అని చెప్పుకుని వెళ్లాను. ఒక తరగతిలో పిల్లలందరూ చిట్టివాళ్లే. ఐదారేళ్లవాళ్లు.. వాళ్లకి తమాషాగా, 1,2,3,4 లాంటి అంకెలు తెలుస్తున్నాయి. చిన్న చిన్న మాటలు కూడా! నేను, లెక్కల్లో, కూడికా, తీసివేతా, హెచ్చివేతా, భాగారం - అని 4 రకాలే వుంటాయని చెప్పాను. 2కి, 3ని కలిపితే ఎంత? ఇదే కూడిక! 3 నించీ, 2ని తీసేస్తే? ఇదే తీసివేత! 3ని, 2 సార్లు చూస్తే! 2, 3లు 6. ఇది, హెచ్చివేత! ఇక, 3లో, ఎన్ని 2లు వున్నాయి? ఒక్క 2 కదా? ఇలా నా సరదాకొద్దీ చెప్పానులెండి. పిల్లలు పది, పన్నెండుమందే. క్లాసుల్లో అలాగే తక్కువమందే వుండాలంట! వాళ్లల్లో 7,8 మంది, ఏది అడిగినా, గబ గబా జవాబులు చెప్పారు. అబ్బా! ఎంత సంతోషంగా వుందోనండీ, పిల్లలకి చెప్పడం!... ఈ పనే కాదు, కొత్త ఇళ్లు పేద జనాల కోసం, తయారవుతున్నాయి కదా? వాటికి సున్నాలు వేసే పనులు వుంటే, అదీ చేశాను! నిజంగా పను లంటే ఇంత సంతోషమా - అనిపించింది సూరయ్యగారూ! అయ్యో! నేను వెళ్లాలి. అక్కడ ఏం జరుగుతోందో మీకు చెప్పాలని వచ్చానుగానీ, ఇక్కడ వుండాలని కాదు, ఇక వెళ్తాను" అంటూ లేచాడు చంద్రన్న.

"నీకు లెక్కలెలా వచ్చాయి?"

"సరుకుల్ని అమ్మించి, ఎకౌంట్లు రాశాను కదండీ? వెళ్తాను!"

"ఏంటా కంగారు? బాగా నేర్చావులే. మొన్నటి, నిన్నటి చంద్రన్నలా లేవు నువ్వు!"

"మా బాగా అన్నారు. అంత మారగలిగానా? రోజూ క్లాసుల కెళ్తున్నానండీ. ఒక మేష్టారు భలేగా సెపుతారండీ! రోజూ చాలామంది నేర్చుకుంటున్నారు. నన్ను బాగా మెచ్చుకుంటారు మేష్టారు. ...."

"ఏం నేర్పుతాడు?"

"అదే, అదే చెపుతా, ఎవరో ఒకాయన 'మార్క్సు' అంట! 'పెట్టుబడి' ఎంత చెడ్డదో చెప్పాలని పెద్ద పుస్తకం ఆ పేరే పెట్టి రాశాడంట! 'లాభం, లాభం అంటా గదండీ, అది చెడ్డదేనంట! శానా బాగా చెప్పాడు. మీరూ ఇనాలండీ ఒక్కసారి. మీరు...."

"అబ్బబ్బా! వూరుకో, నేర్చావుగానీ. ఇంతదాకా ఎదిగావా? నా మాట విను! రెండు రోజులన్నా ఇక్కడుండు! మనం మాట్లాడుకుందాం. నాలుగు రోజులుంటావు! నేను మాట్లాడితే."

"ఆ మార్క్సుకి నేను కోటి రూపాయలు పంపిస్తా. నువ్వే పట్టుకెళ్లు! అతగాడు మళ్లీ మాట్లాడగలడా? కూర్చో ముందు."

"ఇంకా కూర్చుంటానా? ఇవ్వాళ క్లాసేంది. అది వినకపోతే ప్రేణం పోతుంది."

"అయ్యో! కాదు, కూర్చో, కూర్చో! నాలుగురోజులుండు!"

"చాలు! నాలుగురోజులు ఏ పనీ లేకుండానా? అసలు, ఒక మాట చెప్పండి!! మీరు వస్తారా, లేదా? మీకు భోజనాలు రాటం లేదే! ఏం తింటున్నారు?"

"అప్పుడప్పుడూ చేప ముక్కలు! కాల్చి, ఉప్పేసి ఇస్తుంది ఒక ముసలవ్వ! రేపు నేనేదో పట్టుచీర కొని ఇస్తానని అనేమో! నాలుగు చేపముక్కలకే పట్టుచీరా?"

"చేపలైతే, ఆ వాగుల్లో దొరుకుతాయిగానీ, ఉప్పు ఎలాగ? దానికి ఎంత ఖర్చో తెలుసాండీ? నేను వెళ్లాలి బాబూ! నా డ్యూటీ ఎవరి మీదా పెట్టకూడదు లెండి! మీరు కూడా వచ్చెయ్యండీ!"

"వచ్చి, ఏం చెయ్యాలి? మూల పడ్డ మిఠాయి పరిశ్రమ అయినా మళ్లీ నడుపుకోవాలని నాకూ వుంది చంద్రన్నా!"

"అయ్యయ్యో! ఇంకానా? ప్రైవేటు కంపెనీలన్నీ మూసేశారు! ఇంకా మూసేస్తారు. అన్నీ కార్మికులే నడుపుతున్నారు. మీ పరిశ్రమల్లో, రెంటిని అక్కర్లేదని, కల్తీ సరుకులే అని, వాటినీ మూసేశారు! అమ్మో నేను వెళ్లాలి! ఒక బూర్జువా ఎవరో ఇక్కడే అటు పక్క కూడా వున్నాడంట! మీకు కనపడ్డాడా? అతడికి కూడా చెప్పి రావాలి! అటు పోతా! మీరు వస్తారా, లేదా? వొచ్చినా, ఏ పనీ చెయ్యనంటే జైలే మరి!"

"వచ్చాననటేనా? రైళ్లు నడపగలను, తెలుసా? జీతం ఎంత ఉంటుంది? మా బామ్మర్ది ఒకడు రైలు డ్రైవర్‌గా వుంటే, ఒకసారి వాడి పక్కన కూర్చుని చూశాను. అప్పుడు అనిపించింది నాకు అలాగ..."

"ఇంకేం? ముందు ట్రైనింగ్ అవ్వాలి. గూడ్సుబండికి మొదట ఇస్తారేమో! అయ్యో! నేను పోతా!" అంటూ చంద్రన్న చక చకా నడక ప్రారంభించాడు.

"ఆగు! ఆగు! ఎన్నాళ్లు ఇక్కడ? రొండు రోజులన్నా వుండు!"

చంద్రన్న మౌనంగా దూరం అయ్యాడు.

లేచాడు, పెద్ద బూర్జువా! అటే! అడుగులు చక చకా!! "చంద్రన్నా! ఆ కమ్యూనిస్టోళ్లు పోట్లాడుకోరంటావా?"

జవాబు లేదు! నడుస్తున్నాడు సూరయ్య! కళ్ల నీళ్లు తుడుచుకున్నాడు.

చెట్టు చాటునించి చంద్రన్న బయటకొచ్చాడు. "అయ్యో! ఇంటికి పోయి, స్నానం చేసి, తిండి తిని, రోజంతా నిద్రపోయి, అప్పుడు రైలు స్టేషన్‌కి వెళ్ళండి! అక్కడేదో మీకు చెపుతారు."

"నువ్వు కూడా రా, నాతో! మా ఇంటి వాళ్లు వుంటారా? ఇంటికి తాళం వేసి పోయారా?"

"ఇంకా తాళాలా? దొంగలుంటారా? తాళాలెందుకు? వచ్చి చూడండి, కామ్రేడ్! ఊరు ఎలా మారిందో!"

"కామ్రేడా! ఏంటా పిలుపు పని వాళ్లలాగ?"

"నేను పనివాడినే! మీరూ పనిలోకి దిగుతారుగా కామ్రేడ్! మనం వర్గల్లం కాదు!"

"మరి, ఎవరం?"

"సోదరులం! మానవులం!"

సూరయ్య నవ్వాడు "ఇది వరకంటా, సోదరులం కామా? మానవులం కామా?"

"అప్పుడు దోపిడీ మానవులం! ఇప్పుడు నిజం తెలుసుకున్నాం."

"కాదులే, మళ్లీ తిరుగుతాలే వెనక్కి! నేను అలాగే వస్తున్నా."

"అలాగా? సూరయ్యా! నువ్వు ఇవ్వాళే జైలుకి! నేనే పంపిస్తా! నేను కార్మిక పార్టీకి ఒక కార్యదర్శిని! అదే చెప్పాలని వచ్చా!"

"ఆ...! ఆ... ఆ..."

> "అయ్యయ్యో! ఇంకానా? ప్రైవేటు కంపెనీలన్నీ మూసేశారు! ఇంకా మూసేస్తారు. అన్నీ కార్మికులే నడుపుతున్నారు. మీ పరిశ్రమల్లో, రెంటిని అక్కర్లేదని, కల్తీ సరుకులే అని, వాటినీ మూసేశారు! అమ్మో నేను వెళ్లాలి! ఒక బూర్జువా ఎవరో ఇక్కడే అటు పక్క కూడా వున్నాడంట! మీకు కనపడ్డాడా? అతడికి కూడా చెప్పి రావాలి! అటు పోతా! మీరు వస్తారా, లేదా? వొచ్చినా, ఏ పనీ చెయ్యనంటే జైలే మరి!"

ఫార్మా భూతం మింగేస్తుంటే ఊరుకోం

మా ప్రాణాలుండగా భూములివ్వం

- తరతరాలుగా భూములను కాపాడుకుంటూ వస్తున్నాం
- రాయి, రాప్ప కొట్టి చదును చేశాం
- గీ భూమిలో పండిందే తింటాం.. ఇక్కడే ఉంటాం
- ప్రాణాలు ఈడుస్తాం కానీ భూములివ్వం
- ఫార్మా భూ బాధితుల స్పష్టీకరణ

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

'తరతరాలుగా గీ భూములే మాకు తిండి పెడుతున్నాయి. గీ భూముల్లోనే కాయకష్టం చేసి బతుకుతున్నాం. పచ్చని మా భూములను 'ఫార్మా' భూతం మింగేస్తుంటే చూస్తూ ఊరుకోం. ఉన్నట్టుండి మా భూములను కంపెనీల పేర గుంజుకుంటే ఎట్లా.. మేం యేడికి పోయేది.. ఎట్లా బతికేది. గొర్రెలు, బర్రెలు సాదుకోని బతికేటోళ్లం. మా పిల్లల చదువులు కూడా అంతంతే.. గాళ్లకు ఫార్మా కంపెనీల ఏం కొలువులు వస్తాయి. మేం గిన్నే ఉంటాం.. గీ వ్యవసాయమే చేసి బతుకుతాం. మా భూముల జోలికొస్తే.. మా ప్రాణాలైనా ఇస్తాం గానీ భూములు మాత్రం ఇయ్యం. సర్కారోళ్లు మమ్మల్ని భయపెట్టి భూములు గుంజుకోవాలని చూస్తే.. ఆ కంపెనేదో ఇక మా 'బొందలగడ్డ'పైనే పెట్టాలే. మా జీవి తీసి.. కంపెనీ పెట్టాలే. గంతే కానీ మా భూములైతే ఇచ్చేది లేదు..' అని లగచర్ల ఫార్మా విలేజ్ భూ బాధితులు స్పష్టంచేశారు. బాధిత కుటుంబాల్లో ఎవరినీ కదిలించినా తమ కష్టాల వలపోతను వినిపిస్తున్నారు. ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించిన నవతెలంగాణకు బాధితులు తమ గోడును వినిపించారు.

కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలోని మూడు రెవెన్యూ గ్రామాల పరిధిలో ఫార్మా విలేజ్ కోసం ప్రభుత్వం భూ సేకరణకు రంగం సిద్ధం చేసింది. ఈ ప్రాంతంలో సమారు 1,314 ఎకరాలు రైతుల నుంచి తీసుకోవడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ నిర్ణయాన్ని ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడ ఫార్మా పెట్టొద్దని గత ఐదు నెలలుగా అధికారుల చుట్టూ, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. తమ భూములు కాపాడుకోవడానికి రైతులు ప్రయత్నం చేస్తున్నారు. రైతులు తమ ఆవేదనను అధికారులపై దాడి రూపంలో చూపించారు. ఈ ఘటనతో కొంతమందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఫార్మా బాధిత గ్రామాల్లో ఒక్కసారిగా అలజడి రేగింది. ఆయా గ్రామాల్లో పోలీసు బలగాలు పహారా కాస్తున్నాయి. దాంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

నా బతుకు నా భూమితోనే..!



నాకు ఊహ తెలిసిన నుంచి గీ భూములనే నమ్ముకుని బతుకుతున్నాం. మా తాత, మా అయ్య.. పాలుకు 2.30 ఎకరాల పొలం ఇచ్చిండు. ఇందులో పండిన పంటతోనే మా తల్లిదండ్రులు మమ్మల్ని సాదిండ్రు.. నాకు నలుగురు పిల్లలు, ఒక కొడుకు, ముగ్గురు బిడ్డలు. ఈ భూమిని నమ్ముకుని నా ముగ్గురి బిడ్డల పెండ్లిళ్లుచేసిన. నా బతుకే నా భూమి. ఇక భూమి పోయినంక నేనెందుకు బతికి. నా భూమి కావాలంటే నన్ను సంపుండ్రి.

– భీమయ్య గౌడ్, రైతు, లగచర్ల

మమ్మల్ని చంపితే సర్కారుకు భూమి దక్కుతుంది



సర్కారుకు మా భూములే దొరికాయా. వ్యవసాయం చేసుకొని బతికేటోళ్లం. ఈ భూములు విడిచి పెట్టి ఏం జేయాలి. సర్కారు రూ.కోట్లు ఇచ్చినా మా భూములు ఇచ్చేది లేదు. బెదిరిస్తే భూములు ఇస్తారని కేసులు పెడుతున్నారు. సర్కారుకు ఈ భూములు దక్కాలంటే మా ప్రాణాలు తీయాల్సిందే. మా ప్రాణం ఉండగా ఈ భూములు ఇచ్చేది లేదు.

– దేవిబాయ్, పులిచింత కుంట తండా

కొలువులు మాకెందుకు.. సాగు నీరిస్తే చాలు..



ప్రభుత్వం మా భూములు తీసుకుని కొలువులు ఇస్తనంటుంది. నాకు ఏడెకరాల భూమి ఉంది. మొత్తం ఫార్మాలో పోతుంది. ఈ భూమి పోయినాక నేనేమీ చేసి బతకాలి. ఫార్మా కంపెనీలో నేనేం చేయాలి. నా పిల్లలకు కూడా అంత పెద్ద చదువులు రావు. ఇక ఎవరికి సర్కారు ఇచ్చేది కొలువులు. మాకు సర్కారు కొలువులు ఇవ్వనవసరం లేదు. మా భూములకు సాగు నీరు ఇస్తే చాలు. పంటలు సాగుచేసుకుని బతుకుతాం.

– సందుల వెంకటయ్య, రైతు, హకీంపేట

మాగనూరు పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

- డీఈఓ, ఎంఈఓ, హెడ్మాస్టర్ సస్పెన్షన్
- ఆర్డీఓ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఎంపీడీవోకు షోకాజ్ నోటీసు
- హెడ్మాస్టరు, వంట ఏజెన్సీలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశం



నవతెలంగాణ- మాగనూరు

నారాయణపేట జిల్లా మాగనూరు పాఠశాలలో 17 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ విచారణ చేపట్టారు. మాగనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. వంట గది, స్టోర్ రూం, వంటకు వినియోగించే బియ్యాన్ని, స్టోర్ రూంలోని నిత్యావసర సరుకులను పరిశీలించారు. బుధవారం జరిగిన సంఘటనపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. డీఈఓ మురళీధర్ రెడ్డి, ఎంఈఓ అబ్దుల్ ఘని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాపిరెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇకపై ప్రతిరోజూ మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు పరిశీలించి, రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని ఆదేశించారు. బుధవారం 17 మంది విద్యార్థులకు వాంతులతో అస్వస్థత కలిగిందని, వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ సలహాతో మక్తల్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి పంపినట్టు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్, ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సమాచారం అందించి విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకున్నట్టు చెప్పారు. ప్రస్తుతం విద్యార్థులు కోలుకుంటున్నారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అన్నారు. అదేవిధంగా వంట ఏజెన్సీని రద్దు చేసి ఇతర ఏజెన్సీకి అప్పగిస్తున్నట్టు తెలిపారు. వంట ఏజెన్సీపై గతంలో కూడా ఆరోపణలు ఉన్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్టు కలెక్టర్ చెప్పారు. అదేవిధంగా ఆర్డీఓ రామ్‌చందర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ, ఎంపీడీవో రైమాతోద్దీన్‌కు షోకాజ్ నోటీసు పంపించారు. మాగనూరు పాఠశాలలో కలుషిత ఆహారం ఘటనపై విచారణ నివేదికను సిద్ధం చేసి సీఎం కార్యాలయానికి పంపిస్తామని చెప్పారు.

మానుకోట కలెక్టరేట్లో ఏసీబీ దాడులు

- రూ.20,000 తీసుకుంటూ పట్టుబడిన ఎస్‌డిఎం జ్యోతి

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ భవనంలో తొలిసారిగా గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి కార్యాలయంలో సీనియర్ డ్రాఫ్ట్‌మెన్‌గా పనిచేస్తున్న జ్యోతిశర్మ బాయి.. వరంగల్‌కు చెందిన ఒక వ్యక్తి నుంచి రూ.20,000 లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వరంగల్‌కు చెందిన ఒక ఫిర్యాదుదారుడు మహబూబాబాద్ పట్టణ పరిధిలోని ఒక సర్వే నెంబర్లో మూడెకరాల భూమి కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో ఆ భూమిపై ఏమైనా వివాదాలు ఉన్నాయేమోనని తెలుసుకునేందుకు గత నెల 28న మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ భూమి రికార్డుల కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. ఈనెల 12వ తేదీ వరకు కూడా అధికారులు దరఖాస్తు చేసిన టీపనుకు వివరాలు అందించలేదు. దాంతో భూమి రికార్డుల కార్యాలయంలో సీనియర్ డాక్యుమెంట్ జ్యోతిశర్మ బాయిని కలిశారు. ఆమె రూ.20000 రూపాయలు ఇస్తేనే పనవుతుందని చెప్పారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఫిర్యాదుదారుడు వరంగల్ ఏసీబీ కార్యాలయంలో సంప్రదించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు.. గురువారం కలెక్టరేట్ రికార్డుల కార్యాలయంలో జ్యోతికి రూ.20,000 ఇస్తుండగా.. ఆమెను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆమెను శుక్రవారం ఉదయం వరంగల్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా ప్రజలు, ఫిర్యాదుదారుల పని చేయకుండా లంచం డిమాండ్ చేస్తే 1064 నెంబర్‌కు కాల్ చేయాలని ఏసీబీ డీఎస్పీ సూచించారు.

ఫుడ్ సేఫ్టీపై సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం

- ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫుడ్ సేఫ్టీలో హైదరాబాద్ చివరన ఉందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఖండించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2022 సంవత్సరంలో ఫుడ్ సేఫ్టీకి సంబంధించి నమోదైన కేసుల ఆధారంగా, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2023 డిసెంబర్‌లో నివేదిక విడుదల చేసిందని తెలిపారు. 2022లో హైదరాబాద్‌లో ఫుడ్ కల్తీపై 246 కేసులు నమోదయ్యాయి. ఇదే విషయాన్ని 2023 చివరలో విడుదలైన "క్రైం ఇన్ ఇండియా-2022" నివేదికలో పొందుపర్చారని చెప్పారు. అప్పటి సమాచారంతో, ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుడ్ సేఫ్టీలో హైదరాబాద్ లాస్ట్ అంటూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారుని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు నాణ్యమైన ఫుడ్ అందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు స్పష్టం చేశారు.

ఫుడ్ ఆఫీసర్ల పెంపునకు నిర్ణయం

గత పదేండ్లలో పెరిగిన హోటళ్ల సంఖ్య, జనాభా సంఖ్యకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని ప్రస్తుత ప్రభుత్వం బలోపేతం చేస్తోంది. హోటళ్లు, జనాభా సంఖ్యకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల సంఖ్యను పెంచాలని నిర్ణయించింది. నాచారం ఫుడ్ సేఫ్టీ ల్యాబ్‌ను ఆధునీకరించడంతో పాటు, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో కొత్తగా మరో మూడు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కొత్తగా 5 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ తీసుకొస్తున్నారు. ఇప్పటికే వాహనాల కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైంది. సంవత్సరానికి కనీసం 24 వేల ఆహార నమూనాలను పరీక్షించేలా ల్యాబులను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఫుడ్ సేఫ్టీకి సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం కలెక్టరేట్లలో స్పెషల్ సెల్ ఏర్పాటు చేస్తున్నారు. ఉచితంగా ట్రైనింగ్, హైజీన్ కిట్లు, ఫుడ్ సేఫ్టీపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గడిచిన 45 రోజుల్లోనే 3,774 హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు ఫుడ్ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లు నమోదు చేశారు. జీహెచ్ఎంసీ, జిల్లాల్లో సదస్సులు నిర్వహించి, ఫుడ్ సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్నారు.

లగచర్లలో రైతులపై నిర్బంధాన్ని ఆపాలి

రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని.. ఖమ్మంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-ఖమ్మం

లగచర్లలో రైతులపై నిర్బంధాన్ని వెంటనే ఆపాలని, రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ గిరిజన సంఘం, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, కేవీపీఎస్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఖమ్మంలోని అంబేద్కర్ సెంటర్‌లో గురువారం నిరసన తెలిపారు. అనంతరం ఎర్రా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో సంఘాల నాయకులు బొంతు రాంబాబు, మాచర్ల భారతి, భూక్యా వీరభద్రం, మెరుగు సత్యనారాయణ, నందిపాటి మనోహర్ మాట్లాడారు.

2013 భూ సేకరణ చట్టం అమలు చేయకుండా బలవంతంగా లగచర్లలో ఫార్మాసిటీ కోసం భూసేకరణ చేయడం సరికాదని అన్నారు. రాజ్యాంగ చట్టాలని ఉల్లంఘించి రేవంత్‌రెడ్డి అఖిలపక్షం అభిప్రాయాలు తీసుకోకుండా గిరిజనుల, పేదల భూములను లాక్కోవడం అన్యాయమని తెలిపారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మాసిటీని వ్యతిరేకించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు లగచర్లలో భూసేకరణ జరపడం ఏంటని ప్రశ్నించారు. గతంలో రంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీ కోసం 15 వేల ఎకరాల భూములు సేకరించారని, దాని రద్దు చేయకుండా ఫోర్త్ సిటీ పేరుతో లగచర్లలో రైతుల నుంచి బలవంతంగా భూమి తీసుకోవడం తగదన్నారు. విదేశీ కంపెనీల ద్వారా ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తామని చెప్పడం అంటే విదేశీ కంపెనీలకు భూములు అప్పగించటమేనని ఆరోపించారు. ఫార్మా కంపెనీ ఏర్పాటుకు తమ భూములను తీసుకుంటే జీవనోపాధి కోల్పోతామన్న ఆవేదనతో ఉన్న రైతులను నిర్బంధాలతో ఆయా గ్రామాల్ని జైలుగా మార్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నిర్బంధాలు విధించిన వాళ్లు రాజకీయంగా ఏమయ్యారో గుర్తు పెట్టుకోవాలని ప్రభుత్వానికి హెచ్చరించారు. గ్రామ సభలు జరిపి 2013 చట్టం ప్రకారమే 80 శాతం గ్రామసభల్లో ఆమోదిస్తేనే భూములు సేకరించాలని అన్నారు. లగచర్లలో రైతుల మీద పెట్టిన కేసులను తక్షణం రద్దు చేయాలని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు మాదినేని రమేష్, ఎస్.నవీన్‌రెడ్డి, ఎస్.కె హిమాం, వరప్రసాద్, మెరుగు రమణ, మెహ్రూనిస బేగం, అమరావతి, అజిత, బిబి సునీత, పి.రమ్య, భూక్య శ్రీను, గన్య, కృష్ణ, పాపారావు, బస్కినాయక్, బాణాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు సమాజానికి ఆక్సిజన్ కావాలి

ట్రైనీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో రాచకొండ సీపీ సుధీర్‌బాబు



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

సమాజంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికడుతూ.. ప్రజల రక్షణ కోసం పోలీసు వ్యవస్థ సమాజానికి ఆక్సిజన్‌లా పనిచేయాలని రాచకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ సుధీర్‌బాబు అన్నారు. నల్లగొండ జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో 265 మంది ఏఆర్ ట్రైనీ కానిస్టేబుళ్లు తొమ్మిది నెలల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. గురువారం నిర్వహించిన ట్రైనీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో సీపీతోపాటు సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్, నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో రాచకొండ సీపీ మాట్లాడుతూ.. సమాజంలో ప్రజల కోసం నిబద్ధతతో పనిచేస్తున్న ఏకైక వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తూ ప్రాణవాయువులా పనిచేయాలని సూచించారు. అంకిత భావంతో, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ.. రాష్ట్ర పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలి సూచించారు. పోలీసు శాఖలో ఉద్యోగం అంటేనే ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, శారీకంగా, మానసికంగా ధృఢంగా ఉన్నప్పుడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోగలమని చెప్పారు. ఈ ట్రైనింగ్ అనంతరం కూడా రోజూ వ్యాయామం చేసి ఫిట్‌గా ఉండాల న్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని ట్రైనీ కానిస్టేబుళ్లకు సూచించారు. తల్లిదండ్రుల కలల్ని సాకారం చేయాలన్నారు. ఈ తొమ్మిది నెలల ట్రైనింగ్ మీ 36 సంవత్సరాలు సర్వీస్ పూర్తి అయ్యేవరకు తోడ్పడుతుందన్నారు. అనంతరం శిక్షణా కాలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బెస్ట్ అల్ రౌండర్ జె.అనిల్, బెస్ట్ ఇండోర్ ఆర్.మహేష్, బెస్ట్ ఔట్ డోర్ ముజిబుద్దీన్, బెస్ట్ ఫైరర్ టి.ప్రశాంత్, పరేడ్ కమాండర్ నరేష్‌కు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డీటీసీ రమేష్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ రాములు నాయక్, డీటీసీ డీఎస్పీ విఠల్ రెడ్డి, నల్లగొండ డీఎస్పీ శివ రాంరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు డానియల్ రాజశేఖర్ రెడ్డి, రాజు, ఆర్ఐలు హరిబాబు, శ్రీను, సంతోష్, ఎస్ఐలు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు జయరాజు, సోమయ్య ఇండోర్, అవుట్ డోర్ సిబ్బంది పాల్గొన్నారు.

13వ అంతస్తు నుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఆత్మహత్య

నవతెలంగాణ-మియాపూర్

మైండ్ స్పేస్ 13వ అంతస్తు నుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా మాదాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని గుంటూరు జిల్లా అమరావతి మండలం నెమలికల్లు గ్రామానికి చెందిన వంగా నవీన్‌రెడ్డి (24) స్థానికంగా ఓ హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. బుధవారం రాత్రి మాదాపూర్‌లోని మైండ్ స్పేస్ బిల్డింగ్ నెంబర్ 12 సీలో ఉన్న ఎన్‌సీఆర్ వోయిక్స్ కంపెనీ 13వ అంతస్తు నుంచి కిందికి దూకేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మాదాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నవీన్‌రెడ్డి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రజా ప్రభుత్వం భూములు లాక్కోదు

- బీఆర్ఎస్ గుంజుకున్న భూములను తిరిగి రైతులకిస్తాం : డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం భూములను గుంజుకున్నట్టు రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం భూములను లాక్కోదని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. అనాటి కాంగ్రెస్ పాలకులు అసైన్ చేసి పేదలకు పంచిన భూములను బీఆర్ఎస్ సర్కారు బలవంతంగా లాక్కుందని విమర్శించారు. ఇబ్రహీంపట్నంలో 10 వేల ఎకరాలకుపైగా బలవంతంగా తీసుకుని హెచ్ఎండీఏ ద్వారా లే అవుట్ చేసి అమ్ముకున్న గత బీఆర్ఎస్ పాలకులు దుర్మార్గులనీ, అలాంటి దుర్మార్గులు లగచర్లలో రైతులకు అన్యాయం జరిగిందని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పాలకులు లాక్కున్న భూములను తిరిగి రైతులకు ఇస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నట్టు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ పరివాహక ప్రాంతంలో బ్రతుకుతున్న ఎవరిని బయటకు పంపించబోమని చెప్పారు. అందరినీ అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తామని హామీ ఇచ్చారు. ఇండ్లు కోల్పోయిన వారికి మూసి అభివృద్ధి చేసుకున్న తర్వాత అక్కడే మళ్లీ ఇండ్లు కట్టించి ఇస్తామని భరోసానిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమల్లో భాగంగా ఈ ఏడాది రాష్ట్రంలో ఉన్న నిరుపేదలకు 4 లక్షల మందికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణం చేసి ఇస్తామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇవ్వనున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకువెళ్లి చాటి చెప్పాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కోరారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం అమలు కోసం ప్రతి నెలా రూ.400 కోట్లు చెల్లిస్తున్నట్టు తెలిపారు. మార్చి నెల నుంచి 200 యూనిట్లలోపు ఇంటి విద్యుత్తు కోసం ప్రతి నెల రూ.1,150 కోట్లు, రూ.500 గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరేజీని రూ.10 లక్షలకు పెంపు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.5 వేల కోట్లు కేటాయిం చామనీ, డైట్ ఛార్జీలు 40 శాతం పెంపు తదితర విజయాలను వివరించారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టి, 55 కిలోమీటర్ల మేర మూసీ పునర్జీవనం చేస్తుంటే పేద ప్రజలను రెచ్చగొట్టి బీఆర్ఎస్, బీజేపీ కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. పదేండ్లుగా బీఆర్ఎస్ సర్కారు వడ్డీ లేని రుణాలను నిలిపేస్తే, కాంగ్రెస్ రూ.20 వేల కోట్లను ఇస్తున్నదని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తిలో మహిళలను భాగస్వాములను చేసినట్టు భట్టి వివరించారు. 10 నెలల్లో 55 వేల ఉద్యోగాల భర్తీ, దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా 15 రోజుల్లో రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేసినట్టు తెలిపారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డును-రీజనల్ రింగ్ రోడ్డు కలుపుతూ ఇండస్ట్రియల్ క్లస్టర్లు, రెసిడెన్షియల్ గృహాలను నిర్మించబోతున్నామని ప్రకటిం చారు. సామాజికంగా రాజకీ యంగా ఆర్థికంగా సమాజంలో ఇప్పుడు ఉన్న ఏ వర్గాలు నష్టపో యాయి?. వారిని సమానత్వంలోకి తీసుకు రావడానికి ఎక్స్ రేలాగా కుల గణన సర్వే జరగాలని ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రకటన చేశారని భట్టి గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వం అధికా రంలోకి రాగానే అసెంబ్లీలో తీర్మానం చేసి 80 వేల మంది ఎన్యుమరేటర్లతో రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వేను విజయవం తంగా నిర్వహి స్తున్నట్టు భట్టి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సర్వే దేశానికి రోల్ మోడల్ కాబోతు న్నదన్నారు.

గిగ్లీజ్ ఐటీ కంపెనీ ఉద్యోగులకు న్యాయం చేయాలి

- 800 మంది ఉద్యోగుల తొలగింపు దారుణం
- ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలి : కార్మిక శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌కు సీఐటీయూ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిగ్లీజ్ ఐటీ కంపెనీ ఉద్యోగులకు న్యాయం జరిగేలా కార్మిక శాఖ చూడాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. 800 మంది కార్మికులను అకారణంగా తొలగించి సంస్థను మూసేస్తున్నట్టు ప్రకటించడం దారుణమని పేర్కొంది. ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరింది. గురువారం హైదరాబాద్‌లోని అంజయ్యభవన్‌లో ఈ మేరకు కార్మిక శాఖ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఉన్న ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్‌కు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం. చంద్రమోహన్ కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గిగ్లీజ్ ప్రయివేటు లిమిటెడ్ సీఈఓ వాకాటి రవిచంద్రారెడ్డి, చైర్మెన్ రెయినీర్ కంపెనీకి సంబంధించి రాయదుర్గంలో బ్రాంచ్‌ను ఏర్పాటు చేసి 800 మంది సాఫ్ట్‌వేర్ ఎనలిస్ట్‌లను 2024లో రిక్రూట్‌మెంట్ చేసుకున్నారనీ, వర్క్ ఫ్రం హోమ్ పేరిట 2024 ఏప్రిల్ నుండి పని చేయించుకున్నారని వివరించారు. ఒక్కొక్క ఉద్యోగికి ఏడాదికి రూ.4.50 లక్షలు ప్యాకేజీ ఇస్తామని వారు నమ్మించారని తెలిపారు. ఎనలిస్టులతో ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో పని చేయించుకున్నారనీ, ఆ తర్వాత సమాచారం లేకుండా తొలగించారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ నాలుగు నెలల వేతనాలు కూడా చెల్లించ లేదనీ, ఈ విషయమై అనేకసార్లు విజ్ఞప్తి చేసినా, మెయిల్ ద్వారా సమా చారం ఇచ్చినా సీఈఓ, చైర్మెన్‌లు స్పందించడం లేదని వివరించారు. పీఎఫ్ తదితర సౌకర్యాలు అమలు చేస్తామని చెప్పినా క్లారిటీ ఇవ్వలేదని ప్రస్తా వించారు. ఈ సమస్యపై మేనేజ్‌మెంట్‌తో మెయిల్స్ ద్వారా కరెస్పాండెన్స్ కూడా జరిగిందని తెలిపారు. వేతనాలు చెల్లిస్తామంటూనే నెలల తరబడి కాలయాపన చేస్తున్నారని వాపోయారు. ఈ విషయంలో కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలనీ, ఎనలిస్టులకు వెంటనే బకాయి వేతనాలు ఇప్పించాలని కోరారు. ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకో వాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్‌రెడ్డిని ఇన్‌చార్జి కమిష నర్ ఆదేశించారు.

కేజీబీవీ టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా విశాలాక్షి, లక్ష్మి

- కోశాధికారిగా మంజుల
- ఏకగ్రీవంగా నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక







నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు (యూఆర్ఎస్) తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) విభాగం నూతన రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. కేజీబీవీ టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులుగా కె విశాలాక్షి (సంగారెడ్డి), ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ లక్ష్మి (యాదాద్రి భువనగిరి), కోశాధికారిగా ఎం మంజుల (మహబూబాబాద్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జి గోపిలత, మీనా, హెచ్ సూర్య కిరణ్, టి రేణుక, పి రాజకుమారి, ఎం టీనా, డి నారాయణమ్మ, యు గంగామణి, నాగరాణి, కార్యదర్శులుగా జి సుమన చైతన్య, చాడా శ్రీలత, వై స్వరూప, జి కిష్టయ్య రాజాబాయి, జి సంధ్య, డి సావిత్రి, పి కుమారస్వామి, శోభారాణితోపాటు మరో 45 మంది రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన రాష్ట్ర కమిటీకి ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి అభినందనలు తెలిపారు.

అమీన్‌పూర్‌లో ఏసీబీ దాడులు

- ఇంటి నంబర్ కోసం రూ.30 వేల లంచం డిమాండ్
- ఇప్పటికే రూ.10 వేలు తీసుకున్న పంచాయతీ కార్యదర్శి



నవతెలంగాణ-అమీన్‌పూర్

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గురువారం దాడులు చేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఇటీవల విలీనమైన గ్రామాల్లో ఇంటి అనుమతులతో పాటు నిధుల అవకతవకలపై అందిన ఫిర్యాదులపై ఏసీబీ అధికారులు మున్సిపల్ కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో ఐలాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన వి.సచిన్‌ని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు ఐలాపూర్ పంచాయతీ రికార్డుల అవకతవకలపై విచారణ చేస్తున్నట్టు సమాచారం. ఈ సోదాల విషయంపై మెదక్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ మీడియాకు వివరించారు.

సంగారెడ్డి జిల్లా ఐలాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా గతంలో పనిచేసిన సచిన్ ఓ ఇంటి నంబరు కేటాయింపు కోసం స్థానికంగా నివసించే తలారి మల్లేశ్ అనే వ్యక్తి వద్ద రూ.30వేలు లంచం డిమాండ్ చేశారు. అందులో భాగంగానే ముందస్తు ఒప్పందం ప్రకారం కార్యదర్శి వి.సచిన్ రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా తీసిన వీడియోల ఆధారంగా సెప్టెంబర్‌లో మల్లేష్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. మరో రూ.20 వేలు ఇచ్చే క్రమంలో తలారి మల్లేశ్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. దాంతో లంచం తీసుకున్నట్టు ఏసీబీ విచారణలో తేలటంతో అధికారులు సచిన్‌ను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారణ చేపట్టిన అధికారులు.. సచిన్ పదవీకాలంలో ఐలాపూర్‌లో ఇచ్చిన ఇంటి నంబర్ల జాబితాను సేకరించి విచారణ చేపట్టినట్టు తెలుస్తోంది.

వరి కొనుగోలు కేంద్రంలో ఘర్షణ

- నిర్వహణ మాకే అంటే మాకే అంటూ వాగ్వాదం



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

వరి కొనుగోలు కేంద్రంలో ఒకే పార్టీకి చెందిన రెండు గ్రూపులు ఘర్షణ పడ్డాయి. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం బీరెల్లి గ్రామంలో గురువారం జరిగింది ఐకేపీ ద్వారా కొనుగోలు సెంటర్ ఏర్పాటు చేశారు. అయితే, అక్కడ అధికార పార్టీ నేతలు రెండు గ్రూపులుగా విడిపోయి ధాన్యం కొనుగోళ్ల విషయంలో గొడవకు దిగారు. కేంద్రం నిర్వహణనుకు తమకే ఇవ్వాలంటే తమకే ఇవ్వాలంటూ ఇరు గ్రూపుల వారు ఘర్షణ పడ్డారు. గత సంవత్సరం మహిళా సంఘాల వారికే ఈసారి కూడా అప్పగించాలని కొందరు పట్టుపట్టారు. రాజకీయ కారణంగానే బీరెల్లి గ్రామ కొనుగోలు కేంద్రాన్ని ఈసారి వేరే మహిళా సంఘం గ్రూపుకు ఇచ్చారని గత సంవత్సరం నిర్వాహకులు ఆరోపించారు.

కష్టపడ్డ వారికి గుర్తింపు: మహేశ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్టీ కష్టకాలంలో పని పని చేసిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ భరోసానిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఏడాది ప్రజా పాలనకు మద్దతుగా ఓయులో కృతజ్ఞత బహిరంగ సభకు సంబంధించిన ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన వచ్చాక 54 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని గుర్తు చేశారు. యూనివర్సిటీల్లో పార్టీకి పేరు వచ్చేలా కష్టపడి పని చేయాలని సూచించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో ఎన్ ఎస్ యూఐ ఓయు కమిటీ పూర్తి సహకారంతో ఈ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్, గ్రంథాలయ చైర్మెన్ రియాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్, ఎన్ఎస్ యూఐ ఓయు అధ్యక్షులు మీడ శ్రీను, వినయ్, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

'పిచ్చకుంట్ల' అనే పదం వాడితే క్రిమినల్ కేసు

- ప్రభుత్వం నుంచి త్వరలో ఆదేశాలు
- వెనకబాటు కులాలకు న్యాయం చేస్తాం : బీసీ కమిషన్ చైర్మెన్ గోపిశెట్టి నిరంజన్
- స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి : వివిధ వృత్తిదారులు, సంచార జాతుల విజ్ఞప్తి
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని కమిషన్ హామీ
- రంగారెడ్డి కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ బహిరంగ విచారణ



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాజకీయ నాయకులు గానీ, ఇతర కులాలు ఎవరైనా 'పిచ్చకుంట్ల' అనే పదం వాడితే వారిపై క్రిమినల్ కేసులు పెడుతామని, ఇందుకు ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు కూడా ఇవ్వనున్నట్టు బీసీ కమిషన్ చైర్మెన్ గోపిశెట్టి నిరంజన్ తెలిపారు. పిచ్చకుంట్ల అనే పేరు పిలవడం మానేసి 'వంశరాజ్'గా మాత్రమే పిలవాలని విజ్ఞాప్తులు వచ్చాయని, వాటన్నింటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. బీసీ కమిషన్‌పై ఎలాంటి అపనమ్మకం అవసరం లేదని స్పష్టం చేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టింది. ఈ విచారణకు చైర్మెన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, బాలలక్ష్మీ తిరుమలగిరి సురేందర్ సహా జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన కుల సంఘాలు, వృత్తిదారులు, రాజకీయ పార్టీల నేతల నుంచి అభిప్రాయాలు సేకరించారు. పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "పేరుకు మేము బీసీలమే అయినా.. మాకు రాజకీయ రిజర్వేషన్లు దక్కడం లేదు. ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల ఫలాలను పెద్దకులాలే అనుభవిస్తున్నాయి. గ్రామాల్లో కనీసం మమ్మల్నీ మనుషులుగా కూడా చూడటం లేదు' అని వృత్తిదారులు, సంచార జాతుల నేతలు బీసీ కమిషన్ ముందు ఆవేదన వ్యక్తం చేశాయి. స్థానిక సంస్థల్లో అట్టడుగున ఉన్న వర్గాలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశాయి. గ్రామీణ ప్రాంతాల్లోని కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, శిల్పి, పూసలి, వాల్మీకిబోయ, ఆరెకటిక, సగర, ఉప్పర, వడ్డెర, క్షౌర వృత్తిదారులకు రాజకీయంగా కనీస ప్రాధాన్యత దక్కడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మెన్ మాట్లాడుతూ.. బీసీ హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ పనిచేస్తుందన్నారు. బీసీలపై ఎక్కడైనా దాడులు జరిగినట్లయితే చర్య తీసుకునేందుకైనా తాము వెనుకాడబోమని తెలిపారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుల సర్వే చారిత్రాత్మక నిర్ణయం అని, దీనివల్ల రాష్ట్ర జనాభాలో బీసీలు ఎంతమంది ఉన్నారో తెలుస్తుందన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో కోటి 15 లక్షల పైచిలుకు కుటుంబాలను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించినట్టు తెలిపారు. 87వేల మంది ఎన్యూమరేటర్లు ఇండ్లకు వెళ్లి సమాచారాన్ని సేకరిస్తున్నారని, సమగ్ర కుటుంబ సర్వే వివరాలు పూర్తిగా పబ్లిక్ డొమైన్‌లో పెడుతామని చెప్పారు. ఈ సర్వేపై కొందరు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారన్నారు. సమాజంలో బలహీనంగా ఉన్న వారి అభివృద్ధిని కోరుకునే వారికి అందరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు.

పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలి

జిల్లాలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి. నాగయ్య

సీపీఐ(ఎం) భూపాలపల్లి జిల్లా మహాసభలు ప్రారంభం



నవతెలంగాణ-భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని, జిల్లాలోని సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు జి నాగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా సీపీఐ(ఎం) 3వ జిల్లా మహాసభలను పట్టణంలోని కృష్ణ కాలనీ సింగరేణి కమిటీ హాల్‌లో గురువారం ప్రారంభించారు. ముందుగా కారల్ మార్క్స్ కాలనీ శ్రామిక భవనం నుంచి ప్రధాన రహదారి హనుమాన్ ఆలయం రోడ్డు ద్వారా మహాసభ ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంపెట రాజయ్య జెండా ఆవిష్కరించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరికి, అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఆ తర్వాత జిల్లా నాయకులు వి. రాజయ్య అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో నాగయ్య మాట్లాడారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, జిల్లాకు రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సింగరేణి జెన్కో ఆధారిత పరిశ్రమలైన బొగ్గు శుద్ధి కర్మాగారం, ఎరువుల కర్మాగారం, సిమెంటు కర్మాగారం ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లా కేంద్రంలో ఇంజినీరింగ్, బీఈడీ, లా కాలేజీలను ఏర్పాటు చేయాలని తెలిపారు.సింగరేణి బొగ్గు బ్లాగులను కేంద్ర ప్రభుత్వం వేలం వేసే పద్ధతిని ఉపసంహరించు కోవాలని, సింగరేణి ప్రాంతంలో ఉన్న బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీ, జవహర్ నగర్, రాజీవ్ నగర్, బాంబుల గడ్డ సిఆర్ నగర్, శాంతినగర్ కాలనీ వాసులకు ఇండ్లకు పట్టాలు ఇవ్వాలని, పాత ఎర్ర చెరువులో గుడిసెలు వేసిన పేదలందరికీ ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రధాని ఆవాస్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం పేదలందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు.ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి, జెన్ కో, మేడిగడ్డ-అన్నారం ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇచ్చి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్, జిల్లా కార్యదర్శి బందు సాయిలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంపేటి రాజయ్య, చెన్నూరు రమేష్, పోలం రాజేందర్, వి. రాజయ్య, గుర్రం దేవేందర్, సంఘం ప్రీతి, ఆతుకూరి శ్రీకాంత్, మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లోనే అన్ని రకాల వైద్యసేవలు

పేదల బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే..

- రాష్ట్రంలో 54 ట్రామా సెంటర్‌లు : వైద్యఆరోగ్య శాఖమంత్రి రాజనర్సింహ



నవతెలంగాణ - మంచిర్యాల

పేదలకు మండల కేంద్రాల్లోనే 90శాతం అన్నిరకాల వైద్యసేవలందేలా ఏర్పాట్లు చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. పేదలకు అవసరమైన విద్య, వైద్యం ఉచితంగా అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో రూ.360కోట్లతో నిర్మించనున్న 650 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి గురువారం మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. చుట్టు పక్కల మూడు రాష్ట్రాలు, స్థానికంగా ఏడు నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగపడేలా మంచిర్యాలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పారు.తెలంగాణలో మొత్తం 54 ట్రామా సెంటర్‌లు మంజూరు చేస్తామని, గ్రామీణ ప్రాంతాలకు అంబులెన్సు సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను విస్తరించి బెడ్ల సంఖ్యను పెంచుతామన్నారు. 6 బెడ్స్‌తో ఉన్న జన్నారం పీహెచ్‌సీని 30బెడ్స్‌కు విస్తరిస్తామని చెప్పారు. జిల్లాలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తల కొరత లేకుండా చూస్తామన్నారు. జిల్లాలో క్యాన్సర్, ట్రామా, వాస్క్యులర్ సేవలు అందించేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

సింగరేణిలో రెగ్యులర్ కార్మికులతోపాటు కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా లాభాల్లో బోనస్ అందించామని, బొగ్గు గనులను కాపాడటం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందని చెప్పారు. ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరి స్తున్నారని అన్నారు. అందులో భాగంగానే జిల్లాలో 650 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. సామాన్య ప్రజలు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. మందుల కొరత లేకుండా డ్రగ్ స్టోరేజీ సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసు కుంటూ ప్రజల సహకారంతో ముందుగు సాగు తున్నట్టు చెప్పారు.ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ.. త్వరలోనే జిల్లాలో ఐటీ హబ్, ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేస్తామన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తున్నామని,ఇకపై పేద ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని అన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మంత్రి శ్రీధర్‌బాబు వెన్ను దన్నుగా నిలిచారని తెలిపారు.

రాబోయే రోజుల్లోనూ మంత్రి సహకారం జిల్లాకు ఉండాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ చైర్మెన్ కొట్నాక తిరుపతి, మినిమమ్ వేజెస్ బోర్డు చైర్మెన్ జనక్ ప్రసాద్, మున్సిపల్ చైర్మెన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మెన్ సల్ల మహేష్, నస్పూర్ మున్సిపల్ చైర్మెన్ సురిమళ్ల వేణు, టిజిఎంఎస్ఐడిసి ఎండి హేమంత్ బోర్కడే, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య శాఖ అధికారి డా.హరీష్‌రాజ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సులేమాన్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ హరీష్‌చంద్రారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొక్కిరాల సురేఖ, పట్టణ అధ్యక్షులు తూముల నరేష్ పాల్గొన్నారు.

భూకబ్జా కేసులో మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై కేసు


(ఫైల్)

నవతెలంగాణ- నయీంనగర్

హనుమకొండ న్యూశాయంపేట దుర్గాదేవి కాలనీలో ఓ వ్యక్తికి చెందిన భూమి కబ్జా విషయంలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఆయన అనుచరులపై సుబేదారి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పైడిపల్లికి చెందిన రుద్రోజు పద్మావతికి తండ్రి జల్లిపెల్లి పెంటయ్యాచారి హనుమకొండ హంటర్‌రోడ్‌లోని న్యూశాయంపేట దుర్గాదేవికాలనీలోని సర్వే నెం.186లోని 497 చదరపు గజాల స్థలాన్ని పసుపు కుంకుమల కింద ఇచ్చారు. ఈ స్థలంలో జీడబ్ల్యుఎంసీ అధికారుల అనుమతులతో పద్మావతి చుట్టూ ప్రహరీ నిర్మిచడంతోపాటు కంటెయినర్ ఏర్పాటు చేశారు. ఈనెల 16న పద్మావతి దంపతులు తమ స్థల వద్దకు వెళ్లేసరికే.. అజ్మీర వెంకట్‌నాయక్, బానోత్ ప్రేమ్‌నాయక్, బానోత్ మోహన్‌లాల్, మరికొంత మంది వ్యక్తులు స్థలాన్ని, కంటెయినర్‌ను ఆక్రమించుకుని నివాసముంటున్నారు. దీంతో ఎవరు మీరు ? ఈ స్థలంలో మీరెందుకు ఉన్నారని పద్మావతి ప్రశ్నిస్తుండగా వీడియో తీస్తున్న ఆమె కుమారుడు దత్త రాజన్‌ను.. కబ్జాదారులు పరుశ పదజాలంతో దూషిస్తూ వారిపై దాడి చేశారు. వారి సెల్‌ఫోన్లను లాక్కున్నారు. మరుసటి రోజు మళ్లీ స్థలం వద్దకు వెళ్లేసరికే.. అక్కడ రూ.4.20 లక్షల విలువైన కంటెయినర్, దానిలోని సామాగ్రి కూడా లేదు. దీంతో బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా. విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆదేశాల మేరకే ఆయన అనుచరులు ముగ్గురు కబ్జాకు పాల్పడినట్టు తేలడంతో ఈనెల 20న శంకర్‌నాయక్, మిగతావారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ క్రైమ్ కేసులో గొల్లపూడి యువకులు

- అదుపులోకి తీసుకున్న మహారాష్ట్ర పోలీసులు

నవతెలంగాణ- వైరా

సాంకేతికరంగం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. మార్కెట్‌లో అనేక యాప్‌లు పుట్టుకొస్తున్నాయి. ఒక కంపెనీ యాప్‌ను కొనుగోలు చేసిన వ్యక్తి తన పనిని మాత్రమే చేసుకోవాలి కానీ, ఆ వ్యక్తి ఆ యాప్‌ను చైన్ సిస్టం ద్వారా అనేక మందికి విక్రయిస్తున్నారు. తద్వారా అసలు యాప్ కంపెనీకి నష్టాలు కలిగిస్తున్నట్టు బయట పడిన కేసులో ఖమ్మం జిల్లా వైరా మండలం గొల్లపూడి గ్రామానికి చెందిన కర్నాటి రవి, దొబ్బల అశోక్ కీలక సూత్రదారులని మహారాష్ట్ర సైబర్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ నిమిత్తం తీసుకెళ్లారు. ఈ సైబర్ వ్యాపారం ద్వారానే వీరిలో ఒకరి పేరున రూ.70 లక్షలు ఉన్నట్టు కూడా నిర్ధారణ చేసుకున్నట్టు తెలిసింది. ఈ సైబర్ క్రైంలో గ్రామానికి చెందిన ఇంకా కొంత మంది పాత్ర ఉన్నట్టు చర్చ నడుస్తోంది.

24న ఇరిసెట్ 67వ వార్షికోత్సవం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సికింద్రాబాద్‌లోని తార్నాకలో గల ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్ (ఇరిసెట్) 67వ వార్షికోత్సవ దినోత్సవం ఈనెల 24న ఘనంగా నిర్వహిస్తున్నట్టు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. శిక్షణలో అత్యంత ప్రతిభ కనబర్చిన వారికి అవార్డుల పంపిణీతో పాటు టెక్నికల్ మ్యాగజైన్ విడుదల చేస్తున్నట్టు పేర్కొంది. యూపీఎస్సీ, ఆర్‌ఆర్‌బీల ద్వారా ఎంపికైన వారితో పాటు డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, రైల్ వికాస్‌నిగమ్ లిమిటెడ్, రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల సిబ్బందికి శిక్షణ అందించినట్టు తెలిపింది. రైల్వే సిగ్నలింగ్‌పై మలేషియా, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్ మొదలైన దేశాల నుంచి 332 మంది విదేశీయులకు శిక్షణనిచ్చినట్టు వెల్లడించింది. ఇప్పటివరకు 1,12, 842 మంది రైల్వే సిబ్బందికి కోచింగ్ ఇచ్చినట్టు పేర్కొంది.



టెస్టు క్రికెట్‌లో అతిపెద్ద సమరానికి రంగం సిద్ధమైంది. ఐదు టెస్టుల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అమీతుమీ తేల్చుకునేందుకు భారత్, ఆస్ట్రేలియా సై అంటున్నాయి. గత రెండు పర్యటనల్లో ఆసీస్ గడ్డపై అసమాన విజయాలు సాధించిన టీమ్ ఇండియా.. హ్యాట్రిక్ సిరీస్ విజయంపై కన్నేసింది. సొంతగడ్డపై జోరుమీదున్న ఆస్ట్రేలియా ఈసారి లెక్క సరిచేయాలని ఎదురుచూస్తోంది. బలహీనంగా కనిపిస్తోన్న భారత్‌ను దెబ్బకొట్టి సిరీస్‌తో పాటు ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్‌కు దూరం చేయాలనే కసితో బరిలోకి దిగుతోంది. భారత్, ఆస్ట్రేలియా తొలి టెస్టు పెర్త్ ది ఆప్టస్ స్టేడియంలో నేటి నుంచి ఆరంభం.

కంగారూ సవాల్

- సొంతగడ్డపై జోరుమీదున్న కమిన్స్‌సేన
- ఆసీస్‌లో హ్యాట్రిక్ విజయంపై భారత్ గురి
- నేటి నుంచి ఆసీస్‌తో భారత్ తొలి టెస్టు

ఉదయం 7.50 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-హైదరాబాద్

రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో లేడు. యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ గాయం బారిన పడ్డాడు. టాప్ ఆర్డర్ బ్యాటింగ్ లైనప్‌పై అనిశ్చితి. పెర్త్ టెస్టు ముంగిట టీమ్ ఇండియా పరిస్థితి ఇది. మరోవైపు కెప్టెన్ పాట్ కమిన్స్ సహచర భీకర పేసర్లతో కలిసి సీమ్‌కు పదును పెడుతున్నాడు. స్మిత్, లబుషేన్, ట్రావిశ్ హెడ్‌లు ప్రతీకార విజయం కోసం ఎదురుచూస్తున్నారు. స్వదేశంలో కివీస్ చేతిలో వైట్‌వాష్ ఓటమితో భారత్ కాస్త తగ్గగా.. ఆసీస్ స్వదేశంలో సూపర్ స్పీడ్‌తో కనిపిస్తోంది. ప్రపంచ టెస్టు క్రికెట్‌లో అతిపెద్ద సమరమైన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నేటి నుంచి ఆరంభం కానుంది. పెర్త్‌లోని ది ఆప్టస్ స్టేడియం భారత్, ఆస్ట్రేలియా తొలి టెస్టు వేదిక కానుంది. భారత కాలమానం ప్రకారం నేడు ఉదయం 7.50 గంటల నుంచి పెర్త్ పోరు షురూ కానుంది.

కుర్రాళ్లపైనే భారం!

తొలి టెస్టులో టీమ్ ఇండియా కొత్త ఆటగాళ్లపై ఆధారపడనుంది. తుది జట్టులో ఏకంగా నలుగురు కొత్త ముఖాలు కనిపించే అవకాశం ఉంది. దేవదత్ పడిక్కల్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, ఆకాశ్ దీప్‌లు ఆడనున్నారు. రోహిత్ శర్మ శుభ్‌మన్ గిల్ లేకపోవటం భారత్‌కు ప్రతికూలంగా మారింది. ఫామ్‌లో లేని కెఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్ టాప్ ఆర్డర్‌లో ఆడనున్నారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఫామ్‌లో లేడు. కానీ బలమైన ప్రత్యర్థిపై మెరుపు ఇన్నింగ్స్‌లో ఆడటంలో కోహ్లి దిట్ట. ఆసీస్‌పై కోహ్లికి తిరుగులేని రికార్డులు ఉన్నాయి. రిషబ్ పంత్, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ మంచి ఫామ్‌లో ఉన్నారు. ఈ ముగ్గురు బ్యాటర్లకు విరాట్ కోహ్లి జతకలిస్తే భారత్‌కు తిరుగుండదు. కానీ పెర్త్‌లో పచ్చిక పిచ్‌పై పదునైన ఆసీస్ పేస్ దాడిని ఏ మేరకు ఎదుర్కొంటారనే ప్రశ్న ఎక్కువగా ఉంది. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. ఆకాశ్ దీప్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ, హర్షిత్ రాణాలలో ఇద్దరు బుమ్రాకు జత కలువనున్నారు. తెలుగు తేజం నితీశ్



కుమార్ రెడ్డి పేస్ ఆల్‌రౌండర్‌గా ఆడనుండగా.. స్పిన్ ఆల్‌రౌండర్‌గా రవిచంద్రన్ అశ్విన్ తుది జట్టులో నిలువనున్నాడు.

ఆత్మవిశ్వాసంతో ఆసీస్

సొంతగడ్డపై చివరి రెండు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలను ఆస్ట్రేలియా కోల్పోయింది. గత పర్యటనలో టీమ్ ఇండియా ప్రథమ ప్రాధాన్య ఆటగాళ్ల సేవలు కోల్పోయినా.. చిరస్మరణీయ సిరీస్ విజయం అందుకుంది. ఈ పర్యటనలోనూ భారత్ ప్రథమ ప్రాధాన్య ఆటగాళ్ల సేవలను తొలి టెస్టుకు కోల్పోయింది. మరి కొత్త ఆటగాళ్లు పెర్త్ నుంచి అద్భుతం మొదలెడతారా? అనేది చూడాలి. ఆస్ట్రేలియా మాత్రం ఈసారి కచ్చితంగా సిరీస్ కొట్టాలనే పట్టుదలతో కనిపిస్తోంది. యువ ఓపెనర్ మెక్‌స్వీనీపై కంగారూ కెప్టెన్ నమ్మకంగా ఉన్నాడు. ట్రావిశ్ హెడ్ టీ20 తరహాలో సన్నద్ధం అయ్యాడు. మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్ ఐదు రోజుల ఆటలో ఎప్పుడూ ప్రమాదకర బ్యాటర్లే. బౌలింగ్ విభాగంలో పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోశ్ హేజిల్‌వుడ్‌లు భారత బ్యాటర్లకు సవాల్ విసరనున్నారు. స్పిన్నర్ నాథన్ లయాన్‌ను మనోళ్లు ఎలా ఎదుర్కొంటారో చూడాలి. మిచెల్ మార్ష్, అలెక్స్ కేరీలు ఈసారి ఆసీస్‌కు ఎక్స్ ఫ్యాక్టర్‌గా నిలువనున్నారు.

పిచ్, వాతావరణం

ది ఆప్టస్ స్టేడియం సంప్రదాయ పేస్ పిచ్. బుధ, గురు వారాల్లో ఇక్కడ వర్షం కురిసింది. పిచ్ తయారీ ప్రక్రియకు వర్షం అంతరాయం కలిగించింది. వర్షం రాకతో ఆఖరు రెండు రోజుల్లో పిచ్‌పై పగుళ్లు తేలే అవకాశం లేకుండా పోయింది. పిచ్‌పై 8మిమీ మందంలో పచ్చిక ఉంచారు. పేసర్లకు మంచి బౌన్స్, పేస్ లభించనుంది. బ్యాట్‌కు, బంతికి సరసమైన పోటీ ఉండేలా పిచ్ తయారు చేసేందుకు క్యూరేటర్ ఐజాక్ మెక్‌డొనాల్డ్ ప్రయత్నం చేశారు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఎక్కువగా ఉంది. టెస్టు మ్యాచ్ సమయంలో ఎటువంటి వర్షం సూచనలు లేవు.

తుది జట్లు (అంచనా) :

భారత్ : యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, విరాట్ కోహ్లి, రిషబ్ పంత్, ధ్రువ్ జురెల్, రవిచంద్రన్ అశ్విన్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా (కెప్టెన్).

ఆస్ట్రేలియా : ఉస్మాన్ ఖవాజ, నాథన్ మెక్‌స్వీనీ, మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్, ట్రావిశ్ హెడ్, మిచెల్ మార్ష్ అలెక్స్ కేరీ, మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్ (కెప్టెన్), నాథన్ లయాన్, జోశ్ హేజిల్‌వుడ్.



ఆటలు

టాప్‌లేపిన టైటాన్స్

31-29తో బెంగాల్ వారియర్స్‌పై గెలుపు

ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 11



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ టాప్ లేపింది. సీజన్లో ఎనిమిదో విజయం సాధించిన తెలుగు టైటాన్స్ పీకెఎల్ 11 పాయింట్ల పట్టికలో అగ్రస్థానం దక్కించుకుంది. రెయిడర్ విజయ్ మాలిక్ (14 పాయింట్లు) సూపర్ టెన్ షోతో చెలరేగగా గురువారం గ్రేటర్ నోయిడా ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్‌పై తెలుగు టైటాన్స్ 31-19తో మెరుపు విజయం సాధించింది. బెంగాల్ వారియర్స్ తరఫున ప్రణయ్ రానె (9), విశ్వాస్ (4), హేమ్‌రాజ్ (4) మెరిసినా ఫలితం దక్కలేదు. ప్రథమార్థంలో తెలుగు టైటాన్స్ 19-9తో భారీ ఆధిక్యంలో నిలువగా.. బెంగాల్ వారియర్స్ ద్వితీయార్థంలో పుంజుకుంది. ఆఖరు 20 నిమిషాల ఆటలో 20 పాయింట్లు సాధించి ఓటమి అంతరాన్ని కుదించింది. సీజన్లో ఆడిన 12 మ్యాచుల్లో తెలుగు టైటాన్స్‌కు ఇది ఎనిమిదో విజయం కాగా.. బెంగాల్ వారియర్స్‌కు 11 మ్యాచుల్లో ఆరో పరాజయం.

24న ఆసీస్‌కు రోహిత్

రెండో టెస్టులో ఆడనున్న హిట్‌మ్యాన్



ముంబయి : భారత కెప్టెన్, ఓపెనర్ రోహిత్ శర్మ ఈ నెల 24న ఆస్ట్రేలియాకు వెళ్లనున్నారు. పితృత్వ సెలవులో ఉన్న రోహిత్ శర్మ తొలి టెస్టుకు అందుబాటులో లేడు. ఆస్ట్రేలియాతో రెండో టెస్టు అడిలైడ్‌లో డిసెంబర్ 6 నుంచి ఆరంభం కానుంది. అంతకుముందు, టీమ్ ఇండియా కాన్‌బెర్రాలో రెండు రోజుల డే నైట్ పింక్ బాల్ వార్మప్ మ్యాచ్ ఆడనుంది. ఈ వార్మప్ మ్యాచ్‌లో రోహిత్ శర్మ మ్యాచ్ ప్రాక్టీస్ చేయనున్నాడు. ముంబయి నుంచి నేరుగా పెర్త్ చేరుకోనున్న రోహిత్ శర్మ.. ది ఆప్టస్ స్టేడియంలో టీమ్ ఇండియాతో చేరనున్నాడు. రోహిత్ శర్మ స్థానంలో జస్‌ప్రీత్ బుమ్రా ఆసీస్‌తో తొలి టెస్టులో భారత్‌కు కెప్టెన్సీ వహిస్తున్నాడు.

ముగిసిన టీఓఏ ఎన్నికలు

న్యాయస్థానం ఆదేశంతో ఫలితాలు వాయిదా

నవతెలంగాణ-హైదరాబాద్ : తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ) ఎన్నికలు గురువారం ఎల్బీ స్టేడియంలోని ఎల్. వెంకట్రామిరెడ్డి ఒలింపిక్ భవన్‌లో ప్రశాంతంగా ముగిశాయి. 65 మంది ఓటర్లలో 59 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి మినహా మిగతా పదవులు ఏకగ్రీవం అయ్యాయి. ఏపీ జితేందర్ రెడ్డి, వి. చాముండేశ్వరనాథ్‌లు ప్రెసిడెంట్ పదవి కోసం పోటీపడగా.. మల్లారెడ్డి, బాబురావులు ప్రధాన కార్యదర్శి రేసులో నిలిచారు. కోశాధికారి పదవికి సతీశ్ గౌడ్, ప్రదీప్ కుమార్‌లు పోటీపడ్డారు. ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్ చారి, సంజీవ్ రెడ్డి, అమిత్ సంఘీ, అప్పారావు.. సంయుక్త కార్యదర్శులుగా జనార్దన్ రెడ్డి, విజయ్ కుమార్, మహ్మద్ ఖాజా ఖాన్, ఉమేశ్‌లు ఏకగ్రీవం అయ్యారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు రాష్ట్ర క్రీడా సంఘాల నుంచి పది మంది, జిల్లా ఒలింపిక్ సంఘాల నుంచి ఐదుగురు సైతం ఏకగ్రీవం అయ్యారు. గురువారం ఒలింపిక్ భవన్‌లో జరిగిన వార్షిక సర్వ సభ్య సమావేశంలో టీఓఏలో మూడు కీలక పదవులకు ఎన్నికలు నిర్వహించగా.. సిటీ సివిల్ కోర్టు ఆదేశాలతో ఎన్నికల ఫలితాలను వెల్లడించలేదు. బాక్సింగ్ సంఘం పిటిషనుపై మధ్యంతర ఆదేశాలు జారీ చేసిన సిటీ సివిల్ కోర్టు అదనపు ప్రధాన జడ్జి ఎన్నికల ఫలితాలను వెల్లడించకూడదని, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఒరిజనల్ పిటిషనులో తీర్పునకు ఎన్నికల ఫలితాలు లోబడి ఉండాలని ఆదేశించారు. టీఓఏ రిటర్నింగ్ అధికారి హైకోర్టు మాజీ న్యాయమూర్తి సి. ప్రవీణ్ కుమార్ ఓట్ల లెక్కింపు, ఎన్నికల ఫలితాలను వాయిదా వేశారు. న్యాయస్థానం తదుపరి ఆదేశాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉండనుంది.



అంబర్‌పేట బొడ్రాయి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, ఆల్ ఇండియా సర్వ సేవా సంఘ అధ్యక్షులు ఆల్ ఇండియా సర్వ సేవా సమితి అధ్యక్షులు వెదిరే అరవింద్ కుమార్ రెడ్డి ఆలయ కమిటీ వైస్ చైర్మెన్ లక్ష్మణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్ గడ్డం శ్రీధర్ గౌడ్, కోటం అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-అంబర్‌పేట

రేపటి నుంచి సీపీఐ(ఎం) సౌత్ కమిటీ 4వ మహాసభలు..

నవతెలంగాణ-ధూల్‌పేట్

భారత కమ్యూనిస్ట్ పార్టీ(మార్కిస్ట్) సీపీఐ (ఎం) సౌత్ కమిటీ 4వ మహాసభలు ఈ నెల 23, 24 తేదీలు శని, ఆదివారాలలో నిర్వహిస్తున్నామని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ కార్యదర్శి అబ్బాస్ ఈ ప్రకటన తెలిపారు. ఈ మహాసభలు హుస్సేన్ ఆలం, ఇబ్రహీం బాగ్ ఫాల్కే గార్డెన్ లో జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ మహా సభలను సౌత్ జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



డిసెంబర్ 7న రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్



- ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దుర్మార్గం
- నగరంలో లక్ష మంది రవాణా కార్మికులతో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

గత 11 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కరంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ డిసెంబర్ 7న రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్ నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దుర్మార్గమన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో యూనియన్స్ జేఏసీ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు బి.వెంకటేశం (ఏఐటీయూసీ), పి.శ్రీకాంత్ (సీఐటీయు), వి.ప్రవీణ్ (టీయుసీఐ), ఎం.ఎ.సలీమ్ (యుటీఎడీడబ్ల్యూఎ), ఎ.సత్తిరెడ్డి (టిఎడిఎస్), వి.మారయ్య (బీఆర్ టీయు)తో పాటు ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, బీఆర్ టీయు అధ్యక్షులు రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.వెంకటేశం మాట్లాడుతూ 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకుండా మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావొస్తున్న ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని లెక్కలేనన్ని ధర్నాలు, ర్యాలీలు, పికెటింగ్‌లు, వినతి పత్రాలు అందజేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తుందని, ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కరంలో నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. అనంతరం పి.శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుతో పాటు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం వంటి ఆటో డ్రైవర్ల డిమాండ్లు పరిష్కరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం దుర్మార్గమన్నారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల డిమాండ్లు న్యాయమైనవని, కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. రాంబాబు యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి లేక రాష్ట్రంలో 40 మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని, బాధిత ఆటో డ్రైవర్ల కుటుంబాలకు వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ.బిక్షపతి యాదవ్, ఎస్.అశోక్, సిహెచ్.జంగయ్య, ఎండి.ఒమర్ ఖాన్, చందు యాదవ్ (ఏఐటీయూసీ), లింగం గౌడ్ (టీయుసీఐ), లక్ష్మణ్ (సీఐటీయు), ఎండి.నజీర్ (యుటీఎడీడబ్ల్యూఎ) తదితరులు పాల్గొన్నారు.

సిల్ట్ ఛాంబర్లు లేకుంటే సీవరేజ్ కట్

- నిర్లక్ష్యం వహించిన వారికి నోటీసులు
- సిల్ట్ ఛాంబర్లు ఏర్పాటు చేసుకోవాల్సిందే : ఎండీ





నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మెహదీపట్నం, లంగర్ హౌజ్ ప్రాంతాల్లో డీ-సిల్టింగ్ పనుల్ని ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. మొదటగా మెహదీపట్నం అంబా థియేటర్ వద్ద ప్రధాన రహదారిపై తరచూ పొంగుతున్న మ్యాన్ హోళ్లను పరిశీలించారు. చుట్టు పక్కల ప్రాంతాల్లోని హోటళ్ల యాజమానులు తమ సీవరేజ్ పైపు లైన్‌ను నేరుగా జలమండలి సీవరేజ్ నెట్ వర్క్‌కు అనుసంధానం చేయడంతో వాటి నుంచి వచ్చే ఆహార, వ్యర్థ పదార్థాలు మ్యాన్ హోళ్లలో చేరి పొంగినట్లు గుర్తించారు. దీంతో హోటళ్ల, బేకరీలు, ఫుడ్‌కోర్టులు, వాణిజ్య భవనాల యజమానులకు సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోవాలని నోటీసులు జారీ చేయాలని అధికారులను ఎండీ ఆదేశించారు. నిర్లక్ష్యం వహించిన వారి సీవరేజ్ పైపులైన్ కనెక్షన్లను తొలగించాలని ఆదే శాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడారు. ఆస్పత్రులు, హోటళ్లు, బేకరీలు, మాల్స్, తదితర వాణిజ్య, బహుళ అంతస్తు భవన సముదాయాల నిర్వాహకులు సిల్ట్ చాంబర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిల్ట్ ఛాంబర్ల ఏర్పాటుతో వ్యర్థాలు మ్యాన్‌హోళ్లలో కలవకుండా చేయవచ్చన్నారు. ఫలితంగా సీవరేజ్ పైపు లైన్లపై ఒత్తిడి తగ్గి మురుగు ప్రవాహం సాఫీగా ఉంటుందన్నారు. అర్హులైన వినియోగదారులందరూ సిల్ట్ ఛాంబర్లను నిర్మించుకోవాలని ఎండీ విజ్ఞప్తి చేశారు.

డీ-సిల్టింగ్‌ను పరిశీలించిన ఏండీ

టోలీచౌకిలో జరుగుతున్న డీ-సిల్టింగ్ పనుల్ని ఎండీ అశోక రెడ్డి పరిశీలించారు. అక్కడ సీవరేజ్ ఔట్ లెట్ లేని లైన్లను జలమండలి నూతనంగా నిర్మిస్తున్న జోన్-3 సీవరేజ్ నెట్ వర్క్ కు అనుసంధానం చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నిర్మాణం దశలో ఉన్న ఈ ప్రాజెక్టులో 3 ప్రాంతాల్లో దాదాపు 2.1 కిలోమీటర్ల మేరకు స్థానిక సమస్యలతో పనులు నిలిచిపోయాయి. స్థానికులు, ప్రజాప్రతినిధులతో చర్చించి పనులు చేపడతామని చెప్పారు. మరో 7కిలో మీటర్ల మేరకు పైపు లైన్ నిర్మాణం పనులను ఫిబ్రవరి లోపల పూర్తి చేయాలని ఆదేశించారు.

జోన్-3 సీవర్ నెట్ వర్క్ ప్రాజెక్టు

మూసీనదికి ఉత్తరం వైపున కోర్ సిటీలో సీవరేజి వ్యవస్థ ఆధునీకీకరణ కోసం జోన్-3 సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టు పనులు చేపడుతున్నారు. 4 నియోజకవర్గాల పరిధిలో 33.50 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణానికి సంబంధించి రూ.297 కోట్ల వ్యయంతో జోన్ - 3 సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టులో మొత్తం 129.32 కిలో మీటర్ల పొడవైన పైప్‌లైన్ నిర్మాణాన్ని జలమండలి చేపడుతోంది. నగరంలోని ఓల్డ్ సిటీలో ఉన్న గోషామహల్, నాంపల్లి, కార్వాన్‌తో పాటు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీవరేజి వ్యవస్థను ఆధునికీకరించడానికి ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఈ కార్యక్రమంలో సీజీఎం వినోద్ భార్గవ, జీఎం, డీజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.

ఈడీ మయాంక్ మిట్టల్ సమీక్ష

ఈడీ మయాంక్ మిట్టల్ ఓ అండ్ ఎం డివిజన్-9 కూకట్‌పల్లి పరిధిలోని అన్ని సెక్షన్ల అధికారులతో సమీక్ష నిర్వహించారు. 90 రోజుల స్పెషల్ డ్రైవ్ పనుల పరిశీలన, ఓటీఎస్ పథకం తదితర అంశాలపై అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు.

'మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం చేయూతనందించాలి'

తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తరతరాలుగా మత్స్యవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న లక్షలాది మంది మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్ కోరారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకుని, ముదిరాజ్ మహాసభ 10వ ఆవిర్భావ వేడుకలను గురువారం హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండా ప్రకాష్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేసి, చెరువులు, కుంటలను మత్స్య శాఖకు బదలాయించి, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు పొందడం జరిగిందన్నారు. ముదిరాజ్‌ల ఆత్మగౌరవం, అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు మహాసభ నిరంతరం ఎంతో కృషి చేస్తుందన్నారు. జీవో నెం.6తో మత్స్యకారులకు ప్రాతినిధ్యం కల్పించి ముదిరాజ్‌లకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు అనేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మహాసభను ఏర్పాటు చేసిన నాటికి 2,000 సంఘాలు ఉంటే ఇప్పుడు సుమారు 6,000 సంఘాలకు పైగా పెంచి నాలుగు లక్షల సభ్యత్వాలు చేయడం జరిగిందని చెప్పారు. రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్తులను బీసీ(డీ) నుంచి బీసీ(ఎ)లోకి మార్చేంత వరకు ఐక్యతతో ముదిరాజ్ లు ముందుకు సాగి పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల సత్తయ్య, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కనకయ్య, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు పండుగ బాలు, రాష్ట్ర కో-ఆర్డినేటర్ బొక్క శ్రీను ముదిరాజ్, నేతలు చెరుకు సాంబరాజు, కృష్ణమూర్తి, మహేందర్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అదృశ్యం..

నవతెలంగాణ-ధూల్‌పేట్



ఓ బాలిక, యువతి వేర్వేరుగా అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ బల్ రామ్ గల్లి, ఎథి మిఖన ఆస్పత్రి ప్రాంతానికి చెందిన 17 ఏండ్ల సత్యభామ ఏకంబే ఇంట్లోనే ఉంటుంది. ఈ నెల 16న సాయంత్రం ఇంట్లో నుండి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు స్థానికంగా, రక్త సంబంధికుల, బంధు మిత్రులతో వాకాబు చేశారు. ఫలితం లేకపోవటంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఓ యువతి అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ కామాటి పురా ప్రాంతానికి చెందిన అవంతిక దేవి 23ఏండ్లు ఇంట్లోనే ఉంటుంది. ఈ నెల 18న సాయంత్రం ఇంట్లో నుండి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు స్థానికంగా, రక్త సంబంధికుల, బంధు మిత్రులతో వాకాబు చేశారు. ఫలితం లేక పోవటంతో స్థానిక పోలీ సులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేసీఆర్ దూరదృష్టితోనే వ్యవసాయం అభివృద్ధి పథం

- తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులి గారి గోవర్ధన్ రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి వల్లనే తెలంగాణలో వ్యవసాయం అభివృద్ధి పథంలో ప్రయాణి స్తూ ఎన్నడూ లేనంత వరి ధాన్యం పండిందని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ వర్ధమాన సంవత్సరంలో దేశంలోనే ఉమ్మడి రాష్ట్రంలో సహితం పండనంత వరి పంట తెలంగాణ రైతులు పండించారనేది వాస్తవమన్నారు. ఇది గత ప్రభుత్వం కేసీఆర్ దూరదృష్టి వల్లనే సాధ్యమైందన్నారు. వర్షపు నీటిని విడిచి పెట్టకుండా వడసి పట్టి రాష్ట్రంలో 40 వేల చెరువులను 20వేల పైచిలుక కుంటలను చెక్ డ్యాములు మిషన్ కాకతీయ పథకం ద్వారా మరమ్మత్తు పూడిక తీయడం వల్ల భూ గర్భ జల మట్టం పెరిగి ఎండాకాలంలో కూడా చెరువుల్లో నీటితో కళకళలాడాతున్నాయన్నారు.

కమ్యూటేషన్‌కు సంబంధించి హైకోర్టు తీర్పును అమలు చేయాలి

గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజేంద్ర బాబు, ఎస్వీ నరసింహారావు

నవతెలంగాణ-ముషీరాబాద్

పెన్షనర్లు కమ్యూటేషన్ మొత్తాన్ని తిరిగి చెల్లించే విషయంలో హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సత్వరమే అమలు చేయాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎ. రాజేంద్ర బాబు అధ్యక్షతన గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం (షోయబ్ హాల్) లో జరిగిన తమ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేంద్ర బాబు, ఎస్వీ నరసింహారావు మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పటిష్ట పరిచి పెన్షనరలందరికి, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత చికిత్సా సౌకర్యం కలగ చేయాలని ఎన్ని మార్లు విజ్ఞప్తి చేసినా అది అరణ్య రోదనగానే మిగిలిపోయిందని



ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి పడ్డ డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలని, పెన్షనర్‌ల మెడికల్ బిల్లులను త్వరిత గతిన పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మొత్తం 25 జిల్లాలకు చెందిన అధ్యక్షులు కార్యదర్శులు హాజరైన ఈ సమావేశంలో ఆర్థిక కార్యదర్శి బి.నర్సయ్య ఆర్థిక నివేదిక సమర్పించారు.

ప్రాంతీయభాషా భేదాలను విడిచిపెట్టి.. సమైక్యంగా జీవించినప్పుడే ప్రగతి సాధ్యం

- సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్



నవతెలంగాణ-ధూల్‌పేట్

మనుషులు కులమత ప్రాంతీయభాషా భేదాలను విడిచిపెట్టి, సమైక్యంగా జీవించినప్పుడే ప్రగతి సాధ్యమని సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అన్నారు. హర్యానా రాష్ట్రంలో ఈ నెల 12 నుండి 18 వరకు నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని బంగారు పతకం సాధించిన బీకాం తృతీయ ఏడాది విద్యార్థి కార్తీక్‌ను అభినందిస్తూ ప్రిన్సిపాల్ మాట్లాడారు. సమైక్యతే జీవనవిధానం కావాలని, వాటి పట్ల యువత అవగాహన పెంచుకోవాలన్నారు. గత ఐదేళ్లుగా సిటీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు జాతీయ శిబిరాలలో పాల్గొనటమే కాక ఉత్తమ వాలంటీర్లుగా ఎంపిక కావటం గర్వకారణమన్నారు. కేంద్ర యువజన క్రీడల శాఖ నిర్వహించిన ఈ శిబిరంలో 14 రాష్ట్రాలలోని 24 విశ్వవిద్యాలయాల నుండి 220 మంది వాలంటీర్లు పాల్గొనగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి వెళ్లిన బృందానికి సిటీ కాలేజీ ఆంగ్ల ఆచార్యులు డాక్టర్.కృష్ణచంద్ర కీర్తి నేతృత్వం వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన కార్తీక్‌ను వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.

విద్యార్థులను సామాజిక సేవలో భాగస్వామ్యం చేయాలి

- రక్తదాన శిబిరంలో ప్రిన్సిపాల్ ఆచార్య. పి.బాల భాస్కర్



నవతెలంగాణ-ధూల్‌పేట్

విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం చేయకుండా సామాజిక సేవలో భాగస్వాములను చేస్తూ వ్యక్తిత్వ వికాసాన్ని కలిగిస్తున్నామని సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య. పి.బాల భాస్కర్ అన్నారు. ఎన్.సీ.సీ దినోత్సవం సందర్భంగా ఉస్మానియా ఆస్పత్రితో కలసి ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తమ విద్యార్థులు వివిధ విభాగాల ద్వారా అందిస్తున్న సామాజిక సేవకు ఎన్నో బహుమతులు, ప్రశంసలు అందుకున్నారన్నారు. భవిష్యత్తులో వారంతా ఉత్తమ పౌరులుగా ఈ దేశానికి ఎంతో సేవనందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ పూర్వ విద్యార్థులు రక్తదాన సమూహాలను నిర్వహిస్తూ నిత్యం ఎందరినో ప్రాణాపాయ స్థితినుండి కాపాడుతున్నార న్నారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఎన్.సీ.సీ అధికారి డాక్టర్.కృష్ణవేణిని, ఎన్.సీ.సీ కాడెట్లను అభినందించారు. విద్యార్థులతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర బృందం సహితం రక్తదానంలో పాల్గొన్నారు. శిబిరం నుండి 43 యూనిట్ల రక్తం సేకరించామని ఉస్మానియా ఆస్పత్రి బాధ్యులు తెలిపారు.

మేడ్చల్ జిల్లాలో 11 మంది టీచర్లపై చర్యలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

స్పౌజ్ కేటగిరిలో అవకతవకలకు పాల్పడిన ఉపాధ్యాయులపై శాఖ పరమైన చర్యలు తీసుకున్నట్టు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ స్పౌజ్ క్యాటగిరిలో వెబ్ కౌన్సెలింగ్‌లో 11 మంది టీచర్లు నిబంధనలకు విరుద్ధంగా ఆప్షన్లు ఎంపిక చేసినట్టు తెలిపారు. వారి స్పౌజ్‌కు సమీపంలో గల ఖాళీ పోస్టులను ఎంచుకోకుండా వారికి అనుకూలంగా ఇతర ప్రాంతాలలో ఖాళీ పోస్టులను నిబంధనలకు విరుద్ధంగా ఆప్షన్లు ఇచ్చినట్టు గుర్తించామని, దీంతో విచారణ జరిపి 11 మంది ఉపాధ్యాయులకు క్రమ శిక్షణలో భాగంగా చార్జ్ మెమోలు జారీ చేసినట్టు తెలిపారు. అయితే వీరిలో ఇద్దరు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించి స్టే ఉత్తర్వులు తెచ్చారని, దీనిపై హై కోర్టు స్టే ఎత్తి వేసేందుకు జిల్లా విద్యాశాఖ నుంచి వెకెట్ పిటిషన్ సమర్పించినట్టు తెలిపారు. తదుపరి హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి స్పౌజ్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని డీఈఓ పేర్కొన్నారు.

ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు

- అంబర్ పేట్ ఎస్టీపీ ప్రాంగణంలో ఆరోగ్య శిబిరం
- 300 మంది కార్మికులకు ఆరోగ్య పరీక్షలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధవహించాలని, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. గురువారం జలమండలి ఎస్టీపీల్లో పనిచేసే కార్మికులకు అంబర్ పేట్ ఎస్టీపీ ప్రాంగణంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శ్రీ రామానుజ సేవా ట్రస్ట్, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కిమ్స్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించిన ట్రస్టుల్ని ఆయన అభినందించారు. దాదాపు 300 మంది కార్మికులకు ఈ ఆరోగ్య శిబిరంలో బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.ఎస్టీపీ ప్రాంగణంలో ఎండీ, ఈడీలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జీఎంలు సుబ్రమణ్యం, సంతోష్ కుమార్, డీజీఎంలు రాజ్ కుమార్, నాగేశ్వర రావు, వినోద్ కుమార్, మేనేజర్‌లు కల్యాణి, భాను చందర్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు ఐఎస్ఓ గుర్తింపు





నవతెలంగాణ-ధూల్‌పేట్

నెహ్రూ జూలాజికల్ పార్క్‌గా మరో మైలురాయిని సాధించింది. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ)-9001:2015 వరుసగా 5వ సంవత్సరం ఆ గౌరవంను, గుర్తింపు పొందింది. ఐఎస్ఓ తనిఖీ బృందం ధృవీకరణ పత్రాన్ని జారీ చేసే ముందు మెరుగైన నిర్వహణ, ప్రణాళికాబద్ధమైన పెంపకం, సహకారం, పరిశోధన సామర్థ్య నిర్మాణ భాగాల ద్వారా వన్య ప్రాణుల సంరక్షణకు సంబంధించి పరిశీలించారు. ముఖ్యంగా అంతరించిపోతున్న జాతులకు సంబంధించి తనిఖీని నిర్వహించారు. ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్, హెచ్వైఎం మేనేజింగ్ డైరెక్టర్ ఎ. శివయ్య. 2024-25 సంవత్సరానికి ఐఎస్ఓ-9001:2015 సర్టిఫికేట్‌ను డాక్టర్ సునీల్ నేతృత్వంలోని జూ పరిపాలన బృందానికి అందించింది. తెలంగాణ రాష్ట్ర జూ పార్క్స్ డైరెక్టర్ ఎస్. హిరేమత్, జూ పార్క్ క్యూరేటర్ జె.వసంతలు అందుకున్నారు. ఈ సందర్భంగా క్యూరేటర్ జె. వసంత మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ ఐఎస్ఓ 9001:2015 గౌరవం మరోసారి దగ్గించుకోడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేకించి అంతరించిపోతున్న జాతుల సంరక్షణ సర్టిఫికేట్ ద్వారా గౌరవించబడిన ఏకైక జూ హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్ అని అన్నారు. ప్రణాళికాబద్ధమైన సంతానోత్పత్తి, సహకార పరిశోధన, సామర్థ్యాన్ని పెంపొందించడం ప్రధానమన్నారు. అందుకు అధికారుల, సిబ్బంది కృషి ఎంతో ఉందని, దీంతో వరుసగా నాల్గవ ఏడాది సాధించిందన్నారు. జూ అభివృద్ధికి పని చేయడానికి జూలో చేపట్టిన అన్ని కార్యక్రమాలను కొనసాగించడానికి కృషి చేస్తామన్నారు.

'ఆలివ్ బై ఎంబసీతో హిల్టన్ వ్యూహాత్మక ఒప్పందం'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



హైదరాబాద్ ప్రముఖ గ్లోబల్ హాస్పిటాలిటీ కంపెనీ ఆసియా పసిఫిక్ బ్రాండ్ ప్రవేశాన్ని పరిచయం చేస్తూ భారతదేశం అంతటా 150 స్పార్క్ బైహిల్టన్ హెరీటల్ ను తెరవడానికి ఆలివ్ బై ఎంబసీతో వ్యూహాత్మక లైసెన్సింగ్ ఒప్పందం సంతకం చేసుకున్నట్లు గురువారం ఒక ప్రకటనలో ప్రకటించింది. హిల్టన్ బెంగళూరు ఎంబసీ మాన్యతా బిజినెస్ పార్క్, హిల్టన్ గార్డెన్ ఇన్ బెంగళూరు ఎంబసీ మాన్యతా బిజినెస్ పార్క్ యజమానులైన ద ఎంబసీ గ్రూప్ హిల్టన్ దీర్ఘకాల భాగస్వామ్యం ఫలితంగా ఈ ఒప్పందం వచ్చింది. ఈ ఒప్పందం దక్షిణాసియాలో హిల్టన్ ప్రతిష్టాత్మక వృద్ధిని బలపరుస్తుంది. శక్తివంతమైన భారతీయ మార్కెట్‌ను కొత్త ప్రీమియం ఎకానమీ బ్రాండ్‌ను తీసుకువస్తుంది. మహరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గోవా, కర్ణాటక, తమిళనాడులపై ప్రత్యేక దృష్టి ఉంచుకుని దక్షిణ భారతదేశంలో మొదటి స్పార్క్ బై హిల్టన్ హెరీటల్ తెరవబడుతుందని, దక్షిణాసియాలో హిల్టన్ ధైర్యమైన ఆశయాన్ని, దీర్ఘకాల నిబద్ధతను ఆలివ్ ఎంబసీతో ఒప్పందం నొక్కి చెబుతుందని హిల్టన్ ఆసియా పసిఫిక్ అధ్యక్షులు అలాన్ వాట్స్ తెలిపారు. భారతీయ మార్కెట్‌లో అంతరాన్ని స్పార్క్ బై హిల్టన్ పరిష్కరిస్తుందని, రాజీ లేకుండా సరసమైన బసలను అందిస్తుందని, పెద్ద, చిన్న నగరాల్లో విలువ, స్థిరత్వం కోసం అపరిమితమైన డిమాండ్‌ను ఒడిసిపడుతుందని, ఈ భాగస్వామ్యం రికార్డ్-బ్రేకింగ్ వృద్ధికి వేదికను ఏర్పాటు చేయడమే కాకుండా, ప్రపంచంలోని అతిపెద్ద లాడ్జింగ్ మార్కెట్లలో ఒక దానిలో సముచిత స్థానం సాధించడానికి హిల్టన్ నిలబెడుతుందని, దక్షిణాసియాలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు తాము కట్టుబడి ఉన్నామని హిల్టన్ గ్లోబల్ డెవలప్ మెంట్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్, ప్రెసిడెంట్ కెవిన్ జాకబ్స్ చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత : ఎమ్మెల్యే మర్రి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అనారోగ్యంతో బాధపడుతూ వినాయక నగర్ డివిజన్ చెందిన పలువురు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. రమణయ్యకు రూ.32 వేలు, యాదమ్మకు రూ.24 వేలు, వసంతలక్ష్మికి రూ.17500 చొప్పున మంజూరైన చెక్కులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, వినాయక్ నగర్ డివిజన్ అధ్యక్షులు తులసి సురేష్, డివిజన్ కార్యదర్శి బాలకృష్ణ గుప్తా, నాయకులు గుత్తి రామచందర్, శ్రీనివాస్ యాదవ్,సాయి ముదిరాజ్,తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-కాప్రా

మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని మంగాపురం కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డిలు గురువారం పరిశీలించారు. పనులను నాణ్యతతో చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ లింగరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, కాలనీవాసులు కనకయ్య, గోపీనాథ్, నారాయణ, విద్యాసాగర్, దామోదర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయండి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు పెండింగ్‌లో ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఉప్పల్ డిపో వద్ద నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న మొండి వైఖరిని ఖండిస్తూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు నిరవధిక బంద్ నిర్వహిస్తూ పరీక్షలను బహిష్కరించిన ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని నిరసిస్తూ ఈరోజు ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో బొడుప్పల్ కమాన్ చౌరస్తా వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఏ విధమైన ఇబ్బందులు పడుతున్నారో అదేవిధంగా ప్రయివేట్ బడ్జెట్ కళాశాలల యాజమాన్యాలు కూడా సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, భవన కిరాయిలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆర్థిక సమస్యలతో కళాశాలలను నిర్వహించలేమని దసరా తర్వాత డిగ్రీ కళాశాలలు నాలుగు రోజులు నిరవధిక బంద్ చేస్తే వారంలో ఫీజు బకాయిలు విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయలేదన్నారు. దీంతో నేటి నుండి మళ్లీ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బంద్ నిర్వహించడం పరీక్షలు బహిష్కరిస్తామని ప్రకటించడంతో దీని ప్రభావం విద్యార్థుల విద్యాసంవత్సరం చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తుపై పడుతుందన్నారు. ఇప్పుడిప్పుడే అకాడమిక్ తరగతులు సక్రమంగా జరుగుతున్నాయన్నారు. కొన్ని యూనివర్సిటీల్లో సెమిస్టర్ పరీక్షల నాలుగు, అయిదు రోజుల్లో జరుగనున్నాయని తెలిపారు. కొన్ని యూనివర్సిటీలో పరీక్ష ఫీజుల తేదీలు వచ్చాయని, ఇప్పుడు బంద్ వల్ల విద్యార్థులు చాలా నష్టపోతారన్నారు. కొన్ని యూనివర్సిటీల్లో పరీక్షలు వాయిదా అంటూ ప్రచారం జరగటం వల్ల విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా పెండింగ్ ఫీజు బకాయిలు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. విద్యాశాఖ సీఎం వద్ద ఉన్నా ఫీజు బకాయిలు విడుదల చేయడంలో నిర్లక్ష్యం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అన్వర్ జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్ ,నాయకులు సాయి, అరవింద్, మనోహర్, శ్రీనాథ్, గణేష్, సైదులు సందీప్ తదితరులు పాల్గొన్నారు

పోలీసు ఉద్యోగం బాధ్యతాయుతమైనది

- రాష్ట్ర ఇంటలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి
- మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన దీక్షాంత్ పాసింగ్ అవుట్ పరేడ్‌కు హాజరు
- 526 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ పూర్తి
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డుల ప్రదానం





నవ తెలంగాణ- మేడ్చల్

పోలీసు ఉద్యోగం సమాజంలో ఎంతో బాధ్యతాయుతమైందని రాష్ట్ర ఇంటలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ మండల పరిధి కండ్లకోయలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో 9నెలల శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ళు నిర్వహించిన దీక్షాంత్ పరేడ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డికి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో 9నెలలపాటు శిక్షణ పొందిన నూతన పోలీస్ కానిస్టేబుళ్ల గౌరవ వందనం చేసి ఆయనను ఆహ్వానించారు. అనంతరం నూతన పోలీసు కానిస్టేబుళ్లతో పోలీస్ ట్రైనింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర బాబు ఉద్యోగ నిర్వహణకు సంబంధించి ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. తదుపరి వారు జాతీయ పతాకాన్ని చేతబట్టి పరేడ్‌ను ముగించారు. రాష్ట్ర ఇంటలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం సాధించడం గర్వకారణం కాదని బాధ్యతాయుతగల పోలీసుగా విధులు నిర్వహించడమే గర్వకారణమని నూతన కానిస్టేబుళ్లకు సూచించారు. విధి నిర్వహణలో ప్రజల హక్కులను గౌరవిస్తూ ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. పోలీసు ఉద్యోగం అంటే సమాజంలో అత్యధిక బాధ్యత కలిగిన ఉద్యోగమని 526 మంది కానిస్టేబుళ్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర బాబు, మేడ్చల్ డీసీపీ నంద్యాల కోటిరెడ్డి, మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీవెంకట్ రెడ్డి,పెట్ బషీరాబాద్ ఏసీపీ రాములు నాయక్, పోలీసు ట్రైనింగ్ కళాశాల నిర్వాహకులు, సీఐ అద్దాని సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ హస్ మన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెరటి కోళ్లు పంపిణీ



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రాజబొల్లారం తండా, సైదోని గడ్డతండా గ్రామాల్లోని లబ్ధిదారులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఐకాఆర్ నేషనల్ మీట్ రీసెర్చ్ వారి సహకారంతో గురువారం పెరటి కోళ్లుత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజబొల్లారం తండాకు 28యూనిట్లు, సైదోని గడ్డ తండాకు20 యూనిట్ల పెరటి కోళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్సి డైరెక్టర్ డాక్టర్ సహార్స్ బుదే, ప్రిన్సిపల్ సీనియర్ సైంటిస్ట్ డా. బస్వారెడ్డి, జిల్లా ఏడీజీ ప్రభు రాజ్, డా.బాలరాం, బికియా నాయక్, వెటర్నరీ డాక్టర్ కురుమూర్తి, మాజీ సర్పంచ్ మాంగ్య నాయక్ పాల్గొన్నారు.ఎన్ఆర్సీ డైరెక్టర్ డాక్టర్ భూదేరా మాట్లాడుతూ.. పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన, మీట్ ఇంపార్టెన్స్ గురించి వివరించారు. డాక్టర్ బసవ రెడ్డి రెడ్డి మాట్లాడుతూ.. పెరటి కోళ్ల పెంపకం వాటిని సంరక్షణ, వ్యాధుల నివారణ గురించి తెలిపారు. ఏడీజీ ప్రభు రాజు మాట్లాడుతూ పెరటి కోళ్ల దాణ ప్రాముఖ్యత, మార్కెటింగ్ గురించి తెలిపారు. డాక్టర్ బలరాం మాట్లాడుతూ పెరటి కోళ్ల రకాలు, గుడ్ల ఉత్పాదనపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ లైఫ్ స్టాక్ అసిస్టెంట్ శోభారాణి, అసిస్టెంట్ శ్రీను, బి. గణేష్, డి. తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో సెరినిటీ విద్యార్థుల ఉత్తమ ప్రతిభ



- అభినందించిన స్కూల్ యాజమాన్యం

నవతెలంగాణ-కీసర

దేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన అయోధ్యలోని బాలరాముని ప్రాంగణంలో మేడ్చల్ జిల్లా నాగారం సెరెనిటీ పాఠశాల విద్యార్థులు బి.సాయి, సాయి వైభవి, జాహ్నవిలు నృత్య ప్రదర్శన చేయటం వారి పూర్వ జన్మ సుకృతమని సెరినిటి పాఠశాల కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆ విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. భారత ఆర్ట్స్ అకాడమీ వారి నేతృత్వంలో అయోధ్యలోని రామాలయంలో రామ్ లీల్లా సంగీత నృత్య అర్చన కార్యక్రమంలో పాల్గొని అత్యద్భుత ప్రదర్శన చేశారు. ఉత్తమ నృత్య ప్రదర్శనకు బహుమతులను సాధించడం ఎంతో గర్వకారణం అని పాఠశాల ముఖ్యకార్యదర్శి నోముల వసంత పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రదర్శనలు చేసిన చిన్నారులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

స్ఫూర్తి గ్రూప్‌లో సీవీ రామన్ వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో ప్రఖ్యాత శాస్త్రవేత్త, శాస్త్ర విజ్ఞానంలో మొదటి నోబుల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ 54వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్ష వహించగా స్ఫూర్తి గ్రూపు నాయకులు జి. శివరామకృష్ణ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్ఫూర్తి గ్రూపు నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ సీవీ రామన్ భారతదేశానికి ఎంతో పేరు ప్రతిష్టలు తెచ్చారని చెప్పారు. సూర్యకిరణాలపై అనేక పరిశోధనలు చేసి, సూర్య కిరణాలు నీటిలో గాని, ఏదైనా పరావర్తన చెందే ప్రదేశాలలో వివిధ రంగుల్లో విడవడం, దానిపై అనేక పరిశోధనలు చేసి ఒక గొప్ప సిద్ధాంతాన్ని ప్రపంచానికి అందించారని చెప్పారు. ఆయన చేసిన పరిశోధనల ఫలితంగా వచ్చిన సిద్ధాంతాన్ని రామన్ ఎఫెక్ట్ అని శాస్త్ర విజ్ఞానం ఆయనను గుర్తించిందన్నారు. మొట్టమొదటి భారతీయ శాస్త్రవేత్తగా నోబుల్ బహుమతి గ్రహీతగా నిలిచారన్నారు. అనంతరం గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ సీవీ రామన్ ఎంతోమందికి ఆదర్శ ప్రాయంగా నిలిచార ని, తనకు మతం కన్నా, సైన్సు ప్రామాణిక మని అన్నారని గుర్తు చేశారు. శాస్త్రవిజ్ఞానం తో దేశం పురోగమిస్తుందని బోధించారని చెప్పారు. అందుకే మూఢ నమ్మకాలు దరిచేరనీయకుండా విజ్ఞానవంతులుగా జీవించాలని చెప్పారు. అనంతరం సభికులందరూ సీవీ రామన్ చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించా రు. ఈ కార్యక్రమంలో శివరామకృష్ణ,ఉన్ని కృష్ణన్, శ్రీనివాస్, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, శోభ, గౌసియా, బాలు, చంద్రశేఖర్, బసవ పున్నయ్య, రమేష్ పాల్గొన్నారు.

వికలాంగులు అన్ని రంగాల్లో రాణించాలి : కే. స్వర్ణలత





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వికలాంగులు, సకలాంగులతో దీటుగా అన్ని రంగాల్లో రాణించాలని మేడ్చల్ మల్కాజిరి జిల్లా సంక్షేమ అధికారి కే. స్వర్ణలత అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఆటల పోటీలను నిర్వహించారు. గురువారం నేరేడ్ మెట్‌లోని రామకృష్ణాపురం, అంబేద్కర్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించిన ఆటల పోటీలకు 600 మంది క్రీడాకారుల పాల్గొని జయప్రదం చేశారు. కార్యక్రమాన్ని కే. స్వర్ణలత, హెలెన్ కెల్లర్స్ సంస్థ అధినేత పటాన్ ఉమర్ఖాన్, మధుసూదన్ రెడ్డి, నేరేడ్ మెట్ పోలీస్ అధికారి సైదులు హాజరైగాలి బుడగలు ఎగరేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ముఖ్యఅతిథిగా వచ్చిన జిల్లా అధికారి కే.స్వర్ణలత మాట్లాడుతూ..పిల్లలకు చదువుతోపాటు ఆటలు చాలా ముఖ్యమని తెలిపారు. పిల్లలు జిల్లా స్థాయి నుండి దేశ స్థాయి వరకు రాణించాలని ఆశీర్వదించారు. వికలాంగులు సకలాంగులతో అన్ని రంగాల్లో పోటీపడి తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. ఈసారి పారా ఒలంపిక్స్ లో మన వికలాంగులు పాల్గొని పతకాలు సాధించి దేశానికి గౌరవాన్ని తెచ్చి పెట్టారని తెలిపారు. 15 ప్రత్యేక పాఠశాలల్లో నుండి అదేవిధంగా వివిధ వికలాంగుల సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ అధికారి స్వాతి, రేణుక, శారద, బ్లైండ్ ప్రెసిడెంట్ శ్రీశైలం, ఇంతియాజ్, పాపారావు, ప్రత్యేక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులోని రాజ్ సుఖ్ నగర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.20 లక్షలతో చేపట్టుతున్న సీసీరోడ్డు నిర్మాణానికి నాగారం మున్సిపల్ చైర్ పర్సన్ కౌకుట్ల చంద్రారెడ్డి గరువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరం ఉన్న చోట అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బండారి మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ కృషి అభినందనీయం : హెచ్ఎం రాములు



నవతెలంగాణ-కీసర

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమని నాగారం ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రాములు అన్నారు. గురువారం జన విజ్ఞాన వేదిక కీసర మండలం కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాలు -2024 భాగంగా మండల స్థాయి పరీక్ష నాగారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. పరీక్ష సంబంధించిన ప్రశ్న పత్రాన్ని హెచ్ఎం రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవిజ్ఞాన వేదిక విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంచే విధంగా ఇలాంటి పోటీ పరీక్షలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పరీక్ష నిర్వహించారు. అనంతరం జేవీవీ రాష్ట్ర నాయకులు, చెకుముకి కన్వీనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. పరీక్షల్లో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి వచ్చిన విద్యార్థులందరినీ అభినందించి విజేతలందరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు. పిల్లలు చదువుతోపాటు పెద్దలపట్ల గౌరవంతో ఉండి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ.. వచ్చిన ప్రతి విద్యార్థి విజేతలేనన్నారు. వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు ఈ విజయంలో భాగస్వాములేనని చెప్పారు. మండల స్థాయిలో రాణించి, జిల్లా స్థాయి పరీక్షకు అర్హత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 28న జరిగే జిల్లాస్థాయి చెక్‌ముకి పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎన్నిక కావాలని ఆకాంక్షించారు. కీసర మండలం నాయకులు ఎం.ఎల్.చౌదరి మాట్లాడుతూ.. 34 సంవత్సరాలుగా జేవీవీ చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. సైన్స్ పట్ల మక్కువ పెంచడానికి సైన్స్ సంబరాలను విద్యాశాఖ ప్రోత్సహిస్తూ ఉందన్నారు. జిల్లా స్థాయి పోటీలకు నాగారం సెరినిటీ స్కూల్, శివప్ప స్కూల్, దిశ స్కూల్, ప్రభుత్వ పాఠశాలల నుండి జడ్పీ హెచ్ ఎస్ చీర్యాల, యాదిగిర్‌పల్లి, దమ్మాయిగూడ, తెలుగు మీడియం జడ్పీహెచ్ఎస్ నాగారం, రాంపల్లి, దమ్మాయిగూడ, రెసిడెన్షియల్ పాఠశాల అర్హత సాధించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ పాఠశాల ఉపాధ్యాయుల బృందం సభ్యులు వందన, సంతోషి, అరుణ, శైలజ, షభానా అజ్మీ, రామచంద్రయ్య, రమాదేవి, స్వప్న, శివలీల, ముహమ్మద్ అర్షద్ హుస్సేన్, మాధవి, పద్మావతి, దేవకీ, మానస జన విజ్ఞాన వేదిక కీసర మండలం నాయకులు పటేల్ నర్సింహులు, గుమ్మడి హరిప్రసాద్, వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముదిరాజులను 'ఏ' గ్రూపులో చేర్చాలి

జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ కరకపట్ల రాము ముదిరాజ్

ఘనంగా ప్రపంచ మత్స్య కార్మికుల దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-శామీర్‌పేట

ముదిరాజులను ఏ గ్రూప్‌లో చేర్చాలని జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం ఎగ్జికూటివ్ మెంబర్ కరకపట్ల రాము ముదిరాజ్ అన్నారు. శామీర్‌పేట మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో ప్రపంచ మత్స్య కార్మికుల దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై ఆయన ముదిరాజ్ మహాసభ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ముదిరాజుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముదిరాజులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా తదితర రంగాల్లో వెనుకబడి ఉన్నందున ఏ కేటగిరిలో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పర్‌పల్లి మత్స్యశాఖ ప్రధాన కార్యదర్శి మైనబోయిన శంకరయ్య ముదిరాజ్ , మాజీ సర్పంచ్ కట్టెల రవీందర్ ముదిరాజ్ ,మాజీ సర్పంచ్ వల్లపు రామచందర్ ముదిరాజ్, మత్స్య కార్మిక సంఘం వైస్ ప్రెసిడెంట్ కుంట రమేష్ ముదిరాజ్, వల్లపు రాజు ముదిరాజ్ , కట్టెల బాలకృష్ణ ముదిరాజ్, ఆంజనేయులు, యాదగిరి,శీను ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్, నరసింహ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అనురాగ్ విశ్వవిద్యాలయంలో ఫార్మసీ స్క్రీనింగ్ క్యాంప్ ఏర్పాటు



నవతెలంగాణ - పోచారం

ఘట్కేసర్ మండలం పోచారం మున్సిపల్ పరిధిలోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో గురువారం63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా స్కూల్ ఆఫ్ ఫార్మసీ స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహించారు. కార్యక్రమాన్ని డీన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ డా. వసుధ బక్షి, డా. రజిని, హెచ్ఆర్, అనురాగ్ సిబ్బంది పాల్గొని ప్రారంభించారు. ఇందులో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 సమన్వయకర్త డా. జె. రాజేంద్ర కుమార్, డిపార్ట్మెంట్ సమన్వయకర్త బి. తిరుపతి, జాతీయ ఫార్మసీ వారోత్సవం కోఆర్డినేటర్లు డా. మహమ్మద్ సాయిద్, డా. సంతోషి ప్రియ వింట ల్యాబ్ సిబ్బంది డా. వివేక్ కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

చెక్కుల అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ సూర్య నగర్ కాలనీకి చెందిన వెల్చుకొండ లీలావతికి మంజూరైన రూ.36వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి డాక్టర్ ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ బాసటగా నిలుస్తుందన్నారు.

డ్వాక్రా భవనం అదనపు నిర్మాణానికి శంకుస్థాపన



- పోచారం మున్సిపల్ చైర్మెన్ కొండల్ రెడ్డి

నవతెలంగాణ - పోచారం

ఘట్కేసర్ మండలం పోచారం మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప ఏడో వార్డులో డ్వాక్రా భవనం అదనపు అంతస్తు నిర్మాణానికి మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.15 లక్షలతో అదనపు అంతస్తు భవన నిర్మాణం చేపడుతున్నట్టు వార్డులో మౌలిక వసంతులు కల్పన పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అక్కింటి శైలజ, పోచారం మాజీ ఉపసర్పంచ్ అక్కింటి బాల్ రెడ్డి ,నాయకులు, ఆంజనేయులు, రమేష్, ప్రశాంత్, నారాయణ, తుకారం, రేణుక, జానకి, పద్మ, పర్మిల, నవనీత మన్నెమ్మ మహిళా సంఘాల సభ్యులు మున్సిపల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అల్వాల్ సర్కిల్ సమస్యలపై సమావేశం



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ సర్కిల్ పరిధిలోని మచ్చబొల్లారం, శ్రీదామ్ కాలనీ, మడికట్ల బస్తీ వంటి ప్రాంతాలలోని డ్రయినేజీ, వరద నీరు, ఫైర్ స్టేషన్, ప్రభుత్వ లైబ్రరీ వంటి సమస్యల పరిష్కరించాలని స్థానిక ప్రజలు, కార్పొరేటర్లు కలిసి కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాంతాల అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని ఏడు కాలనీల డ్రయినేజీ ఔట్‌లెట్ సమస్య, శ్రీదామ్ కాలనీ, మడికట్ల బస్తీ వరదనీటి సమస్య, అల్వాల్ ఫైర్ స్టేషన్ ఏర్పాటు, ప్రభుత్వ లైబ్రరీ ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. ఇప్పటికే ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, డోలి రమేష్, శరణగిరి, పవన్, ప్రశాంత్ రెడ్డి, సతీష్, సురేష్ తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి : సీఐ



నవతెలంగాణ - చర్లపల్లి

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సీఐ రవికుమార్ అన్నారు. గురువారం నెహ్రూ నగర్ రేణుక ఎల్లమ్మ దేవాలయం దగ్గర బీఆర్టీయూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చర్లపల్లి సీఐ రవికుమార్, ఎస్సై శేఖర్, ట్రాఫిక్ పోలీస్ ఎస్సై సతీష్, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రెస్ కోడ్ ధరించాలని, వాహన కండీషన్ రోజు పరిశీలించాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదన్నారు. అలా తీసుకువెళ్తే చట్టపరంగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని పేర్కొన్నారు. ఆటో ఫిట్నెస్ సర్టిఫికెట్, ఆర్సీలు, లైసెన్స్ దగ్గర ఉండాలన్నారు. చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రారంభం కానుండడంతో డ్రైవర్ల అందరూ కలిసిమెలిసి నడుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ అధ్యక్షులు కె.రామాంజనేయులు చర్లపల్లి రైల్వే స్టేషన్ ఆటో యూనియన్ అధ్యక్షులు గోపాల్ నాయక్, పి.రమేష్, పి.నరేష్, బి.మహేష్, జి.కృష్ణ, నర్సింగ్, బాలకృష్ణ, నాయక్, లక్ష్మీనారాయణ, జయరాజ్, యాదగిరి, తమిళ్ శీను, అనిల్, ప్రవీణ్, సుమన్, సాయికిరణ్, సాయి సురేష్ తదితరులున్నారు.

గాంధీనగర్‌లో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి పర్యటన



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణ డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గాంధీనగర్ వాసులు శుభకార్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి తమ బస్తీలోని ఖాళీ స్థలంలో మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని కాలనీలు-బస్తీల అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. బుధవారం జోనల్ కమిషనర్‌తో కలిసి పలు కాలనీలు-బస్తీలలో పర్యటించిన సందర్భంగా ఆయా కాలనీల ప్రజలు కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపట్టాలని తమ దృష్టికి తెచ్చారని, కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ప్రొపోజల్స్ పంపించామని తెలిపారు. గాంధీనగర్ వాసులు-యువత కోరిక మేరకు మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు జి కృష్ణ , దశరథ్ , జి. కృష్ణ, ఎన్. పద్మారావు, జి. బాలయ్య రామ్ చందర్, ఎన్. సురేష్, సాయి కృష్ణ, గాంధీనగర్ యువజన సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, సెక్రటరీ ప్రభాకర్, జాయింట్ సెక్రటరీ శివ రామకృష్ణ, యూత్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీహరి, సిద్ధూ ,మనోజ్ కుమార్, మనోజ్, ఎస్ బాలకృష్ణ , మహేష్ , హరి , జి శ్రీకాంత్ , ఎస్ రాకేష్ , గిరి , ఎస్ అనిల్, రాజు తదితరులు మరియు కాప్రా డివిజన్ కాంగ్రెస్ నాయకులు పవన్ కుమార్ , పడమటి మల్లారెడ్డి , బాబురావ్ , సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

నవతెలంగాణ - పోచారం

ఘట్కేసర్ మండలం పోచారం మున్సిపల్ పరిధిలోని చౌదరిగూడ ప్రాథమిక పాఠశాలలో, అంగన్వాడీ కేంద్రాలను మున్సిపల్ చైర్మెన్ కొండల్‌రెడ్డి గురువారం పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మెన్ మాట్లాడుతూ.. తమ దృష్టికి వచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. టాయిలెట్స్, వంటగదిని శుభ్రం ఉంచాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబమూర్తి, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు సిబ్బంది ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శుక్రవారం | నవంబర్ 22, 2024 | www.navatelangana.com

సర్వేలో వివరాలిచ్చిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్ పల్లి

సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ కుల సర్వే సమగ్ర ఇంటిం టి కుటుంబ సర్వేకు స్థానిక మూసాపేట్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ అధి కారుల ప్రశ్నలకు పూర్తి సమా ధానలు తెలిపి నట్లు కార్పొరే టర్ మీడియా కు తెలియజేశారు.

ప్రజాపాలన కళాయాత్ర



నవతెలంగాన-సిటీబ్యూరో

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న "ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు -2024" లో భాగంగా మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా 'తెలంగాణ సాంస్కృతిక సారథి ' కళాకారుల రెండు బృందాలు "ప్రజా పాలన కళాయాత్ర" నిర్వహించి నారు. ఇందులో భాగంగా గురువారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కూకట్ పల్లి పరిసర ప్రాంతాలలో, కీసర మున్సిపాలిటీలోని తిమ్మాయి పల్లి, యాద్గార్ పల్లి, ధర్మారంలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో ప్రచారం చేసినారు. ఈ కార్యక్రమాలలో పంచాయత్ సెక్రెటరీలు, బిల్ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు



- హాజరైన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ చౌరస్తాలో గురువారం అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం, తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవాన్ని ముదిరాజ్ సంఘం నాయకులు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ ముదిరాజ్ మహాసభ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను అసెంబ్లీ సమావేశాలలో ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలనే ముఖ్యమైన డిమాండ్‌ను ఇప్పటికే ప్రస్తావించడం జరిగిందని, రాబోయే రోజుల్లో కూడా ముదిరాజ్‌ల అభివృద్ధి, అభ్యున్నతి కోసం తాను శాయశక్తుల కృషిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడ్వకేట్ కమలాకర్, ఆటో బలరాం, నదీమ్ రాయ్, విజయ్ హరీష్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గుమ్మల స్వామి, కోలా రవీందర్ ముదిరాజ్, గుమ్మడి మధుసూదన్ రాజు, తోడేటి సత్యం ముదిరాజ్, ఆర్. రమేష్ ముదిరాజ్, నరసింహ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు బిల్డర్లు కృతజ్ఞతలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ టౌన్ పరిధిలోని పద్మనగర్ ఫేస్-2 కాలనికి చెందిన పలువురు గురువారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను షాపూర్ నగర్‌లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపి శాలువతో సన్మానించారు. గతంతో అక్కడక్కడ వక్ఫ్ బోర్డ్ స్థలాల నెపం చూపిస్తూ, సర్వేనెంబర్ 58 నుంచి 226 వరకు గత కొద్ది కాలంగా రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో దానిని పునరుద్ధరించాలని కోరుతూ.. పద్మనగర్ ఫేస్-2 కాలని వాసులు శ్రీశైలం గౌడ్‌కి వినతి పత్రం అందజేశారు. ఆయన ఈ సమస్యని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడి పరిష్కారం చూపినందుకు కుత్బుల్లాపూర్ బిల్డర్లు ఆయనకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, దుర్గారావు, ఓబుల్ రెడ్డి, హర్ష, సత్యనారాయణ, రంగారావు, రాజనాల శ్రీనివాస్ రెడ్డి, రాజేష్, వెంకన్న, వెంకటరత్నం, రాజీవ్, వెంకటేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

చెలరేగిపోతున్న సైబర్ నేరగాళ్లు

- వీడియో కాల్ ఇంటరాగేషన్ అంటే అసలు నమ్మకండి
- ముంబై పోలీస్ పేరుతో దోపిడి
- జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ముంబై పోలీసులు అంటూ ఎవరైనా ఫోన్ చేస్తే ఏమాత్రం స్పందించకండి. పోలీసులు వీడియో కాల్‌లో ఇంట్రాగేషన్ చేయడం జరగదు. కాబట్టి ఎవరు కూడా ముంబై పోలీసులు అంటూ ఫోన్ చేసి ఇంట్రాగేషన్ పేరిట వీడియో కాల్ చేస్తే పట్టించుకోకండి. మీకు ఏమైనా అనుమానాలు ఉంటే ఏమాత్రం భయపడకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌కి వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకోండి. అవగాహనతోనే ఇలాంటి సైబర్ నేరాలను కట్టడి చేయగలమని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సీఐ గడ్డం మల్లేష్ అన్నారు.

డ్రయినేజి సమస్యలను పరిష్కరించాలి



విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్టీయూహెచ్ విశ్వవిద్యాలయంలో నెలకొన్న డ్రయినేజి సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్ అన్నారు. గురువారం జేఎన్టీయూ హెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో విశ్వ విద్యాలయ బీఐసీఎస్ సంచాలకులు ప్రొఫెసర్ వెంకటేశ్వర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. రోజు రోజుకి విశ్వ విద్యాలయంలో డ్రయినేజి సమస్య తీవ్రతంగా మారి విద్యా ర్థులకు ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసారు. స్పందన బ్లాక్ చుట్టు ప్రక్కల, క్యాంటీన్ పరిసరాలలో, క్యాంపస్ 2వ గేట్ వద్ద, కిన్నెర, మంజీరా వసతి గృహం వెనుక భాగంలో డ్రయినేజిలు పొంగి బయటకు వస్తున్నాయి. దీంతో దుర్వాసన కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు అనర్యోగాని గురవుతున్నారు. డ్రెనేజి సమస్యలును పరిష్కరించాలని. అవసరమైతే పైపులైన్లను మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పిల్లి సిద్దార్థ్, శివ కృష్ణ, బ్రహ్మం గౌడ్, అర్జున్ గౌడ్, చంద్రశేఖర్, సాయి కుమార్ రాథోడ్, సాత్విక్, శ్రీను, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటూ.. భారీ మోసం

నవతెలంగాణ-కుకట్‌పల్లి

ఐటీ కంపెనీలకు సంబంధించి ట్రెనింగ్ ఇస్తామని, విదేశాలలో వివిధ కంపెనీలలో భారీ ప్యాకేజీలతో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఓ వ్యక్తి నమ్మించి మోసం చేసిన ఘటన కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జయనగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే గంగరాజు అనే వ్యక్తి ఐటీ కంపెనీలో ఉద్యోగాలు ఇస్తామని చెప్పడంతో నమ్మిన ఆశవాహులు అధిక మొత్తంలో అతనికి డబ్బు చెల్లించారు. రెండేండ్లు గడుస్తున్న ఉద్యోగాలు ఇప్పించకపోవటంతో బాధితులు అతని ఇంటి ముందు ఆందోళకు దిగడంతో ఈ మోసం బయటపడింది. ఈ సందర్భంగా మోసపోయామని గుర్తించిన బాధితులు, తాము అప్పులు తెచ్చి మరి శిక్షణ తీసుకున్నామని, డబ్బులు లేక ట్రెనింగ్ కోసం, పర్సనల్ లోన్, లోన్ యాప్స్‌లో లోన్‌లు తీసుకొని మరి డబ్బులు చెల్లించామని, డబ్బులు కట్టాలని లోన్ యాప్స్ వేధింపులు ఎక్కువ కావడంతో, ఓ బాధితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని బాదిత కుటుంబ సభ్యులు వాపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు గంగరాజు ఇంటికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

దేశానికే వెన్నెముకైన రైతన్నపై దమనకాండెందుకు?

- పశ్నిస్తే వణుకెందుకు రేవంత్ రెడ్డి...?
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

చింతల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మానుకోట మహాధర్నా అనుమతులను నిరాకరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.. దేశానికే వెన్నెముక అయిన రైతు భూములను ఫార్మాసిటీ పేరుతో అల్లుడి కోసం బలవంతంగా లాక్కుంటుంటే, రైతులపై నీవు చేసిన దమనకాండను, రైతు వ్యతిరేక విధానాలను మా నాయకుడు కేటీఆర్ ప్రజల్లోకి తీసుకెళుంటే నీ వెన్నులో వణుకెందుకు సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. తెలంగాణ సస్యశ్యామలం కావాలి, రైతు రాజులా బ్రతకాలి అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగానే వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా, రైతు రుణమాఫీ, రైతుబంధు వంటి పథకాలతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగగా మారిస్తే, ప్రభుత్వ మారిన 11 నెలల్లోనే నీ అనాలోచిత నిర్ణయాలతో రైతాంగాన్ని, వ్యవసాయాన్ని దండుగగా మారుస్తున్నావు. ఫార్మా సిటీకి ఎందుకు పనికి రాని బీడు భూములుతీసుకోవాలి కానీ కాంగ్రెస్ మాత్రం వ్యవసాయం వద్దు.. ఫార్మా సిటీయే ముద్దు అనేట్టుగా పచ్చటి భూ ములను లాక్కుంటూ రైతుల నోటి కాడి బువ్వను ల్లాకుంటుంది. వ్యవసాయంపై ప్రభుత్వం అవలం బిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మహా ధర్నా చేపట్టే ందుకు సిద్ధమవగా మహాధర్నాకు అనుమ తులు లేవంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హేయమైన చర్య. పోలీస్ శాఖను మీకు ఇష్టం వచ్చిన ట్లుగా వినియోగించుకొని మహాధర్నా కార్యక్ర మాన్ని అపవచ్చు, కానీ ప్రజల్లో రోజురోజుకు మీ ప్రభుత్వంపై పెరు గుతున్న ప్రజా వ్యతిరేకత నుంచి తప్పించు కోలేరన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల వాణిని ప్రభుత్వానికి వినిపించాల్సిన బాధ్యత మాపై ఉంది. ప్రజల సమస్యలపై నిత్యం పోరాడే మా నాయకులు కేటీఆర్ ప్రభుత్వ తాటకు చప్పులకు భయపడే రకం కాదన్నారు. మాది ఉద్యమ పార్టీ, పోరాటాలు, అరెస్టులు, జైల్లు మాకు కొత్తేమి కాదు. ప్రజల పక్షాన నిలబ డతాం, ప్రజల కోసం కొట్లాడుతాం..అలుపెరుగని పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఇంటి అనుమతుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ఇంటి అనుమతుల విషయంలో పట్టణ ప్రణాళిక విభాగం(టౌన్ ప్లానింగ్)అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద హెచ్చరించారు. ఈ మేరకు గురువారం గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇంటి నిర్మాణదారుల అనుమతుల విషయంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాజులరామారం డివిజన్ పరిధిలో ఇంటి నిర్మాణాల అనుమతుల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నియమ, నిబంధనలను పాటించకుండా వక్ఫ్, దేవాదాయ శాఖల పేరు చెప్పి అనుమతులు ఇవ్వకుండా దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురి చేయడం సరైన పద్ధతి కాదని, కోర్టు ఉత్తర్వులను పాటించకుండా చేద్దాంలే..చూద్దాం..లే అనే ధోరణి వహించకుండా దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురి చేయకుండా వెంటనే అనుమతులను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ.రమేష్, టీపీఎస్.తుల్జాసింగ్, హెచ్ఐఎల్ కాలనీవాసులు అడ్వకేట్ కమలాకర్, చిన్న చౌదరి, అంజయ్య, వీరయ్య చౌదరి, తాహేద్, శ్రీనివాస్, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

జనవరిలో డీహెచ్‌పీఎస్ జాతీయ మహాసభలు

- గోడ పత్రికను ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం



నవతెలంగాణ-బాలానగర్

దళిత హక్కుల పోరాట సమితి జనవరి 5.6.7 తేదీలలో జరిగే 2.వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గం మండల సీపీఐ(ఎం) మండల కార్యదర్శి జి.కృష్ణ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ నగర్ సీపీఐ(ఎం) కార్యాలయంలో గురువారం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కె. ఏసురత్నం, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు డి.బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖైరతాబాద్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగే డీహెచ్‌పీఎస్ జాతీయ 2వ మహాసభలను వాడ వాడలా, గ్రామ గ్రామాల నుంచి భారీ ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. దేశం నలు మూలల నుంచి 50 వేల మందిని బహిరంగ సభకు తరలించాలని ప్రజలకు, సానుభూతి పరులకు పిలుపు నిచ్చారు. బీజేపీ ప్రభుత్వం హయాంలోనే దేశంలో మహిళలపై, దళితులపై చిన్నపిల్లలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మణిపూర్‌లో మళ్లీ చెలరేగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అదేవిధంగా బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న మణిపూర్ రాష్ట్రంలో రోజు ఏదో ఒక ప్రాంతంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూనే ఉన్నారని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి కనీసం దాడుల పట్ల స్పందించకపోవడం విచారకరమన్నారు.మణిపూర్‌లో కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా అక్కడ జరుగుతున్న దారుణాలను చూస్తుంటే ఎంతో బాధ కలిగిస్తు ందన్నారు. ఇలాంటి దాడులు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రశాంతమైన భా రతావనిలో మళ్లీ ప్రశాంతత కన్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుంగిన మ్యాన్ హెూల్‌కు మరమ్మతులు

- నవతెలంగాణ కథనానికి స్పందన





నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

"ఆదమరిస్తే... ప్రమాదమే"..అనే శీర్షిక మీద గురువారం నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. గిరినగర్, గురుమూర్తి నగర్ అనుసంధానంగా ఉన్న మూలమలుపు చౌరస్తాలో కుంగిపోయిన మ్యాన్ హెూల్‌ను సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా నవతెలంగాణ దినపత్రికకు స్థానికులు, పాదాచారులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు పనులు పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్ పల్లి

వివేకానంద నగర్ డివిజన్, వడ్డేపల్లి ఎంక్లేవ్ సబ్‌స్టేషన్ నుంచి హెచ్పి పెట్రోల్ బంక్ బాలకృష్ణ నగర్ వరకు చేపట్టిన సిమెంటు రోడ్డు పనులను కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు గురువారం పరిశీలించారు. అమెతో పాటు కూకట్ పల్లి ట్రాఫిక్ సీఐ ముత్తు యాదవ్, జలమండలి, జీహెచ్ఎం సీ అధికారులు, టీజీఎస్పీడీసీఎల్ అధికారులు, కాలనీ వాసులతో ఉన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ రోడ్డులో ట్రాఫిక్ అధికంగా పెరిగిపోవడం వల్ల ట్రాఫిక్ సంబంధించిన సమస్యలు, వాటర్ వర్క్స్ సీవరేజి లైన్స్‌కు సంబంధించిన మ్యాన్ హెూల్ రిపేర్లు, విద్యుత్ పోల్స్ షిఫ్టింగ్ సమస్యలు ఉన్నందున, అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి, ప్రజలకు ఇబ్బంది కాకుండా వీలైనంత త్వరగా నాణ్యతతో కూడిన సిమెంట్ రోడ్డు వేయవలసిందిగా జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సివరేజి బోర్డు మేనేజర్ అమీరుద్దీన్, టీజీఎస్పీడీసీఎల్ ఏఈ పీరు నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ సూర్యం, బాలకృష్ణ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, రమణ, విక్రమ్, ప్రవీణ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ యజమానులపై విద్యుత్ భారం



- కార్పొరేటర్ సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని సమతా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు టీఎస్పీడీసీఎల్ సంస్థ వారు 10 మీటర్లు దాటితే ట్రాన్స్‌ఫార్మ్‌లు ఏర్పాటు చేసుకోవాలని కాలనీ వాసులకు దాదాపు 20 భవనాలకు నోటీసులు ఇవ్వడంతో కాలనీవాసులు గురువారం కార్పొరేటర్ సతీష్ గౌడ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాణ్యమైన విద్యుత్తును ప్రజలకు ఇస్తూ ఏనాడు ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన పది నెలల్లోనే కరెంటు సరిగా ఇవ్వకపోగా ట్రాన్స్‌ఫార్మ్‌లను ఏర్పాటు చేసుకోవాలంటూన్నారని పేర్కొన్నారు. మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువ ఉన్న బిల్డింగ్ యజానులకు ట్రాన్స్‌ఫార్మ్‌లను పెట్టుకోవాలంటే ఒక బిల్డింగ్‌కి 3,4 లక్షల వరకు వెచ్చించే స్థాయి స్తోమత లేదని, కాబట్టి ఈ ఆలోచనని విధానాన్ని వెంటనే విరమిం చుకోవాలని లేకపోతే తదుపరి కార్యాచరణ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ఖచ్చితంగా ప్రజల పక్షాన పోరాడుతామని, ప్రభుత్వమే కొత్తగా అవసరమైన ట్రాన్స్‌ఫార్మ్‌లను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ సతీష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సమతా నగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు రాజేందర్, సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సతీష్ గౌడ్, కన్నయ్య సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఆందోళన



- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

నవతెలంగాణ-కూకట్ పల్లి

జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ.. జర్నలిస్టుల పక్షాన నిలిచిన ఏకైక జర్నలిస్టుల సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) అని సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య అన్నారు. ట్రేడ్ యూనియన్‌గా కార్మిక శాఖలో నమోదై, ప్రభుత్వ గుర్తింపు పొందిన టీడబ్ల్యూజేఎఫ్‌లో సభ్యులుగా చేరే జర్నలిస్టులకు సంఘం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మామిడి సోమ య్య మాట్లాడుతూ.. యూనియన్‌లో చిన్న, పెద్ద భేదం లేకుండా ప్రతి జర్నలిస్టుకు సభ్యత్వం, సమా నత్వం కల్పించడం జరుగుతుందని అన్నారు.

ప్రభుత్వం ద్వారా హెల్త్ కార్డులు, అర్హులైన వారికి అక్రెడిటేషన్ కార్డులు ఇప్పించేందుకు ఫెడరేషన్ కృషి చేస్తుందని చెప్పారు. ముఖ్యంగా జర్నలి స్టులకు ఇళ్ల స్థలాల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఫెడరేషన్ పోరాటం చేస్తుందని, జిల్లా, మండల, నియోజకవర్గ కేంద్రాలలో, ఇళ్ల స్థలాల సాధనకు పోరాటం చేయడానికి ఫెడరేషన్ సిద్ధమవు తుందని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో, జర్నలి స్టులకు తీరని అన్యాయం జరిగిందని, ఈ ప్రభు త్వంలో కూడా అలాగే జరిగితే పోరాటం చేయక తప్పదని అన్నారు. అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ మహా సభలు త్వరలో పూర్తి చేసి, రాష్ట్ర మహాసభలు పెద్ద ఎత్తున జరిపేందుకు సన్నద్ధ మవ్వాలని, అదే విధంగా రాష్ట్ర కేంద్రంతో పాటు జిల్లా, మండల, నియోజకవర్గ కేంద్రాలలో, పనిచే స్తున్న జర్నలి స్టులు ఫెడరేషన్‌లో సభ్యత్వం తీసు కుని, తమ హక్కుల సాధన కోసం జరిగే పోరా టాల్లో భాగ స్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఫెడరే షన్ బలంగా ఉందని, త్వరలో అన్ని నియోజ కవర్గాల్లో మహాసభలు పూర్తి చేసి, జిల్లా మహా సభను విజయవంతంగా జరపాలని కోరారు. సీని యర్ జర్నలిస్టు కట్టెల మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు పద్మా రెడ్డి, జిల్లా కోశాధికారి బెలిదె అశోక్, కుత్బుల్లాపూర్ అధ్యక్ష, కార్యదర్శులు గడ్డమీది అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- మేడ్చల్ ఏసీపీ బి.శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ ఏసీపీ బి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మల్లారెడ్డి ఇన్స్టిట్యూ షన్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశా లలో విద్యార్థులతో "యాంటీ ర్యాగింగ్ రూల్స్ అండ్ రెగ్యులే షన్స్" పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మాట్లా డుతూ... ర్యాగింగ్ వల్ల మనోవేదనతో కొన్ని సందర్భాలలో ఆత్మహత్యలు జరగడంతో ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేశాయనున్నారు. విద్యార్థులు పోలీస్ కేసులలో ఉంటే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. ప్రతి ఒక విద్యార్థి తమ తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్ లైన్‌లో లోన్లు తీసుకొని, డబ్బులు కట్టిన ఇంకా డబ్బులు కట్టాలని బెదిరింపు కాల్స్, అసభ్య పాలజాలంతో ఫోన్ కాల్స్ ఇలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులు ఒకరిపై ఒకరు విరోధంతో ఫోన్ నెంబర్లను కాల్ గర్ల్స్ వెబ్‌సైట్లో పెడుతున్నారని, ఇలా ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సూరారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓఎస్. భరత్ కుమార్, మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ వి.వి.శాస్త్రి, యాంటీ ర్యాగింగ్ నిరోధక కమిటీ సభ్యులు, అడ్మిన్ ఎస్ఐపీ చింతకాయల వెంకటేష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థినీలు అదృశ్యం



నవతెలంగాణ-కూకట్ పల్లి

బుధవారం ఉదయం ఇంటి నుంచి పాఠశాలకని బయలుదేరిన ఎనిమిదవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినిలు అదృశ్యమయ్యారు. ఈ ఘటన గురువారం కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పిల్లల అదృశ్యంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కూకట్ పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్ ముత్తు వివరాల ప్రకారం కూకట్పల్లి వివేకానంద నగర్‌లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో లక్ష్మిదుర్గ, హారికలు 8వ తరగతి చదువుతున్నారు. ప్రతి రోజు మాదిరిగానే బుధవారం స్కూల్‌కు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు ఇంటికి తిరిగి రాకపోవడంతో పిల్లల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించగా సమాచారం లేకపోవడంతో, ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, దీనిపై కిడ్నాప్ కేస్ నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించగా సాయంత్రం స్కూలు విడిచిపెట్టిన అనంతరం బయటికి వచ్చిన దుర్గ, హారికలు, పక్కనే నిర్మాణంలో ఉన్న భవనంలోకి వెళ్లినట్లు గుర్తించారు. అప్పటికే ఇంటి నుంచి తమతో పాటు తెచ్చుకున్న సివిల్ బట్టలను మార్చుకున్నారు. అక్కడి నుంచి ఇద్దరు బయటికి వెళ్లిపోయారు. తరచూ వీరు ఇరువురు సూర్యలంక బీచ్ కెళ్లాలని తరగతి రూమ్‌లో చర్చించుకునే వారని, పోలీస్ విచారణలో తెలియడంతో, ఇరువురు సూర్యలంక బీచ్‌కి ఎంజాయ్ చేయడానికి వెళ్లినట్టుగా సమాచారం. వెంటనే కూకట్పల్లి పోలీసులు విద్యార్థులను తీసుకువచ్చేందుకు వెళ్లటం జరిగిందని, వారు వస్తే పూర్తి సమాచారం తెలుస్తుందని కూకట్ పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావు తెలిపారు.

నవతెలంగాణ
10
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శుక్రవారం నవంబర్ 22, 2024 www.navatelangana.com



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం హైదరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా ఆమెకు జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి పూల బొకే అందజేసి ఆహ్వానించారు.

నేడు బీసీ కమిషన్ బహిరంగ విచారణ

- జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి. ఆశన్న



నవతెలంగాణ -సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీసీ కమిషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రంలోని సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులను పరిశోధించడానికి బహిరంగ విదారణ చేపట్టడం జరుగుతున్నదని జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి. ఆశన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బీసీ కులాల వారు , బీసీ సంఘాల వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యూసఫ్‌గూడలో అగ్ని ప్రమాదం

- ఆటో మొబైల్ షాప్ దగ్ధం



నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

యూసఫ్ గూడ బస్తీ హైదరాబాద్ రెస్టారెంట్ పక్కనగల న్యూఎస్‌ఆర్ ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్ జీ ప్లస్ 2 భవనం గురువారం తెల్లవారుజామున 3:30 గంటలకు మంటలు చెలరేగాయి. భవనం లోపలి నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే జూబ్లీ హిల్స్ పోలీస్ స్టేషన్‌కు, ఫైర్ అధికారులకు సమాచారం అందిం చారు. వెంటనే అగ్ని మాపక సిబ్బంది రెండు వాహనాలతో అక్కడకు చేరుకొని మంటలను ఆర్పివేశారు. షాపు యజమాని మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్ వల్ల షాప్‌లో మంటలు వ్యాపించాయని, సుమారు రూ. కోటి వరకు ఆస్తి నష్టం జరిగిందని, ఎలాంటి ఇన్సూరెన్స్ చేసుకోలేదని తెలిపారు. అదేవిధంగా జూబ్లీహిల్స్ పోలీసులకు విషయాన్ని తెలిపినట్టు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించాయా లేక ఎవరైనా కావాలని నిప్పు పెట్టరా అని, సీసీ కెమెరాలు పరిశీలించి దర్యాప్తు చేపడతామన్నారు.

ఎమ్మెల్యేకు ఆశా వర్కర్ల వినతిపత్రం..

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణా గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల సంఘం (ఆశా) ప్రతినిధుల బందం గురువారం సికింద్రాబాద్, ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్‌ను సికింద్రాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ డిమాండ్లపై వినతి పత్రాన్ని అందజేశారు. ప్రధానంగా తమ వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రతను కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షురాలు ఉమాదేవి పాల్గొన్నారు.

డిసెంబర్ 18న ఓయూలో ప్రభుత్వానికి కృతజ్ఞత సభ



నవతెలంగాణ-ఓయూ

కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన విద్యార్థి నిరుద్యోగుల పాలిట స్వర్ణయుగంగా మారిందని తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసి చైర్మెన్ కోటూరి మానవతారాయ్ అన్నారు. డిసెంబర్ 18న సాయంత్రం 5 గంటలకు ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద విద్యార్థి నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థి నిరుద్యోగుల కృతజ్ఞత సభను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో కతజ్ఞత సభ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడవ తరగతి నుంచి పీజీ విద్యార్థుల వరకు కాస్మోటిక్, డైట్ ఛార్జీలు ఏకంగా 40 శాతం పెంచటం,చట్టబద్ధ జాబ్ క్యాలెండర్ ప్రకటించడం, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యార్థి నిరుద్యోగుల్లో నైపుణ్యాలు పెంచటం,క్రీడా యూనివర్సిటీ తో దేశానికి పేరు తెచ్చే క్రీడాకారులను తయారు చేయడం వంటి చర్యలు నిజంగా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పట్ల నాగరాజు, రెడ్డి శ్రీను, భైరి నాగరాజు గౌడ్, భీమ్ రావ్ నాయక్,సభావత్ క్రాంతి, బాణాల నగేష్, ఎం.మల్లికార్జున్, జగన్నాథ్ యాదవ్, పుల్లగిరి అశోక్ ,చందు, హేమంత్ చౌదరి, పాల్గొన్నారు.

మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించడమే లక్ష్యం

- డా. విజయ శారద రెడ్డి..

నవతెలంగాణ - బంజారాహిల్స్



అపరిమితమైన శక్తి సామర్థ్యాలు ఉండి కూడా తాము బలహీనులమని అని భావిస్తూ ఇంటికే పరిమితమ వుతున్న మహిళలను అన్ని రంగాలలో ప్రోత్సహించడం లక్ష్యంగా తాను ముందుకు సాగుతున్నట్టు ఆరుపదుల వయసులో క్లాసిక్ మిసెస్ ఆసియా ఇంటర్నేషనల్ 2024 కిరీటంతో పాటుమిస్సెస్ ఇంటర్నేషనల్ పేజెంట్ టైటిట్‌ను కైవసం చేసుకున్న విద్యావేత్త డాక్టర్ విజయ శారదా రెడ్డి తెలిపారు. బ్యాంకాక్‌లో జరిగిన మిస్సెస్ ఏషియా ఇంటర్నేషనల్ పోటీలలో టైటిల్ కైవసం చేసుకున్న సందర్భంగా బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రత్యేక మీడియా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏపీలోని చిరు గ్రామంలో జన్మించిన తనకు డిగ్రీ రెండో సంవత్సరంలో వివాహం జరిగిందని తెలిపారు. భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యను పూర్తి చేసి విద్య ద్వారానే విజ్ఞానం లభిస్తుందని బలంగా నమ్మి విద్యా సంస్థలను నెలకొల్పినట్టు చెప్పారు. అనంతరం వయస్సు కేవలం శరీరానికే మనసు కాదని ప్రతి మహిళకూ వివరించే లక్ష్యంతో ఆరుపదల వయసులో అందాల పోటీలకు సిద్ధమైనట్టు చెప్పారు. భర్త, కుమారులు, కోడలు సైతం తన నిర్ణయాన్ని సమర్థించి ప్రోత్సహిం చడంతో అంతర్జాతీయ వేదికపై టైటిల్‌ను కైవసం చేసుకున్నట్టు తెలిపారు. ఇది కేవలం తన కోసం చేసింది కాదని చిన్న చిన్న కారణాలతో ఇంటికి పరిమితం అవుతు న్న మహిళలలో అంతర్లీనంగా ఉన్న శక్తిని ప్రేరేపించే లక్ష్యంతో చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి మహిళా తనకు నచ్చిన రంగంలో అద్భుతంగా రాణించి కుటుంబానికి, దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు.

కాంగ్రెస్ విద్యార్థి నిరుద్యోగ సభను అడ్డుకుంటాం



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో డిసెంబర్ 18, 21 తేదీల్లో జరిగే కాంగ్రెస్ విద్యార్థి నిరుద్యోగ సభలను అడ్డుకుంటామని బీఆర్‌ఎస్‌వీ నాయకులు తెలిపారు. గురువారం ఓయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గదరాజు చందు మాట్లాడుతూ విద్యారంగానికి బడ్జెట్ లో ప్రస్తుత వాటా 6 నుంచి 15 శాతానికి పెంపు, విశ్వవిద్యాలయాల్లో రీసెర్చ్ స్కాలర్స్‌కు నెలకు రూ. 10,000 ఫెలోషిప్ లేదన్నారు.ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఈడబ్ల్యూఎస్ వర్గాల విద్యార్థులందరికీ ఫీజు రియింబర్స్‌మెంట్‌తో పాటు పాత బకాయిలు పూర్తిగా చెల్లింపు లేవని తెలిపారు. మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వాల ఉద్యోగాలు కల్పించలేదని, 4000 నిరుద్యోగ భృతి, ప్రతి విద్యార్థికీ 5 లక్షల విద్యా భరోసా కార్డు ఎక్కడ అని ప్రశ్నించారు. ఓయూ లో 1250 మందికి 350 మంది శాశ్వత ఆచార్యులు ఉన్నారని చెప్పారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా విద్యారంగంలో ఇన్ని సమస్యలు పెట్టుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న ముఖ్యమంత్రి నిరుద్యోగ సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని కోరారు. ఈ కార్యకమంలో బీఆర్‌ఎస్‌వీ కార్యదర్శి జీడీ. అనిల్ ,బీఆర్‌ఎస్‌వీ ఓయూ నాయకులు జంగయ్య ,క్యాదాసి రవి,కొంపెల్లి నరేష్ ,మిథున్ ప్రసాద్ ,శ్రీకాంత్ ,నాగేందర్ ,పవన్ కుమార్ అవినాష్ ,సాయి ,జాషువా పాల్గొన్నారు.

2 లక్షల ప్రభుత్వాల ఉద్యోగాలు ఏవి ? : బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి నాగరం ప్రశాంత్

ఓయూలో డిసెంబర్ 18, 21 తేదీల్లో జరిగే కాంగ్రెస్ విద్యార్థి నిరుద్యోగ సభలను అడ్డుకుంటామని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి నాగరం ప్రశాంత్ అన్నారు. మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వాల ఉద్యోగాలు ఏవి ? అని ప్రశ్నించారు. 2024-2025 బడ్జెట్ లో ఓయూ కి కేటాయించిన రూ. 500 కోట్లు విడుదల చేసి యూనివర్సిటీకి కాంగ్రెస్ నాయకులు రావాలని లేకుంటే బీఆర్‌ఎస్‌వీ అడ్డుకుంటుందన్నారు.

పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టండి

- డ్రయినేజీ సమస్య పరిష్కారం కోసం నిధులు ఇస్తా .. ప్రతిపాదనలు సమర్పించండి
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- దారుల్ షిఫా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆకస్మికంగా తనిఖీ





నవతెలంగాణ-సిటీబ్యూరో

బహదూర్‌పూరలోని దారుల్ షిఫా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పాఠశాల ఆవరణలో మురికి నీరు నిల్వ ఉండకుండా వెంటనే తగు చర్యలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం బహదూర్ పూర లోని దారుల్ షిఫా ప్రభుత్వ ఉన్నత ఉర్దూ మీడియం, ప్రభుత్వ బాలుర అంధుల ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఉర్దూ మీడియం పాఠశాలలో డ్రయినేజీ నీటి ద్వారా విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఈఓ, డిప్యూటీ ఈఓ, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్, ఈఈ ఐడీసీ, హెచ్‌ఎండబ్ల్యూఎస్, తహసిల్దార్, పాఠశాల హెడ్మాస్టర్ లు పాఠశాలను తనిఖీ చేసి పాఠశాలలు చేపట్టిన పనులను శుక్రవారం సాయంత్రంలోగా నివేదిక సమర్పిం చాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, చెట్లు తొలగించాలని, అమ్మ ఆదర్శ పాఠశాల అసంపూర్తి పనులు పూర్తిచేయాలని దానికి కావలసిన నిధుల గురించి ప్రతిపాదనలు అందజేయాలని అన్నారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు, డ్రైనేజ్ నీరు నిల్వ ఉండకుండా వారం రోజుల్లోగా పనులు పూర్తి చేయాలన్నారు.

అనంతరం అంధుల పాఠ శాల సందర్శించి పాఠ శాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు అని తెలుసుకొని, పిల్లలతో మాట్లాడారు. సరిగా భోజనం ఇస్తున్నారా, బుక్స్ ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. ఉర్దూ మీడియం పాఠ శాలలో డ్రైనేజీ వాటర్ పాఠశాలలో రాకుండా వెంటనే తగు చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఆర్.రోహిణి, హెచ్‌ఎమ్‌డబ్ల్యూఎస్ మేనేజర్ సయ్యద్ అబ్దుల్ జకీ, హెడ్మాస్టర్ మహమ్మద్ మసూద్దీన్ అహ్మద్, తహసీల్దార్ చంద్రశేఖర్, మహమ్మద్ సాదిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో అన్ని వివరాలు నమోదు చేయించుకోండి



- కార్పొరేటర్ బాబా పసివుద్దీన్
- బోరబండలో సర్వే అధికారులతో కలిసి పర్యటించిన కార్పొరేటర్

నవతెలంగాణ - జూబ్లీహిల్స్ .

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా బోరబండ డివిజన్‌లో గురువారం అధికారులతో కలిసి కార్పొరేటర్ బాబా పసివుద్దీన్ ఇంటింటికి వెళ్లి సర్వే వివరాలు సేకరించడంలో సహాయ సహకారాలు అందించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ అన్ని వివరాలు తెలియ పరచాలని, సర్వే వల్ల ఎలాంటి ఇబ్బంది ఎవరికీ రాదని తెలిపారు. రాష్ట్రం అభివద్ధి చెందేందుకు మాత్రమే సర్వే ఉపయోగపడుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. బోరబండ వినాయక్ రావు నగర్‌లో ఇంటిం టికి తిరిగి సర్వే పూర్తి చేశారు. కార్పొరేటర్ బస్తీలో అధికా రులతో కలిసి తిరుగుతూ ప్రజలను చైతన్య పరిచారు. సర్వేలో యూసుఫ్ గూడా సర్కిల్- 19 డిప్యూటీ కమిషనర్ జాకీయ సుల్తానా, డీపీఓ వెంకటకష్ణారావు, ఎన్యూమ నేటర్లు, సర్వే అధికారులు, కాంగ్రెస్ బోరబండ డివిజన్ నాయకులు, వినాయక్‌రావునగర్ బస్తీ నాయకులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో దిశా సభ్యురాలు భేటీ

నవతెలంగాణ-ఓయూ

ఈస్ట్ జోన్ చిలకల్ గూడ ఏసీపీ వి. జైపాల్ రెడ్డి, వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ సైదులును గురువారం హైదరాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు శారదా మల్లేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెతో పాటుగా ప్రభు గుప్తా, శ్యాంసుందర్, మహేష్ ,గంగాధర్ యాదవ్, నీలం శ్రీనివాస్ ముదిరాజ్ గండికోట నరసింహ, హనుమంతు ముదిరాజ్ ,బిక్షపతి, రవీందర్,శ్రీనివాస్ చారి, ఆదర్శ, వేణు, సత్యనారాయణ ,రామకష్ణ ,శ్యామావు,ఒములు,మల్లేష్, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాలల సింహ గర్జనకు కదలిరండి

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ



నవతెలంగాణ-బంజారాహిల్స్

మాలల సింహ గర్జనకు కదలిరావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది. బంజారాహిల్స్‌లోని ప్రేమ్ నగర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ కార్యవర్గం గురువారం ప్రేమ్ నగర్ మాలబస్తీ వాసులతో సమావేశమయ్యారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలలో తీవ్ర అన్యాయం జరిగిందని, రిజర్వే షన్ ఫలాలు అనుభవించి కూడా కొందరు రిజర్వేషన్లలో తమకు అన్యాయం జరిగిందంటూ మాలలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అలాంటి మనువాదులకు తగిన గుణపాఠం చెప్పాలంటే ప్రతి ఇంటితో పాటు బస్తీ బాటకు తోడు కావాలని, మాలల సత్తా మాలల సింహగర్జన కార్యక్ర మం రోజు చూపించాలని కోరారు. కమిటీ రాష్ట్ర కన్వీనర్లు మన్నే శ్రీధర్ రావ్, పి బల్వంత్ రావు,కో కన్వినర్లు తాలూకా రాజేష్, గోకుల కళ్యాణ్‌లు ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ...మాల కులంలో పుట్టిన వారందరూ తమ జాతికి జరుగుతున్న అన్యాయాన్ని చదువులు లేని కుటుంబాలకు బస్తీల్లో పర్యటిస్తూ మరి తెలపాల్సిన అవశ్యకత ఏర్పడిందని మాలలకు పిలుపుని చ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేసి మాలల ఓటు బ్యాంకు కాపాడుకోవాలని డిమాండ్ చేస్తూ తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, ఆదర్శ, అంజలి, రాజేష్, మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

'సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి'



నవతెలంగాణ-ఓయూ

సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని రెడ్డి శ్రీను ముదిరాజ్ కోరారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో గురువారం ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవ కార్యక్రమాన్ని ముదిరాజ్ స్కలర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడితే ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూపులోకి మారుస్తానని సీఎం మాట ఇచ్చారని గుర్తు చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలుపుకొని తెలుగు ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ ఏ లోకి మార్చాలని కోరారు. ముదిరాజుల ముఖ్యవత్తి మత్స్యకార వత్తి కనక యావత్ తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సామాజిక వర్గానికి ఇచ్చిన మాటను నిలుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంజి ముదిరాజ్, శంకర్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, ప్రకాష్ ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఓఎస్డీకి శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఓయూ



ఓయూ నూతన ఓఎస్డీగా నియమితులైన ప్రొ. ఎస్ జితేందర్ కుమార్ నాయక్ కుమార్‌కు ఓయూ, టీఎస్ జేఏసీ, సామాజిక తెలంగాణ విద్యార్థి సమైక్య రాష్ట్ర కమిటీ పక్షాన గురువారం శుభాకాంక్షలు తెలుపుతూ విశ్వవిద్యాలయ సమస్యలపైన వినతి పత్రం అందజేశారు. విశ్వవిద్యాలయ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు దర్శనం జాన్, రవికుమార్ బాధవత్, నోముల వంశీ యాదవ్, రాజేష్,విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

నియామక ప్రకటన రద్దు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళా, శిశు, వికలాంగుల, వయో వద్దుల శాఖ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి కేంద్రాలు (1) బంజారాహిల్స్ రోడ్ నం. -12 (2) సైదాబాద్‌నకు అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థల ద్వారా కొ-మేనేజ్మెంట్ తో నడిపేందుకు గతంలో ఇచ్చినటువంటి నోటిఫికేషన్, నియామక ప్రకటన అడ్మినిస్ట్రేటివ్ కారణాల ద్వారా రద్దు చేసినట్టు జిల్లా సంక్షేమాధికారి, మహిళా, శిశు, దివ్యంగులు మరియు వద్ధుల సంక్షేమ శాఖ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నది.

టేబుల్ డ్రైన్ వర్క్ పనులను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-ఓయూ



సీతఫలమండిలోని ఏక్ నెంబర్ గల్లి వద్ద జరుగుతున్న టేబుల్ డ్రైన్ వర్క్ పనులను కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిలకల గూడ చౌరస్తా నుంచి సీతఫలమండి చౌరస్తా వరకు ఈ పనులు జరుగుతు న్నాయని తెలిపారు. రూ. 50 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టినట్టు చెప్పారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా,ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కూడా ఈ పనికి సహకరిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పక్కన ఉన్న షాప్ యజమానులతో మాట్లాడారు. త్వరగా పనులు పూర్తి చేస్తామని అందుకు వారు కూడా సహకరించాలని కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాల్గొన్నారు.



కళాసిగూడ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్ పైన భక్తులు అయ్యప్ప స్వామి మాల ధరించడం కోసం షెడ్డు నిర్మాణం జరిగింది. షెడ్డు నిర్మాణం కోసం తన వంతు సహాయంగా రూ.16,000 కాంగ్రెస్ సనత్ నగర్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అక్కడ బస్తీ వాసులకి సురేష్ బందానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సనత్ నగర్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు. నవతెలంగాణ-బేగంపేట



గెజిటెడ్ ఆఫీసర్స్ ఎన్నికలు నిర్వహించాలి

- బోయ కుమార్

నవతెలంగాణ-ఓయూ

ఓయూలో గెజిటెడ్ ఆఫీసర్స్ ఎన్నికలు నిర్వహించాలని, ఇటీవల నిర్వహించిన డిప్యూటీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పరీక్ష ఫలితాలు విడుదల చేయాలని,వెంటనే ప్రమోషన్స్ ఇస్తూ, ఖాళీలు లేకుండా భర్తీ చేయాలని బోయ కుమార్ కోరారు. గురువారం ఓయూ వీసీ ప్రొ. కుమార్‌కు హైదరాబాద్ జిల్లా, ఓయూ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎండీ. కష్ణ, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖాదర్ ,ఉపాధ్యక్షుడు డా.రవి కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోయ కుమార్, ఉపేందర్, సాయి నాద్ , అనిత, విఠల్ ,ప్రసాద్ పాల్గొన్నారు.



కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని, డీఎస్పీ సీ. వంశీ మోహన్ రెడ్డి సచివాలయంలో నలపోచమ్మ దేవాలయానికి ఆకాశ దీపం విరాళమిచ్చారు. నవతెలంగాణ-బేగంపేట

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి సంబురాలు



నవతెలంగాణ-దుండిగల్

జనవిజ్ఞాన వేదిక బాచుపల్లి కమిటీ నిర్వహణలో బాచుపల్లి, దుండిగల్ మండలాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల 8,9,10 తరగతుల విద్యార్థులకు గురువారం ప్రగతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో చెకుముకి సైన్స్ సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా, ప్రగతి నగర్ జూనియర్ కాలేజ్ కోఆర్డినేటర్ డాక్టర్ నరేష్, ఎంటెక్ పీహెచ్‌డీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ చెన్నయ్య, జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు లక్ష్మీనరసయ్య హాజరైనారు. చెకుముకి సంబరాలలో భాగంగా ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులు 11 టీములు ఇంగ్లీష్ మీడియం, 4 టీములు తెలుగు మీడియం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు ఈ చెకుముకి సంబురాలు ఉపయోగపడతాయని వక్తలు అన్నారు. జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబురాలు 28న కుత్బుల్లాపూర్ మండలం వేదికగా జిల్లాలోని 15మండలాల నుండి విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. జన విజ్ఞాన వేదిక నాయకులు శంకరరావు, అమిర్ భాష మేడ్చల్ జన విజ్ఞాన వేదిక నాయకులు శంకరరావు, అమిర్ భాష మండల స్థాయి చెకుముకి సంబురాలు నిర్వహించారు. మేడ్చల్ జిల్లాస్థాయిలో జరిగే చెకుముకి సైన్స్ సంబురాలకు ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం బాచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రయివేటు పాఠశాల నియో గీతాంజలి స్కూల్ నుండి ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు వెళ్తున్నారు.

సీఎంఆర్ కళాశాలలో సెమినార్



నవతెలంగాణ-సిటీబ్యూరో

"మొదటి ప్రయత్నంలో సివిల్ సర్వీసెస్ సాధించటం ఎలా – యూపీఎస్సీ మాస్టర్ క్లాస్" అనే అంశం పై మేడ్చల్‌లోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జీ5 మీడియా గ్రూప్, హైదరాబాద్ లోని 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మెన్ పి. కృష్ణ ప్రదీప్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "మీరు ఎదగడమే కాకుండా, ఇతరులు మీ గురించి తెలుసుకునే విధంగా ఎదగాలి" అని చెబుతూ, అందుకోసం యూపీఎస్సీలో సీటు సాధించాలన్నారు. అంతేకాక దేశం కోసం జీవిస్తున్న అజిత్ డోవల్ అనే భారతీయ ఐపీఎస్ అధికారి గురించి ఉదాహరణగా పేర్కొంటూ ,పాకిస్తాన్‌లో గూఢచారి (నిఘా అధికారి)గా పనిచేసి, భారత దేశానికి అత్యంత రహస్యమైన సమాచారాన్ని పంపించేవారని చెప్పారు.తన అకాడమీ లక్ష్యం భవిష్యత్ తరానికి నాయకులను సష్టించడం, వారికి అవసరమైన శిక్షణ అందించడం అని అన్నారు. 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటర్ డాక్టర్ భవానీ శంకర్ మాట్లాడుతూ యూపీఎస్సీ పరీక్షల్లో ప్రాథమిక తరగతుల ప్రశ్నలూ వస్తాయని, అందులోని ప్రశ్నలన్నీ చాలా కఠినమైనవన్న భావనను వీడాలని చెప్పారు. అలాగే కేవలం 35 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందిన గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఈ పరీక్షలకు అర్హులు అని స్పష్టంగా పేర్కొన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే యూపీఎస్సీలో సీటు సంపాదించడం తేలిక అన్నారు. సెమినార్‌లో సీఎంఆర్‌ఈసీ సెక్రటరీ శ్రీశైలం రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ రెడ్డి, డాక్టర్ లక్ష్మయ్య, ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ హెడ్ డాక్టర్ విజయ్ కార్తిక్ , జీ5 మీడియా డైరెక్టర్ ఐఎస్ గిరి ప్రకాష్ పాల్గొన్నారు .

భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము రెండు రోజుల హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఢిల్లీ నుండి బేగంపేట విమానాశ్రయంలో ప్రత్యేక విమానంలో విచ్చేసిన సందర్భంగా స్వాగతం పలికి పుష్ప గుచ్చాలు అందజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, డీజీపీ డాక్టర్ జితేందర్, సీపీ సీవీ ఆనంద్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు

నవతెలంగాణ-సిటీబ్యూరో



స్మార్ట్ కండ్లద్దాలతో అంధుల జీవితాల్లో కొత్త వెలుగులు



తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంధులకు కేవలం చేతికర్ర మాత్రమే సాయంగా ఉండేదని, అలాంటిది ఇప్పుడు కొత్తగా వచ్చిన ఏఐ ఆధారిత స్మార్ట్ కండ్లద్దాలు వాళ్ల జీవితాల్లో కొత్త వెలుగులు పంచుతాయని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మనుషులను, వస్తువులను గుర్తించడం, దారి చూపించడం లాంటి సామర్థ్యాలు కూడా ఉన్న కళ్లద్దాలు రూపొందించినందుకు కిమ్స్ ఫౌండేషన్, రీసెర్చ్ సెంటర్‌ను ఆయన అభినందించారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో గురువారం జరిగిన స్మార్ట్ కళ్లద్దాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ఏఐ ఆధారిత స్మార్ట్ కళ్లద్దాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ దాదాపు 2 కోట్ల మందికి పైగా మన దేశంలోనే అందులు ఉన్నారని, ఇలాంటి తరుణంలో వారికి అత్యంత ఆవశ్యకమైన స్మార్ట్ కండ్లద్దాలు ఇవ్వడం ఎంతగానో అభినందనీయమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. అంధుల రోజువారీ జీవితాల్లో కూడా ఉపయోగపడడం వల్ల వారికి మంచి ఆత్మవిశ్వాసం వీటివల్ల వస్తుందని చెప్పారు. వీటి రూపకల్పనలో పాలుపంచుకున్న శాస్త్రవేత్తలు, టెక్నాలజీ నిపుణులు, మద్దతిచ్చిన సంస్థలు.. వీరంతా ఎంతో నిబద్ధత, అంధుల పట్ల తమ బాధ్యత చూపించి వీటిని రూపొందించినందుకు వారందరికీ పేరుపేరునా అభినందనలు తెలిపారు. ప్రతిఒక్కరూ ఈ ఉద్యమానికి చేయూతనిచ్చి తెలంగాణలోని అంధులను ఆదుకునేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. తద్వారా అంధులకు మరింత మెరుగైన భవిష్యత్తు అందించాలన్నారు. అనంతరం కొందరు అంధులకు ఆయన స్వయంగా ఈ కళ్లద్దాలు అందించారు. కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ "మా కిమ్స్ ఫౌండేషన్, రీసెర్చ్ సెంటర్ రూపొందించిన ఏఐ ఆధారిత స్మార్ట్ కళ్లద్దాలను ఆవిష్కరించేందుకు ఎంతో పెద్దమనసుతో ముందుకొచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ధన్యవాదాలు. ఈ టెక్నాలజీ వల్ల అంధులు మరింత సులభంగా తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో తిరగగలరు. ఎదురుగా ఉన్న వారిని గుర్తించి మాట్లాడగలరు. దానివల్ల వారికి జీవితంలో మరింత స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం లభిస్తాయి. అందరికీ సమాన అవకాశాలు, అందుబాటులో సమాచారం ఉండే భవిష్యత్తు కోసమే మేం కలలుగన్నాం. అవి ఈరోజు నిజమయ్యాయి" అని చెప్పారు.

వెయ్యి మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు



నవతెలంగాన-సిటీబ్యూరో

భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ అయిన ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ వారి ప్రాజెక్ట్ ఎస్పీవీ అయిన ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రయివేట్ లిమిటెడ్, నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులో ప్రయాణించే భారీ వాహన వినియోగదారుల కోసం ఉచితంగా కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించింది. టాటా గ్రూప్ సంస్థ అయిన టైటాన్ ఐ ప్లస్, హైదరాబాద్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (హెచ్‌జీటీఏ) ఈ శిబిర నిర్వహణకు తమ విలువైన సహకారాన్ని అందించాయి. వనస్థలిపురం ఆటోనగర్‌లోని హైదరాబాద్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ వారి ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో ఈ శిబిరాన్ని ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ, కంటి చూపు సరిగా లేకపోతే అది మనతో పాటు పక్కవారి ప్రాణాలకు కూడా ప్రమాదకరం అవుతుందని, అందువల్ల తప్పనిసరిగా డ్రైవర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, కంటి చూపు పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ రోజుల్లో 40 ఏళ్ల వయసు నుంచి ప్రతి ఒక్కరికీ కంటి చూపు కొంత ఇబ్బంది అవుతోందని, అందువల్ల సమస్యను సకాలంలో గుర్తించి దానికి పరిష్కారంగా కళ్లద్దాలు వేయించుకోవాలన్నారు. ఐఆర్ బీ గోల్కొండ ఎక్స్ ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి మాట్లాడుతూ "ఓఆర్ ఆర్ పై ప్రయాణించే భారీ వాహన డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా చేపట్టిన భద్రతా, సంరక్షణ కార్యక్రమాల్లో ఇదొకటి. ఎక్కువ గంటలు డ్రైవింగ్ చేయడం, సరైన పరిశుభ్రత లేకపోవడం తరచుగా కంటి సమస్యలకు దారితీస్తుంది. 60 ఏళ్లు పైబడిన చాలామంది డ్రైవర్లు కంటిశుక్లం లేదా గ్లకోమాతో బాధపడుతున్నారు. అందువల్ల వారితో పాటు ఇతరుల భద్రత కోసం క్రమం తప్పకుండా కంటి పరీక్షలు అవసరం. అమూల్యమైన సహకారం అందించిన టైటాన్ ఐ ప్లస్, హైదరాబాద్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ వారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమం కంటి ఆరోగ్యం, భద్రత గురించి అవగాహన పెంచడానికి ఒక అడుగు. లారీ డ్రైవర్లకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించాలని మా సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది" అని చెప్పారు. ఈకార్యక్రమంలో హెచ్ జీటీఏ అధ్యక్షుడు అజయ్ శర్మ, హెచ్ జీటీఏ ఉపాధ్యక్షుడు వినీల్, ఎన్ఓఆర్ఆర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్నల్ గిరీశ్వర్, హెచ్‌జీసీఎల్ డీజీఎంలు చంద్రశేఖర్, రిజ్వాన్, ఏజీఎం మీనాక్షి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ దుండిగల్

బౌరంపేట్ విలేజ్ కేబుల్ ఫీడర్ లో కొత్త సర్వీస్ కనెక్షన్లు మెయింటెనెన్స్ పనుల కారణంగా ఉదయం 10.30 గం. నుండి మధ్యాహ్నం 1.30 గం . వరకు అలాగే మధ్యాహ్నం 2.30 గం. నుండి మధ్యాహ్నం 4.30 గంటల వరకు బౌరంపేట్ గ్రామం, ఆర్‌కే టౌన్‌షిప్, సారెగూడెం రోడ్, షికారా స్కూల్ రోడ్, మొదలైన ప్రాంతంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని బౌరంపేట్ విద్యుత్ శాఖ ఏఈ బి. సాయి కిరణ్ తెలిపారు.

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION-I AT: HYDERABAD
CC. No. 551 OF 2024

BETWEEN:
M/s.Keerthi Sudarshan Apartments Owner Welfare Association ...Complainant
And
M/s. Anjali Enterprises ...Opposite party

To,
M/s. Anjali Enterprises Having its office at Flat no.404, Sree Sai Balaji Residency, Rajeev Nagar, Hyderabad - 45. Represented by its proprietor Sri Satyanarayana.

Madam/Sir,
Please take Notice that the Complainant herein has filed the above Case in C.C. No. 551 of 2024 on the file of the Hon'ble District Consumer Disputes Redressal Commission-I, Hyderabad for Deficiency of service by your Firm.The same is posted on 09/12/2024 for your Appearance and Written Version if any. You may make it convenient to present either in person or through your Counsel before the above Hon'ble Commission-I, Hyderabad at 10-30 am on 09/12/2024. If you fail to appear on the above date the Matter will be heard Exparte.

//BY THE ORDER OF THE HON'BLE DISTRICT COMMISSION-I//

Place: Hyderabad
Date: 21/11/2024

Shri D. Madhava Rao
D.Raghavender Rao
Ch. Manmohan
M/s. DMR LAW CHAMBERS
Advocates
41, Ishaq Colony, Wellington Road, AOC Center, Secunderabad - 015
Cell : 8121221188

BEFORE THE HON'BLE JUDGE FAMILY COURT AT: SECUNDERABAD
F.C.O.P. NO. 194 OF 2024

BETWEEN:
Sri Panguluri Hari Krishna .... Petitioner
AND
Smt. Rambai Panguluri @ Rama ... Respondent

SUMMONS

To,
Smt. Rambai Panguluri @ Rama, W/o. Hari Krishna Panguluri, aged about 60 years, Occ.: House wife, R/o. Flat No. G-3, H. No.: 30-167/216, Sri Chekra Residency, West Chandragiri Colony, Safilguda, Hyderabad.

Take Notice that the above F.C.O.P. is filed by Petitioner for Divorce against you. The case is posted to 18.12.2024 at 10.30 a.m. for your Appearance, before Hon'ble Judge Family Court, at Secunderabad either in person or through a Counsel,if you fail to attend before the above Hon'ble Judge Family Court on the said day, the matter will be heard and decided in your absence as per Law.

(BY ORDER OF THE HON'BLE COURT)

Dr. B. MANOJ KUMAR
O/o. TheLawMan™
Advocates & Arbitrators,
H. No.: 8-3-36, M.C. No.: 1000, Second Bazar, Secunderabad.
tlmindia@gmail.com,
Ph:880 1681 999.

BEFORE THE CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, AT : KARIMNAGAR
A.R.B.NO: 484 / 2024

SRINIDHI CHITS (HYDERABAD) PRIVATE LIMITED., Represented by its Foremen, Godhavarikhani Branch. ...Disputant
AND
Avidapu Sathaiah & Others ....Opponents

OP.No: 01. Avidapu Sathaiah, S/o: Gouraiah, Age: 39 Years, Occu: Business, R/o. Plat No. 9, Flat No. 301,Orchid residency,Gajularamaram, Jeedimetla, Hyderabad.
OP.No: 02. Shaik Rafi, S/o: Hazimiya, Age: 40 Years, Occu: General Mazdoor, Employee No. 01245687, O/o.The Singareni Colleries Company Ltd., N.C.W.A., GDK9 Incline, Ramagundam-II Area, R/o. H.No.9-7-207, Vittal Nagar, Godavarikhani, Dist. Peddapalli.
OP.No: 04. Karupakala Rajesh, S/o: Pocham Age: 35 Years, Occu: General Mazdoor, Employee No. 01006041, O/o.The Singareni Colleries Company Ltd., N.C.W.A., GDK 2 Incline, Ramagundam-I Area, R/o. H.No.4-56, Shettypally, Jaipur, Dist. Adilabad.
OP.No: 05. Bandari Veeraswamy, S/o: Rajam, Age: 39 Years, Occu: Sorting Asst., Employee ID. 10167946, O/o. Post Office, Hyderabad NSH, R/o. H.No.9-56, Arunakka nagar, Srirampur colony, Mancherial.

TO.
Take Notice that the above dispute is filed against you and others for recovery of money, summon we issued on you, but you failed to received the same.The above dispute is posted on:**13-12-2024** for your appearance. On that day you have you appear in person at 11.00A.M. Before the deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

CHIT ARBITRATOR
DEPUTY REGISTRAR OF CHITS, KARIMNAGAR.

IN THE COURT OF THE CHAIRMAN : ASST. COMMISSINER OF LABOUR -IV (ACL-IV) HYDERABAD
EC.CASE NO. 125 OF 2023 (NF)

BETWEEN :
Challa venkateswara Reddy @ venkateswarlu .....Applicant
AND
Chilukuri Srinivasa Reddy @ other ... opposite partiee

To
Chilukuri Srinivasa Reddy S/o velugonda Reddy age : major. occ : business. R/o H.no. 19-12-124 LR colony Road, Sangadigunta, Guntur (town) & (dist) Pin. 522003
(Owner Of Lorry bearing No. AP-07TM-8649)

Take notice that the above named petitioner/s filed the above case for grant of compensation against you and the said case is posted to 28/11/2024 for your appearance.

Therefore, you are hereby informed to be present on 28/11/2024 at 03-00 pm. in person or through pleader the above said court, failing which the matter will be decided against your absence.

//BY ORDER OF THE COURT//
REGATTE BHUPAL REDDY
PADAM SEENAIAH
Advocate, Nalgonda.
NALGONDA,
DT : 21-11-2024

మహారాజశ్రీ కృష్ణా జిల్లా, గుడివాడ 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో ...
ఐ.ఎ.నెం. 779/2023
ఇన్
ఓ.యస్.నెం. 89/2017

బిట్వీన్:
రామినేని భగవతి, వారి తరపున జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హెూల్డర్, అయిన రామినేని వెంకటేశ్వర ప్రసాద్ ...పిటీషనర్ / వాది
(1) వడ్లమూడి తాండవ కృష్ణ సత్యనారాయణ బాబు మరియు యితరులు ... రెస్పాండెంట్లు / ప్రతివాదులు

రెస్పాండెంట్ నెం.4
వడ్లమూడి జాహ్నవి, భర్త: టి. ప్రశాంత్ హిందువు, వయస్సు: 38 సం.లు, ఉద్యోగి, ఫ్లాట్ నెం. 103, ఫస్ట్ ఫ్లోర్, అన్య రెసిడెన్సీ మాచబొల్లారం, జనప్రియ అపార్టుమెంట్ ప్రక్కన అల్వాల్, బొల్లారం, హైదరాబాద్ -10

పై నెంబరు పిటీషన్లో రెస్పాండెంటు నెం.4కి నోటీసులు పేపరు ప్రకటన ద్వారా సర్వు చేయించుటకు శ్రీ కోర్టు వారు పై పిటీషన్ ను ది.02-12-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు తేదిన ఉ.గం.10.30 లకు పై కోర్టులో నాల్గవ రెస్పాండెంటు స్వయంగా గాని, వారి అడ్వకేటు గారి ద్వారా గాని పై కోర్టులో పై తేదిన హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల పై నెంబరు గల పిటీషన్ 4వ రెస్పాండెంట్ పరోక్షమందు వారికి వ్యతిరేకంగా తీర్మానించబడునని యిందుమూలముగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

గుడివాడ,
ది.21-11-2024

కె.వి. రామకృష్ణారెడ్డి
అడ్వకేట్, గుడివాడ
PH: 9490881180

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, R.R. DISTRICT AT: L.B.NAGAR
L.A.O.P.No.111 of 2010

Between:
P.Anantha Raju & Others. ...Claimants
And
The Spl.Grade Deputy Collector I.A.P., Shamshabad. ... Respondent

NOTICE FOR APPEARANCE

To
1.P.Anantha Raju
2.Shaik Jaffar-Bao-Vazar
3.Md. Aziz Laddiq
4.Shaik Ahmed Ayoola
5.Shaik Rukia
7.Ismail Bai

All are residents of Mamidipally Village, Saroornagar Mandal, Ranga Reddy District.

That the above named Claimant Nos.1 to 5 &7 in L.A.O.P.No.111 of 2010. It is submitted that the above LAOP is referred U/s. 30 of the Land Acquisition Act, in respect of the acquired lands covered under the above LAOP in Sy. No.73 admeasuring Ac.: 0-0250 gts., of Mamidipally Village, erstwhile Saroornagar Mandal presently Balapur Mandal of Ranga Reddy District acquired by the Referring Officer in Procgs. No.C/17/2007 since there is a dispute with regard to the title between the Claimants and the same was referred to this Hon'ble Court under the above LAOP for adjudication. The case is posted to 17-12-2024 for your appearance before the Hon'ble Court at 10.30 a.m., on 17-12-2024 either in person or through Advocate duly instructed by you to put forth the objection by you otherwise, the matter will be decided as per Law.

(BY ORDER OF THE COURT)
Sd/-
M.RAJ KUMAR,
Government Pleader,
Flat No.103, Sai Residency, Sirinagar, LB Nagar, Hyderabad.
Mob. 9989525927/9848057170
Chambers at Room No.27, District Court Complex, L.B.Nagar , Hyd., Cell No.9912658614

PUBLIC NOTICE

Under the instruction of my client M/s. Theme Ambience Constructions Pvt. Ltd. Having its registered office at 8-2-293/8/2/L/1-B, Plot No.12, MLA Colony, Banjar Hills, Hyderabad rep. by its Director Mr. Bimal Kedia, who has instructed me to issue the public notice:

This is to inform the General Public at large that my client had filed **SLP. (Civil) NO. 25280/2024,** On the file of the Hon'ble Supreme Court of India against Mr. Sajjan Raj Jain and others, aggrieved by the orders passed by High Court for the State of Telangana at Hyderabad in **CMA No.462 of 2024 orders dated 13-09-2024,** confirming the orders passed in Arb Op No.82 of 2022 on file of the X Additional chief Judge, City Civil Court at Hyderabad. That the Hon'ble Supreme Court of India had by order dated 5.11.2024 passed in **SLP (Civil) No.258280/2024,** was pleased to direct the parties to maintain '**Status quo**' in respect of the property i.e. Land admeasuring Acres 6-00 Guntas in part of survey No.102/4/2 of Hakimpet Village corresponding to T.S. No. 1, part 3, Block J, Ward 12 and 29 Part , Ward 9 Block J, situated at Road No 12, Banjara Hills, Shaikpet Mandal, Hyderabad.

That it has come to the notice of my client that Mr. Sajjan Raj Jain and others, are trying to deal with the above-mentioned property, which is subject matter of **SLP. (Civil) No.25280/2024,** and the same is pending on the file of Hon'ble Supreme Court of India.

That the members of the general public are hereby cautioned not to deal with Mr. Sajjan Raj Jain and others in respect of above-mentioned properties. That in spite of this public notice any person enter into any agreement in respect of the above mentioned property the same shall be at their sole risk and consequences and the same shall not be binding on my client.

DIVYA RAI, Advocate
#302,3rd Floor, Thirath Towers, Road No.7, Banjara Hills, Hyd-034, Tel-9110314175

IN THE COURT OF HON'BLE IX ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT, AT: HDYERABAD.
A.S.No.165 OF 2023

Between:
M/s.Sri Durga Fabricators, Rep. by it's Sole Proprietor, P.Srinivasu ...APPELLANT
AND
1.M/s.Muktar Steels Pvt. Ltd, Rep by Its Director & 2 Others. ...RESPONDENTS

To
M/s.Muktar Steels Pvt.Ltd, Rep by Its Director Mukul Agarwal, S/o.Madanlal Agarwal, Occ: Director, Muktar Steel P. Ltd, R/o. No. 3-5-141/3/3, Eden Gardens, Ramkoti, Hyderabad. & R/o.H.No. 17, 3rd Floor, Motilal Nagar, Hyderabad. (Respondent No. 1)

Sir,
Please take notice that the Appellant herein has filed the above Appeal, questioning the Order and Decree in E.A. No. 870 of 2014 in E.P.No.168 of 2013 in O.S.No.2261 of 1988. The said Appeal A.S.No.165 of 2023 is posted to 20-12-2024, for your appearance. If you fail to appear on the said date at 10-30 a.m. through your Counsel or in Person before the Hon'ble Court you will be set Ex-parte,

//BY THE ORDER OF THE HON'BLE COURT//
C.V.NARAYAN RAO.
Advocate
OFFICE: Flat No. 303, 4th Floor H.No. 3-4-543 & 544 Laxminilayam, Narayanguda Hyderabad-500 027

IN THE COURT OF CHIEF JUDGE-CUM-MACT, CITY CIVIL COURTS.At: Chatta Bazar, Hyderabad.
MVOP.No.1272 of2024
BETWEEN:

Anil Kumar, ...Petitioner/s
AND:
Kamala Hasan Lingampally, & Anothers. ...Respondent/s.

To,
Prabhakara Rao.K. @ Prabhakar Rao Kurapati, S/o:Sadhasiva Rao.K., Age:54 years, Occ: Rider, R/o: Flat No:358, Janapriyasai Nest, SR Naik Nagar, Jeedimetla, RR Dist. Ph.No:9666734528

Take this Notice that the petitioner herein has filed the above M.V.O.P. against you and another respondent by claiming compensation before the above mentioned Court. Hence the above M.V.O.P. is posted for your appearance and counter. If you fail to appear before the above mentioned Court on 25-11-2024 by 10.30 a.m., the matter will be decided in your absence.

(By Order of the Court)
PUTTA THIRUPATHI REDDY
ADVOCATE
Flat No:1, Ravi Residency Apartment, H.No:13-4-48/F/1, Opp: Central Bank of India, left side to Rajadhani Theater, Vikas Nagar, Dilsukh Nagar, Hydrabad (Town & Dist.) Telangana (State), PIN:500060. Phone: 9440687160.

CHANGE OF NAME

I, **KOTHA SREENIVASA REDDY (OLD NAME) S/o. K. CHANDRA REDDY** R/o. FLAT No: 301, PLOT NO: 110. SRI HANSUJA NIVAS, TYAGARAYA NAGAR, HAYATA NAGAR, K.V RANGA REDDY (Dist,) Telangana 501505
I Have changed My Name AS **KOTHA SRINIVAS REDDY** (New Name)

IN THE COURT OF HON'BLE IX ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT, AT:HDYERABAD.
A.S. No. 157 OF 2023

Between:
M/s.Madhavi Engineering Co. A Sole Proprietor Concern, Rep. its Proprietor T. Koteswar Rao. ...APPELLANT
AND
1.M/s.Mukar Steels Pvt. Ltd, Rep by Its Director & 2 Others ...RESPONDENTS

To,
1.M/s.Mukar Steels Pvt.Ltd, Rep by Its Director Mukul Agarwal S/o. Madanlal Agarwal, Occ: Director, Muktar Steel P. Ltd, R/o.No.3-5-141/3/3, Eden Gardens, Ramkoti, Hyderabad. & R/o.H.No.17, 3rd Floor, Motilal Nagar, Hyderabad. (Respondent No. 1)

Sir,
Please take notice that the Appellant herein has filed the above Appeal, questioning the Order and Decree in E.A.No.871 of 2014 in E.P.No.168 of 2013 in O.S.No.2261 of 1988. The said Appeal A.S.No.157 of 2023 is posted to 20-12-2024. for your appearance. If you fail to appear on the said date at 10-30 a.m. through your Counsel or in Person before the Hon'ble Court you will be set Ex-parte.

//BY THE ORDER OF THE HON'BLE COURT//
C.V.NARAYAN RAO.
Advocate
Flat No. 303, 4th Floor H.No. 3-4-543 & 544 Laxminilayam, Narayanguda Hyderabad-500 027

IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI, AT: MALKAJGIRI
O.S.No.781 OF 2022

BETWEEN:
G.Bikshapathi & others ...Plaintiffs
AND
1.The Tahsildar, Uppal Mandal, Uppal.
2.All concerned. ...Defendants

To,
All Concerned. ...Defendant No.2

Please take notice that the above named Plaintiff has filed a suit for Declaration to declare the Plaintiff as legal heir of Late G.Bala Krishna and the same is stand posted to 18-12-2024, if anybody having any objection in the above suit, appear at 10:30 a.m. before this Hon'ble Court in person or by an Advocate, failing which the Hon'ble Court will proceed with the matter as per the law.

//By order of the Hon'ble Court//
S.BASTAWALA
G.PADMA, Advocates
Office at Mehdipatnam, Hyderabad, T.S.
Cell No.7337423201

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE SANGAREDDY
M.V. O.P. No. 17 OF 2019

Between
Cheruvukindi Hameed & another ... Claimants
And
Thummala Ramakrishna & Others .....Respondents

To,
Smt. Thummala Jyothi w/o Ramakrishna, aged about 50 years, occu: Not known, R/o H.No. 5-5-35/315/6/4, Saibaba Nagar, Kukatpally, Hyderabad.
(owner of Vehicle No. A.P. 28 CE, 4726) .... Respondent No. 3

Whereas the above named Claimants have made applications to this Court for grant of compensation under Motor Vehicles Act on account of death of their Son in a motor vehicle accident.

Take notice that you wanted to appear in this Court in Person or by a pleader duly instructed on 28-11-2024 at 10-30 A.M.. to show cause against the said application, failing which the said application will be heard and determined ex-parte.

Given under my hand and the seal of the Court.

M. GOVERDHAN RAO
MD. SADATH ALI
V. VIJAY KUMAR
ADVOCATES
SANGAREDDY.
Ph. 9849085159

IN THE COURT OF THE M.A.C.T CUM-CHIEF JUDGE, CITY CIVIL COURTS, AT: HYDERABAD.
O.P.No.991 of 2024

Between:-
1.Vavilala Swarajyam ...Petitioner
And
1.Vijay Sagar Reddy Shamala.
2.Mr.Sudheer Reddy Shamala.
3.TATA AIG General Insurance Co-Ltd. ...Respondents

To,
(R-1) Vijay Sagar Reddy Shamala S/o.Shamala Lordu Reddy, (Age: 42 yrs, Occu: Private Job, R/o Patigadda Village, R/m Keshampet, Dist. Ranga Reddy-509408. (Driver of Motor Car No.TS 07 HB 5797)
(R-2)Mr.Sudheer Reddy Shamala, S/o Not Known, (Age: Major, Occ: Business, R/o.H.No.7-32, Madhapuri Colony, Dilsuknager, Dist. Ranga Reddy-500060. (Owner of Motor Car No. TS 07 HB 5797)

Take notice that the above named petitioner has filed the above O.P for compensation, against you i.e., Respondent No.1 & 2, for the injuries sustained by the Petitioner, in a road accident. The same is posted to 02-12-2024, for your appearance. Therefore you are hereby informed and required to appear before the above court On 02-12-2024, at about 10-30 AM, by person or through pleader, failing which orders will be passed in your absence.

//BY ORDER OF THE COURT//
Gulam Amjad,
Advocate for Petitioner,
Tolichowki, Hyderabad.
Cell No. 9440423753

IN THE COURT OF HON'BLE CHAIRMAN MACT CUM PRL. DISTRICT JUDGE AT VIKARABAD.
EP.NO. 21 OF 2024
IN
MVOP.NO. 37 OF 2014

Between :
B. Ravindra Kumar ...Petitioner/Decree Holder
And
Mohd. Nadeem & another ....Respts/Judgement Debtor

Summons/Notice to Judgement Debtor No.1 (U/o V Rule 20 of CPC)

To
Mohd. Nadeem S/o. Mohd. Tajuddin, Aged Major, Occ : Business, R/o. H.No.9-2-48/2B, Muslim Basti Lane, Hashmathpet, Shamirpet, R.R.Dist - 500078. ...JDR No.1

Take notice that the above EP is filed against you and the summons/ notices could not be served in ordinary way through court and RP inspite of several processes and hence the Hon'ble court ordered for substitute service and the same is posted on 03-12-2024 for your appearance.

Therefore you are required to be present in the court of **Hon'ble Prl.District & Sessions Judge** at Vikarabad either personally or through an Advocate at **10.30 AM on 03-12-2024**, along with proper documents, failing which the EP will be decided on the basis of material available before the Hon'ble Court.

Hence this Notice

//BY THE ORDER OF THE HON'BLE COURT//
N.BASWARAJ
V.TULSI RAM
ADVOCATES
Vikarabad,
Cell No.9440710900

మహారాజశ్రీ కృష్ణా జిల్లా, గుడివాడ 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 780/2023
ఇన్
ఓ.యస్.నెం. 90/2017

బిట్వీన్:
రామినేని భగవతి, వారి తరపున జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హెూల్డర్ అయిన రామినేని వెంకటేశ్వర ప్రసాద్ .....పిటీషనర్ / వాది
(1) వడ్లమూడి తాండవ కృష్ణ సత్యనారాయణ బాబు మరియు యితరులు .....రెస్పాండెంట్లు / ప్రతివాదులు

రెస్పాండెంట్ నెం.3
వడ్లమూడి జాహ్నవి, భర్త: టి. ప్రశాంత్ హిందువు, వయస్సు: 38 సం.లు, ఉద్యోగి, ఫ్లాట్ నెం. 103, ఫస్ట్ ఫ్లోర్, అన్య రెసిడెన్సీ మాచబొల్లారం, జనప్రియ అపార్టుమెంట్ ప్రక్కన అల్వాల్, హైదరాబాద్ - 10

పై నెంబరు పిటీషన్లో రెస్పాండెంటు నెం.3కి నోటీసులు పేపరు ప్రకటన ద్వారా సర్వు చేయించుటకు శ్రీ కోర్టు వారు పై పిటీషను ది.02-12-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు తేదిన ఉ.గం.10.30 లకు పై కోర్టులో మూడవ రెస్పాండెంటు స్వయంగా గాని, వారి అడ్వకేటు గారి ద్వారా గాని పై కోర్టులో పై తేదిన హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల పై నెంబరు గల పిటీషన్ 3వ రెస్పాండెంట్ పరోక్షమందు వారికి వ్యతిరేకంగా తీర్మానించబడునని యిందుమూలముగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

గుడివాడ,
ది.21-11-2024

కె.వి. రామకృష్ణారెడ్డి
అడ్వకేట్, గుడివాడ
PH: 9490881180

IN THE COURT OF THE HON'BLE IX ADDITIONAL DISTRICT JUDGE, AT: L.B.NAGAR.RANGA REDDY
I.A.NO. OF 2024
IN
I.A.NO.136 OF 2022
IN
O.S.NO.42 OF 2016

Between:
Vanaja @ T.Jayamma & Others ...Petitioners/Plaintiffs
VS
Sangam Gopal & Others ...Respondents/Defendants

NOTICE/SUMMONS

To,
J.Shyam Sunder S/o Ramanatham Joojuri, aged about 58 yrs, Occ:Business, R/o H.No.4-1-1210/1, Boggulakunta, Abids, Hyd.

Sir,
Please take notice/summons that the above named Petitioners/ plaintiffs have filed the above I.A. for restoration of the 1.A./Suit in above mentioned suit for partition and separate possession in respect of Petition/plaint schedule described land bearing Sy.No.99, adm,, AC.3-24 Gts., situated at Himayathnagar, Village, Moinabad Mandal, F..R.Dist.

In the above case you are the Respondent No.11 and the above case is posted on 27-11-2024 for your appearance.

Therefore, make it convenient to present yourself either in person or through authorized agent before the above mentioned court at 10-30 AM on 27-11-2024. Otherwise the matter will be decided in ex-parte.

(By order of the Court)
Sd/ -
S.Cnaneshwar Goud,
Advocate
1-36, Himayathnagar, Moinabad Mandal, R.R.Dist. 500075,
Cell No.6303481425, 9985522509

IN THE COURT OF HON'BLE CHAIRMAN MACT CUM PRL. DISTRICT JUDGE AT VIKARABAD.
EP.NO. 19 OF 2024
IN
MVOP.NO. 38 OF 2014

Between :
M. Baswaraj ...Petitioner/Decree Holder
And
Mohd. Nadeem & another ....Respts/Judgement Debtor

Summons/Notice to Judgement Debtor No.1 (U/o V Rule 20 of CPC)

To
Mohd. Nadeem S/o. Mohd. Tajuddin, Aged Major, Occ : Business, R/o. H.No.9-2-48/2B, Muslim Basti Lane, Hashmathpet, Shamirpet, R.R.Dist - 500078. ...JDR No.1

Take notice that the above EP is filed against you and the summons/notices could not be served in ordinary way through court and RP inspite of several processes and hence the Hon'ble court ordered for substitute service and the same is posted on 03-12-2024 for your appearance.

Therefore you are required to be present in the court of **Hon'ble Prl. District & Sessions** Judge at Vikarabad either personally or through an Advocate at **10.30 AM on 03-12-2024,** along with proper documents, failing which the EP will be decided on the basis of material available before the Hon'ble Court.

Hence this Notice

//BY THE ORDER OF THE HON'BLE COURT//
N.BASWARAJ
V.TULSI RAM
ADVOCATES
Vikarabad,
Cell No.9440710900

మహారాజశ్రీ కృష్ణా జిల్లా, గుడివాడ 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 777/2023
ఇన్
ఓ.ఎస్.నెం.49/2012

బిట్వీన్:
రామినేని అభిరామ్, వారి తరపున జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హెూల్డర్ అయిన రామినేని వెంకటేశ్వర ప్రసాద్ ....పిటీషనర్ / వాది
(1) వడ్లమూడి తాండవ కృష్ణ సత్యనారాయణ బాబు మరియు యితరులు .....రెస్పాండెంట్లు / ప్రతివాదులు

రెస్పాండెంట్ నెం.5
వడ్లమూడి జాహ్నవి, భర్త: టి. ప్రశాంత్ హిందువు, వయస్సు: 38 సం.లు, ఉద్యోగి, ఫ్లాట్ నెం. 103, ఫస్ట్ ఫ్లోర్, అన్య రెసిడెన్సీ మాచబొల్లారం, జనప్రియ అపార్టుమెంట్ ప్రక్కన అల్వాల్, హైదరాబాద్ - 10

పై నెంబరు పిటీషన్లో రెస్పాండెంటు నెం.5 కి నోటీసులు పేపరు ప్రకటన ద్వారా సర్వు చేయించుటకు శ్రీ కోర్టు వారు పై పిటీషన్ను ది.02-12-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు తేదిన ఉ.గం.10.30 లకు పై కోర్టులో ఐదవ రెస్పాండెంటు స్వయంగా గాని, వారి అడ్వకేటు గారి ద్వారా గాని పై కోర్టులో పై తేదిన హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల పై నెంబరు గల పిటీషన్ 5వ రెస్పాండెంట్ పరోక్షమందు వారికి వ్యతిరేకంగా తీర్మానించబడునని యిందుమూలముగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

గుడివాడ,
ది.21-11-2024

కె.వి. రామకృష్ణారెడ్డి
అడ్వకేట్, గుడివాడ
PH: 9490881180

సత్యానగర్‌లో పోలీసుల తనిఖీలు



నవతెలంగాణ- కొత్తపేట

సత్యానగర్, న్యూ మారుతి నగర్‌లలో పోలీసులు బృందం గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత కొంతకాలంగా గంజాయిపై ఉక్కు పాదం మోపినట్టు పేర్కొన్నారు. అందులో భాగంగానే తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు. బండ్లు, ఆటోలు, కార్లు, పలు వాహనాలను తనిఖీలు చేసినట్టు వెల్లడించారు. సీఐ వెంట ఎస్ఐ భద్రయ్య, ఏఎస్ఐలు, కానిస్టేబుల్స్ తదితరులు ఉన్నారు.

యువకుడి అదృశ్యం



నవతెలంగాణ- నాగోల్

ఓ యువకుడు అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ ఎ. సూర్య నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ డివిజన్ పరిధిలోని జైపూర్ కాలనీ రోడ్ నెంబర్ 3 లో నివాసం ఉంటున్న నల్లగట్టు మహేష్..పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 20న సాయంత్రం ఆరున్నర గంటల ప్రాంతంలో భోజనంలోకి పెరుగు తెస్తానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లాడు. కానీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతని సెల్ ఫోన్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్‌లో వస్తుంది. బాధితుడి భార్య ఇంట్లో వెతకగా సిమ్ కార్డ్‌ని ఇంట్లోనే వదిలేసి, కేవలం ఫోను మాత్రమే తీసుకొని వెళ్ళినట్లు గమనించారు. అతని ఆచూకీ కోసం పరిసర ప్రాంతాలలో, బంధు మిత్రుల వద్ద విచారించినా ఫలితం లేకపోయింది. వెంటనే అతని భార్య నల్లగట్టు పూజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సూర్య నాయక్ తెలిపారు.

డ్రయినేజీ పైప్‌లైన్‌ను పొడగించాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ నుండి మస్కృతి డైరీ మీదుగా 22వ వార్డు ముగింపు సుందరయ్య నగర్ కాలనీ వరకు మాత్రమే వేస్తున్న అంతర్గత డ్రైనేజీ పైప్‌లైన్‌ను మునగనూర్ చెరువు వరకు పొడగించాలని కోరుతూ గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయాంజాల్ మున్సిపల్ కన్వీనర్ డి.కిషన్ మాట్లాడుతూ.. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని కమ్మగూడ గ్రామంలోని 22వ వార్డు సాయిప్రియ నగర్, మస్కృతి డైరీ, హైకోర్టు కాలనీ, ప్రగతి నగర్ కాలనీ, నవ భారత్ కాలనీ, ఆర్టీసీ కాలనీ తదితర చుట్టుపక్కల కాలనీల నుంచి వస్తున్న డ్రైనేజ్ వాటర్ పైప్‌లైను సుందరయ్య కాలనీ దగ్గరలో వదిలేయడం జరిగిందన్నారు. దీంతో ఇప్పటికే ఆ ప్రాంతంలో మురుగనీరు జామై తీవ్ర దుర్వాసన వస్తుందని.. లక్ష్మీనగర్, ఇందిరమ్మ కాలనీ, సుందరయ్య కాలనీ ప్రజలు డెంగ్యూ లాంటి విష జ్వరాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే కాకుండా శ్రీ శ్రీనివాస కాలనీ, లక్ష్మీ నగర్, ఇందిరమ్మ కాలనీ, సుందరయ్య కాలనీ, శ్రీరంగాపురం, ఆపిల్ ఎవెన్యూ కాలనీలో డ్రైనేజీ వాటర్ కూడా ఇక్కడి నుండే వెళ్తుంది కనుక ఈ యొక్క పైప్ లైన్ సైజు పెంచి 23 మరియు 24వ వార్డు గుండా తొర్రూరు రోడ్డు వరకు పొడిగించాలని అధికారులను కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఐ(ఎం) పార్టీ మున్సిపల్ నాయకులు ఇంజాపూర్ జోన్ బాధ్యులు యం.సత్యనారాయణ, సుందరయ్య కాలనీ సీపీఐ(ఎం) పార్టీ శాఖ కార్యదర్శి పొట్టేలు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

నేరాలను అరికట్టడంలో

సీసీ కెమెరాల పాత్ర కీలకం

- ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య





నవతెలంగాణ -నాగోల్

నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని మధురానగర్ ఫేస్ టు కాలనీలో నూతనంగా ఒక లక్ష 60 వేల రూపాయలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్‌తో కలిసి గురువారం ఏసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తాయని అన్నారు. సీసీ కెమెరాల ఆధారంతో నేరాలకు పాల్పడిన వారిని గుర్తించి, జైలుకు పంపించిన ఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. మధురానగర్‌ను ఆదర్శంగా తీసుకొని నాగోలు డివిజన్లోని మరిన్ని కాలనీలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్నారని, అటువంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా మాదకద్రవ్యాలకు అలవాటు పడి యువత తమ బంగారు భవిష్యతును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్‌ను కాపాడాల్సిన అవసరం ఉందని తల్లీదండ్రులకు సూచించారు. శాంతి భద్రతలను కాపాడేందుకు సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

నాగోల్ సీఐ సూర్యనాయక్ మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల కాలనీలలో ఈవ్‌టీజింగ్, దొంగతనాలను అరికట్టగలుగుతామని అన్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. కార్యాలయాలు, వీధులలో కాకుండా ప్రతి ఇంట్లోనూ వ్యక్తిగతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. యువత అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సూర్య నాయక్, ఎస్ఐ శివ నాగప్రసాద్, కాలనీ ప్రెసిడెంట్ ధనరెడ్డి,సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, కాలనీ సభ్యులు మనిదీప్, సూర్య ప్రకాష్, సాయికిరణ్, వెంకటేష్, అరుణ్ యాదవ్, కార్తీక్, సురేష్, నాయకులు డప్పు రాజు, పాల్వాయి సంజీవ రెడ్డి, రావుల శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, ప్రభాకర్ గౌడ్, రాధిక, సంతు, శివ, మధుర నగర్ కాలనీ అధ్యక్షులు ధనరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నగర సుందరీకరణకు పెద్దపీట





జంక్షన్లు, ఫ్లైఓవర్లు, పార్కులు, వివిధ రకాల సుందరీకరణకు జీహెచ్ఎంసీ ప్రణాళికలు సిద్ధం చేసింది.

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ అంతర్జాతీయ గ్రీన్ సిటీగా అవార్డును దక్కించుకున్న విషయం తెలిసిందే. గ్రేటర్ హైదరాబాద్‌లో చేపట్టిన పచ్చదనం నేపథ్యంలో నగరంలో కాలుష్య రహిత వాతావరణం కల్పించేందుకు వినూత్న పద్ధతిలో పచ్చదనం పెంపొందించడంతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఫారెస్ట్ విస్తీర్ణం కావడంతో జాతీయంగా గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే సుందరీకరణ నగరంగా గ్రేటర్ హైదరాబాద్‌ను తీర్చిదిద్దే క్రమంలో 6 జోన్‌లో జీహెచ్ఎంసీ కార్యరూపం దాల్చింది. ఇంతకు ముందు గ్రేటర్‌లో పాదాచారులకు ప్రయోజనాలు కల్పించి ప్రమాద రహితంగా జంక్షన్‌లను అభివృద్ధి చేశారు. ఈ జంక్షన్‌లలో పాదాచారుల భద్రతతో పాటుగా సుందరీకరణకు ప్రాధాన్యత ఇచ్చారు. అందులో కొన్ని సీ.ఎస్.ఆర్ పద్ధతిలో చేపట్టుటకు ముందుకు రావడం జరిగింది. ఈ జంక్షన్ అభివృద్ధిలో పాదచారులకు ఎక్కువగా ట్రాఫిక్ ఉన్న సందర్భంలో రోడ్డు దాటకుండా ఉండేందుకు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ లేని సమయంలో పాదాచారులు ఎలాంటి ప్రమాదం సంభవించకుండా రోడ్డు దాటేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఫ్లై ఓవర్ల వద్ద కళాత్మక చిత్రలేఖనాలు, ముఖ్యంగా భావి తరాలను ప్రభావితం చేసే విధంగా కళాత్మకంగా తీర్చిదిద్దారు. ఫ్లై ఓవర్ పిల్లర్స్ కొన్ని చోట్ల ఉద్యానవన పెయింట్స్ వెరైటీ థీమ్స్‌తో కళాత్మక చిత్రాలు వేశారు. సెంట్రల్ మీడియం, జంక్షన్‌లలో శిల్పాలు, ఆకర్షించే ప్రత్యేక థీమ్‌లతో నగరాన్ని సుందరంగా ముస్తాబు చేసేందుకు జీహెచ్ఎంసీ ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలో గ్రేటర్ వ్యాప్తంగా సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో ఆరు జోన్ల పరిధిలో రూ. 149.84 కోట్ల అంచనా వ్యయంతో 224 సుందరీకరణ పనులు చేపట్టగా అందులో రూ. 5.33 కోట్ల విలువ గల 15 పనులు పూర్తి కాగా మిగతా 209 పనులు వివిధ ప్రగతి దశలో కలవు. చిన్నారులకు, యువతకు స్ఫూర్తినిచ్చేలా సుందరీకరణ పనులు చేపట్టినట్లు పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.



ఆశ్రమంలో మహిళ మృతి



నవతెలంగాణ-నాగోల్

మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళ ఆశ్రమంలో మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్న సమయంలో తట్టిఅన్నారం పరిధిలోని ఆర్కేనగర్‌లో ఓ గుర్తు తెలియని మహిళ(30) మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు స్థానికులు గుర్తించి.. నాగోలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని మహిళ వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆమె పేరు చెప్పలేకపోయింది. తర్వాత ఆమెను అబ్దుల్లాపూర్మెట్ ప్రాంతంలోని ఆలేటి ఆశ్రమంలో చేర్చారు. ఆ మహిళ అనార్యోగంతో మృతి చెందినట్లు నాగోలు పోలీసులకు సమచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఆమె మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనార్యోగం, ఇతర సమస్యలతో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

తండ్రి లేని అమ్మాయి పెండ్లికి

ఉప్పల ఫౌండేషన్ చేయూత



నవతెలంగాణ- నాగోల్

తండ్రి లేని నిరుపేద అమ్మాయి వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త మంగళసూత్రం, మెట్టెలు, చీరలతో పాటు గాజులను అందజేసి చేయూత నిచ్చింది. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కర్మన్‌ఘాట్ ప్రాంతానికి చెందిన శిరీష వివాహానికి తోచిన సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని కోరుతూ గురువారం నాగోలు డివిజన్‌లోని కో ఆపరేటివ్ బ్యాంకు కాలనీలో ఉన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసంలో శిరీష కుటుంబ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగాకలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసగుప్త వారి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత శ్రీనివాస గుప్త తన సతీమణి ఐవీఎఫ్ ప్రథమ మహిళా ఉప్పల స్వప్నల చేతుల మీదుగా మంగళసూత్రం, మెట్టెలు, చీర, గాజులను వారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ఆడపిల్లల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక మందికి చేయూతనందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవాని తదితరులు పాల్గొన్నారు.



- చలికాలంలో స్నో ఫాల్స్‌తో పర్యాటకులకు ప్రత్యేక అనుభూతి
- పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా 2024 ప్రారంభం

నగరం నడిబొడ్డున సాగర తీరంలో

ఆకట్టుకుంటున్న కాశ్మీర్ అందాలు




నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి ఒక్కరూ వారి జీవితంలో ఒకసారైనా కాశ్మీర్ అందాలను చూడాలనుకుంటారు. చలికాలంలో ప్రత్యేకంగా కురిసే మంచు అందాలను చూడాలంటే కాశ్మీర్ వెళ్లాల్సిందే. అలాంటి కాశ్మీర్ అందాలను నగరం నడి ఒడ్డున హైదరాబాద్లో పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా 2024 పేరుతో ఏర్పాటు చేశారు. కాశ్మీర్‌లో కనిపించే అద్భుత అందాలను నగరవాసులకు కళ్ళకు కట్టినట్టు కనువిందు చేసేలా ఏర్పాటు చేసేందుకు గత 15 రోజులుగా తమిళనాడు, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర నుంచి వందలాది కార్మికులు పనిచేసి కాశ్మీర్ అందాలకు ప్రాణం పోసినట్లు నిర్వాహకుడు బేక్ తెలిపారు.

మైనస్ 5 డిగ్రీలలో మంచు కురుస్తుంటే ఎగ్జిబిషన్ లోపలికి వెళ్లే విధంగా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ అందాలను సెల్ఫీన్లో ఫోటోలు తీసుకుంటూ కుటుంబ సమేతంగా కాశ్మీర్ వెళ్లిన అనుభూతిని పొందవచ్చు. గురువారం పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటుచేసిన వింటర్ ఉత్సవ్ మేళాను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు. ఈ ప్రత్యేక అనుభూతిని ప్రతి ఒక్కరూ చూసి అనుభూతి పొందాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

వింటర్ ఉత్సవ మేళాలో 200 స్టాల్స్‌లలో కాస్మోటిక్, తినుబండరాలు, గృహపకరణ వస్తువులు వివిధ రకాల దుస్తులు, చలికాలంలో ధరించే స్వెటర్స్ బ్లౌజులు అన్ని ఇక్కడ లభిస్తాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎంయూస్మెంట్ రైట్స్ లో పిల్లలు పెద్దలు ఆహ్లాదంగా గడపవచ్చు. వింటర్ ఉత్సవ్ మేళ ప్రతిరోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు సందర్శకుల కోసం అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు మీర్జా రఫీక్ ఈ సందర్భంగా తెలిపారు.





'26న సీపీఐ నియోజకవర్గ సమావేశం'



నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్

ఆర్కేపురం డివిజన్ బాబు జగ్జీవన్ రావు భవన్‌లో ఈ నెల 26న సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ సమావేశం నిర్వహించనున్నట్టు సీపీఐ నాయకులు అందోజు రవీంద్ర చారి తెలిపారు. ఈ సమావేశానికి సంబంధించిన కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ సీపీఐ శత జయంతి ఉత్సవాలను ఈ నెల 26న బాబు జగ్జీవన్ రావు భవన్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అణగారిన వర్గాల సమస్యలు, హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ సీపీఐ అని కొనియాడారు. ప్రధానంగా దేశంలో మతోన్మాదం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కరపత్రాన్ని ఆవిష్కరించిన వారిలో నియోజకవర్గ పార్టీ కన్వీనర్ సామిడి శేఖర్ రెడ్డి, సరూర్ నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ, హయత్ నగర్ మండల కార్యదర్శి శ్రీదేవి, మండల సహాయ కార్యదర్శులు రాములు గౌడ్, కందుల సుధాకర్, నాయకులు నాగరాజు, సౌజన్య, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజలో ఉప్పల

నవతెలంగాణ -నాగోల్

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ సికింద్రాబాద్ జోన్ మరియు ఏపీఎస్ అడిక్మెట్ బౌద్ధ నగర్ల ఆధ్వర్యంలో శ్రీ కనకదుర్గ ఆలయంలో గురువారం నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజకు టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసగుప్త హాజరయ్యారు. తర్వాత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈ మహా పడిపూజ మహెూత్సవంలో పాల్గొన్న 400 మంది స్వాములకు శాస్త్రప్రీతి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కటకం శ్రీనివాస్ గుప్తా, నాగమల్ల సుధాకర్ గుప్తా, అల్లాడి శ్రీనివాస్, కూరాకుల సుధాకర్ గుప్తా, కల్వ వీరేందర్ గుప్తా, అమర పెంటయ్య పాత విశ్వనాథం గుప్త, సోమ మధుసూదన్ గుప్తా, బెలిదె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆ నొప్పి తగ్గించుకోవాలంటే...

నెలసరిలో చాలా మంది పొత్తి కడుపులో నొప్పితో ఇబ్బంది పడుతుంటారు. దీంతో పాటు కొందరికి అధిక రక్తస్రావం కూడా అవుతుంది. దీనివల్ల ఏ పనీ చేయకుండా రోజంతా నీరసంగా ఉంటారు. పీరియడ్స్‌లో ఆరు నుంచి ఏడు రోజుల వరకు బ్లీడింగ్ అనేది సాధారణమే. కానీ అధికంగా అయితే మాత్రం ప్రమాదమే. ఎక్కువ రోజుల ఇలానే అయితే రక్తహీనత, శ్వాస సమస్య, అలసట వంటి ఇతర అనారోగ్య సమస్యలు వస్తాయి. దీని నుంచి ఉపశమనం పొందాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. మరి అవేంటో చూద్దాం.

- పీరియడ్స్ బ్లీడింగ్ నుంచి ఉపశమనం పొందాలంటే సోంపు నీరు తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. సోంపు గింజలను డైరెక్ట్‌గా లేదా పౌడర్ చేసుకుని నీళ్లలో మరిగించాలి. ఆ తర్వాత ఈ నీటిని వడగట్టి తాగితే వెంటనే బ్లీడింగ్ అదుపులో ఉంటుంది.
- పొట్ట కింద ఐస్ ప్యాక్ పెట్టుకున్నా హెవీ బ్లీడింగ్‌ను తగ్గించడంతో పాటు పొత్తి కడుపులో వచ్చే నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
- ఒక టేబుల్ స్పూన్ మెంతులను నీటిలో వేసి బాగా మరిగించాలి. ఆ తర్వాత ఆ నీటిని వడకట్టి స్పూన్ తేనెలో కలిపి గోరు వెచ్చగా తాగాలి. రోజుకు రెండు సార్లు ఇలా చేయడం నొప్పి నుంచి విముక్తి పొందొచ్చు.
- పీరియడ్స్ సమయంలో తీవ్రంగా నొప్పి వస్తే నిద్రపోవడం మంచిది. నిద్రలోకి వెళ్లిన తర్వాత హార్మోన్ల స్థాయిలు నియంత్రణలోకి వస్తాయి. దీంతో బ్లీడింగ్, నొప్పి తగ్గుతాయి.
- పీరియడ్స్ సమయంలో అధికంగా రక్తస్రావం అయితే రక్తహీనత సమస్య బారిన పడతారు. ప్రతీ నెల ఇలానే అధికంగా జరుగుతున్నట్లయితే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది.



బెలగావి జిల్లా, రాయబాగ్ తాలూకాలో ఉన్న మంటూర్ అనే చిన్న గ్రామంలో ఓ అద్భుతమైన కథగా ఆవిష్కృతమయ్యింది మల్లవ్వ భీమప్ప. 48 ఏండ్ల ఆమె రెండుసార్లు గ్రామపంచాయతీ సభ్యురాలుగా పనిచేసి తన వర్గ ప్రజల పాలిట ఆశాజ్యోతిగా మారింది. తనకు అక్షరం ముక్క రాకపోయినా గ్రామంలోని విద్యార్థుల విద్యా ఆకాంక్షలకు మద్దతుగా నిలబడింది. గ్రంథాలయాన్ని స్థాపించేందుకు సిద్ధమయ్యింది. లైబ్రరీ నిర్మాణం కోసం తన పొదుపు డబ్బునే ఉపయోగించిన ఆమె స్ఫూర్తిదాయక పరిచయం మీ కోసం...

మల్లవ్వ గ్రంథాలయం..

సుమారు 6,000 మంది జనాభా ఉన్న మంటూరులో విద్యా వనరులు అంతంత మాత్రమే. గ్రామంలో ఒక ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉంది. ఉన్నత విద్య కోసం విద్యార్థులు గోకాక్ లేదా రాయబాగ్ వంటి పట్టణాలకు వెళ్లాలి. అంత దూరం ప్రయాణించడం, అందుబాటులో సరైన స్టడీ మెటీరియల్ లేకపోవడంతో గ్రామంలోని చాలా మంది పిల్లలు ఉన్నత విద్యకు దూరమయ్యారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన మల్లవ్వ ఈ విషయాన్ని గమనించి తీవ్ర ఆందోళనకు గురైంది. ఆమెకు చదవడం, రాయడం రాకపోయినా సరైన విద్యా అవకాశాలు లేకపోవడం పిల్లల అవకాశాలు, ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారిపై ఎలా ప్రభావం చూపుతుందో గమనించింది.

సవాళ్లను అధిగమిస్తున్నారు

స్మార్ట్‌ఫోన్‌లు, డిజిటల్ సాధనాలు ఆధిపత్యం చెలాయించే యుగంలో పుస్తకాల అవసరం ఎలాంటిదో మల్లవ్వకు స్పష్టంగా అర్థమయ్యింది. విద్యార్థులకు సరైన మెటీరియల్ అందుబాటులో ఉంటే వారు ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని గుర్తించింది. అంతేకాదు చదువుతో ఎలాంటి సవాళ్లనైనా అధిగమించగలరని విశ్వసించింది. 'విద్య, జ్ఞానం గ్రామానికి మరింత శ్రేయస్సును తీసుకురాగలవు' అని ఆమె బలంగా నమ్మింది. కనుక ఈ సమస్యను పరిష్కరించాలన్న ఆమె సంకల్పం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ముందుకెళ్లింది. తన ప్రతిపాదనను మంటూరు గ్రామ పంచాయతీ ముందు పెట్టింది. అయితే మిగిలిన సభ్యులందరూ ఆమె అభ్యర్థనను తిరస్కరించారు. కానీ ఆమె మాత్రం ఆగలేదు. గ్రంథాలయ స్థాపన తన చేతుల్లోకి తీసుకోవాలని నిర్ణయించుకుంది. పంచాయతీకి రెండుసార్లు పనిచేసిన సభ్యురాలిగా వ్యవస్థను ఎలా నావిగేట్ చేయాలో ఆమెకు బాగా తెలుసు. అయితే మద్దతు కోసం సంఘం వైపు మొగ్గు చూపింది.

లైబ్రరీని నిర్మించడం

గ్రామంలో 15 ఏండ్లుగా బీఎస్ఎన్ఎల్ మొబైల్ టవర్‌కు లీజుకు ఇచ్చిన భూమిని ఇటీవలే ఖాళీ చేయించిన బిర్సిద్దేశ్వర్ టెంపుల్ ట్రస్టును ఆమె ఆశ్రయించింది. టవర్ యంత్రాలను ఉంచేందుకు చిన్న ఫైబర్ బ్లాక్ అక్కడ ఏర్పాటు చేశారు. ఈ బ్లాక్‌ను లైబ్రరీగా మార్చేందుకు అనుమతి ఇవ్వాలని మల్లవ్వ ట్రస్టు సభ్యులతో మాట్లాడి ఒప్పించింది. ఆ బ్లాక్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో విద్యార్థుల కోసం మరో బ్లాక్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. అలా మల్లవ్వ తన వ్యక్తిగత డబ్బుతో కొత్త బ్లాక్ నిర్మాణం జరిగింది. ఆ అదనపు నిర్మాణం కోసం ఆమె రూ.1.2 లక్షలు వెచ్చించింది. ఈ మొత్తంలో కొంత భాగం గృహ లక్ష్మి యోజన నుండి పొందింది. మహిళలకు సాధికారత కల్పించే లక్ష్యంతో రూపొందించబడిన ప్రభుత్వ పథకం ఇది. అలాగే గ్రామస్తులు, స్థానిక వ్యాపారస్తుల ద్వారా మరో రూ.30 వేలు సేకరించింది. వడ్రంగి ఫర్నిచర్‌ను విరాళంగా ఇచ్చాడు.



మరికొందరు పుస్తకాలను అందించారు. ఇలా అందరి సహకారంతో మంటూర్ పిల్లలకు చక్కటి లైబ్రరీని ఏర్పాటు చేసింది. 'సంకల్ప గ్రామ సేవా సంఘం' బ్యానర్ కింద 2024, సెప్టెంబర్ 19న ఈ లైబ్రరీని స్థాపించింది. అప్పటి నుండి విద్యార్థులు చదువుకోవడానికి, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి, వారు కొనుగోలు చేయలేని, దొరకని పుస్తకాలను అందుబాటులో ఉంచడానికి ఇది ఒక గొప్ప ప్రదేశంగా మారింది.

విజన్ ఉన్న నాయకురాలు

మల్లవ్వకు విద్య లేకపోయినా ఆమె దృష్టి ఎప్పుడూ గ్రామ విద్యపైనే కేంద్రీకృతమై ఉంది. విద్యా వనరులు అందుబాటులో లేకపోవడం వల్ల ఆమె తన పిల్లలను కూడా చదివించలేకపోయింది. అయినప్పటికీ మనుషుల జీవితాల్లో విద్య తీసుకొచ్చే మార్పుపై ఆమెకు నమ్మకం ఉంది. అందుకే ఆమె తన చిన్న కోడల్ని ఉన్నత చదువులు చదివేందుకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందు బెంగళూరు వెళ్లేందుకు ప్రోత్సహించింది. మల్లవ్వ లైబ్రరీ ఏర్పాటు చేయడంతోనే తన పని పూర్తయినట్టు భావించలేదు. అది పటిష్టంగా, సమర్థవంతంగా పని చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇది గ్రామానికి దీర్ఘకాలిక ఆస్తిగా ఉండేలా చూసుకుంది. రాబోయే నాయకత్వం పట్ల ఆమె ఆలోచనాత్మక విధానానికి ఇది ఓ తార్కాణం. అలా లైబ్రరీ భవిష్యత్తు నిర్వహణకు కూడా ఆమె భరోసా ఇచ్చింది.

స్ఫూర్తిదాయకమైన రోల్ మోడల్

ఇతరులకు సాయం చేయాలంటే గొప్ప ధనవంతులే కానక్కర్లేదని మల్లవ్వ రుజువు చేసింది. చాలా మంది సమాచారం కోసం సాంకేతికతపై ఆధారపడే సమయంలో మల్లవ్వ పుస్తకాల విలువను, విద్యార్థులు తమ చదువుపై దృష్టి సారించే భౌతిక స్థలం అవసరాన్ని గుర్తించింది. గ్రామీణ సమాజంలో సాంకేతికత మాత్రమే పరిష్కరించలేని లోటును ఆమె ప్రయత్నాలు భర్తీ చేశాయి. గ్రంథాలయ సమస్య తాలూకా పంచాయతీ, గ్రామ పంచాయతీ పరిధిలోకి వస్తుంది. కనుక రాయబాగ్ తహశీల్దార్ సురేష్ ముంజే తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారితో కలిసి త్వరలో ఆ నూతన గ్రంథాలయాన్ని సందర్శిస్తానని, మల్లవ్వ గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. స్మార్ట్‌ఫోన్‌లు అనేక సౌకర్యాలు అందిస్తున్నప్పటికీ పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు పుస్తకాలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను యువతకు అందించాలని మల్లవ్వ అర్థం చేసుకుంది. కనుకను ఆమె చొరవ మంటూరు పిల్లలకు పెద్ద కలలు కనడానికి, కష్టపడి చదవడానికి, వారి జీవిత పథాన్ని మార్చడానికి అవసరమైన వనరులను అందించింది. ■

గజ గజ..

(మొదటిపేజీ తరువాయి)

ఎన్‌పీసీసీహెచ్‌హెచ్ ఇప్పటికే పబ్లిక్ అడ్వైజరీ విడుదల చేసింది. చలి గాలుల కాలం నవంబర్ నుంచి మార్చి వరకు ఉంటుందని సదరు అడ్వైజరీ హైలెట్ పేర్కొన్నది. ముఖ్యంగా, డిసెంబర్, జనవరి నెలల్లో తీవ్ర చలి పరిస్థితులు ఉంటాయని వివరించింది. చలితో ప్రభావితమయ్యే రాష్ట్రాలు, యూటీలను 'కోర్ కోల్డ్ వేవ్ జోన్'గా గుర్తించారు. ఇందులో తెలంగాణ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా వంటి రాష్ట్రాలు, యూటీలు ఈ జాబితాలో ఉన్నాయి. చలి గాలులతో చాలా జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్యనిపుణులు చెప్తున్నారు. అవసరమైతే తప్పితే, ఉదయం, రాత్రి సమయాల్లో బయటకు రావొద్దనీ, ఒకవేళ వచ్చినా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ బయట అడుగేయాలని అంటున్నారు. ఈ చలి గాలులు కొన్ని వర్గాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని తన అడ్వైజరీలో ఎన్‌పీసీసీహెచ్‌హెచ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో నిరాశ్రయులు, వృద్ధులు, నిరుపేదలు, గర్భిణీలు, పిల్లలు, బయటి పనులు చేసే కార్మికులు, రైతులు, రాత్రి శిబిరాల మేనేజర్లు ఉన్నారని వివరించింది.

తీవ్ర చలి పరిస్థితులతో ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదమున్నదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. చలిలో ఎక్కువగా ఉంటే హైపోథర్మియా(శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా తగ్గటం), ఫ్రోస్‌బైట్ (శరీర భాగాలపై ప్రభావం) వంటి సమస్యలు తలెత్తుతాయని ఎన్‌పీసీసీహెచ్‌హెచ్ అడ్వైజరీ పేర్కొన్నది. కొన్ని సందర్భాల్లో తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే మరణాలు కూడా సంభవించే ప్రమాదమున్నదని హెచ్చరిస్తున్నది. ఈ చలికాలంలో, ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, వృద్ధుల పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. నిరాశ్రయులు, నిరుపేదలు, యాచకుల విషయంలో ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకొని, వారిని తీవ్ర చలి గాలుల నుంచి కాపాడాలని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు.

పార్టీ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యం : మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యమిస్తామని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు అధ్యక్షతన గురువారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తిస్తుందని తెలిపారు. మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావుకు అసెంబ్లీకి పోటీ చేసే అవకాశం ఇవ్వడంతో పాటు పలువురు మహిళలకు కార్పొరేషన్ పదవులు కూడా ఇచ్చామని గుర్తుచేశారు. రాబోయే స్థానిక సంస్థలు, మార్కెట్ కమిటీల్లో మహిళలకు అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు.

ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే

ములుగు, జనగాం జిల్లాల్లో వంద శాతం పూర్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతోంది. జనగాం, ములుగు జిల్లాల్లో గురువారం నాటికి వంద శాతం సర్వే పూర్తయింది. నల్లగొండ జిల్లా 99.7 శాతం పూర్తిచేసుకుని వంద శాతం లక్షానికి చేరువలో ఉంది. కామారెడ్డి, మంచిర్యాల, యాదాద్రి భువనగిరి, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జోగులాంబ గద్వాల్, మహబూబ్‌నగర్, మెదక్, మహబూబాబాద్, పెద్దపల్లి, కొమరంభీం ఆసీఫాబాద్, నారాయణ్ పేట్, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 90 శాతానికి పైగా సర్వే పూర్తయింది. హన్మకొండ (75.7 శాతం), మెడ్చెల్ మల్కాజ్‌గిరి (71.2 శాతం) మినహా మిగతా జిల్లాల్లో 80 శాతానికి పైగా సర్వే పూర్తయింది. జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం కొంత మందకొడిగా సాగుతోంది. గురువారం నాటికి ఇక్కడ0.60 శాతం సర్వే పూర్తయింది.

మహిళా సాధికారతకు పెద్దపీట

రాష్ట్రంలో సిద్ధమవుతున్న 22 మహిళా శక్తి భవనాలు

శిల్పారామంలో 106 స్టాళ్లతో ఇందిరా మహిళా శక్తి బజార్

తొలివిడతలో 1000 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు

మొదటి దశలో 150 బస్సుల కొనుగోలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేసేందుకు, మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సీఎం సంకల్పంలో భాగంగా మహిళా స్వయం సహాయక బృందాలతో బస్సుల కొనుగోలు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, శిల్పా రామంలో ఇందిరా మహిళా శక్తి బజార్ల ఏర్పాటు పనులను ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ.. 22 ఇందిరా మహిళ శక్తి భవనాల నిర్మాణ పనులను 8 నెలల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికి శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్‌ను 106 షాపులతో ఏర్పాటు చేస్తున్నామనీ, డిసెంబర్ మొదటి వారంలోగా పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి బజార్‌లో నిత్యం వివిధ సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఐటీ, ఇతర వ్యాపార సంస్థలు ఆర్థిక చేయూతనిచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో అద్భుతంగా పొదుపు సంఘాలను నిర్వహిస్తూ, అధిక మొత్తంలో డబ్బును పొదుపు చేసిన మహిళా సంఘాలతో బస్సులను కొనుగోలు చేయించి టీఎస్ఆర్‌టీసీ ద్వారా నిర్వహించేందుకు తగు ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఈ సంఘాల ద్వారా మొత్తం 600 బస్సులను కొనుగోలు చేయించాలనీ, దీనిలో భాగంగా మొదటి దశలో 150 బస్సుల కొనుగోలు చేయించాలని సూచించారు. ఆ బస్సుల నిర్వహణ భాద్యతలను ఆర్టీసీ చూస్తుందని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా 4000 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామనీ, మొదటి దశలో 1000 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్ల ఏర్పాటు చేయిస్తున్నామని చెప్పారు. ఆ ప్లాంట్ల కోసం నీటిపారుదల, దేవాదాయ, ఆటవీ శాఖల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ఖాళీ భూములను లీజ్ పద్ధతిన సేకరించి ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు మహిళా సంఘాలకు జీరో వడ్డీ రుణాలను కూడా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు అనంతరం వాటి నిర్వహణ భాద్యతలను తెలంగాణ రెడ్కో, విద్యుత్ డిస్కమ్‌లకు అప్పగిస్తామని చెప్పారు. సమీక్షలో రవాణా, రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, పీసీసీఎఫ్ ఆర్ఎం. డోబ్రియల్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యావరణ, అటవీ శాఖ కార్యదర్శి అహ్మద్ నదీమ్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి డీఎస్.లోకేశ్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, సెర్ప్ సీఈవో దివ్య తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

24 వరకు ఫెస్టివల్ కొనసాగుతుంది

తెలంగాణ ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ మెట్టు సాయికుమార్




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో సచివాలయం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం గ్రౌండ్‌లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ మొదలైంది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఒగ్గుడోలు, డప్పు కళాకారులు, పిల్లలు తమ కళాప్రదర్శలతో హడావిడి చేశారు. మత్స్యకారుల సామాజిక తరగతి నుంచి తొలి ప్రొఫెసర్‌గా ఉన్న సుదర్శన్‌రావును, మత్స్యకార్మిక రంగం అభివృద్ధికి కృషి చేస్తున్న వారికి జ్ఞాపికలను అందజేశారు. ఇందులో ఆలిండియా ఫిషర్మెన్ కాంగ్రెస్ జాతీయ చైర్మెన్ ఆర్మ్‌స్టాంగ్ ఫెర్నాండో, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేశ్‌రెడ్డి, సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ అన్వేశ్‌రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రీయల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి, ఎస్టీ కార్పొరేషన్ చైర్మెన్ బెల్లయ్య నాయక్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతమ్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మెన్ జె.జైపాల్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య, తదితరులు పాల్గొన్నారు. ఫెస్టివల్ ప్రారంభ సభలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ..మత్స్యకార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. తెలంగాణలో మత్స్యకారుల కోసం ప్రజాప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రతి ఇంటికీ ప్రజా ప్రభుత్వం విజయాలను తీసుకెళ్లాలని కోరారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..మత్స్యకారుల సామాజిక తరగతికి సీఎం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారనీ, రాష్ట్రంలో ప్రకటించిన తొలి కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ అని గుర్తుచేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

కాగ్ చీఫ్‌గా సంజయ్ మూర్తి

ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్రపతి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)గా ఏపీకి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి కొండ్రు సంజయ్ మూర్తి బాధ్యతలు స్వీకరించారు. గురువారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో కాగ్ అధిపతి పదవిని చేపట్టిన తొలి తెలుగు వ్యక్తిగా సంజయ్ మూర్తి నిలిచారు. 1996లో కాంగ్రెస్ నుంచి అమలాపురం ఎంపీగా ఎన్నికైన కెఎస్ఆర్ మూర్తి కుమారుడే సంజయ్‌మూర్తి. 1964 డిసెంబర్ 24న జన్మించిన ఈయన, మెకానికల్ విభాగంలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 1989లో ఐఏఎస్‌లో హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. ఆ తరువాత కేంద్ర సర్వీసుల్లోకి వచ్చిన ఆయన, 2021 సెప్టెంబర్ నుంచి ఉన్నత విద్యా కార్యదర్శిగా పని చేశారు. వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేయాల్సిన ఆయనకు కేంద్ర ప్రభుత్వం కాగ్ బాధ్యతలను అప్పగించింది. ఆయన ఈ పదవిలో గరిష్టంగా ఆరేండ్లు లేదా ఆయనకు 65 ఏండ్ల వయస్సు వచ్చే వరకు కొనసాగనున్నారు.

సీఎంవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని చెప్పారని, దీన్ని బట్టి ప్రభుత్వానికి అధికారులకు మధ్య సమన్వయం లేదన్న విషయం తేటతెల్లమవుతున్నదని తెలిపారు. కాంగ్రెస్ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో.. రైతులకు 9 హామీలు ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రతిపక్షంగా ప్రజల పక్షాన ఎప్పటికీ పోరాడుతామన్నారు. ఈ సమావేశంలో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ మఠం బిక్షపతి, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షులు పి. జైపాల్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మెన్ పి.నారాయణ, డీబీ నాగభూషణం, డీసీఎంఎస్ మాజీ చైర్మెన్ శివకుమార్, రాష్ట్ర నాయకులు ఉదయ్ భాస్కర్, ఆదర్శ్ రెడ్డి, పట్నం మాణిక్యం, శివ చందర్, చాపల వెంకటేశం, సాయి, ఫైజల్, తదితరులు పాల్గొన్నారు.

నెతన్యాహుకు ఐసీసీ అరెస్టు వారంట్

(మొదటిపేజీ తరువాయి)

తోసిపుచ్చింది. న్యాయస్థానం పరిధిని తిరస్కరించింది. గాజాలో యుద్ధ నేరాలకు పాల్పడలేదని పేర్కొంది. నెతన్యాహు, గాలంట్‌లు గాజాలో అమానుష రీతిలో మారణకాండకు పాల్పడ్డారని, ఆహారం, నీరు వంటి మౌలిక అవసరాలను కూడా అందనివ్వకుండా అమానవీయ చర్యలకు దిగారని న్యాయస్థానం పేర్కొంది. ఫలితంగా వేల సంఖ్యలో అక్కడి ప్రజలు మరణించారని తెలిపింది. ఇందుకు అవసరమైన సాక్ష్యాధారాలను కూడా గుర్తించామని పేర్కొంది. కాగా, ఈ ఆదేశాలు ఐసీసీకి సిగ్గుచేటైనవని ఇజ్రాయిల్ మాజీ ప్రధాని బెనెట్ వ్యాఖ్యానించారు. గతేడాది అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి, అందుకు ప్రతిగా గాజాలో ఇజ్రాయిల్ మిలటరీ కొనసాగిస్తున్న ఆపరేషన్ నేపథ్యంలో నెతన్యాహు, గాలంట్‌లను అరెస్టు చేయాలని ఐసీసీ ప్రాసిక్యూటర్ కరీమ్ ఖాన్ మే 20న కోరారు.







లగచర్లలో వామపక్ష నేతలు

తావిడిస్తే సావొస్తది

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యమిస్తూనే ఉంటామని ఆయా గ్రామాల ప్రజలు స్పష్టం చేశారు.

ఫార్మా విలేజ్ వద్దే.. వద్దు..

దుద్యాల మండలంలోని లగచర్ల దాని చుట్టూ ఉన్న గ్రామాల్లో ప్రభుత్వం ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని భావించగా.. ఇప్పటికే మూడు గ్రామాల పరిధిలోని 1274.25 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములను సేకరించాలని సర్కారు నిర్ణయించగా అక్కడి రైతులు వ్యతిరేకతను వ్యక్తం చేశారు. కొన్నేండ్లుగా ఆ భూములపై ఆధారపడి జీవిస్తున్నామనీ... వాటిని ఫార్మా కంపెనీలకు ఇస్తే ఎలా బతకాలని నిలదీస్తున్నారు. ప్రాణాలైనా ఇస్తాం.. కానీ.. భూములను ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. మేమేసిన ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి.. ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి మమ్మల్ని రోడ్డుపాలు చేస్తామంటే ఊరుకునేది లేదనీ, తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు. భూములిస్తే మా బతుకులు రోడ్డున పడతాయనీ, ఊర్లు వదిలి వలసపోవాల్సిన దుస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మేం ఏం పాపం చేశామని ప్రభుత్వం ఇంతటి దారుణానికి ఒడిగడుతోంది? పచ్చటి పొలాల్లో చిచ్చుపెట్టేలా.. ఈ ప్రాంతంలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం యత్నించడం బాధాకరం. రేవంత్‌రెడ్డి సీఎం అయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనీ.. నీళ్లొస్తాయని ఆశించాం. కానీ.. ప్రజా జీవనానికి భంగం కలిగించేలా ఫార్మా కంపెనీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం ఏంటని గిరిజన రైతులు ప్రశ్నించారు.

నోటికాడి కూడుపోతే.. చావే శరణ్యం..

వ్యవసాయంతోనే మా బతుకు, తిండి. అటువంటి భూములను లాక్కోవాలని ముఖ్యమంత్రే చూస్తుంటే ఇక మాకు చావే శరణ్యం. ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టకుండా అందర్ని ఒకేసారి చంపేసి, మా శవాలపై కంపెనీలను ఏర్పాటు చేయండి. ఉన్న ఎకరం, రెండెకరాల భూమి పోతే ఎట్లా బతకాలి?.సీఎం మావోడయితే.. ఈ ప్రాంతం అభివృద్ధి ఐతదనుకున్నం..చివరకు మా చావుకొచ్చింది కదా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేం భూములివ్వం..

వ్యవసాయం పండుగలా సాగుతున్న ఈ ప్రాంతంలో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించడం సరైంది కాదు. మేం భూములివ్వం. భూములు వదులుకుని ఎక్కడికెళ్లాలి?. మాది, మా పిల్లల భవిష్యత్తు ఏమి కావాలి?. వారసత్వంగా వచ్చిన భూములను ఎందుకు ఇస్తాం?. ప్రభుత్వం వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు తెగేసి చెప్పారు.







న్యాయం జరిగే వరకు పోరాడుతాం

అప్రజాస్వామిక చర్యలు చేపడితే ఊరుకోం

లెఫ్ట్ నేతల హెచ్చరిక

లగచర్ల రైతులపై కొనసాగుతున్న నిర్బంధకాండను నిలిపేయాలని వామపక్ష నేతలు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బలవంతపు భూసేకరణ తగదని వారు హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించాలని హితవు పలికారు.

ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ ఆరు గ్యారంటీలతోపాటు ఏడో గ్యారంటీగా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. ఆయన చెప్పినట్టుగానే ప్రగతి భవన్ ముందు కంచెలను తొలగించి, ప్రజాస్వామ్య పరిరక్షణకు నాంది పలుకుతామంటూ చెప్పారన్నారు. కానీ ఆ తర్వాత అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. హైడ్రా, మూసీ, దామగుండం, గ్రూప్స్1 అభ్యర్థులు, ఇప్పుడు లగచర్ల రైతుల విషయంలోనూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న విషయాన్ని వివరించారు. ఇవి ప్రజాస్వామిక చర్యలెలా అవుతాయో చెప్పాలన్నారు. లగచర్ల ప్రాంత ప్రజలు సంక్షేమాన్ని కోరుతున్నారనీ, కానీ.. ప్రభుత్వం మాత్రం సంక్షోభాన్ని సృష్టించటం దారుణమని విమర్శించారు. నారాయణపేట లిఫ్టు ఇరిగేషన్ ద్వారా ఫార్మా కంపెనీకి నీళ్ళు ఇవ్వాలను కుంటున్నారా? అని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో భూస్వామి గురునాథరెడ్డి పేరున సుమారు 1100 ఎకరాలకు పైగా భూమి ఉందనీ, ఆ భూమిని ఫార్మాకు ఎందుకు తీసుకోవటం లేదో చెప్పాలన్నారు. అధికారానికి రాకముందు రేవంత్ ఏం మాట్లాడారో గుర్తు చేసుకోవాలని సూచించారు. మరో పక్క రైతుల బాధ, ఆవేదన, వారిగోడును రాజకీయ సమస్యగా ప్రచారం చేయటం తగదన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు లంగా, లఫంగులంటూ హద్దులు దాటి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. బాంబులు పేలుతాయంటూ హెచ్చరించుకుంటున్నారని విమర్శించారు. అది వారి విజ్ఞతకు సంబంధించిన వ్యవహారమన్నారు. కానీ రైతులు ఏం పాపం చేశారని వారిని ఇంతగా ఇబ్బంది పెడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. వారి బతుకులు బుగ్గి పాలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో ఉగ్రవాదుల స్థావరాలేమైనా ఉన్నాయా? ఇదేమైనా కల్లోలిత ప్రాంతమా? అని ప్రశ్నించారు. అడుగడుగున పోలీసు చెకప్‌లు, వచ్చే పోయెటోళ్ల ఫొటోలు తీయటమెందుకని నిలదీశారు. అర్ధరాత్రి తలుపులు పగులగొట్టి ఇంట్లో ఉన్నవారిని భయభ్రాంతులకు గురిచేసి అరెస్టులు చేయటమేంటని ప్రశ్నించారు. అంటే.. ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదులను, వామపక్ష పార్టీలను, రైతులను బెదిరించటం కాదా ? అని ప్రశ్నించారు. రైతు కంట కన్నీరు పెట్టించిన వారెవరూ ఇప్పటి వరకు బాగుపడలేదని చెప్పారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతుల సమ్మతి లేకుండా భూమి తీసుకోవద్దన్నారు. పైగా సీఎం చెబుతున్నట్టుగా ఇక్కడ తొండలు గుడ్లు పెట్టే భూములు కనిపించలేదన్నారు. రెండు,మూడు పంటలు మంచిగా పండే భూములే ఉన్నాయన్నారు. మంచోడు మంచోడంటే మంచమంతా చెడగొట్టినట్టు ..ఏరికోరి ఓట్లేసిన గిరిజన రైతుల నోట్లో మన్నుగొట్టటమేంటని ప్రశ్నించారు. ఫార్మా పరిశ్రమ జనావాసాలకు దూరంగా ఉండాలన్నారు. దాని ద్వారా విడుదలయ్యే విషవాయువు వల్ల ఇక్కడ నివసించే ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీయటమే కాదనీ, ప్రాణ హాని కలిగించే ప్రమాదం ఉంటదని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలు, కులాలు పక్కనబెట్టి మీ భూములు కాపాడుకునేందుకు ఐక్యంగా ఉండాలని సూచించారు. విఛిన్నకుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మీ పోరాటానికి ఎర్రజెండాలు అండగా ఉంటాయని హామీ ఇచ్చారు.

ప్రభుత్వం చట్టబద్ధంగా వ్యవహరించాలి

ప్రభుత్వం చట్టాన్ని ఉల్లంఘిస్తున్నదనీ, రైతుల ఆవేదనలో న్యాయముందనీ, వారు విజయం సాధించే వరకు వారిపక్షాన నిలబడతామంటూ ఇతర వామపక్ష నేతలు బాధిత రైతులకు హామీ ఇచ్చారు. రేవంత్ సర్కార్ రైతుల పట్ల మొండిగా వ్యవహరించకుండా వారితో చర్చించాలని సూచించారు. తిరుపతిరెడ్డి అనే వ్యక్తి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారనీ, ఇది మంచిది కాదని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఆర్ వెంకట్రాములు, వికారాబాద్ జిల్లా కార్యదర్శి మైపాల్, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎస్ఎల్ పద్మ, ఎం హన్మేష్, సీపీఐ నాయకురాలు విజయలక్ష్మి పండిట్ తదితరులు పాల్గొన్నారు.



రామ్ నయా సినిమా షురూ..

రామ్ పోతినేని హీరోగా అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న సినిమా గురువారం ఉదయం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ చిత్రానికి మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మాతలు. హీరోగా రామ్ 22వ చిత్రమిది. ఇందులో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే నాయికగా నటిస్తున్నారు. హీరో రామ్ పోతినేని, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మీద చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు గోపీచంద్ మలినేని కెమెరా స్విచ్ఛాన్ చేయగా, మరో దర్శకుడు హను రాఘవపూడి క్లాప్ ఇచ్చారు.

తొలి సన్నివేశానికి దర్శకుడు వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించారు. చిత్ర దర్శకుడు మహేష్ బాబుకు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలితో పాటు ఆ సంస్థ సీఈవో చెర్రీ స్క్రిప్ట్ అందజేశారు. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' విజయం తర్వాత దర్శకుడు మహేష్ బాబు ఫీల్ గుడ్ అండ్ క్రేజీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్న చిత్రమిది. యువతను ఆకట్టుకునే అంశాలతో పాటు చక్కటి కథ, కథనంతో సినిమా రూపొందుతోందని దర్శక, నిర్మాతలు అన్నారు.

నవ్వించే జాతకాల పిచ్చోడి కథ



మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వం వహించిన సినిమా 'సారంగపాణి జాతకం'. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించారు.

'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న మూడో చిత్రమిది. డిసెంబర్ 20న సినిమా విడుదల చేయనున్నారు. గురువారం హీరో విజయ్ దేవరకొండ చేతుల మీదుగా టీజర్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నా బ్రదర్ దర్శి (ప్రియదర్శి)తో నా కెరీర్ స్టార్ట్ చేశా. ఇంట్రెస్టింగ్ కథల్లో లీడ్ రోల్స్ చేస్తూ మనకు మంచి సినిమాలు అందిస్తున్నాడు. టీజర్ చూశాను. ఇందులో... దర్శి పాత్రకు జాతకాల మీద నమ్మకం ఉంటుంది. జాతకాలు ఎంత నిజం అనేది నాకు తెలియదు. 'పెళ్లి చూపులు' చేసినప్పుడు మేం ఈ స్థాయికి వస్తాం అని ఊహించలేదు. డెస్టినీ మమ్మల్ని ఇక్కడికి తీసుకు వచ్చింది. మోహనకృష్ణ ఇంద్రగంటి తీసిన 'అష్టా చమ్మా' సినిమా చూసి బాగా నవ్వుకున్నాను. అలాగే శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్‌కు ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

నవచిత్రం

నటుడిగా, నిర్మాతగా.. 5 దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణం



మోహన్‌బాబు

మోహన్‌బాబు.. విలక్షణ నటనకు, భిన్న సినిమాల నిర్మాణానికి పక్కా కేరాఫ్ అడ్రస్. నేటి(శుక్రవారం)తో ఆయన నటుడిగా 50వ వసంతంలోకి అడుగు పెడుతున్నారు.

1975 నుంచి 1990 వరకు భారతీయ సినిమాల్లో విలన్ పాత్రలకు కొత్త నిర్వచనాన్ని ఇచ్చిన వారిలో మోహన్‌బాబు పేరు బాగా వినిపిస్తుంది. అప్పట్లోనే దేశంలో అత్యధిక డిమాండ్ ఉన్న ప్రతినాయకులలో ఒకరిగా నిలిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వంలో తెరకెక్కిన 'స్వర్గం నరకం' చిత్రంతో పరిశ్రమకు విలన్‌గా పరిచయమై అగ్ర స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

'అల్లుడు గారు, అసెంబ్లీ రౌడీ, పెదరాయుడు..' వంటి తదితర ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలతో నాయకుడిగా తన నట విశ్వరూపాన్ని చూపించారు. ఆయన నటించిన, నిర్మించిన అనేక చిత్రాలు హిందీ, తమిళ భాషల్లో రీమేకై, అక్కడ కూడా భారీ విజయాలు సాధించాయి. దీంతో ఆయన జాతీయ స్థాయిలోనూ విశేష ఆదరణ పొందారు.

నటుడిగా దాదాపు 500కి పైగా చిత్రాల్లో భిన్న పాత్రలను పోషించి తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఆయన చిత్రాల్లోని పాటలు సైతం విశేష శ్రోతకాదరణ పొందటం విశేషం. ఆయన ప్రభావం సినిమాలపై మాత్రమే కాకుండా రాజకీయ రంగానికీ విస్తరించింది.

1993లో ఆయన నిర్మించిన 'మేజర్ చంద్రకాంత్' చిత్రం ఎన్టీఆర్‌ని తిరిగి ముఖ్యమంత్రి పదవి చేపట్టడంలో కీలక పాత్ర పోషించిందని చెప్పుకునేవారు. నిర్మాతగా 75 చిత్రాలను నిర్మించారు. 1992లో స్థాపించిన శ్రీ విద్యానికేతన్ విద్యా ట్రస్ట్ ద్వారా మోహన్‌బాబు వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. ఇన్నేండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో గౌరవ పురస్కారాలను అందుకున్నారు. 2007లో భారత ప్రభుత్వం పద్మశ్రీ ప్రదానం చేయగా, 2016లో ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఆయన్ను వరించింది.

తన తండ్రి నటుడిగా, నిర్మాతగా దిగ్విజయంగా 50వ వసంతంలోకి అడుగిడుతున్న నేపథ్యాన్ని పురస్కరించుకుని మంచు విష్ణు మాట్లాడుతూ, 'ఇన్నేండ్ల సుదీర్ఘ ప్రయాణం అసామాన్యం. దీన్ని ప్రత్యేకంగా సెలెబ్రేట్ చేయబోతున్నాం. డిసెంబర్ నుండి ప్రతి నెల ప్రత్యేక ఈవెంట్లను ప్రారంభిస్తాం. 2025 నవంబర్ వరకు ప్రతీ నెలా ఒకటో తేదీన ఈ ఈవెంట్‌లకు సంబంధించిన ప్రకటన వస్తుంది' అని అన్నారు. ప్రస్తుతం తనయుడు విష్ణు హీరోగా పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' చిత్రాన్ని ఆయన నిర్మిస్తున్నారు. ఇది తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని మోహన్‌బాబు పలు సందర్భాల్లో తెలిపారు. ఈ సినిమా డిసెంబర్‌లో విడుదల కానుంది.


'ఉద్వేగం' రిలీజ్ ఎప్పుడంటే?



త్రిగుణ్

కళా సృష్టి ఇంటర్నేషనల్, మణిదీప్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై జి. శంకర్, ఎల్. మధు నిర్మించిన చిత్రం 'ఉద్వేగం'. ఈ కోర్టు డ్రామాకు మహిపాల్ రెడ్డి దర్శకత్వం వహించారు. త్రిగుణ్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో దీప్సిక కథానాయికగా నటించగా, శ్రీకాంత్ భరత్, సురేష్ నాయుడు, పరుచూరి గోపాలకృష్ణ, శివకృష్ణ, అంజలి తదితరులు కీలకపాత్రలు పోషించారు. భిన్న ప్రమోషన్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఈ సినిమా పై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈనెల 22న విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని సాంకేతిక కారణాల వల్ల ఈనెల 29న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ సందర్భంగా నిర్మాతలు శంకర్, మధు మాట్లాడుతూ, 'ఈనెల 29న తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక థియేటర్లలో విడుదల చేయబోతున్నాం. అలాగే కర్ణాటకతో పాటు, రెస్టాఫ్ ఇండియా, ఓవర్సీస్‌లోనూ భారీగా విడుదల చేయనున్నాం. సినిమాని వీలైనంత ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం' అని తెలిపారు.

సంస్కృతంలో 'వస్సాహి ..' పాట



మాధవ్, సిమ్రాన్ శర్మ

రవితేజ తమ్ముడు రఘు కొడుకు మాధవ్ హీరోగా నటిస్తోన్న సినిమా 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్ శర్మ హీరోయిన్. జేజేఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై యలమంచి రాణి సమర్పణలో నిర్మాత జేజేఆర్ రవిచంద్ నిర్మిస్తున్నారు. దర్శకురాలు గౌరీ రోణంకి డైరెక్ట్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

తాజాగా నటుడు శివాజీ చేతుల మీదుగా ఈ సినిమా నుంచి 'వస్సాహి వస్సాహి..' లిరికల్ సాంగ్ రిలీజైంది. బ్యూటిఫుల్ కంపోజిషన్‌తో, కలర్ ఫుల్ పిక్చరైజేషన్‌తో ఈ పాట ఆకట్టుకుందని, ఇంతవరకు సంస్కృత భాషలో ఏ పాట రాలేదు, ఇది ఫస్ట్ సాంగ్ అని శివాజీ ప్రశంసించారు. ఈ పాటను అనూప్ రూబెన్స్ మంచి బీట్‌తో కంపోజ్ చేయగా, శివశక్తి దత్తా సాహిత్యాన్ని అందించారు. సింగర్ శ్రీరామచంద్ర ఎనర్జిటిక్‌గా పాడారు. 'సౌందర్య సార, మకరంద దార, శృంగార పారవరా, సౌవర్ణ ప్రతిమ, లావణ్య గరిమ... ఇదంకిం తమాషా...వస్సాహి వస్సాహి' అంటూ సంస్కృత సాహిత్యంతో ఆకట్టుకునేలా సాగుతుందీ పాట అని మేకర్స్ చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మాకు తెల్వకుండా కాలేజీలకు అటానమస్ ఇవ్వొద్దు

- యూజీసీకి ఉన్నత విద్యామండలి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వానికి, ఉన్నత విద్యామండలికి కనీస సమాచారం ఇవ్వకుండా ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీలకు స్వయంప్రతిపత్తి (అటానమస్ హోదా)ని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇవ్వడం పట్ల ఉన్నత విద్యామండలి అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది సరైంది కాదని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వానికి, ఉన్నత విద్యామండలికి తెల్వకుండా ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీలకు అటానమస్ హోదా ఇవ్వొద్దని కోరింది. ఈ మేరకు యూజీసీ చైర్మెన్ ఎం జగదీశ్ కుమార్‌కు గురువారం ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి లేఖ రాశారు. తెలంగాణ భౌగోళిక ప్రాంతంలో ఉన్న కాలేజీలకు అటానమస్ హోదా కల్పించినపుడు సమాచారం ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రభుత్వం నిరభ్యంతర ధ్రువపత్రం (ఎన్‌వోసీ) ఇచ్చిన తర్వాతే అటానమస్ హోదా కల్పించాలని సూచించారు. రాష్ట్రంలోని అటానమస్ ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీల్లో చదివే విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలై ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే ఎవరు బాధ్యులని యూజీసీని ప్రశ్నించారు. పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాల మూల్యాంకనం వంటి అంశాలపై ఆయా యాజమాన్యాలు పారదర్శకంగా వ్యవహరించకపోతే ఎలా?అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతాయని వివరించారు. ఆయా కాలేజీలపై పర్యవేక్షణ ఎవరు చేయాలని అడిగారు. విద్యార్థుల భవిష్యత్తు, కాలేజీల ప్రతిష్టను దృష్టిలో ఉంచుకుని కొత్తగా అటానమస్ హోదా ఇచ్చేటపుడు రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌వోసీ తప్పనిసరిగా అడగాలని సూచించారు. ఆ తర్వాత యూజీసీ పరిశీలించి అటానమస్ హోదా ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 420 ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీలకు అటానమస్ హోదా ఉన్నది.

నకిలీ వైద్యుని వద్ద మందులు స్వాధీనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విశ్వసనీయ సమాచారం మేరకు మంచిర్యాల జిల్లా నస్పూర్ గ్రామంలో నకిలీ వైదయులు సుధాకర్ బొద్దుల క్లినిక్‌పై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడి చేశారు. ఆ దాడిలో యాంటీబయాటిక్స్ తదితర 76 రకాల మందులు డ్రగ్ లైసెన్స్ లేకుండా కలిగి ఉన్నట్టు గుర్తించారు. రూ.35 వేల విలువైన మందులను సీజ్ చేసి నమూనాలను పరీక్షలకు పంపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఆహారోత్పత్తుల పేరుతో మందులను అమ్ముతున్నట్టు గుర్తించారు. ఫెర్రోరెడ్-ఎక్స్ టీ టాబ్లెట్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇవి గుజరాత్‌లో తయారు చేస్తుండగా, మహారాష్ట్రకు చెందిన అమెరికన్ ఫార్మా రెమెడీస్ సరఫరా చేస్తున్నది. అదే విధంగా డయాబెటీస్, హార్ట్ డిసీజెస్, ఒబేసిటీ, బ్లడ్ ప్రెషర్, మూత్రపిండాల్లో రాళ్లకు చికిత్స అంటూ తప్పుడు ప్రకటనలతో అమ్ముతున్న ఆయుర్వేదిక్, అల్లోపతి మందులను స్వాధీనం చేసుకున్నారు.

కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం రేవంత్ వల్ల కాదు

- మాజీ మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం రేవంత్‌రెడ్డి వల్ల కాదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పేరు చెరిపేయడానికి బ్లాక్ బోర్డు మీద చాక్ పీస్ రాత కాదనీ, తెలంగాణ ప్రజల గుండెల్లో సువర్ణాక్షరాలతో లిఖించి ఉందని పేర్కొన్నారు. చరిత్రను చెరిపేయడం మహామహులకే సాధ్యం కాలేదని అన్నారు. దొడ్డి దారిన సీఎం అయిన రేవంత్ అభివృద్ధిని గాలికొదిలేసి విపక్షాలపై కక్ష పూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

వేములవాడ పర్యటన సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వరాల జల్లు కురిపిస్తారని ఆశించామనీ, కానీ మొండి చేయి చూపించారని ఎద్దేవా చేశారు. మానేరు రివర్ ఫ్రంట్ పనులు 90 శాతం పూర్తి అయ్యాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో తట్టెడు మట్టి తీయలేదని విమర్శించారు. ఈ నెల 30న సీఎం కరీంనగర్ పర్యటనకు వస్తారని సమాచారం ఉందనీ, అప్పుడైనా జిల్లాలోని పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో ఇప్పటిలాగా భూ సేకరణ జరగలేదనీ, రైతులను ఒప్పించి భూ సేకరణ చేశామని చెప్పారు. ఫార్మా సిటీ ఉండగా మళ్ళీ ఫార్మాకు భూ సేకరణ ఎందుకు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మాని పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు.

మానవ తప్పిదాలతోనే అడవుల్లో అగ్ని ప్రమాదాలు

- జీవపరిణామ వ్యవస్థకు భంగం కలిగే అవకాశం
- అటవీ అగ్ని ప్రమాదాలు-నివారణ చర్యలు వర్క్‌షాపులో పీసీసీఎఫ్ ఆర్ఎం.డోబ్రియల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మానవ తప్పిదాలతోనే అడవుల్లో ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయనీ, వాటివల్ల జీవపరిణామ వ్యవస్థకు భంగం కలిగే అవకాశముందని పీసీసీఎఫ్ ఆర్ఎం.డోబ్రియల్ అన్నారు. అటవీ అగ్నిప్రమాదాలు- నివారణ చర్యలు వాటికి సంబంధించి వాడే పరికరాలు అనే అంశంపై కేంద్ర పర్యావరణ, అటవీశాఖ, ఐఐఎఫ్ఎమ్(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్‌షాపును గురువారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఇది రెండు రోజుల పాటు జరుగనున్నది. అందులో తొలిరోజు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్.రాజేశ్, రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ నరేంద్రసింగ్ బుందేలా, ఐఐఎఫ్ఎమ్ డైరెక్టర్ రవిచంద్రన్ పాల్గొన్నారు. డోబ్రియాల్ మాట్లాడుతూ..అడవుల్లో మానవ తప్పిదాల వల్ల కొన్ని తెలిసి, మరికొన్ని తెలియక, ఇంకొన్ని ప్రమాదవశాత్తూ జరుగుతాయని తెలిపారు. ఆ ప్రమాదాల వల్ల వెలువడే కర్బన ఉద్గారాల వల్ల చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పుల గురించి వివరించారు. ఆ దుష్ప్రభావాలతో మానవ మనుగడకు ముప్పు ఏర్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. దేశంలో జరుగుతున్న అగ్నిప్రమాదాల తీరు గురించి ఎస్.రాజేశ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గతేడాది ఉత్తరాఖండ్‌లో ఎక్కువ ప్రమాదాలు జరిగినట్టు వివరించారు. నరేంద్రసింగ్ బుందేల మాట్లాడుతూ.. ఎన్డీఆర్ఎఫ్ దళాలు కూడా అగ్నిప్రమాద నివారణ చర్యల్లో భాగస్వామ్యమయ్యేందుకు అటవీశాఖతో సమన్వయం చేసుకుని పనిచేస్తామన్నారు. అగ్నిప్రమాదాల నియంత్రణకు తమవంతు కృషిచేస్తామని హామీనిచ్చారు.

అందుకోసం ప్రత్యేకంగా మూడు దళాలను ఏర్పాటు చేశామని తెలిపారు. దక్షిణభారతానికి విజయవాడ కేంద్రంగా ఒక దళం పనిచేస్తున్నదని చెప్పారు. రవిచంద్రన్ మాట్లాడుతూ..ఇలాంటి వర్క్‌షాప్‌లను దేశమంతటా నిర్వహించి ఆయా రాష్ట్రాల అటవీ శాఖాధికారులకు అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ అటవీశాఖాధికారి సిరిపురపు మాధవరావు రాసిన ఫారెస్ట్ ఫైర్ మేనేజ్‌మెంట్ ఇన్ తెలంగాణ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్(అడ్మిన్) సునీత భగవత్, అటవీశాఖ ఉన్నతాధికారులు, ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

అమ్మభాష కండ్ల లాంటిది.. ఇంగ్లీషు కండ్లద్దాల్లాంటిది

భారతీయులందరూ మూలాల్లోకి వెళ్లాలి

- లోక్‌మంథన్ ఎగ్జిబిషన్ ప్రారంభంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు
- భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ గొప్పతనం : మంత్రి జూపల్లి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అమ్మభాష కండ్లలాంటిదైతే ఇంగ్లీషు భాష కండ్లద్దాల్లాంటిదనీ, కండ్లు లేకపోతే కండ్లద్దాలు ఎందుకని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. మాతృభాషవైపు ఎక్కువ దృష్టి సారించాలని సూచించారు. తాము ఏ భాషలకూ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని శిల్పారామంలో లోక్ మంథన్ ఎగ్జిబిషన్‌ను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారతీయులందరూ తిరిగి తమ మూలాల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. బ్రిటీష్ పాలనలో మన భాష,మన వేషధారణ, మన సంస్కృతిని మరిచిపోయామనీ, తిరిగి ప్రతి ఒక్కరూ మన సంప్రదాయానికి రావాల్సిన అవసరం వుందని నొక్కి చెప్పారు. వలసవాద బుద్ధిని వదిలి, తిరిగి మన మూలాల్లోకి వెళ్లడమే లోకమంథన్ ఉద్దేశమని వివరించారు. దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ కూడా మాతృభాషలోనే చదువుకున్నారనీ, స్వయంగా తాను కూడా ఓ వీధి బడిలో చదువుకున్నానని గుర్తుచేశారు. వారంతా గొప్పస్థాయికి ఎదిగారన్నారు. మన సంస్కృతిని ఆచరించడంలో సిగ్గు పడొద్దని, అత్యంత గర్వంగా ప్రకటించుకోవాలని సూచించారు. ప్రకృతితో అందరూ స్నేహపూర్వకంగా వుండాలనీ, సంస్కృతిని కూడా ఆచరిస్తూ పోతే... అందరి జీవితాలు బాగుంటాయని చెప్పారు. చిన్నతనం నుంచే పిల్లలకు కష్టపడే తత్వం నేర్పించాలని సూచించారు. కుటుంబ వ్యవస్థ భారతీయతకే ప్రత్యేకమన్నారు.

కేంద్ర మంత్రి, లోక్‌మంథన్ కార్యక్రమం ఆహ్వాన కమిటీ చైర్మెన్ జీ.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భాగ్యనగర్ వేదికగా నాలుగు రోజుల పాటు లోక్ మంథన్ భాగ్యనగర్ -2024 జరుగుతుందనీ, శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభిస్తారని చెప్పారు. మూడు రోజుల పాటు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పాల్గొంటారనీ, కుటుంబ వ్యవస్థ, దాని ప్రాధాన్యత, సామాజిక సమరసత, స్వదేశీ తదితర అంశాలపై వారు మార్గదర్శనం చేస్తారని తెలిపారు. కార్యక్రమం రాజకీయాలకతీతంగా జరుగుతుందనీ, అందులో 12 దేశాలకు చెందిన 2,500 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ కళాకారులు, మేధావులు, ఆర్టిస్టులు, ఆలోచనాపరులు, పద్మ అవార్డు గ్రహీతలు, చెప్పారు. ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్ర సింగ్ షెకావత్ పాల్గొంటారని తెలిపారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ..సమాజంలో నేడు వ్యాప్తి చెందుతున్న వికృతులకు కారణం సంస్కృతి, జీవనమ విధానాల ధ్వంసాలే కారణమని చెప్పారు. సంస్కృతి అంటే ఓ జీవన విధానమనీ, అదే సమాజాన్ని కాపాడుతుందని స్పష్టం చేశారు. మనమందరమూ తిరిగి నైతిక విలువలను, సంస్కృతి సాంప్రదాయాలను తిరిగి సంపాదించుకోవాలని పిలుపునిచ్చారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ గొప్పతనమీ, దాన్ని భావితరాలకు అందించాలని నొక్కిచెప్పారు. తెలంగాణకి సుసంపన్న చరిత్ర, సంస్కృతి వుందని, ఇక్కడి కళలు, శిల్పసంపదలు కూడా వున్నాయన్నారు. వీటన్నింటితో పాటు జైన, బౌద్ధ మతాలు కూడా విలసిల్లాయన్నారు. తెలంగాణ సర్వ సంస్కృతుల ఖజానా అనీ, ఉత్తర-దక్షిణ సంస్కృతుల సంగమ స్థలమని అభివర్ణించారు. హైదరాబాద్‌లో భిన్నత్వంలో ఏకత్వం వుంటుందనీ, అందరూ కలిసి జీవిస్తారని తెలిపారు.

సవాళ్లను దీటుగా ఎదుర్కోవాలి

- ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలి
- మహిళా కానిస్టేబుళ్ల శిక్షణానంతర ముగింపు కవాతులో డీజీపీ పిలుపు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

పోలీసుల విధి నిర్వహణ అత్యంత క్లిష్టతరమైందనీ, సవాళ్లను దీటుగా ఎదుర్కోవాలని రాష్ట్ర డీజీపీ జితేందర్.. విధుల్లో చేరుతున్న నూతన కానిస్టేబుళ్లకు పిలుపునిచ్చారు. గురువారం రాజాబహదూర్ వెంకట్రామరెడ్డి పోలీసు అకాడమీలో జరిగిన మహిళా పోలీసు కానిస్టేబుళ్ల శిక్షణానంతరం ముగింపు కవాతుకు జితేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ మారు పోలీసు శాఖలో చేరుతున్న మహిళా కానిస్టేబుళ్లలో అత్యధికులు ఉన్నత విద్యావంతులేననీ, వీరి అనుభవాలు పోలీసు ప్రతిష్టను మరింతగా పెంచటానికి ఉపయోగపడాలని ఆయన అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒడిసి పట్టుకుంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని జితేందర్.. సూచించారు. తొమ్మిది నెలల శిక్షణా కాలంలో అన్ని విభాగాలలో శిక్షణను ఇవ్వటం జరిగిందనీ, ముఖ్యంగా నూతన చట్టాలను అవగాహన చేసుకుంటూ ప్రజలకు న్యాయం చేకూర్చాలని ఆయన తెలిపారు.

ప్రధానంగా మానవ హక్కుల పరిరక్షణతో పాటు పెరిగిపోతున్న సైబర్ నేరాలను అరికట్టటానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ శిక్షణా కాలంలో ప్రతీ మహిళా కానిస్టేబుల్ తన ప్రతిభను కనబర్చటం అభినందనీయమని తెలిపారు. వీరిని ప్రతిష్టాకరమైన పోలీసు శాఖలోకి ఆహ్వానిస్తున్నాననీ, భవిష్యత్తులో పోలీసుల ప్రతిష్టను పెంచటానికి నిరంతరం కృషి చేయాలని ఆయన కోరారు. పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. తొమ్మిది నెలల శిక్షణా కాలంలో మహిళా కానిస్టేబుళ్లకు చట్టాలతో పాటు మానవీయ సంబంధాలు, ఫోరెన్సిక్ సైన్స్, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నూతన చట్టాలపై చక్కటి అవగాహనను కల్పించటం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా, ఈ సారి చిన్న పిల్లల తల్లులైన కొందరు మహిళా కానిస్టేబుళ్లకు అకాడమీలోనే ప్రత్యేక సౌకర్యాలతో వసతులు ఏర్పాటు చేయటం జరిగిందని చెప్పారు. ఒకపక్క, శిక్షణతో పాటు మరోవైపు బోనాలు వంటి ఉత్సవాలను నిర్వహించటం, వివిధ కళల్లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించటం జరిగిందని తెలిపారు. మహిళా కానిస్టేబుళ్లు, పోలీసు శాఖలో చట్టబద్ధమైన విధులను నిర్వహిస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపును పొందగలరని ఆమె ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మొత్తం 1211 మంది మహిళా కానిస్టేబుళ్లు శిక్షణను పూర్తి చేసుకున్నారనీ, ఇందులో సివిల్, ఏఆర్, ఐటీ తదితర విభాగాలకు చెందిన కానిస్టేబుళ్లు ఉన్నారని ఆమె తెలిపారు. అలాగే, 600 మందికి పైగా పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ఉన్నారని చెప్పారు. అంతకముందు, జనగామకు చెందిన కానిస్టేబుల్ సౌమ్య పరేడ్ కమాండర్‌గా సాగిన కానిస్టేబుళ్ల కవాతు.. అత్యంత ఆకర్షణీయంగా నిలిచింది. శిక్షణా కాలంలో అన్ని విభాగాలలో అత్యుత్తమంగా నిలిచిన కానిస్టేబుల్ మమతకు ఆల్‌రౌండ్ ట్రోఫీని డీజీపీ బహూకరించారు. అలాగే, షుటింగ్‌లో అత్యంత ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ ప్రకృతికి బెస్ట్ షుటర్ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులతో పాటు పోలీసు అకాడమీకి చెందిన వివిధ హోదాల్లోని అధికారులు పాల్గొన్నారు.

26న పంచాయతీల్లో పనుల జాతర

- మంత్రి సీతక్క ఆదేశాలతో ఏక కాలంలో ప్రారంభం
- రూ. 2750 కోట్ల ఉపాధి హామీ నిధులతో పనులు
- మార్చి లోపు పూర్తి చేసేలా కార్యాచరణ
- ఎమ్మెల్యేందర్నీ భాగస్వామ్యం చేయాలని నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలపై ఫోకస్ పెట్టింది. ఓవైపు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్న సందర్భం..మరోవైపు త్వరలో నిర్వహించనున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆ దిశగా రాష్ట్ర సర్కారు అడుగులు వేస్తున్నది. ప్రజా పాలన- ప్రజా విజయోత్సవాలను అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశాల మేరకు ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో రూ. 2750 కోట్ల నిధులతో పనులకు శ్రీకారం చుట్టనున్నారు. మార్చిలోగా ఆ పనులు పూర్తిచేసేలా కార్యాచరణ కూడా ఇప్పటికే అధికారులు రూపొందించారు. అదే సమయంలో స్థానిక ఎమ్మెల్యేలను ఆ పనుల్లో భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ పనులను వీలైనంత వేగంగా పూర్తిచేసి పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో రాష్ట్ర సర్కారు ఉన్నట్టు తెలుస్తోంది. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా పథకం కింద పశువుల పాకలు, కంపోస్ట్ గుంతలు, కోళ్ళ ఫారాల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం కింద వ్యవసాయ బావులు, చెల్కలకు వెళ్లేందుకు బాటలు వెడల్పు చేయడం, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, కుంటలు తీయడం, ఉన్నవాటిలో పూడిక తీయడం, గ్రామాల్లో సీసీ రోడ్లు వేయడం, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు నిర్మించడం వంటి పనులు చేపట్టనున్నారు. అదే విధంగా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా గ్రామీణ రహదారుల నిర్మాణం(సీఆర్ఆర్) నిధులతో పనులు ప్రారంభించనున్నారు. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ. 2750 కోట్ల నిధులతో చేపట్టనున్నారు. ఈ పనులు ప్రతి నియోజకవర్గంలో ప్రారంభించి మార్చి 2025 చివరి నాటికి పూర్తి చేయనున్నారు.

ప్రాజెక్టుల తయారీని తగ్గించండి

- విద్యాకమిషన్ చైర్మెన్‌కు సబ్జెక్టు నిపుణుల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రాజెక్టుల తయారీ పనులను తగ్గించాలని పలువురు సబ్జెక్టు నిపుణులు అభిప్రాయపడ్డారు. దానివల్ల విద్యార్థులపై అధిక భారం పడుతున్నదని వివరించారు. గురువారం హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయంలో అభ్యసనా సామర్థ్యంపై సమస్యలపై విద్యాకమిషన్ మేథోమథనం నిర్వహించింది. ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్న సబ్జెక్టు నిపుణులతో విద్యాకమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి, సభ్యులు పీఎల్ విశేశ్వరరావు, చారకొండ వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రంలో 2011 నుంచి ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు అమలవుతున్న నిరంతర సమగ్ర మూల్యాంకన విధానం (సీసీఈ)పై సుదీర్ఘంగా చర్చించారు. సీసీఈని అమలు చేయడం వల్ల విద్యార్థులకు కలుగుతున్న ఇబ్బందులపై విద్యాకమిషన్ చైర్మెన్ అభిప్రాయాలను సేకరించారు. ప్రాజెక్టుల తయారీని తగ్గించాలని వారు కోరారు. ఈ అంశాన్ని పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని ఆకునూరి మురళి వారికి చెప్పారు.

తెలంగాణలో శత్రు(ఎనిమీ) ఆస్తుల లెక్క తేల్చండి

- డిసెంబర్ లోగా రికార్డుల పరిశీలన, సర్వే పూర్తి చేయండి
- జనవరి తొలివారంలో నివేదిక ఇవ్వండి : సెపీ అధికారులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశం
- హైదరాబాద్, రంగారెడ్డి, కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల్లోని శత్రు ఆస్తులపై ఆరా
- ఆస్తుల అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా(సెపీ) సంరక్షణలో ఉన్న శత్రు ఆస్తుల (ఎనిమీ ప్రాపర్టీ) లెక్క తేల్చాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని హైదరాబాద్, రంగారెడ్డి, కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల్లో శత్రు ఆస్తుల వివరాల విచారణను వచ్చే నెలాఖరు నాటికి పూర్తి చేసి, జనవరి మొదటి వారంలో నివేదిక ఇవ్వాలని సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని హోటల్ మారియట్‌లో ఎనిమీ ప్రాపర్టీకి సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సెపీ ముంబై విభాగ అధికారులతోపాటు రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, హోంశాఖ సహాయ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి ఆంద్ర వంశీ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్, వికారాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు హాజరయ్యారు. 1962లో చైనీస్ దండయాత్ర, 1965 నుండి 1971 వరకు నిర్వహించిన ఇండో-పాక్ యుద్ధం అనంతరం భారత్ నుండి వెళ్లిపోయి పాకిస్తాన్, చైనాలో స్థిరపడి ఆయా దేశాల పౌరసత్వం తీసుకున్న వ్యక్తులకు సంబంధించి భారత్ లో ఉన్న ఆస్తులను శత్రు(ఎనిమీ ప్రాపర్టీ) ఆస్తులుగా ప్రభుత్వం గుర్తించింది. వీటి సంరక్షణ బాధ్యతలను కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా(సెపీ)కు అప్పగించింది. తెలంగాణ, ఏపీతోపాటు దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాదాపు 13 వేల వరకు శత్రు ఆస్తులున్నట్లు కేంద్రం వద్ద రికార్డులున్నాయి. వీటి మార్కెట్ విలువ వేల కోట్ల రూపాయలున్నట్టు గుర్తించింది. ఎనిమీ ప్రాపర్టీ చట్టంలోని సెక్షన్ 8(ఏ) ప్రకారం ఈ ఆస్తులను విక్రయించే అధికారం కేంద్రానికి ఉంది. అయితే నాటి నుండి నేటి వరకు ఈ ఆస్తులు చాలా చోట్ల అన్యాక్రాంతమయ్యాయి. మరికొన్ని ఆస్తులకు సంబంధించి న్యాయ వివాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈరోజు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలంగాణలోని ఎనిమీ ఆస్తుల వివరాలపై రెండు గంటలపాటు ప్రత్యేకంగా సమీక్షించారు.

రాష్ట్రవ్యాప్తంగా 234 శత్రు ఆస్తులన్నాయని పేర్కొన్న అధికారులు రంగారెడ్డిలో 180, హైదరాబాద్‌లో 44, కొత్తగూడెంలో 7, వికారాబాద్‌లో 3 శత్రు ఆస్తులున్నాయని వివరించారు. మెజారిటీ స్థలాలు అక్రమణలకు గురయ్యాయనీ, నిర్మాణాలు కూడా ఉన్నాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి మియాపూర్, కొత్వాల్ గూడలో, హైదరాబాద్‌లో చిక్కడపల్లి, ముషీరాబాద్ తోపాటు పాతబస్తీలోనూ విలువైన ఆస్తులు అన్యాక్రాంతమైనట్టు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ తక్షణమే ఆయా ఆస్తుల రికార్డుల పరిశీలన, సర్వే నిర్వహణకు సెపీ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రికార్డుల పరిశీలన, సర్వే నిర్వహణ కోసం ప్రత్యేకంగా బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, సెపీ బృందాలు జాయింట్ కమిటీగా ఏర్పాటై డిసెంబర్ నెలాఖరులో కల్లా రికార్డుల పరిశీలనతోపాటు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. జనవరి తొలివారానికల్లా తెలంగాణలోని ఎనిమీ ఆస్తుల వివరాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. ఆ నివేదిక ఆధారంగా శత్రు ఆస్తులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తగ్గిన చికున్ గున్యా కేసులు

- డీహెచ్ డాక్టర్ రవీందర్ నాయక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో చికున్ గున్యా కేసులు తగ్గాయనీ, ఈ ఏడాదిలో ఒక్క మరణం కూడా నమోదు కాలేదని రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు. తెలంగాణ నుంచి వస్తున్న ప్రయాణికుల్లో చికున్ గున్యా కేసులు పెరుగుతున్నాయని యుఎస్ ప్రకటించిన నేపథ్యంలో గురువారం డాక్టర్ రవీందర్ నాయక్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాదిలోలో నవంబర్ 19 వరకు 13,320 మందికి టెస్టులు చేయగా, వారిలో 447 మందికి చికున్ గున్యా వచ్చిందని తెలిపారు. వీరిలోనూ ఆగస్టులో 134, సెప్టెంబర్ లో అత్యధికంగా 183 మందికి వచ్చినట్టు చెప్పారు. అక్టోబర్ లో ఈ సంఖ్య 74కు తగ్గగా, ఈ నెలలో 19వ తేదీ వరకు 12కు పరిమితమైందని చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో తీసుకున్న ముందస్తు చర్యలతో చికున్‌గున్యాను నియంత్రించ గలిగినట్టు తెలిపారు.

బైడెన్‌ను 'అత్యవసరం'గా తొలగించాలి

మాజీ అమెరికన్ జనరల్



రష్యా భూభాగంలో లోతుగా దాడి చేసేందుకు దీర్ఘశ్రేణి క్షిపణులను వినియోగించేందుకు ఉక్రెయిన్‌ను అనుమతించిన తర్వాత అధ్యక్షుడు జో బైడెన్‌ను మూడవ ప్రపంచ యుద్ధంలోకి "నిద్రలో నడిచిపోకుండా" నిరోధించడానికి 25వ సవరణను అమలు చేయాలని రిటైర్డ్ అమెరికన్ ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ మైఖేల్ ఫ్లిన్ వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్‌ను కోరారు. అటువంటి అనుమతిని వాషింగ్టన్ అధికారికంగా ధవీ కరించనప్పటికీ, రష్యాలోని బ్రయాన్స్క్ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ ఇప్పటికే అమెరికా సరఫరా చేసిన క్షిపణులను ఉపయోగించినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. అదనంగా, బైడెన్ ఈ వారం ఉక్రెయిన్‌కు యాంటీ పర్సనల్ ల్యాండ్‌మైన్‌లను సరఫరా చేయాలని నిర్ణయించుకుని వాటి వినియోగాన్ని పరిమితం చేస్తానని తన 2022 వాగ్దానాన్ని ఉల్లంఘించాడు.

"ప్రస్తుత ప్రతినిధుల సభ అమెరికాకు అపాయం కలిగించినందుకు బైడెన్‌ను అభిశంసించాలి" అని ఫ్లిన్ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో రాశాడు. తన మాజీ బాస్, ప్రస్తుత ప్రెసిడెంట్ ఎలెక్ట్ అయిన డోనాల్డ్ ట్రంప్ చాలా చిన్న విషయానికే అభిశంసించబడ్డాడని వాదించాడు. "హారిస్ వెంటనే 25వ సవరణను అమలు చేసి, బైడెన్‌ను తొలగించాలి. అతను నిద్రపోతూ మనల్ని మూడో ప్రపంచ యుద్ధంలోకి తీసుకుని పోతున్నాడు. హారిస్‌పై కనీసం రాజ్యాంగపరమైన ఒత్తిడి తెద్దాం. ఎందుకంటే జో పేలవమైన జ్ఞాపకశక్తి అతనిని జవాబుదారీగా చేస్తుంది." ఈలోగా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ మిత్ర పక్షాలు, అమెరికా అటార్నీ జనరల్‌గా ఎంపికైన మాజీ ఫ్లోరిడా కాంగ్రెస్‌మెన్ మాట్ గేట్జ్ వంటి సంభావ్య నియా మకులు మౌనంగా ఉండకూడదు. "కాబోయే అమెరికా అధికారులు పరిస్థితిలో ఉద్రిక్తతలను తగ్గించడానికి రష్యన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సంప్రదింపులు జరపాలి" అని మైఖేల్ ఫ్లిన్ అన్నాడు. జనవరి 2017లో అధికారం చేపట్టిన వెంటనే ట్రంప్ ఫ్లిన్‌ను సలహాదారుగా నియమించారు.

అయితే, ఆ సమయంలో అమెరికాలో రష్యా రాయబారిగా ఉన్న సెర్గీ కిస్ల్యాక్‌తో ఫోన్ సంభాషణ గురించి అధికారులను తప్పుదారి పట్టించారని ఆరోపించ బడిన ఒక నెలలోపే ఫ్లిన్ రాజీనామా చేయవలసి వచ్చింది. ఎన్నికలలో గెలవడానికి ట్రంప్ ప్రచారం మాస్కోతో కుమ్మక్కయ్యిందనే విస్తృత ఆరోపణలకు ఈ వివాదం దారితీసింది. పణను ట్రంప్ తీవ్రంగా ఖండించాడు.

గాజాలో కాల్పుల విరమణ తీర్మానానికి అమెరికా వీటో

గాజా, లెబనాన్‌లలో కొనసాగుతున్న ఇజ్రాయిల్ మారణకాండ



గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో కాల్పుల విరమణ కోసం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాన్ని ఇతర 14 కౌన్సిల్ సభ్యులు రాజీకి వచ్చే ప్రయత్నాలకు గండి కొడుతున్నారని ఆరోపిస్తూ అమెరికా వీటో చేసింది. ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుతో అమెరికా రాయబారి అమోస్ హొచ్‌స్టెయిన్ ముందస్తుగా నిర్ణయించబడిన సమావేశానికి ముందు ఇజ్రాయిల్‌తో ఏదైనా ఒప్పందంలో పూర్తి కాల్పుల విరమణ జరగాలని, "లెబనాన్ సార్వభౌమాధికారాన్ని రక్షించాలని" హిజ్బుల్లా నాయకుడు నయీమ్ ఖాస్సేమ్ డిమాండ్ చేశారు.

ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ హాస్పిటల్ డైరెక్టర్ మాట్లాడుతూ పోషకాహార లోపం ఉన్న 17 మంది పిల్లలు ఈ సదుపాయానికి వచ్చారని, వారికి చికిత్స చేయడానికి సామగ్రి లేదు. ఇజ్రాయెల్ దళాలు భవనంపై కాల్పులు జరుపుతు న్నాయి. వ్యక్తులను లేదా మందులను లోపలికి అనుమతించడం లేదు. అక్టోబర్ 7, 2023 నుంచి గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమంలో కనీసం 43,985 పాలస్తీనియన్లు చనిపోయారు. 104,092 మంది గాయపడ్డారు. ఆ రోజు హమాస్ నేతత్వంలోని దాడుల్లో ఇజ్రాయిల్‌లో 1,139 మంది మరణించారు. 200 మందికి పైగా బందీలుగా తీసుకున్నారు. గాజాపై యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి లెబనాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో ఇప్పటివరకు కనీసం 3,558 మంది మరణించారు. 15,123 మంది గాయపడ్డారు.

ఉత్తర గాజాపై ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో కనీసం 88 మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో 66 మంది బీట్ లాహియాలోని కమల్ అద్వాన్ హాస్పిటల్ సమీపంలో, 22 మంది గాజా సిటీలో ఉన్నారని అల్ జజీరా అరబిక్ రాసింది. ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ హాస్పిటల్ డైరెక్టర్ మాట్లాడుతూ, ఈ సదుపాయం పోషకాహార లోపంతో బాధపడుతున్న 17 మంది పిల్లలను పొందిందని, అయితే ఇజ్రాయిల్ దళాలు వైద్య సదుపాయంపై కాల్పులు జరిపి, చాలా మంది వ్యక్తులు, సామగ్రి ప్రవేశించకుండా నిరోధించడంతో వారికి చికిత్స చేయడానికి వనరుల కొరతను ఎదుర్కొంటున్నామని ఆయన చెప్పాడు.

టైర్‌పై ఇజ్రాయిల్ చేసిన బాంబు దాడిలో కనీసం తొమ్మిది మంది మరణించారని, 65 మంది గాయపడ్డారని లెబనాన్ ప్రజారోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. లెబనాన్‌లో ఇజ్రాయిల్ యుద్ధాన్ని ముగించే కాల్పుల విరమణ ఒప్పందా నికి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. సాయుధ మిలిటెంట్ సంస్థ హిజ్బుల్లాహ్ అటువంటి ఒప్పందం తప్పనిసరిగా పోరాటానికి ముగింపునకు, "లెబనాన్ సార్వభౌమాధికారం రక్షణ"కు దారితీయాలని నొక్కి చెప్పింది.

యునైటెడ్ స్టేట్స్ సెనేట్ ఇజ్రాయిల్‌కు బిలియన్ల డాలర్ల ప్రమాదకర ఆయుధాల బదిలీని నిరోధించగల ఓటింగ్‌కు సిద్ధమవుతోంది. ఇజ్రాయిల్ అనుకూల సమూహాలు, అధికారులు దానిని ఆమోదించకుండా ఆపడానికి ప్రయత్నించారు. అమెరికా చట్టం ప్రకారం, మానవతా సహాయానికి ప్రాప్యతను నిరోధించే దేశాలకు ఆయుధాల బదిలీలను ప్రభుత్వం నిలిపివేయాల్సి ఉంటుంది.

బిజినెస్

మంగోల్ రిఫైనరీకి మేఘా వెస్సెల్స్

- సొంత యూనిట్లలో పరికరాల తయారీ



నవ తెలంగాణ - హైదరాబాద్

మంగోలియా దేశంలో నిర్మిస్తున్న మంగోల్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీకి అవసరమైన కీలక పరికరాలైన వెస్సెల్స్ (ఫ్లషింగ్ ఆయిల్ డ్రమ్)ను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) సొంత యూనిట్లలో తయారు చేసి ఎగుమతి ప్రారంభించింది. వెస్సెల్స్ రవాణాను మంగోల్ రిఫైనరీ సిఇఒ ఆల్ట్ దశదావా గురువారం హైదరాబాద్‌లోని ఎంఇఐఎల్ వెస్సెల్ తయారీ విభాగంలో జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఇఐఎల్) ప్రతినిధి వికల్ప్ పాలివాల్, ఎంఇఐఎల్ డైరెక్టర్ (హైడ్రోకార్బన్స్) పి దొరయ్య, ఎంఇఐఎల్ హైడ్రో కార్బన్స్ విభాగం ప్రెసిడెంట్ పి రాజేష్ రెడ్డి సహా పలువురు పాల్గొన్నారు. మంగోలియాలో గ్రీన్ ఫీల్డ్ ఆయిల్ రిఫైనరీని ఎంఇఐఎల్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మంగోల్ రిఫైనరీ నిర్మాణం మంగోలియాలో రిఫైనరీల అభివద్ధిలో కీలక భూమికను పోషిస్తుందని దశదావా తెలిపారు. తమ దేశంలో ఇదే తొలి రిఫైనరీ అన్నారు. మంగోల్ రిఫైనరీలో ఉపయోగించే వెస్సెల్స్‌లో మొదటిది సరఫరా చేయటం సంతోషంగా ఉందని పి దొరయ్య పేర్కొన్నారు. మంగోలియాలోని వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటూ తమ సిబ్బంది కఠినతరమైన రిఫైనరీని సకాలంలో పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని తెలిపారు.

డామ్సన్ టెక్నాలజీస్ రూ.200 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ : కంప్యూటర్, మొబైల్ ఉపకరణాల సంస్థ డామ్సన్ టెక్నాలజీస్ కొత్తగా రూ.200 కోట్ల పెట్టుబడులను ప్రకటించింది. తయారీ యూనిట్‌ను నెలకొల్పడానికి మూడు దశల్లో వ్యయాలు చేయనున్నట్లు వెల్లడించింది. అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఈ ప్లాంట్‌లో దేశంలోని ఇతర ప్రముఖ అనుబంధ బ్రాండ్‌ల కోసం ఉత్పత్తులను తయారు చేయనుంది. ఈ పెట్టుబడిలో భాగంగా ఫ్యాక్టరీ ఏర్పాటుకు రూ.110 కోట్లు, అధునాతన యంత్రాల కోసం రూ.60 కోట్లు, తయారీ ప్రక్రియకు మరో రూ.30 కోట్ల చొప్పున వ్యయం చేయనున్నట్లు డామ్సన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ రితేష్ గోయెంకా తెలిపారు. తొలిదశలో ఆరు అసెంబ్లీ లైన్‌లతో ప్రారంభించి, ఫేజ్ 3లో ఈ సౌకర్యం 20 అసెంబ్లీ లైన్‌లకు విస్తరించనున్నామన్నారు.

రఘువంశీ ఏరోస్పేస్ భారీ విస్తరణ

- నూతన యూనిట్‌కు శంకుస్థాపన
- 1800 కొత్త ఉద్యోగాలు: మంత్రి శ్రీధర్ బాబు



నవతెలంగాణ - బిజినెస్ బ్యూరో

విమాన ఇంజన్ల కీలక విడిభాగాలు, రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ సంస్థ రఘువంశీ ఏరోస్పేస్ భారీ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. గురువారం శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లో ఈ సంస్థ కొత్త తయారీ యూనిట్ నిర్మాణానికి ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు.

రూ.300 కోట్ల వ్యయంతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోందని మంత్రి తెలిపారు. దీంతో వచ్చే మూడేళ్లలో 1200 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయన్నారు. రఘువంశీ ఏరోస్పేస్ చేతిలో ఉన్న రూ.2 వేల కోట్ల ఆర్డర్లకు సంబంధించిన పరికరాలు ఈ నూతన సదుపాయంలో ఉత్పత్తి అవుతాయని తెలిపారు. ఎయిర్ బస్ ఏ320, బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల ఇంజన్లకు, జిఇ ఏరోస్పేస్, రోల్స్ రాయిస్, ప్రాట్ అండ్ విట్నీ, సఫ్రన్, హనీవెల్ విమాన ఇంజన్లను తయారు చేసే సంస్థలకు రఘువంశీ కీలకమైన విడిభాగాలను సరఫరా చేస్తుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. డిఆర్‌డిఒ, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ , భారత్ డైనమిక్స్ లిమిటెడ్ లాంటి ప్రభుత్వరంగ సంస్థలకు పరికరాలు, విడిభాగాలను అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రఘువంశీ ఏరోస్పేస్ డైరెక్టర్ వంశీ వికాస్, డిఆర్‌డిఒ క్షిపణి, వ్యూహాత్మక వ్యవస్థల డైరెక్టర్ రాజబాబు, సిఐఐ చైర్మన్ సాయి ప్రసాద్, టిజిఐఐసి ఎండి ఇ విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర ఏరోస్పేస్, డిఫెన్స్ విభాగం డైరెక్టర్ పిఎ ప్రవీణ్, టిజిఐఐసి సిఒఒ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పో ఫైండ్ ఎక్స్8 ధర రూ.70వేలు

న్యూఢిల్లీ : ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ ఒప్పో ఇటీవల ఆవిష్కరించిన ఫైండ్ ఎక్స్ 8 సిరీస్‌లో రెండు కొత్త ప్రీమియం ఫోన్లు విడుదల చేసింది. వీటి ధరలను తాజాగా ప్రకటించింది. ఒప్పో ఫైండ్ ఎక్స్8 12జిబి, 256జిబి వేరియంట్ ధర రూ.69,999గా, 16జిబి 512 జిబి వేరియంట్ వేరియంట్ ధరను రూ.79,999గా నిర్ణయించింది. ఇక ఒప్పో ఫైండ్ ఎక్స్8 ప్రో సింగిల్ వేరియంట్ ధరను రూ.99,999గా ప్రకటించింది. ఈ ఫోన్లు డిసెంబర్ 3నుంచి అందుబాటులోకి వస్తాయని తెలిపింది.

మెర్క్యూరీ ఇవి టెక్ లాభాల్లో వృద్ధి

హైదరాబాద్ : విద్యుత్ వాహనాల తయారీ సంస్థ మెర్క్యూరీ ఇవి టెక్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 171.19 శాతం వృద్ధితో రూ.1.60 కోట్ల నికర లాభాలు సాధించినట్లు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.0.59 కోట్ల లాభాలు నమోదు చేసింది. అదే సమయంలో రూ.5.52 కోట్లుగా ఉన్న అమ్మకాలు.. గడిచిన క్యూ2లో 252.90 శాతం పెరిగి రూ.19.48 కోట్లకు చేరినట్లు వెల్లడించింది.

డిసెంబర్ 18 నుంచి డీఈఐఈడీ ప్రథమ సంవత్సరం పరీక్షలు

- టైం టేబుల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ) ప్రథమ సంవత్సరం చదువుతున్న (2023-2025 బ్యాచ్) విద్యార్థులకు వచ్చేనెల 18 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు గురువారం టైంటేబుల్‌ను విడుదల చేశారు. అదేనెల 24 వరకు ఆ పరీక్షలు జరుగుతాయని వివరించారు. ప్రతిరోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేనెల 18న పేపర్-1, 19న పేపర్-2, 20న పేపర్-3, 21న పేపర్-4, 23న పేపర్-5, 24న పేపర్-6 పరీక్షలుంటాయని వివరించారు. పాత బ్యాచుల్లో ఫెయిలైన విద్యార్థులు కూడా ఈ పరీక్షలకు హాజరు కావాలని కోరారు.

మానుకోటలో హైడ్రామా

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

- కేటీఆర్ ధర్నాకు బ్రేక్
- అనుమతి నిరాకరించిన పోలీసులు
- ధర్నా రద్దు చేసుకున్న బీఆర్ఎస్
- మహబూబాబాద్‌ను పోలీసులు చుట్టుముట్టి వీధుల్లో కవాతు
- జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్
- 25న ధర్నాకు హైకోర్టు అనుమతి
- ధర్నా పూర్తయ్యే వరకు టెన్షన్ టెన్షన్
- ఆ ముగ్గురిపై సుమోటో కేసులు పెట్టాలి : బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లాలో 48 గంటలుగా కొనసాగిన హైడ్రామాకు హైకోర్టు బ్రేక్ వేసింది. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 25న గిరిజన మహా ధర్నా నిర్వహించుకోవచ్చని హైకోర్టు అనుమతి ఇవ్వడంతో టెన్షన్ నెలకొంది. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ పట్టణంలో పోలీసులు 144 సెక్షన్ కొనసాగిస్తారా రద్దు చేస్తారా అనేది ఆసక్తిగా మారింది. లగచర్ల ఘటనకు నిరసనగా గురువారం బీఆర్ఎస్ చేపట్టిన ధర్నా పోలీసులు అనుమతించకపోవడంతో రద్దయింది. కాగా, ధర్నా నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు.. విలేకరుల సమావేశాలతో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించారు. కాంగ్రెస్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు మురళి నాయక్ రామచంద్రనాయక్ ప్రెస్ మీట్ పెట్టి.. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ నాయకులు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, గిరిజనుల భూములు కబ్జా చేశారని, ఏ ముఖం పెట్టుకొని మానుకోటకు వస్తున్నారని ప్రశ్నించారు చైతన్యవంతమైన ప్రజలు రాళ్లతో ఎదురు దాడి చేస్తారని ప్రకటించారు. మరో పక్క.. ఎవరు అడ్డుకున్నా ఆగేది లేదని, ధర్నా చేసి తీరుతామని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, రవీంద్రరావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ ప్రకటించారు. ఈ రెండు పార్టీల ప్రకటనలతో కేటీఆర్ ధర్నాకు అనుమతి నిరాకరిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. దాంతో కంగుతిన్న బీఆర్ఎస్ శ్రేణులు.. ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. బుధవారం రాత్రి 12 గంటలవరకు ధర్నా నిర్వహించినా.. అనుమతి ఇచ్చేది లేదని పోలీసులు స్పష్టంచేశారు. దాంతో గురువారం ధర్నాను బీఆర్ఎస్ విరమించుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం తమ అవినీతి అక్రమాలు బయటపడతాయని కుట్రతోనే కేటీఆర్ రాకుండా అడ్డుకున్నదని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. హైకోర్టు అనుమతితో ధర్నా చేసి తీరుతామని ప్రకటించారు. ఈ క్రమంలో గురువారం హైకోర్టును ఆశ్రయించగా ఈనెల 25వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు ధర్నా చేసుకోవచ్చని ప్రకటించింది. ఈ పరిణామాలతో ఈ నెల 25 వరకు మానుకోటలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కాగా, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం కేటీఆర్ ధర్నాతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసులు పట్టణాన్ని చుట్టుముట్టారు. జిల్లావ్యాప్తంగా పోలీసులను అలర్ట్ చేసి సరిహద్దులో కంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేసి శారు పట్టణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎస్పీ సుధీర్ రామ్నాథ్ ఆధ్వర్యంలో గురువారం మహబూబాబాద్‌లో పోలీసులు కవాతు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో 144 సెక్షన్ విధించారు. దాంతో పట్టణంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది.

ఆ ముగ్గురిపై సుమోటో కేసులు పెట్టాలి : బీఆర్ఎస్ నాయకులు

లగచర్లలో ఘటనతో గిరిజనుల్లో మనోధైర్యం నింపడం కోసం మహబూబాబాద్‌లో కేటీఆర్ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించేందుకు పూనుకోగా, కాంగ్రెస్ నాయ

కులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి ప్రజలను ఉసిగొల్పడం చట్టరీత్యా నేరమని వారిపై సుమోటో కేసులు పెట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు బానోతు శంకర్‌నాయక్, డీఎస్ రెడ్డినాయక్ డిమాండ్ చేశారు. గురువారం మానుకోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మానుకోటలో ధర్నాకు పోలీసులు ముందు అనుమతి ఇచ్చి, తర్వాత నిరాకరించారని అన్నారు. సీఎం పతనం ఆయన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ప్రారంభమైందని మానుకోట నుంచి కొనసాగుతుందని అన్నారు. గిరిజన ఓట్లతో గెలిచిన గిరిజన ప్రజాప్రతినిధులు వారికి అండగా ధర్నా చేస్తుంటే అడ్డుకోవడం గిరిజనులకు వ్యతిరేకం కాదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ మారినేని వెంకన్న మంగళంపల్లి కన్నా యాకోబ్‌రెడ్డి అశోక్ తేల శ్రీనివాస్ ఆయుబ్ ఖాన్ పాల్గొన్నారు .

బెల్ట్ షాపులు నిషేధించి ప్రజలకు రక్షణ కల్పించాలి

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మహిళలు ఎక్సైజ్ జిల్లా కార్యాలయం ముట్టడి

- సిండికేట్‌గా మారి మద్యం ఏరులై పారిస్తున్న బెల్టు, లిక్కర్ మాఫియా
- స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనుకారెడ్డి
- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ



నవతెలంగాణ-జనగామ

గ్రామాల్లో విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్ట్ షాపులను తొలగించాలని జనగామ జిల్లాలో మహిళలు కదం తొక్కారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి గిర్నిగడ్డ మీదుగా ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయం వరకు మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. మద్యం మహమ్మారి, పెను భూతం వేషాధారణతో వినూత్న రూపంలో ర్యాలీ ముందుకు సాగింది. అనంతరం ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించిన మహిళలను పోలీసులు అడ్డుకున్నారు. దాంతో జనగామ-హుస్నాబాద్ రహదారిపైన మహిళలు బైటాయించి ఆందోళన చేశారు. జిల్లాలో బెల్టుషాపులు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించి కూర్చున్నారు. రోడ్డుపై మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అహల్య అధ్యక్షతన జరిగిన ధర్నాలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ.రమణ మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో బెల్ట్ షాపులను నిషేధించి ప్రజలను రక్షిస్తానని హామీ ఇచ్చారని, కానీ దాన్ని అమలుచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్ట్‌షాపుల వల్ల రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ముఖ్యంగా జనగామ జిల్లాలో బ్రాందీ, లిక్కర్ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి బెల్ట్ షాపుల ద్వారా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని అన్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులకు ఎంఆర్‌పీ ధర కన్నా ఎక్కువ ధరకు వైన్‌షాపుల ద్వారా విక్రయిస్తూ ప్రజలను ఆర్థికంగా దోచుకుంటున్నారన్నారని అన్నారు. ఈ బెల్ట్‌షాపుల వల్ల యువకులు, కార్మికులు, కష్టజీవులు, రైతులు, గ్రామీణ, పట్టణ, మధ్యతరగతి పేదలు మద్యానికి బానిసలుగా మారి విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా చిన్నచిన్న విషయాలకు గొడవలు పడి కేసులపాలై పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. బెల్టు, బ్రాందీ షాపులను నిరోధించాల్సిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదన్నారు. ఫలితంగా మద్యం విక్రయాల్లో జనగామ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచినట్లుగా ప్రభుత్వ నివేదికలు తెలుపుతున్నాయన్నారు. జాతీయ రహదారులపై చిన్నచిన్న డబ్బాలు పెట్టి 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంచుతున్నారని, దాంతో ఎన్‌హెచ్ హైవే 163 పై తరచూ ప్రమాదాలు జరిగి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. రెవెన్యూ పోలీస్, ఎక్సైజ్ శాఖలను సమన్వయం చేస్తూ టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించి బెల్టుషాపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా యువకులను, మహిళలను ఐక్యం చేసి ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కాగా, ఎక్సైజ్ జిల్లా కార్యాలయం ముందు సుమారు నాలుగు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకారెడ్డి మాట్లాడారు. సూపరింటెండెంట్ స్పందించి డిసెంబర్ చివరి వరకు జిల్లాలో ఉన్న బెల్ట్ షాపులను అరికడదామని హామీ ఇవ్వడంతో ఈ ధర్నాను విరమించారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, రాపర్తి సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈనెల 29న నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షా దివస్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈ నెల 29న దీక్షాదివస్ ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్షా దివాస్ నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి స్వరాష్ట్ర సాధనకు బలమైన పునాదులు వేసిందని తెలిపారు. తెలంగాణ వచ్చుడో - కేసీఆర్ సచ్చుడో అనే తెగింపుతో చేపట్టిన దీక్ష సబ్బండవర్ణాల ప్రజలను ఏకం చేసిందని అన్నారు. ఈ దీక్ష భారతదేశ రాజకీయ వ్యవస్థను కదిలించిందనీ, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం స్వయంగా ప్రకటించిందని గుర్తు చేశారు. కాగా కరీంనగర్‌లో జరిగే దీక్షా దివస్ కార్యక్రమంలో తాను పాల్గొంటానని కేటీఆర్ తెలిపారు.

డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్-2

- 9 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ : టీజీపీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చేనెల 15, 16 తేదీల్లో గ్రూప్-2 రాతపరీక్షలను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల తొమ్మిదో తేదీ నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని వివరించారు. వచ్చేనెల 15న మొదటి రోజు పరీక్ష ప్రారంభమయ్యే వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. హాల్‌టికెట్‌లో ఉండే నిబంధనలను పాటించాలని కోరారు. నమూనా ఓఎంఆర్‌పత్రాలు ఈనెల 20 నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మోడల్ ఓఎంఆర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని అభ్యర్థులు సాధన చేయాలని సూచించారు. వచ్చేనెల 15న పేపర్-1, పేపర్-2, అదేనెల 16న పేపర్-3, పేపర్-4 రాతపరీక్షలు జరుగుతాయని తెలిపారు. ప్రతిరోజూ రెండు విడతల్లో రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. వచ్చేనెల 15న ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ పేపర్-1, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు హిస్టరీ, పాలిటీ, సొసైటీ పేపర్-2, అదేనెల 16న 15న ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎకానమి, డెవలప్‌మెంట్ పేపర్-3, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం పేపర్-4 రాతపరీక్షలను నిర్వహిస్తామని వివరించారు.

పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేస్తామని తెలిపారు. ఉదయం 8.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు గేట్లు మూసివేస్తామని వివరించారు. మధ్యాహ్నం 1.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుందని వివరించారు.

మధ్యాహ్నం 2.30 వరకే అభ్యర్థులను అనుమతిస్తామనీ, ఆ తర్వాత రానివ్వబోమని స్పష్టం చేశారు. మొదటి విడత పరీక్షకు తెచ్చిన హాల్‌టికెట్‌నే తర్వాత జరిగే పరీక్షలకు తేవాలని సూచించారు. డూప్లికేట్ హాల్‌టికెట్లను ఇవ్వబోమని వివరించారు. ఏమైనా సమస్యలుంటే 040-23542185 లేదా 040-23542187 నెంబర్లను Helpdesk@tspsc.gov.in ఈ మెయిల్ ద్వారా నివృత్తి చేసుకోవాలని ఓరారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

అప్పుడే వండిన ఆహారాన్ని పిల్లలకు వడ్డించాలి

- వంటవారు, కామాటిలకు శుభ్రతపై శిక్షణ ఇవ్వాలి
- సెలవు రోజుల్లో, పాఠశాల తర్వాత టీచర్లకు డ్యూటీ వేయాలి
- నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు : గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పిల్లలకు అప్పుడే వండిన సురక్షిత వేడి ఆహార పదార్థాలను వడ్డించాలని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, కమిషనర్ డాక్టర్ ఏ శరత్ ఆదేశించారు. సరుకులు మొదలుకుని ఆహారం వండి వడ్డించే వరకు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కోరారు. నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, ఉప సంచాలకులు, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారులు, ఆర్సీవోలు, గిరిజన గురుకులం ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుకుల నాణ్యత పరిశీలించి, నాణ్యత సరిగా లేని వాటిని తిరస్కరించి, మంచి వాటిని మాత్రమే అనుమతించాలని సూచించారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు ఆ హాస్టళ్లలో పనిచేస్తున్న వంటవారు, కామాటిలకు శుచి, శుభ్రత పాటించడం గురించి శిక్షణ ఇవ్వాలని చెప్పారు. పరిశుభ్రమైన మంచినీటిని తాగడానికి అందుబాటులో పెట్టాలని కోరారు. వంట చేసే ప్రదేశం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కూరగాయలు, పండ్లు, మాంసాహారం, గుడ్లు మొదలైనవి సరైన నాణ్యత లేకుంటే తిరస్కరించి కేసు నమోదు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ గురుకులం హెల్త్ కమాండ్ సెంటర్ పనితీరు తరచూ పరిశీలించడం జరుగుతుందని వివరించారు. సెలవు రోజుల్లో, పాఠశాల తర్వాత ఉపాధ్యాయులకు విధులు వేయాలని కోరారు. ఈ సూచన లను పాటించని వారిపై తగుచర్య తీసుకోబడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు విట్ట సర్వేశ్వర్‌రెడ్డి, ట్రైకార్ జీఎం శంకర్‌రావు, డీటీఆర్ఐ సముజ్వల, గిరిజన సంక్షేమ గురుకులం అదనపు కార్యదర్శి మాధవి దేవి, గిరిజన సంక్షేమ విద్య ఉప సంచాలకులు చందన తదితరులు పాల్గొన్నారు.

నరేందర్ రెడ్డి కేసులో హైకోర్టు తీర్పు వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ నాయకుడు, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన తీరుపై హైకోర్టు మరోసారి పలు ప్రశ్నలు సంధించింది. నరేందర్ రెడ్డిని అరెస్టు చేసిన తీరును ఎండగట్టింది. నరేందర్‌రెడ్డి పరారీలో లేనప్పుడు కేబీఆర్ పార్కులో ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించింది. ఇంట్లోనే అరెస్టు చేశామని పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు చెప్పడంతో స్పందిస్తూ, అదే నిజమైతే అరెస్టు చేసిన సమాచారాన్ని నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులకు కాకుండా థర్డ్ పర్సన్ సలీమ్‌కు ఎలా ఇచ్చారని ప్రశ్నించింది. కేబీఆర్ పార్కులో వాకింగ్ చేసేందుకు వెళ్లినప్పుడు అరెస్టు చేయడానికి కారణాలు ఏమిటని కూడా ప్రశ్నించింది. అరెస్టు నిబంధనలను ఉల్లంఘించారని వ్యాఖ్యానించింది. ఇంట్లోనే అరెస్టు చేసి ఉంటే ఆయన భార్య లేదా పిల్లలు లేదా ఇంట్లో ఉండే ఇతర కుటుంబసభ్యులకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించింది. అరెస్టు చేసే ముందు సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను అమలు చేయకపోవడాన్ని తప్పుపట్టింది. అరెస్టు ప్రక్రియను ఆక్షేపించింది.

వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో ఫార్మా సిటీ నిమిత్తం భూసేకరణ చేపట్టే క్రమంలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు నిర్వహించిన సభలో రైతులు దాడికి పట్నం నరేందర్‌రెడ్డి ప్రధాన కారణమని పేర్కొంటూ ఆయనను పోలీసులు తొలి నిందితుడిగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఈ నెల 13న కొడంగల్ కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన క్రిమినల్ పిటిషన్‌ను జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ పూర్తి చేశారు. ఇరు పక్షాల వాదనలు ముగియడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

మాజీ ఎమ్మెల్యేను ఓ ఉగ్రవాదిలాగా ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందని హైకోర్టు ప్రశ్నించింది. దాడికి గురైన అధికారుల గాయాలపై సమగ్ర వివరాలు ఎందుకు ఇవ్వలేదని అడిగింది. తీవ్రగాయాలైనట్టు రిపోర్టు ఇచ్చి.. చిన్న గాయాలైనట్టు ఎలా రాస్తారనే సందేహాన్ని లేవనెత్తింది. పార్కులో వాకింగ్ చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారనీ, కింది కోర్టు యాంత్రికంగా రిమాండ్ ఉత్తర్వులు ఇచ్చిందనీ, వాటిని రద్దు చేయాలని నరేందర్‌రెడ్డి తరపు సీనియర్ అడ్వొకేట్ గండ్ర మోహన్‌రావు వాదించారు. రాజకీయ కుట్రతో పిటిషనర్‌ను కేసులో ఇరికించారని చెప్పారు. రైతులను ఉసిగొల్పి అధికారులపై దాడికి నరేందర్‌రెడ్డి కారణమని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు ప్రతివాదన చేశారు. ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. అయితే, లంచ్ తర్వాత తిరిగి పీపీ న్యాయమూర్తి ఎదుట హాజరై, పోలీసుల వద్ద వీడియో ఆధారాలు ఉన్నాయనీ, రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయవద్దని కోరారు. ఫార్మా కంపెనీల ఏర్పాటు వ్యవహారంపై అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు కంటే ముందు నరేందర్ రెడ్డి తన అనుచరులతో సమావేశాన్ని నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి వచ్చినా, కలెక్టర్ వచ్చిన దాడి చేయాలని చెప్పారని ఆ



వీడియోను పరిశీలించాలంటూ పెన్ డ్రైవ్‌ను హైకోర్టుకు అందజేశారు. ఈ పరిస్థితుల్లో పిటీషనర్ బయటకు వస్తే కేసు దర్యాప్తుపై ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు బయటకు వస్తే ఏమవుతుందని ప్రశ్నించింది. ఇరు పక్షాల వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును తర్వాత వెలువరిస్తామని చెప్పింది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లు అందరికీ ఓటు హక్కు ఉండాలి : ఈసీకి నోటీసులు ఇచ్చిన హైకోర్టు

తెలంగాణ రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ (ఉపాధ్యాయుల కోటా) ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించకపోవడంపై దాఖలైన పిటీషన్ను హైకోర్టు గురువారం విచారించింది. వివరణ ఇవ్వాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఎన్నికల సంఘానికి నోటీసులు ఇచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల టీచర్లకు కూడా ఓటు హక్కు కల్పించాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం బండకాడిపల్లికి చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్ బి.కృష్ణమూర్తి వేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచి బెంచి విచారించింది. ఉన్నత పాఠశాల టీచర్లతో సమానంగా పిటిషనర్లకు ఓటు హక్కు లేకపోవడం అన్యాయమని లాయర్ వాదించారు. అనంతరం ప్రతివాదులు తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది.

ఒకే కేసులో మూడు ఎఫ్ఐఆర్‌లపై పట్నం పిటిషన్

ఒక నేరంపై 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడాన్ని సవాలు చేస్తూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తరపున ఆయన భార్య పట్నం శృతి గురువారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. లగచర్ల గ్రామంలో పలువురు అధికారులపై దాడి చేశారంటూ బొమ్మరాస్‌పేట పోలీసు స్టేషన్‌లోనే మూడు ఎఫ్ఐఆర్లు నమోదు చేయడానికి ఆమె సవాల్ చేసిన పిటీషన్ను శుక్రవారం హైకోర్టు విచారించనుంది. ఒకసారి అరెస్టు చేసి జైలు నుంచి బయటికి రాకుండా రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతున్నారనీ, ఆ క్రమంలోనే చట్ట వ్యతిరేకంగా ఒకే నేరంపై మూడు ఎఫ్ఐఆర్లు నమోదు చేశారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ధర్నాకు హైకోర్టు అనుమతి

మహబూబాబాద్ ఎమ్మార్వో కార్యాలయం ముందు ఈనెల 25న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బీఆర్ఎస్ ధర్నా చేసేందుకు హైకోర్టు షరతులతో కూడిన అనుమతినిచ్చింది. లగచర్ల సంఘటనలో పోలీసుల తీరుపై నిరసనగా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఎమ్మార్వో కార్యాలయం ముందు శాంతియుత ధర్నాకు అనుమతి ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ ఆ పార్టీ యుజవన అధ్యక్షులు వై.మురళీధర్‌రెడ్డి వేసిన కేసులో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. శాంతియుతంగా ధర్నా చేయాలి. రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదు. నిబంధనలు ఉల్లంఘించకూడదు. వీటిని ఉల్లంఘించిన పక్షంలో పోలీసులు తిరిగి హైకోర్టును ఆశ్రయించవచ్చు అని చెప్పింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల మధ్యలో ధర్నా చేసేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.